

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 149

మంగళవారం 13-2-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నాలుగేళ్ల తర్వాత

ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్ టాప్–100లో భారత్ ప్లేయర్ సుమిత్ నగాల్ - 12లో



పేటీఎంపై చర్యలు తప్పవ్

ఆలోచించే నిర్ణయాలు తీసుకుంటాం.. ఆర్‌బీఐ గవర్నర్ దాస్ వెల్లడి - 13లో



భారత్ దౌత్య విజయం

గూఢచర్యం ఆరోపణలపై మరణ శిక్ష పడిన 8 మంది భారత నేవీ మాజీ అధికారులను ఖతార్ ప్రభుత్వం విడుదల చేసింది.

వివరాలు 6లో ▸



నేడే రైతుల 'చలో ఢిల్లీ'

రైతు సంఘాలు నేడు 'చలో ఢిల్లీ' పేరుతో పోరుబాట పడుతుండగా.. ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు.

వివరాలు 6లో ▸



ప్రసంగం పూర్తిగా చదవని గవర్నర్

డీఎంకే సర్కార్ జాతీయ గీతాన్ని గౌరవించలేదంటూ తమిళనాడు గవర్నర్ రవి ప్రసంగించకుండానే అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు.

వివరాలు 6లో ▸



బలపరీక్ష నెగ్గిన నితీశ్ సర్కారు

బిహార్ సీఎం నితీశ్ కుమార్ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం సోమవారం ఆ రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో నెగ్గింది.

వివరాలు 6లో ▸

త్వరితగతిన పీఆర్సీ ప్రకటిస్తాం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు
2 నెలల్లో రూ.5,500 కోట్లు విడుదల
తహశీల్దార్ రమణయ్య కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా.. ఇంట్లో ఒకరికి ఉద్యోగం
మీడియాతో మంత్రి బొత్స
ఉద్యోగ సంఘాలతో ముగిసిన ప్రభుత్వ చర్చలు

- వివరాలు 2లో

నేడు 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు వేడుకలు

రాష్ట్రవ్యాప్తంగా 50 రోజుల పాటు ఉత్సాహంగా క్రీడా పోటీలు నిర్వహించిన ప్రభుత్వం
వివిధ క్రీడల్లో పోటీ పడిన 25.40 లక్షల మంది క్రీడాకారులు
అన్ని దశల్లో కలిపి రూ.12.21 కోట్ల నగదు బహుమతులు
విశాఖలో జరిగే ముగింపు వేడుకల్లో పాల్గొననున్న సీఎం జగన్


- వివరాలు 2లో

నారాయణ వాటా..

రూ.650 కోట్లు!

ఎన్నికల్లో వెదజల్లేందుకు 'నిధుల' మార్గాలు అన్వేషిస్తున్న చంద్రబాబు

- దీన్లో భాగంగానే నెల్లూరులో అధిక వడ్డీకి అప్పులు సమీకరించిన నారాయణ
- దాదాపు రూ.650 కోట్లు సమీకరించి రహస్య ప్రాంతానికి తరలింపు!
- 2014లోనూ ఇలానే నారాయణ అప్పులు తీసుకుని ఎగ్గొట్టారంటున్న బాధితులు
- బ్యాంకుల నుంచి రుణాలు సమీకరించడానికి ఆర్థిక నేరగాళ్లు సిద్ధం
- లోపాయికారీగా ఇం'ధనం' సమకూరుస్తున్న సుజనా చౌదరి, సీఎం రమేష్
- మళ్లీ రుణాలు తెచ్చయినా బాబు కోసం ఖర్చు చేయాలని గంటా యత్నాలు
- పోలవరానికి తాము తెచ్చిన రుణాలనూ బాబే వాడేశారని తేల్చిన ట్రాన్స్‌ట్రాయ్
- ఈ మధ్యే ఈ రహస్యాన్ని బట్టబయలు చేసిన రాయపాటి రంగారావు
- ఆ డబ్బులు తిరిగి ఇవ్వకపోవటం వల్లే దివాలా తీశామంటూ గగ్గోలు
- ఎన్నారైలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు 'కోట్లకు టికెట్లు' అంటూ బాబు ఆఫర్లు



సాక్షి, అమరావతి: కూటి కోసం కోటి పాట్లు అన్నది లోకోక్తి! ఉనికి కోసం ఆర్థిక నేరాలు అన్నది టీడీపీ అధినేత చంద్రబాబు యుక్తి! అధికారంలో ఉండగా రాజధాని పేరుతో రైతుల భూములను సమీకరించిన చంద్రబాబు ఇప్పుడు ఎన్నికల్లో వెదజల్లేందుకు నిధుల కోసం మళ్లీ ఆర్థిక నేరగాళ్లనే ఆశ్రయిస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గత ఎన్నికలకు మించి ఘోర పరాజయం తప్పదని ఆందోళన చెందుతున్న ఆయన... ఉనికి చాటుకునేందుకు యథావిధిగా డబ్బు కట్టలనే నమ్ముకున్నారు. సీనియర్ నేతలను పక్కన పెట్టి ఆర్థికంగా బలవంతులైన ఎన్నారైలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కాంట్రాక్టర్లను ఎన్నికల బరిలోకి దింపేందుకు గాలం వేస్తున్నారు. వీళ్లిచ్చే డబ్బుతో పాటు ఎన్నికల్లో వెదజల్లేందుకు తన చుట్టూ ఉన్న ఆర్థిక నేరగాళ్లకు కూడా నిధులు సమీకరించే పని పురమాయించారు. అధిక వడ్డీల ఆశచూపి సామాన్యుల నుంచి డబ్బులు సమీకరించటం, బ్యాంకులను

మిగతా 2వ పేజీలో ▶

డీఎస్సీ వచ్చేసింది

- 6,100 ఉపాధ్యాయ పోస్టులు టీఆర్టీ ద్వారా భర్తీ
- https://cse.ap.gov.in ద్వారా దరఖాస్తుల స్వీకరణ, ఫీజు చెల్లింపు.. వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి బొత్స
- మార్చి 15 నుంచి 30 వరకూ పరీక్షలు.. సెలవులు మినహా మిగతా రోజుల్లో రెండు విడతల్లో ఆన్‌లైన్ టెస్ట్
- డీఎస్సీ నిర్వహణకు జీవో నం.11, 12 విడుదల
- సందేహాల నివృత్తికి కమిషనరేట్‌లో హెల్ప్ డెస్క్
- 2018 నోటిఫికేషన్ నిబంధనల ప్రకారమే అర్హతలు
- ఇకపై ఏ యేడాది ఉపాధ్యాయ ఖాళీలు ఆ ఏడాదే భర్తీ

3లో



వివరాలు వెల్లడిస్తున్న మంత్రి బొత్స

ఏపీ ఎత్తిపోస్తుంటే ఏం చేశారు?



- జగన్ సీఎం అయ్యాక పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 92,500 క్యూసెక్కులకు పెంచుకున్నారు
- నీళ్లు తరలించుకుపోతున్నా కేసీఆర్, హరీశ్‌రావు ఉలకలేదు
- కృష్ణా జలాల్లో రాష్ట్ర హక్కులను బీఆర్ఎస్ పట్టించుకోలేదు
- స్వరాష్ట్రంలోనే తెలంగాణకు ఎక్కువ అన్యాయం
- తెలంగాణ శాసనసభలో నీటిపారుదల మంత్రి ఉత్తమ్ ఫైర్

3లో



ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం కలిసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు ప్రణీత్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి

శ్రీశైలంలో పోటెత్తిన భక్తులు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం మహాక్షేత్రంలో సోమవారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీగా తరలి వచ్చారు. వేకువ జామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి మల్లన్న దర్శనానికి ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల వద్ద బారులుతీరారు. స్వామి వార్లను దర్శించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

లోకేశ్ నన్నే చూడమన్నాడు..

- పీఏగా చెప్పుకుంటూ ఓ నేత దందా
- డబ్బులు పోగొట్టుకున్న చీరాల టీడీపీ ఆశావహులు

చీరాల: చినబాబు లోకేశ్ పీఏ అని చెప్పుకుంటూ కొద్ది నెలలుగా చీరాలలో పొన్నూరుకు చెందిన ఓ వ్యక్తి టీడీపీ ఆశావహుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడు. లోకేశ్‌తో ఉన్న సన్నిహిత సంబంధాలు, ఫొటోలు, వీడియోలను వాడుకుంటూ ఆర్థికంగా బలపడిన చేనేత సామాజిక వర్గానికి చెందిన నాయకులకు వల వేస్తున్నాడు. తాను లోకేశ్ పంపిన వ్యక్తినని, చీరాల అభ్యర్థిని తననే ఖరారు చేయమన్నాడని చెప్పుకుంటున్నాడు. ఇతన్ని నమ్మిన కొందరి నుంచి సుమారు రూ.కోటి వరకు దండుకున్నాడన్న ప్రచారం ఉంది. చీరాలకు చెందిన ప్రముఖ వైద్యురాలు ఒకరు రూ.15 లక్షల వరకు ముట్టజెప్పినట్లు సమాచారం. మంగళగిరికి చెందిన ముగ్గురు చేనేతవర్గ నాయకుల నుంచి భారీగా వసూలు చేశాడు. వీరు చీరాలలో సమావేశాలు, ప్రెస్‌మీట్లు, ఫ్లెక్సీలు కూడా పెట్టారు. వేటపాలెం మండలానికి చెందిన కూల్‌డ్రింక్ డిస్ట్రిబ్యూటర్, రొయ్యల చెరువుల యాజమాని వద్ద నుంచి రూ.7 లక్షల వరకు తీసుకున్నాడు. ఈపురుపాలేనికి చెందిన మాజీ జెడ్పీటీసీ వద్ద కూడా రూ.5 లక్షల మేరకు వసూలు చేశాడు. మోసపోయామని తెలుసుకున్న కొందరు తమ టికెట్ సంగతి తేల్చాలని లేదంటే డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఇలా డబ్బులు సమర్పించుకున్న వారు పరువుపోతుందని తేలు కుట్టిన... వారిలా ఉండిపోతున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి ప్రకాశంలో గ్రానైట్, ఇసుక వ్యాపారుల వద్ద నుంచి లోకేశ్ పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేయడంతో పాటు అన్నీ లోకేష్‌కే తన ద్వారా చేరుతాయని వ్యాపారులను మోసగించాడు. అప్పట్లో ఈ అక్రమ వసూళ్ల వ్యవహారం టీడీపీ పెద్దల దృష్టికి వెళ్లడంతో కొద్ది రోజులు మౌనంగా ఉండి ప్రస్తుతం చీరాలలో తెరతీసినట్లు తెలుస్తోంది.

ఈసీ కొత్త మార్గదర్శకాలు తప్పక పాటించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వెల్లడి
- విశాఖ, తిరుపతిలో ఎన్నికల సిబ్బంది శిక్షణ ప్రారంభం

సాక్షి, విశాఖపట్నం/తిరుపతి సిటీ: రానున్న ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం కొత్తగా జారీచేసిన మార్గదర్శకాలు, సూచనలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా స్పష్టంచేశారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమికల్ ఇంజరింగ్ బ్లాక్‌లో లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గ ఆర్వోలు, ఏఆర్వోలకు నిర్వహిస్తున్న తొలి విడత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. మీనా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల గురించి అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో 1,000 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ ఇచ్చేందుకు జాతీయస్థాయి మాస్టర్ ట్రైనర్లు వచ్చారని, వారి నుంచి ఎన్నికల ప్రారంభం నుంచి ముగిసే వరకు కొనసాగాల్సిన ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ సమీర్ అహ్మద్ జాన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. డీఆర్వో కె.మోహన్‌కుమార్, విశాఖ, విజయనగరం, అనకాపల్లి, పాడేరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల జాయింట్ కలెక్టర్లు, ఏఆర్వోలు హాజరయ్యారు.



విశాఖలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేయాలి: హరీంధిరప్రసాద్



రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా కృషిచేయాల్సిన బాధ్యత ఆర్వోలు, ఏఆర్వోలపై ఉందని ఏపీ అదనపు ప్రధాన ఎన్నికల అధికారి హరీంధిర ప్రసాద్ అన్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ సావేరీ సెమినార్ హాల్‌లో సోమవారం పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వోలు, ఏఆర్వోలకు ఎన్నికల విధులపై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న హరీంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 16 వరకు మొదటి విడత శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. ఈ నెల 19 నుంచి 23 వరకు రెండో విడత, 26 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు మూడో విడత శిక్షణ ఉంటుందన్నారు. పోలింగ్ అధికారులు కంట్రోల్ రూమ్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాడ్లు, ఓటింగ్ కంపార్ట్‌మెంట్ల ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం ఎన్నికల ప్రక్రియపై మాస్టర్ ట్రైనర్లు అశ్విన్ మాలిక్, బిజిత్ కుమార్‌ధార్, జ్ఞానవేలు, శశి శేఖర్‌రెడ్డి, అచిత్య కుమార్ హజ్రా శిక్షణ ఇచ్చారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్, డీఆర్వో పెంచల కిషోర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్, ఆర్డీవోలు నిశాంత్ రెడ్డి, చంద్రముని తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన అధికారులతో ఐఐఎం విశాఖపట్నం సంచాలకులు



ఆల్ ఇండియా సర్వీస్ ఆఫీసర్ల శిక్షణ ప్రారంభం

- డిజిటల్ గవర్నెన్స్ అండ్ మేనేజ్‌మెంట్ అంశంపై తరగతులు
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో నిర్వహణ

ఏయూ క్యాంపస్ (విశాఖ జిల్లా): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆల్ ఇండియా సర్వీస్ ఆఫీసర్స్‌కు ఐదు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. డిజిటల్ గవర్నెన్స్ అండ్ మేనేజ్‌మెంట్ అంశంపై భారత ప్రభుత్వ సహకారంతో శిక్షణ కార్యక్రమాన్ని ఐఐఎంవీ నిర్వహిస్తోంది. ఈ శిక్షణ తరగతులకు సెంట్రల్ స్టాఫింగ్ స్కీం, సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్, సెంట్రల్ సెక్రటేరియట్ స్టెనోగ్రాఫర్ సర్వీస్ విభాగాల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులు హాజరయ్యారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పూర్వ కార్యదర్శి అజయ్ ప్రకాష్ సాహ్నీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల ఆవశ్యకత, యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ ఫేస్(యూపీఐ)సౌలభ్యత, ఆధునిక సాంకేతికతను లాభదాయకంగా నిలుపుతున్న విధానాన్ని వివరించారు. నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విభిన్న వ్యవస్థలను మిళితం చేస్తూ ఒకే వేదికపైకి చేర్చుతూ ప్రజలకు ఉపయుక్తంగా నిలుస్తున్నాయో తెలియజేశారు. ప్రపంచానికి అవసరమైన వాణిజ్య విపణిని సృష్టించడంలో భారత్ తన సత్తాను చాటుతోందన్నారు. యూరప్ దేశాలన్నీ కలిపితే తీర్చిదిద్దే యూనికార్న్‌ల కంటే అధికంగా భారత్ యూనికార్న్‌లను తయారు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐ ఆధారిత భాషా మాధ్యమం భాషిణి, ఓఎన్‌డీసీ, ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ తదితర అంశాలను వివరించారు. రానున్న కాలంలో హెల్త్‌కేర్, విద్య రంగాల్లో డిజిటల్ గవర్నెన్స్‌కు మరింత అనుకూల సమయం రానుందన్నారు. ఐఐఎం విశాఖపట్నం సంచాలకులు ఆచార్య ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ తాము డిజిటల్ గవర్నెన్స్ అండ్ మేనేజ్‌మెంట్ అంశంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శిక్షణ తరగతుల సంచాలకులు ఆచార్య పీఎస్ భవ్య, ఆచార్య అభిషేక్ శ్రీవాస్తవ పాల్గొన్నారు.

తహసీల్దార్ హత్య కేసులో నిందితుడికి ముగిసిన కస్టడీ

మధురవాడ (విశాఖ): బదిలీ అయిన విశాఖ రూరల్ తహసీల్దార్ రమణయ్య హత్య కేసులో నిందితుడు మురారి సుబ్రహ్మణ్యం గంగారామ్ పోలీస్ కస్టడీ సోమవారం ముగిసింది. దీంతో పీఎం పాలెం పోలీసులు నిందితుడిని భీమునిపట్నం 16వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచిన తర్వాత రిమాండ్‌కు తరలించారు. అంతకుముందు పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పైఅంతస్తులో ఉంచి నిందితుడిని పోలీసులు విచారించారు. కాల్ డేటా రికార్డ్ ఆధారంగా పలు వివరాలు సేకరించడంతోపాటు అతడి వాంగ్మూలన్ని కూడా నమోదు చేశారు. విచారణలో భాగంగా నిందితుడు మురారి, తహసీల్దార్ రమణయ్యతో పాటు విశాఖ రూరల్ మండలంలో ఇతర అధికారులు, సిబ్బంది ఎవరెవరికి ఎంతెంత ఇచ్చాడో తెలిపిన వివరాల ప్రకారం సదరు అధికారులు, సిబ్బందిని కూడా పోలీసులు అన్ని కోణాల్లో విచారించినట్టు తెలుస్తోంది. హత్యకు ముందు తహసీల్దార్ రమణయ్యకు ఫోన్ చేసి తాను నివాసం ఉంటున్న ప్లాటు నుంచి కిందికి పిలిచిన పురోహితుడిని కూడా విచారించారు.

నాపై కేసులున్నా.. ఎదుటి వారిపై కేసులు వేస్తా

- ప్రజాప్రయోజన వ్యాజ్యంలో తన క్రిమినల్ కేసుల గురించి చెప్పకపోవడాన్ని సమర్థించుకున్న రఘురామకృష్ణరాజు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటూ నరసాపురం పార్లమెంట్ సభ్యుడు కె.రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ ఈ నెల 15వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ప్రజా సంక్షేమ పథకాలకు దురుద్దేశాలను ఆపాదించడంతోపాటు ఆ పథకాల వల్ల పలువురికి లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలు ఉన్నాయని, వాటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీ కె.రఘురామకృష్ణరాజు పిల్ దాఖలు చేసిన విషయం విదితమే. ఈ వ్యాజ్యం సోమవారం మరోసారి జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది.

విచారణపై వాయిదా కోరడంతో: ఈ వ్యాజ్యం విచారణార్హతపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ తాము దాఖలు చేసిన కౌంటర్‌పై రఘురామకృష్ణరాజు తిరుగు సమాధానం దాఖలు చేశారని, దానిని గత రాత్రే తమకు అందజేశారని సీఎం వైఎస్ జగన్ తరఫు న్యాయవాది సన్నపురెడ్డి వివేక్‌చంద్రశేఖర్ హైకోర్టుకు తెలిపారు. దానిని చదివేందుకు కొంత వ్యవధి కావాలని నివేదించారు. అంతే కాకుండా ఈ వ్యాజ్యంలో సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించనున్నారని, అందువల్ల వాయిదా వేయాలని కోరారు. ఈ వివరాలను నమోదు చేసిన హైకోర్టు విచారణను వాయిదా వేసింది. కాగా.. తనపై నమోదైన క్రిమినల్ కేసుల గురించి తాను దాఖలు చేసిన పిల్‌లో పేర్కొనకపోవడాన్ని రఘురామకృష్ణరాజు సమర్థించుకున్నారు. తన పిల్ విచారణకు ఆ కేసులకు సంబంధం లేదని, అందువల్లే వాటి ప్రస్తావన తీసుకురాలేదని ఆయన తిరుగు సమాధానంలో పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపైన, ప్రభుత్వంపైన మీడియా సమావేశాలు, విలేకరుల సమావేశాలు నిర్వహించడం తమ పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యంలో భాగమని.. అలా చేయడానికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆయన పేర్కొన్నారు.

పార్థీ గ్యాంగ్ అరెస్టు

అనంతపురం: ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్రలోని డీజిల్ బంకుల్లో చోరీలకు పాల్పడిన పార్థీ గ్యాంగ్‌ను అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు లారీలు, రూ.3.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను అనంతపురం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సోమవారం మీడియాకు వెల్లడించారు. ఆయన మాటల్లో... మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లాకు చెందిన శివ అప్ప పవార్, బాలాజీ దత్తాత్రినాయక్ వాడి, బాబానందు షిండే, మాదేవ్ సురేశ్ పవార్, అశోక్ ధర్మ జాదేవ్ అలియాస్ కాకా తదితరులు సమీప బంధువులు. వీరంతా ముఠాగా ఏర్పడి శివారు ప్రాంతాల్లో ఉన్న డీజిల్ బంకుల్లోని డీజిల్ ట్యాంకు తాళాలు పగులగొట్టి డీజిల్‌ను చేతి పంపుల ద్వారా తోడి లారీల్లోకి తరలించేవారు. తక్కువ ధరకు హైవేల సమీపంలో లూజ్ విక్రయాలు సాగించే వారికి, సుదూర ప్రాంతాలకు వెళ్లే ఇతర రాష్ట్రాల లారీ డ్రైవర్లకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఒక వేళ వీరు దొంగతనానికి వెళ్లిన సమయంలో బంకు సిబ్బంది మేల్కొని ఉంటే మారణాయుధాలతో బెదిరించి నగదు లాక్కొనేవారు. ఈ పార్థీ గ్యాంగ్ జిల్లాలో సంచరిస్తోందన్న సమాచారంతో పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి నిఘా పెట్టారు. ఈ క్రమంలోనే సోమవారం ఎస్కే యూనివర్సిటీ సమీపంలో ఐదుగురు పార్థీ గ్యాంగ్ సభ్యులను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.3.50 లక్షల నగదు, రెండు 12 చక్రాల లారీలు, రెండు చేతి పంపులు, 100 మీటర్ల పైపు, 50 డీజిల్ క్యాన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.35 లక్షలు ఉంటుంది. అలాగే వీరి నుంచి డీజిల్ కొనుగోలు చేసినట్లు తేలడంతో అనంతపురం జిల్లా యాడికి మండలం వేమలపాడు గ్రామానికి చెందిన గడ్డం గాంగేశ్వర, గడ్డం నాగేష్, కడవకల్లు జగదీష్‌లపైనా పోలీసులు కేసు నమోదు చేసి..అరెస్టు చేశారు.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఆరోగ్యశ్రీతో క్యాన్సర్‌ను జయించా



నా పేరు బొప్పా నాగలక్ష్మి. నా భర్త శ్రీనివాస్. తాపీ పనిచేస్తారు. మాది పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామం. నాకు 2022లో బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చింది. గుంటూరులోని క్యాన్సర్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా రేడియేషన్, కీమోథెరపీ చేశారు. ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్స కూడా చేశారు. సుమారు రూ.3 లక్షల వరకు ఖర్చయ్యింది. పూర్తిగా ప్రభుత్వమే భరించింది. ప్రస్తుతం నా ఆరోగ్యం బాగుంది. పూర్తిగా కోలుకున్నాను. ఇటీవల నా భర్త శ్రీనివాస్ ప్రమాదవశాత్తు పడిపోవడంతో కాలు విరిగింది. ప్లేట్లు వేశారు. ఆ తర్వాత ప్లేట్లు కూడా తీసేశారు. ప్రస్తుతం ఇంటివద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. నాకు వైఎస్సార్ చేయూత పథకంలో మూడుసార్లు ఏడాదికి రూ.18,750 చొప్పున ఆర్థిక సహాయం అందింది. వైఎస్సార్ ఆసరాలో ఏడాదికి రూ.16 వేల చొప్పున మూడుసార్లు నా బ్యాంకు ఖాతాలో డబ్బులు పడ్డాయి. సున్నా వడ్డీ కింద ఏడాదికి రూ.2 వేల చొప్పున అందింది. నవరత్నాల పథకాలు మా కుటుంబానికి ఎంతో ఆసరాగా నిలిచాయి. నాకు ఇద్దరు సంతానం. ఇద్దరికీ వివాహాలు చేశాను. **– బొప్పా నాగలక్ష్మి, పూలపల్లి**

(కె.శాంతారావు, విలేకరి, పాలకొల్లు అర్బన్)

వృద్ధాప్యంలో పింఛనే ఆధారం



మాది పేద కుటుంబం. నా భర్త చాలా కాలం క్రితం మృతి చెందారు. నాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పిల్లలందరికీ వివాహం చేశాను. ఎవరి కుటుంబాలను వారు పోషించుకుంటున్నారు. ఈ ప్రభుత్వం వచ్చాకే నాకు వితంతు పింఛన్ మంజూరైంది. ఇప్పుడు రూ.3 వేలు ఇస్తున్నారు. వృద్ధాప్యంలో ఈ సొమ్ము ఎంతగానో ఉపయోగపడుతోంది. మాది అనకాపల్లి జిల్లా మునగపాక మండల కేంద్రం. సొంతిల్లు లేకపోవడంతో దరఖాస్తు చేసిన వెంటనే ఇల్లు మంజూరైంది. ఇప్పుడు సొంతింట్లోనే ఉంటున్నాను. ఉపాధి హామీ పథకంలో కూలి పనులకు కూడా వెళుతుంటాను. నా లాంటి వృద్ధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద కొడుకులా ఆదరిస్తున్నారు. నాకు వచ్చే పింఛన్‌ను కుటుంబ అవసరాలు, మందులకు వినియోగించుకుంటున్నా. పొద్దు పొడవక ముందే ప్రతి నెలా ఒకటో తారీఖునే వలంటీర్ వచ్చి పింఛన్ అందజేయడం సంతోషంగా ఉంది. **– గుడే పార్వతి, మునగపాక**

(వెలగా జగదీష్‌కుమార్, విలేకరి, మునగపాక)

ఈ మేలును జీవితాంతం మరవం



భార్యాభర్తలిద్దరం పని చేస్తేగానీ పూట గడవని కుటుంబం మాది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా కుటుంబ ఆర్థిక పరిస్థితి చాలా వరకు మారింది. మాది వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని హనుమాన్‌నగర్. నా భర్త తిరుమలేశు ఇక్కడే ఓ వస్త్ర దుకాణంలో గుమస్తాగా పని చేసేవాడు. నేను భాగ్యలక్ష్మి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిని. మా సంఘం రూ.10 లక్షలు రుణం తీసుకుంది. ఈ ప్రభుత్వంలో వైఎస్సార్ ఆసరా ద్వారా ఆ రుణం నాలుగు విడతల్లో మాఫీ అయింది. గతంలో మేము మగ్గం నేసేవాళ్లం. అప్పుడు వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఏడాదికి రూ.24 వేలు చొప్పున మూడేళ్లు రూ.72 వేలు అందుకున్నాం. కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగు పడ్డాక చేనేత వృత్తిని వీడి, ప్రస్తుతం ఇంటి వద్ద బియ్యం వ్యాపారం చేస్తున్నాం. మా అమ్మాయి కళావతి బీటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. ఆమెకు మూడేళ్లపాటు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా రూ.లక్షకు పైగా లబ్ధి చేకూరింది. కుమారుడు జయకృష్ణకు ఇంటర్లో అమ్మఒడి ద్వారా రూ.30 వేలు లబ్ధి చేకూరింది. ప్రస్తుతం బీటెక్ డేటా సైన్స్‌లో చేరాడు. గతంలో మా ప్రాంతానికి తాగునీరు వచ్చేది కాదు. ఇప్పుడు రోజూ ఇంటి వద్దకే నీటి సరఫరా జరుగుతోంది. జగనన్న పాలనలో మా కుటుంబం ఆర్థికంగా స్థిరపడింది. దిగుల్లేదిక. ఈ ప్రభుత్వం మేలును జీవితాంతం గుర్తుంచుకుంటాం. **– తనికంటి లక్ష్మీదేవి, ప్రొద్దుటూరు**

(కుడుముల వీరారెడ్డి, విలేకరి, ప్రొద్దుటూరు)

నేడు 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు వేడుకలు

రాష్ట్రవ్యాప్తంగా 50 రోజుల పాటు ఉత్సాహంగా క్రీడా పోటీలు నిర్వహించిన ప్రభుత్వం

- వివిధ క్రీడల్లో పోటీ పడిన 25.40 లక్షల మంది క్రీడాకారులు
- అన్ని దశల్లో కలిపి రూ.12.21 కోట్ల నగదు బహుమతులు
- రూ.37 కోట్ల విలువైన స్పోర్ట్స్ కిట్లు అందజేత
- ప్రఖ్యాత సంస్థలతో టాలెంట్ హంట్ నిర్వహణ
- ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ.. అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటేలా తర్ఫీదు
- విశాఖలోని వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో జరిగే ముగింపు వేడుకల్లో పాల్గొననున్న సీఎం జగన్



ఏయూ మైదానంలో కబడ్డీలో తలపడుతున్న విశాఖ-అనంతపురం జట్లు

సాక్షి, అమరావతి/విశాఖ స్పోర్ట్స్: రాష్ట్రవ్యాప్తంగా 50 రోజుల పాటు పండుగ వాతావరణంలో ఉత్సాహంగా సాగిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు తుది ఘట్టానికి చేరుకున్నాయి. మట్టిలోని మాణిక్యాలను ఒడిసిపట్టే మహాయజ్ఞం విశాఖ సాగర తీరంలో ఉవ్వెత్తున ఎగిసిపడింది. గ్రామ స్థాయి నుంచి యువతలో క్రీడా స్ఫూర్తిని నింపుతూ, ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి వైఎస్ జగన్ ప్రభుత్వం తలపెట్టిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం ఫైనల్ దశకు చేరుకుంది. మంగళవారం విశాఖపట్నంలోని వైఎస్సార్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ముగింపు వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు, నగదు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

ఇకపై ఏటా ఆడుదాం..

మారుమూల గ్రామాల్లోని క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' మెగా టోర్నీని నిర్వహించింది. గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 50 రోజుల పాటు ఈ క్రీడా సంబరాలు కొనసాగాయి. మొత్తం 25,40,972 మంది క్రీడాకారులు తమ ప్రతిభ కనబరిచారు. ఇందులో 17,59,263 మంది పురుషులు, 7,81,709 మంది మహిళా క్రీడాకారులున్నారు. వీరికి దాదాపు రూ.37 కోట్ల విలువైన స్పోర్ట్స్ కిట్లను ప్రభుత్వం అందించింది. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో 3.30 లక్షలు, మండల స్థాయిలో 1.24 లక్షలు, నియోజకవర్గ స్థాయిలో 7,946, జిల్లా స్థాయిలో 1,731, రాష్ట్ర స్థాయిలో 260 మ్యాచ్‌లను దిగ్విజయంగా నిర్వహించింది. వివిధ దశల్లో విజేతలకు రూ.12.21 కోట్ల నగదు బహుమతులిస్తోంది. తొలి ఏడాది పోటీలు విజయవంతం కావడంతో భవిష్యత్‌లో మరింత ఎక్కువ మంది గ్రామీణ క్రీడాకారులను పరిచయం చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇకపై ప్రతి ఏటా 'ఆడుదాం ఆంధ్రా' నిర్వహించేలా ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

ప్రతిభకు ప్రోత్సాహం..

ఈ మెగా టోర్నీ ద్వారా ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. చెన్నై సూపర్ సింగ్స్(సీఎస్‌కే)తో పాటు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా క్రికెట్‌లో టాలెంట్ హంట్ నిర్వహించింది. ప్రో కబడ్డీ, బ్లాక్ హాక్స్ వాలీబాల్ ఫ్రాంచైజీలతో పాటు ఏపీకి చెందిన ఖోఖో, కబడ్డీ క్రీడా సంఘాలు, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుల బృందాలు కూడా ఈ ఎంపికలో భాగస్వామ్యులయ్యాయి. ఎంపికైన క్రీడాకారులకు శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ ఇచ్చి, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దనుంది.

భారీగా నగదు బహుమతులు

విశాఖ వేదికగా జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. మెన్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ మంగళవారం విశాఖలోని వైఎస్సార్ స్టేడియంలో జరగనుంది. ముగింపు వేడుకలకు హాజరవుతున్న సీఎం జగన్ చివరి ఐదు ఓవర్లను వీక్షించనున్నారు. అనంతరం క్రీడల వారీగా విజేతలకు సీఎం జగన్ నగదు బహుమతులను అందజేస్తారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లకు రూ.5 లక్షల చొప్పున, రన్నరప్‌లకు రూ.3 లక్షలు, సెకండ్ రన్నరప్‌లకు రూ.2 లక్షల చొప్పున నగదు బహుమతి అందించనున్నారు. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో విజేతలు రూ.2 లక్షలు, రన్నరప్ రూ.లక్ష, సెకండ్ రన్నరప్ రూ.50 వేలు అందుకోనున్నారు.

ఆడుదాం ఆంధ్ర విజేతలు వీరే

- బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు పూర్తి
- నేడు ఫ్లడ్‌లైట్ల వెలుగులో పురుషుల క్రికెట్ ఫైనల్స్

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర ఫైనల్ పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. విశాఖలోని ఎనిమిది వేదికల్లో ఐదు క్రీడాంశాల్లో పురుషుల, మహిళల జట్ల మధ్య ఫైనల్స్‌ను ప్రేక్షకులు ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు.

మహిళల విభాగంలో..

- క్రికెట్ విజేతగా ఎన్టీఆర్ జిల్లా సిద్ధార్థ నగర్, రన్నరప్‌గా తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి, సెకండ్ రన్నరప్‌గా ప్రకాశం జిల్లా చిరకూరపాడు జట్లు నిలిచాయి.
- వాలీబాల్ విజేతగా బాపట్ల జిల్లా నిజాంపట్నం-3, రన్నరప్‌గా కర్నూలు జిల్లా మామిడాలపాడు-1, సెకండ్ రన్నరప్‌గా అన్నమయ్య జిల్లా కుచ్చువారిపల్లి-1 జట్లు నిలిచాయి.
- బ్యాడ్మింటన్ విజేతగా బాపట్ల జిల్లా స్వర్ణ 2, రన్నరప్‌గా వైఎస్సార్ జిల్లా శంకరాపురం-4, సెకండ్ రన్నరప్‌గా కర్నూలు జిల్లా ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ కాలనీ జట్లు నిలిచాయి.
- ఖోఖో విజేతగా ప్రకాశం జిల్లా పోలిరెడ్డి బజార్, రన్నరప్‌గా కృష్ణా జిల్లా నెహ్రూ సెంటర్ చౌక్, సెకండ్ రన్నరప్‌గా కాకినాడ జిల్లా బీసీ కాలనీ 2 జట్లు నిలిచాయి.
- కబడ్డీ విజేతగా విశాఖ జిల్లా లాసన్స్‌బే కాలనీ, రన్నరప్‌గా ప్రకాశం జిల్లా పాకాల 2, సెకండ్ రన్నరప్‌గా అనకాపల్లి జిల్లా సాలపువానిపాలెం జట్లు నిలిచాయి.

పురుషుల విభాగంలో..

- బ్యాడ్మింటన్ విజేతగా ఏలూరు జిల్లా శేఖర్ వీధి, రన్నరప్‌గా తిరుపతి జిల్లా భేరీపేట, సెకండ్ రన్నరప్‌గా వైఎస్సార్ కడప కాగితాల పెంట 1 జట్లు నిలిచాయి.
- వాలీబాల్ విజేతగా బాపట్ల జిల్లా బేతపూడి, రన్నరప్‌గా మన్యం జిల్లా బలిజపేట, సెకండ్ రన్నరప్‌గా చిత్తూరు జిల్లా కొత్తపల్లె జట్లు నిలిచాయి.
- ఖోఖో విజేతగా బాపట్ల జిల్లా పొంగులూరు -1, రన్నరప్‌గా అనకాపల్లి జిల్లా తుమ్మపాల -2, సెకండ్ రన్నరప్‌గా ప్రకాశం జిల్లా రుద్రవరం జట్లు నిలిచాయి.

సాగర తీరంలో డ్రోన్ షో

సాక్షి, అమరావతి: 'ఆడుదాం ఆంధ్ర' ముగింపు వేడుకలను ప్రభుత్వం నేడు అట్టహాసంగా నిర్వహించనుంది. విశాఖ సాగర తీరంలో లేజర్ షోతో పాటు డ్రోన్ షోలు ఏర్పాటు చేశారు. స్టేడియంలో ప్రొజెక్షన్ మ్యాపింగ్, సౌండ్ అండ్ లైటింగ్ షోకు శాప్ ఏర్పాట్లు చేసింది. ఎల్‌ఈడీ కాంతుల్లో 150 మంది కూచిపూడి నృత్యకారులతో ఆడుదాం ఆంధ్రపై కళా ప్రదర్శన నిర్వహిస్తారు. బాణసంచా వెలుగులు ఆహూతుల్ని అలరించనున్నాయి.

నేడు సీఎం జగన్ విశాఖ పర్యటన

సాక్షి, అమరావతి: సీఎం జగన్ మంగళవారం విశాఖలో పర్యటించనున్నారు. 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు వేడుకల్లో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఇందు కోసం సీఎం జగన్ మంగళవారం సాయంత్రం 4 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటారు. పీఎం పాలెంలోని వైఎస్సార్ క్రికెట్ స్టేడియానికి వెళ్లి క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షిస్తారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి సీఎం జగన్ ప్రసంగించి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. అనంతరం అక్కడి నుంచి తాడేపల్లికి చేరుకుంటారు.

త్వరితగతిన పీఆర్సీ ప్రకటిస్తాం : మంత్రి బొత్స



మాట్లాడుతున్న మంత్రి బొత్స, పక్కన సజ్జల, సీఎస్ జవహర్‌రెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పీఆర్సీ ప్రకటించాలని భావిస్తోందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన ఉద్యోగ సంఘాలతో వారి పెండింగ్ సమస్యలపై చర్చించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆర్థిక అంశాలను పరిష్కరిస్తున్నామన్నారు. ఈ నెలతోపాటు వచ్చే నెలలో కూడా సుమారు రూ.5,500 కోట్లు విడుదల చేస్తామన్నారు. ఇప్పటికే పీఆర్సీ కమిషన్ వేశామని, త్వరలోనే అది తన పనిని ప్రారంభిస్తుందని తెలిపారు. ఉద్యోగులు మధ్యంతర భృతిని కోరారని, తమ ప్రభుత్వం పీఆర్సీని వేగంగా అమలుచేయాలని యోచిస్తోందన్నారు. తహశీల్దార్ రమణయ్య కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు వారి ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇస్తున్నట్లు బొత్స ప్రకటించారు.

మార్చి నాటికి బకాయిల విడుదల..

ఇక ప్రభుత్వంతో డీఏ బకాయిలు, మధ్యంతర భృతిపై ప్రధానంగా చర్చించినట్లు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి చెప్పారు. రూ.5వేల కోట్లకు పైగా ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను మార్చి నెలాఖరు నాటికి చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఏపీజీఎల్ఐ బకాయిలు, సీపీఎస్ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ రూ.2,400 కోట్లతో పాటు రూ.2,250 కోట్ల మేర సరెండర్ లీవ్‌ల బకాయిలు ఇచ్చేందుకు మంత్రుల కమిటీ అంగీకారం తెలిపిందన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎక్స్‌పీరియన్స్ అలవెన్సు ఇవ్వాలని కోరామన్నారు. ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణకు తక్షణం ఉత్తర్వులివ్వాలని కోరామన్నారు.

రాజ్యసభ సభ్యత్వానికి.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్లు

సాక్షి, అమరావతి : త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గొల్ల బాబూరావు, వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డిలు సోమవారం తమ నామినేషన్లను దాఖలు చేశారు. అసెంబ్లీలో రాజ్యసభ ఎంపీ అభ్యర్థులుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అసెంబ్లీ సంయుక్త కార్యదర్శి ఎం. విజయరాజుకి తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పీవీ సుబ్బారెడ్డి, ఉప కార్యదర్శి వనితారాణి, అభ్యర్థుల తరఫున మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేత వి. విజయసాయిరెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.



వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థులకు బీ-ఫారాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

3 స్థానాల్లో విజయం సాధిస్తాం: వైవీ

శాసనసభలో అత్యధిక సంఖ్యా బలం మాకే ఉంది. వైఎస్సార్‌సీపీ నుంచి ముగ్గురం విజయం సాధిస్తాం. సీఎం వైఎస్ జగన్ పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారు. రాజ్యసభ ఎన్నికల్లో మాకు అవకాశం కల్పించినందుకు సీఎం జగన్‌కి ధన్యవాదాలు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైఎస్సార్‌సీపీలో అధిక ప్రాధాన్యత ఉంటుంది. రాజ్యసభ ఎన్నికల్లో సీఎం జగన్ సామాజిక న్యాయం చేశారు. గతంలో బీసీలు నలుగురికి అవకాశం కల్పించగా.. తాజాగా దళితుడైన గొల్ల బాబురావుకి అవకాశమిచ్చారు. చరిత్రలో ఎప్పుడులేని విధంగా ముఖ్యమంత్రి జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారిని పార్లమెంట్ మెట్లు ఎక్కిస్తున్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగాలన్న, సంక్షేమ-అభివృద్ధి పథకాలు అందాలన్నా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలి.

వైఎస్సార్‌సీపీ ఆశయ సాధనకు పనిచేస్తాం : మేడా రఘునాథరెడ్డి

అన్నా.. నువ్వు పోటీ చేయాల్సిందేనని పట్టుబట్టి ముఖ్యమంత్రి జగన్ నాకు వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థిత్వం కేటాయించారు. వృత్తిరీత్యా కాంట్రాక్టర్‌ని. నేను దేశవ్యాప్తంగా ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశాను. కానీ, ఇలాంటి మనసున్న సీఎంను ఎక్కడా చూడలేదు. ఒకరికి మేలుచేసే విషయంలోనూ, గౌరవించే విషయంలోను ముఖ్యమంత్రి జగన్ తర్వాతే ఎవరైనా. ఎంతో పోటీ ఉన్నా నాపై నమ్మకంతో ముఖ్యమంత్రి పిలిచి మరీ నాకు రాజ్యసభ సీటు ఇచ్చారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా, వైఎస్సార్‌సీపీ ఆశయాల సాధనకు, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి మేడా సోదరులం కలిసి పనిచేస్తాం.

బీ-ఫారాలు అందజేసిన సీఎం జగన్

అంతకుముందు.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థులు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి సీఎం క్యాంప్ కార్యాలయంలో కలిశారు. వారికి సీఎం బీ-ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలను జగన్ రాజ్యసభకు పంపిస్తున్నారు: గొల్ల బాబురావు

అవసరాలకు అనుగుణంగా రాజకీయాలు నడుస్తున్న రోజులివి. ఈ కాలంలో మానవీయాన్ని ఒంటినిండా నింపుకున్న ఏకైక రాజకీయ నేతగా ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే కన్పిస్తారు. కష్టకాలంలో సీఎం జగన్ వెంట నడిచాను. ఎవరు మన వారు.. ఎవరు పరాయి వారు అనేది ఆయనకు తెలుసు. నమ్మిన వారిని గుండెల్లో పెట్టుకునే కుటుంబం వైఎస్సార్‌ది. చంద్రబాబు పార్టీలో దళితులకు రాజ్యసభ సీటు అందని ద్రాక్షే. అదే ముఖ్యమంత్రి జగన్ ఎలాంటి పదవులైనా అన్ని వర్గాలకు సమంగా పంచుతారు. పేద వర్గాలను ఆయన రాజ్యసభకి పంపిస్తున్నారు. వైఎస్సార్ కుటుంబ రుణం తీర్చుకోలేనిది. సంఖ్యాబలం ప్రకారం మూడు స్థానాలు మేమే దక్కించుకుంటాం.

నారాయణ వాటా... రూ.650 కోట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

బురిడీ కొట్టించటం, లేని కంపెనీలను సృష్టించి మరీ రుణాలు తెచ్చి ఎగవేయటం వంటి కళల్లో సిద్ధహస్తులైన బాబు ముఠా మళ్లీ ఆ పనిలో పడ్డారు. దీన్లో భాగంగా అధిక వడ్డీల ఎర వేసి అప్పుల రూపంలో డబ్బులు సేకరించే బాధ్యత తన బినామీ అయిన మాజీ మంత్రి నారాయణకు అప్పగించారు. ఇక ఎడాపెడా రుణాలు తీసుకుని బ్యాంకులకు టోపీ పెట్టిన చరిత్ర సుజనా చౌదరిది. దాదాపు 10వేల కోట్లకుపైగా వివిధ బ్యాంకులకు ఎగ్గొట్టిన సుజనాను అరెస్టు చేస్తారన్న భయంతోనే 2019లో ఓడిపోయిన వెంటనే బీజేపీలోకి పంపారు చంద్రబాబు. గంటా శ్రీనివాసరావుదీ రుణాలు ఎగవేసిన బాపతే. వీళ్లు మళ్లీ అదే పనిలో పడ్డారని విశ్వసనీయంగా తెలియవచ్చింది.

ఆర్థిక నేరగాళ్లతో బ్యాంకులకు కన్నమేసి..

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్ట అయిన చంద్రబాబుతో ఆది నుంచి ఆర్థిక నేరగాళ్లు పెనవేసుకుపోయారు. ఆది నుంచీ పలువురు బినామీలను పెంచి పోషిస్తూ వచ్చిన చంద్రబాబు... రాష్ట్రంలో 2014–19 మధ్య అధికారంలోకి వచ్చినపుడు ప్రభుత్వ సహజ వనరులను, వ్యవస్థలను వీళ్లకు అప్పగించేశారు. అంతా అందినకాడికి దోచుకున్నారు. ఇది చాలదన్నట్టు అధికారాన్ని అడ్డం పెట్టుకుని వీరు బ్యాంకులకు కూడా అధికారికంగా దోచుకున్నారు. ఎడాపెడా నకిలీ కంపెనీలు పెట్టి... వాటి పేరిట కోటాను కోట్ల రూపాయల రుణాలు తీసుకున్నారు.

- వివిధ బ్యాంకుల నుంచి రూ.10 వేల కోట్ల రుణాలను తీసుకుని ఎగ్గొట్టిన కేసులో సుజనా చౌదరిపై 2018–19లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణ చేపట్టింది. గత ఎన్నికల ఫలితాలు వెలువడగానే టీడీపీని వీడి బీజేపీ పంచన చేరిన సుజనా... ఇప్పటికీ యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలు సాగిస్తూనే ఉన్నారని, చంద్రబాబుకు ఇం'ధనం' చేకూర్చుతున్నారని టీడీపీ సీనియర్ నాయకుడొకరు వ్యాఖ్యానించారు.
- ప్రత్యూష కంపెనీ పేరుతో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వివిధ బ్యాంకుల నుంచి రూ.141 కోట్ల రుణాన్ని తీసుకోగా వడ్డీతో కలిపి రూ.203.62 కోట్లకు చేరాయి. వాటిని చెల్లించకుండా మొండికేస్తున్న గంటా మరిన్ని ఆర్థిక సంస్థలను కొల్లగొడుతూ టీడీపీకి ఎన్నికల వ్యయాన్ని సమకూరుస్తున్నారని సమాచారం.

రిత్విక్‌కు పందేరం..

2019 ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక కేసుల నుంచి తప్పించుకునేందుకు సుజనా చౌదరితో పాటు తనకు అత్యంత సన్నిహితుడైన సీఎం రమేష్‌ను కూడా బీజేపీ గూటికి చేర్చారు చంద్రబాబు. ఆయన బీజేపీలో ఉంటున్నా తరిస్తున్నది మాత్రం చంద్రబాబు సేవలోనే. 2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు సాగునీటి ప్రాజెక్టుల్లో రూ.వేల కోట్ల విలువైన పనులను సీఎం రమేష్ సంస్థ రిత్విక్ ప్రాజెక్ట్స్‌కు కట్టబెట్టిన చంద్రబాబు కమీషన్లు వసూలు చేసుకున్నారు. రిత్విక్ ప్రాజెక్ట్స్‌తోపాటు సీఎం రమేష్‌కు సన్నిహితంగా ఉండే కాంట్రాక్టు సంస్థల ద్వారా బ్యాంకుల నుంచి భారీగా రుణాలను సేకరిస్తూ టీడీపీకి ఇం'ధనం' సమకూర్చుతున్నట్లు ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి.

కాలేజీలో నారాయణ 'కౌంటర్'

2014 వరకూ చంద్రబాబు ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షిస్తూ బినామీగా వ్యవహరించిన నారాయణ విద్యాసంస్థల అధినేత పొంగూరు నారాయణ.. అధిక వడ్డీల ఆశ చూపిస్తూ భారీ ఎత్తున రుణాలను సేకరించి చంద్రబాబుకు అందిస్తుంటారు. టీడీపీ హయాంలో నారాయణకు అత్యంత కీలకమైన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖను కేటాయించిన చంద్రబాబు ఆయనతో కలసి అమరావతి భూకుంభకోణంలో భారీ ఎత్తున దోచేశారు. అయితే ఎన్నికలు ముగిశాక అధిక మొత్తంలో అప్పులు ఇచ్చిన ఇద్దరు బడా వ్యాపారులు, మార్వాడీలకు నారాయణ టోపీ పెట్టారనే చర్చ నెల్లూరులో భారీ ఎత్తున సాగింది. ఇప్పుడు కూడా నారాయణ తనకు అలవాటైన రీతిలో అధిక వడ్డీల ఎర వేసి వ్యాపారులు, మార్వాడీలు, ప్రజల నుంచి పెద్ద ఎత్తున రుణాలు సేకరిస్తున్నారు. నెల్లూరులోని నారాయణ వైద్య కళాశాలలో వారం క్రితం నాలుగు కౌంటర్లు తెరిచి నూటికి 5 రూపాయల వడ్డీ ఆశ చూపించి... (అంటే ఏడాదికి 60 శాతం) వ్యాపారులు, మార్వాడీల నుంచి దాదాపు రూ.650 కోట్లు సమీకరించారని సమాచారం. దీన్ని రహస్య ప్రాంతానికి తరలించిన నారాయణ... అక్కడి నుంచి చంద్రబాబు సూచించిన స్థావరాలకు చేరవేయడంలో నిమగ్నమయ్యారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

పోలవరాన్ని పాతిపెట్టి!

పోలవరం ప్రాజెక్టు హెడ్ వర్క్స్ పనులను 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పార్టీ ఎంపీ రాయపాటి సాంబశివరావుకు చెందిన ట్రాన్స్‌ట్రాయ్‌కు కట్టబెట్టింది. దాన్ని అప్పట్లో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న చంద్రబాబు తీవ్రంగా తప్పుబట్టారు. అర్హత లేని ట్రాన్స్‌ట్రాయ్‌కి అత్యంత ప్రతిష్టాత్మకమైన పోలవరం పనులు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ అధిష్టానానికి రూ.వందల కోట్లు ముడుపులు ముట్టాయని ఆరోపించారు. అనంతరం 2014 ఎన్నికల్లో భారీ ఎత్తున ఇం'ధనం' సమకూర్చాలనే షరతుతో రాయపాటిని చంద్రబాబు తమ పార్టీలోకి తీసుకున్నారు. మొబిలైజేషన్ అడ్వాన్సుల రూపంలో ప్రభుత్వం నుంచి తీసుకున్న డబ్బులతోపాటు పోలవరం పనుల కోసం బ్యాంకుల నుంచి ట్రాన్స్‌ట్రాయ్ తీసుకున్న రుణాన్ని సైతం ఎన్నికల ఖర్చుల కోసం చంద్రబాబు వసూలు చేశారని, అలా ఇచ్చేశాం కాబట్టే తాము దివాలా తీయాల్సి వచ్చిందని ఇటీవల ట్రాన్స్‌ట్రాయ్ అధినేత రాయపాటి రంగారావు బహిరంగంగా ప్రకటించటం తెలిసిందే. చంద్రబాబు కమీషన్ల కక్కుర్తితో పోలవరం ప్రాజెక్టుతో పాటు తాము కూడా నాశనమయ్యామని ఆయన స్పష్టంగా చెప్పారు.

క్లుప్తంగా...

గ్రూప్‌-2 ప్రిలిమ్స్‌కు అంతా సిద్ధం

- రేపటి నుంచి హాల్‌ టికెట్ల డౌన్‌లోడ్‌

సాక్షి, అమరావతి: గ్రూప్‌–2 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు ఏపీపీఎస్సీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 25వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసం 24 జిల్లాల్లో సెంటర్లను ఏర్పాటు చేసింది. హాల్‌ టికెట్లను కమిషన్‌ వెబ్‌సైట్‌ http://www.psc.ap. gov.in-లో అందుబాటులో ఉంచామని, అభ్యర్థులు బుధవారం నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చని ఏపీపీఎస్సీ సోమవారం ప్రకటించింది. గ్రూప్‌–2లో మొత్తం 899 పోస్టులకు 4,83,525 మంది దరఖాస్తు చేసుకున్నారు. నోటిఫికేషన్‌లో తొలుత 897 పోస్టులను ప్రకటించగా, అదనంగా మరో రెండు పోస్టులు కలిపారు.

వాయిదా అపోహలు నమ్మవద్దు

ఇటీవల ఏపీపీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్లలో ఏ ఒక్క పరీక్షను వాయిదా వేయడం లేదని సర్వీస్‌ కమిషన్‌ స్పష్టం చేసింది. గ్రూప్‌–2 ప్రిలిమ్స్‌ వాయిదా వేస్తున్నట్లు కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని, అలాంటి వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది.

మరో రెండు వారాల గడువు ఇవ్వండి

- స్పీకర్‌కు ముగ్గురు ఫిరాయింపు ఎమ్మెల్యేలు లేఖ

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ నుంచి శాసనసభకు ఎన్నికై టీడీపీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖరరెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం శాసనసభ స్పీకర్‌ తమ్మినేని సీతారాం ఎదుట వివరణ ఇచ్చేందుకు రాలేదు. తాము వివరణ ఇవ్వడానికి మరో రెండు వారాల సమయం ఇవ్వాలని కోరుతూ స్పీకర్‌కు వారు లేఖలు రాశారు. వాటిపై స్పీకర్‌ తమ్మినేని నిర్ణయం తీసుకోనున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఆనం రాంనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలపై ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ తమ్మినేని వద్ద ప్రభుత్వ చీఫ్‌ విప్‌ ముదునూరి ప్రసాదరాజు పిటిషన్‌లు దాఖలు చేశారు. వాటిపై స్పీకర్‌ తమ్మినేని విచారిస్తున్నారు. ఆనం రాంనారాయణరెడ్డి ఇప్పటికే స్పీకర్‌కు వివరణ ఇచ్చారు.

న్యాయ సేవాధికార సంస్థల న్యూస్‌లెటర్‌ ఆవిష్కరణ



న్యూస్‌ లెటర్‌ను ఆవిష్కరిస్తున్న జస్టిస్‌ ఆకుల వెంకట శేషసాయి తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల న్యాయ సేవాధికార సంస్థలు అందించిన వివిధ సేవలు, చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన న్యూస్‌ లెటర్‌ను హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్‌ చైర్మన్‌ జస్టిస్‌ ఆకుల వెంకట శేషసాయి ఆవిష్కరించారు. సోమవారం హైకోర్టులో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి మజ్జి బబిత, హైకోర్టు లీగల్‌ సర్వీసెస్‌ కమిటీ కార్యదర్శి మాలతి, న్యాయ సేవాధికార సంస్థ పరిపాలనాధికారి అమర రంగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్‌ 27న పాలిసెట్‌



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న కమిషనర్‌ నాగరాణి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో ప్రవేశం కోసం పాలిసెట్‌–2024ను ఏప్రిల్‌ 27న నిర్వహిస్తున్నట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌ చదలవాడ నాగరాణి చెప్పారు. ఆమె సోమవారం తన కార్యాలయంలో పాలిటెక్నిక్‌ విద్యతో కలిగే ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలు, జీత భత్యాలపై అవగాహన కల్పించేలా సమగ్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలిటెక్నిక్‌ విద్యతో ఉన్నత ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. పదోతరగతి చదువుతున్న విద్యార్థుల్లో పాలిటెక్నిక్‌పై మరింత అవగాహన పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పదోతరగతి పరీక్షలు పూర్తయిన వెంటనే ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలల్లో ఉచితంగా విద్యార్థులకు పాలిసెట్‌–2024కు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో శిక్షణ ఇవ్వడంతోపాటు స్టడీ మెటీరియల్‌ను కూడా ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలల్లో ఆధునిక ల్యాబొరేటరీలు, హాస్టల్‌ సౌకర్యాలను మెరుగుపర్చినట్లు చెప్పారు. ఎన్‌బీఏ గుర్తింపు పొందిన ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 2024–25 విద్యాసంవత్సరం నుంచి మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించేలా అనేక పరిశ్రమలతో ఒప్పందం చేసుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంకేతికవిద్య, శిక్షణమండలి కార్యదర్శి రమణబాబు, సంయుక్త కార్యదర్శి జి.వి.వి.ఎస్‌.ఎన్‌.మూర్తి, కంట్రోలర్‌ ఆఫ్‌ ఎగ్జామినేషన్స్‌ జానకిరామయ్య, ఉప కార్యదర్శులు ప్రసాద్‌బాబు, రవికుమార్, వేణుమాధవ్, ఓఎస్డీ రత్నసాగర్‌ పాల్గొన్నారు.

డీఎస్సీ వచ్చేసింది



షెడ్యూల్‌ ఇదీ

ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపు	ఫిబ్రవరి 21 వరకు
దరఖాస్తులకు చివరి తేదీ	ఫిబ్రవరి 22
ఆన్‌లైన్‌ నమూనా పరీక్ష	ఫిబ్రవరి 24
హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌	మార్చి 5 నుంచి
టీఆర్టీ	మార్చి 15 నుంచి 30 వరకు
ప్రాథమిక 'కీ' విడుదల	మార్చి 31
తుది 'కీ' ప్రకటన	ఏప్రిల్‌ 2
ఫలితాల ప్రకటన	ఏప్రిల్‌ 7

సాక్షి, అమరావతి: బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన టీచర్‌ అభ్యర్థుల ఉత్కంఠకు తెరదించుతూ డీఎస్సీ 2024 నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. డీఎస్సీ అర్హతలు, భర్తీ ప్రక్రియకు సంబంధించిన జీవోలు 11,12లతో పాటు వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తూ సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వెనువెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు, ఫీజు చెల్లింపు ప్రక్రియను ప్రారంభించారు. 2022 తర్వాత బీఈడీ, డీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులకు కూడా మేలు జరిగేలా టీచర్‌ ఎలిజిబిలిటీ టెస్ట్‌ నిర్వహణకు నోటిఫికేషన్‌ వెలువడిన విషయం తెలిసిందే. డీఎస్సీ నోటిఫికేషన్‌ ద్వారా 6,100 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారు. డీఎస్సీ దరఖాస్తు ఫీజు రూ.750గా నిర్ణయించారు. రాష్ట్రంలో ప్రభుత్వ యాజమాన్యాల కింద ఉన్న జిల్లా, మండల పరిషత్, మున్సిపల్, ఏపీ మోడల్‌ స్కూల్స్, ఏపీ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషనల్‌ ఇనిస్టిట్యూషన్‌ సొసైటీ, ఏపీ ట్రైబల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషనల్‌ ఇనిస్టిట్యూషన్‌ సొసైటీ(గురుకులం), ఏపీ ట్రైబల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషనల్‌ ఇనిస్టిట్యూషన్‌ సొసైటీ (ఆశ్రమ్‌), ఏపీ సోషల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషనల్‌ ఇనిస్టిట్యూషన్‌ సొసైటీ, మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సొసైటీల కింద పని చేస్తున్న విద్యాసంస్థల్లోని ఖాళీలన్నిటినీ భర్తీ చేయనున్నట్టు మంత్రి బొత్స తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌ నాటికి ఖాళీ అయ్యే ఉపాధ్యాయ పోస్టులను సైతం డీఎస్సీ 2024 ద్వారా భర్తీ చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. అంతేకాకుండా 'జీరో వేకెన్సీ' విధానంతో ఏ ఏడాది ఖాళీలను ఆ ఏడాదే భర్తీ చేస్తామని తెలిపారు.

2018 నిబంధనలే అమలు

డీఎస్సీ 2024లో ఎలాంటి కొత్త నిబంధనలు లేవని, 2018 డీఎస్సీ నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధివిధానాలు, అర్హతలనే ఖరారు చేశామని మంత్రి బొత్స తెలిపారు. ఇందులో ఎలాంటి మార్పు లేదనే విషయాన్ని గుర్తించాలని కోరారు. జనరల్‌ అభ్యర్థులకు ఈ ఏడాది జూలై 1 నాటికి 44 సంవత్సరాలు లోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్‌ అభ్యర్థులకు 49 ఏళ్లు, దివ్యాంగులకు 54 ఏళ్లు గరిష్ట వయోపరిమితి విధించారు. డీఎస్సీ ఎంపికలో టీచర్‌ రిక్రూట్‌మెంట్‌ టెస్ట్‌కు 80 శాతం, ఏపీ టెట్‌/సీటెట్‌కు 20 శాతం మార్కులు వెయిటేజీ ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో జరిగే టీచర్‌ రిక్రూట్‌మెంట్‌ టెస్ట్‌ (టీఆర్టీ)కు రాష్ట్రవ్యాప్తంగా 122 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నోటిఫికేషన్‌ వెలువడిన రోజు నుంచి ఫిబ్రవరి 21 వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవచ్చని, ఈనెల 22 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించామని వివరించారు. మార్చి 15 నుంచి 30వతేదీ వరకు రెండు సెషన్స్‌లో టీచర్‌ రిక్రూట్‌మెంట్‌ టెస్ట్‌ నిర్వహిస్తామన్నారు. మొదటి సెషన్‌ ఉదయం 9.30 నుంచి 12 వరకు, రెండో సెషన్‌ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌ (సీబీటీ) విధానంలో జరుగుతుంది. పండుగలు, ప్రభుత్వ సెలవు దినాలు, ఏపీపీఎస్సీ పరీక్షలు జరిగే తేదీలను మినహాయించి షెడ్యూల్‌ ఖరారు చేశామన్నారు. డీఎస్సీ 2024కు సంబంధించి ఫిర్యాదుల స్వీకరణ, సందేహాల నివృత్తికి పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌లో ప్రత్యేక హెల్ప్‌ డెస్క్‌ను అందుబాటులోకి తెచ్చామని మంత్రి తెలిపారు.

అర్హతలు, నియామకాలపై జీవోలు

డీఎస్సీ 2024 విద్యార్హతలు, నియామకాలకు సంబంధించి వేర్వేరుగా జీఓలు విడుదల చేసినట్లు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ ప్రకాశ్‌ తెలిపారు. జీవో నం.11లో ఉపాధ్యాయ నియామక వివరాలు, జీవో నం.12లో అభ్యర్థుల అర్హతలకు సంబంధించిన వివరాలను పొందుపరిచామన్నారు. మార్చి 5వ తేదీ నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చని పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ సురేశ్‌ కుమార్‌ సూచించారు. రాష్ట్రంలో రోజుకు సగటున 40 వేల మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పరీక్షలు రాసేందుకు వీలుగా సదుపాయాలు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే 122 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందిన దరఖాస్తుల ఆధారంగా మిగతా కేంద్రాల సంఖ్యను నిర్ణయిస్తామని వెల్లడించారు. కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌ డెస్క్‌ (9505619127, 9705655349) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పనిచేస్తుందని, అవసరమైన వారు ఈ సేవలు వినియోగించుకోవచ్చని సూచించారు. సమావేశంలో ఇంటర్‌ బోర్డు కమిషనర్‌ సౌరభ్‌ గౌర్, పాఠశాలల మౌలిక సదుపాయాల విభాగం కమిషనర్‌ కె.భాస్కర్, సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్‌ శోభిత, ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలవారీగా పోస్టులు

డీఎస్సీ 2024లో ప్రకటించిన 6,100 పోస్టుల్లో ఎస్జీటీలు 2,280, స్కూల్‌ అసిస్టెంట్లు 2,299, టీజీటీలు 1,264, పీజీటీలు 215, ప్రిన్సిపల్‌ పోస్టులు 42 ఉన్నాయి.

జిల్లా	ఎస్జీటీ	ఎస్‌ఏ	టీజీటీ	మొత్తం
శ్రీకాకుళం	104	130	49	283
విజయనగరం	103	97	84	284
విశాఖపట్నం	101	133	95	329
తూ.గోదావరి	108	182	102	392
ప.గోదావరి	102	145	59	306
కృష్ణా	103	111	65	279
గుంటూరు	109	170	137	416
ప్రకాశం	111	299	93	503
నెల్లూరు	104	140	102	346
చిత్తూరు	101	97	139	336
కడప	105	81	103	289
అనంతపురం	107	164	115	386
కర్నూలు	1,022	550	121	1,693

సొసైటీల వారీగా పోస్టులు ఇలా..

రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలో ఏపీ మోడల్‌ స్కూల్స్, ఏపీ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషనల్‌ ఇన్‌స్టిట్యూషన్‌ సొసైటీ, ఏపీ ట్రైబల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషనల్‌ ఇనిస్టిట్యూషన్‌ సొసైటీ(గురుకులం), ఏపీ ట్రైబల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషనల్‌ ఇనిస్టిట్యూషన్‌ సొసైటీ(ఆశ్రమ్‌), ఏపీ సోషల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషనల్‌ ఇనిస్టిట్యూషన్‌ సొసైటీ, మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సొసైటీలు పని చేస్తున్నాయి. వాటిలో 1,264 టీజీటీ పోస్టులు, 215 పీజీటీ, 42 ప్రిన్సిపల్, 13 ఫిజికల్‌ డైరెక్టర్‌ (పీడీ) పోస్టులున్నాయి.

సొసైటీ	టీజీటీ	పీజీటీ	ప్రిన్సిపల్‌
ఏపీ మోడల్‌	248	23	15
బీసీ సంక్షేమ	66	81	23
సోషల్‌ వెల్ఫేర్‌	386	0	0
ట్రైబల్‌ వెల్ఫేర్‌	446	58	0
ఏపీ రెసిడెన్షియల్‌	118	53	4

ఏపీ ట్రైబల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషనల్‌ ఇనిస్టిట్యూషన్‌ సొసైటీ(గురుకులం)లో 13 ఫిజికల్‌ డైరెక్టర్‌ పోస్టులను భర్తీ చేయనున్నారు.

ఏపీ ఎత్తిపోస్తుంటే ఏం చేశారు?

జగన్‌ సీఎం అయ్యాక పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 92,500 క్యూసెక్కులకు పెంచుకున్నారు

సాక్షి, హైదరాబాద్‌: కృష్ణా జలాల పంపిణీ, శ్రీశైలం, నాగార్జునసాగర్‌ ప్రాజెక్టులపై వాగ్వాదాలతో తెలంగాణ శాసనసభ సోమవారం అసెంబ్లీ దద్దరిల్లింది. కృష్ణా నీటిని ఏపీ సీఎం వైఎస్‌ జగన్‌ ఆంధ్రప్రదేశ్‌కు తరలించుకుపోతుంటే నాడు కేసీఆర్‌ ఆయనకు సహకరించారంటూ కాంగ్రెస్‌ ప్రభుత్వం విమర్శించింది. అయితే ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించేందుకు కాంగ్రెస్‌ సర్కారు ప్రయత్నిస్తోందంటూ ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌ ఎదురుదాడికి దిగింది. కాంగ్రెస్‌ సర్కారు తీరును ఎండగట్టేందుకు తాము నల్లగొండలో బహిరంగ సభ నిర్వహిస్తుంటే దీన్నుంచి దృష్టి మళ్లించేందుకు సభలో తీర్మానం పెట్టారని మండిపడింది. నదీ జలాల విషయంలో ఉమ్మడి రాష్ట్రంలో కంటే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటయ్యాకే ఎక్కువ అన్యాయం జరిగిందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. జలాల్లో ఏపీకి ఎక్కువ వాటా ఇచ్చినా, ఆంధ్రప్రదేశ్‌ భారీగా తరలించుకుపోతున్నా బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వంతో కేసీఆర్‌ సర్కారు కుమ్మక్కైందని ఆరోపించారు. కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించినది గత ప్రభుత్వమేనన్నారు. కృష్ణాబోర్డుకు ప్రాజెక్టుల అప్పగింత అంశంపై సోమవారం తెలంగాణ అసెంబ్లీలో ఉత్తమ్‌ పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పెంచిన సీఎం జగన్‌

2020లో శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 92,500 క్యూసెక్కుల నీటిని తరలించుకుపోవడానికి వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం జీవో నంబర్‌ 203 తెచ్చినా కేసీఆర్‌ సర్కార్‌ అడ్డుకోలేదు. ఏపీ ప్రభుత్వంతో కుమ్మక్కయ్యారు. కృష్ణా నుంచి రోజుకు 3 టీఎంసీల నీటిని తరలించుకుపోయేందుకు ఏపీ రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టినా పట్టించుకోలేదు. పోతిరెడ్డిపాడు ద్వారా 1983లో 11,150 క్యూసెక్కుల నీరు తరలిస్తే 2005లో వైఎస్సార్‌



ప్రభుత్వం 44,000 క్యూసెక్కులకు పెంచింది. సీఎం జగన్‌ వచ్చిన తర్వాత పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని ఏకంగా 92,500 క్యూసెక్కులకు పెంచారు.

ఏనాడూ అభ్యంతరం తెలపలేదు

2014లో కేంద్ర ప్రభుత్వం కృష్ణాజలాల్లో నీటి వాటాను తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీలుగా నిర్ణయిస్తే.. అప్పటి సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి ఏమాత్రం అభ్యంతరం తెలపలేదు. సాగునీటి మంత్రిగా హరీశ్‌రావు ఢిల్లీ వెళ్లి 299 టీఎంసీలకు ఒప్పుకొని కృష్ణా జలాల్లో తెలంగాణకు శాశ్వత నష్టం చేకూర్చారు. 2015 నుంచి 2023 వరకు ఏటా ఢిల్లీలో జరిగిన సమావేశాల్లో పాల్గొన్న కేసీఆర్, హరీశ్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అభ్యంతరాలేమీ తెలపలేదు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన 225 టీఎంసీల గురించి గానీ, కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు అవసరమైన 206 టీఎంసీల గురించి గానీ ఏనాడూ అడగలేదు. ఎస్‌ఎల్‌బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు, పాలమూరు–రంగారెడ్డిలకు అవసరమైన నీటి గురించి కేంద్రాన్ని నిలదీయలేదు. నీటి వాటాలపై ట్రిబ్యునల్‌ తీర్పు వచ్చేదాకా పాత ఒప్పందమే కొనసాగించాలంటూ రెండో అపెక్స్‌ కౌన్సిల్‌ మీటింగ్‌లో కూడా కేసీఆర్‌ అంగీకరించడం తెలంగాణకు తీరని ద్రోహమే. బీఆర్‌ఎస్‌ పదేళ్ల హయాంలో నీటిపారుదల శాఖలో జరిగిన అవినీతి దేశ చరిత్రలో ఎక్కడా జరగలేదు.

కేసీఆర్‌ సభకు వస్తే తేలుస్తాం: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

పదేళ్లు తెలంగాణకు అన్యాయం చేసిన పాపాల భైరవుడు కేసీఆర్‌. కృష్ణా నదీ జలాలపై ముఖ్యమైన చర్చ జరుగుతుంటే ఆయన సభకు ఎందుకు రాలేదు? అసెంబ్లీ చర్చలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ నాయకులకు, వారి మాటలకు ఏమాత్రం విలువ లేదు. బీఆర్‌ఎస్‌ అధినేత ఇక్కడికొచ్చి మాట్లాడాలి. ఆయనకు ఎంతసేపైనా మైక్‌ ఇచ్చేందుకు సిద్ధం. తెలంగాణకు ఎవరు అన్యాయం చేశారో తేలుస్తాం.

ఏపీకి ప్రయోజనం చేకూర్చారు..

ఏపీ సీఎం జగన్, అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్‌ గంటల కొద్దీ ఏకాంత చర్చలు జరిపారు. రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు టెండర్లు ముగిసేదాకా కేసీఆర్‌ అపెక్స్‌ కమిటీ సమావేశానికి హాజరు కాకుండా ఏపీకి ప్రయోజనం కలిగేలా వ్యవహరించారు. కేసీఆర్‌ తెలంగాణ నీళ్లను ఏపీకి ఇస్తున్నారంటూ వైఎస్‌ జగన్‌ ఆ రాష్ట్ర అసెంబ్లీలో పొగడటం నిజం కాదా? అసెంబ్లీ ఎన్నికల చివరిరోజున నాగార్జునసాగర్‌ను ఏపీ ప్రభుత్వం అనధికారికంగా తమ చేతుల్లోకి తీసుకోవడం వెనుక రాజకీయం లేదా? కుడికాల్వ గేట్లు ఎత్తి నీటిని తరలించడంపై కేసీఆర్‌ ఇప్పటి వరకు ఒక్కమాట కూడా మాట్లాడలేదు. కృష్ణాబోర్డుకు నాగార్జునసాగర్‌ను అప్పగించేందుకు సిద్ధమన్న రీతిలో అప్పటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్‌ కేంద్రానికి లేఖ రాయడం మరింత నష్టం కలిగించింది. మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల అప్పగింతకు వ్యతిరేకమని కేంద్రానికి స్పష్టం చేశాం. ఇందుకు సంబంధించిన సమావేశం మినిట్స్‌ మార్చాలని కోరాం.

సముద్రంలో కలిసే నీళ్లే ఇచ్చాం

బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్‌: ఏటా రెండు వేల టీఎంసీల గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తాయని, అలా కలిసే నీటిని వాడుకోవాలని తమ ప్రభుత్వ హయాంలో ఏపీకి అవకాశం ఇచ్చామని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే, తెలంగాణ మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. దీనివల్ల కృష్ణా జలాలను ఎక్కువగా వాడుకోవడానికి తెలంగాణకు అవకాశం దొరుకుతుందన్నది తమ ఉద్దేశమన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించబోమని అసెంబ్లీలో తీర్మానం చేయడం తెలంగాణ ప్రజల విజయమన్నారు. సోమవారం అసెంబ్లీలో ఈ అంశంపై జరిగిన చర్చలో హరీశ్‌రావు మాట్లాడారు. ''ట్రిబ్యునల్‌ పరిధిలో ఉన్న అంశాన్ని మేం కృష్ణాబోర్డుకు అప్పగించడం సాధ్యం కాదు. రెండో అపెక్స్‌ సమావేశంలో నీటి వాటాను వ్యతిరేకిస్తూ లేఖ రాశాం. గత కాంగ్రెస్‌ ప్రభుత్వాల తీరు వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రాకు 512 టీఎంసీలు కేటాయించారు. పదేళ్ల కేసీఆర్‌ పాలనలో ప్రాజెక్టులను అప్పగించలేదు. మీరు కాంగ్రెస్‌ వచ్చాక రెండు నెలల్లో అప్పగించారు' అని విమర్శించారు.

రాయలసీమ లిఫ్ట్‌పై కేసులు వేశాం...

'రాయలసీమ లిఫ్ట్‌ గురించి 5-5-2020న జీఓ వచ్చింది. అంతకు ముందే జనవరి 29, 2020 నాడే కేంద్రానికి ఫిర్యాదు చేశాం. 12-05-2020 నాడు ఆపాలని లేఖ రాశాం. అపెక్స్‌ కమిటీ మీటింగ్‌లలో కూడా రాయలసీమ లిఫ్ట్‌ను ఆపాలని కోరాం. పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పెంచినప్పుడు మీరు ఎందుకు మాట్లాడలేదు? మేము పేగులు తెగేదాకా కొట్లాడాం. 40 రోజులు అసెంబ్లీ స్తంభింప చేశాం. రాయలసీమ లిఫ్ట్‌పై కేసులు కూడా వేశాం. ఎన్జీటీకి ఫిర్యాదు చేసి ఆపాం' అని హరీశ్‌రావు తెలిపారు.

ఎన్నికల నిబంధనల మేరకే ఐపీఎస్‌ల బదిలీలు

- పోలీసుల ప్రతిష్టను దెబ్బతీసేలా కథనాలు రాస్తే సహించం
- ఎల్లో మీడియా నిరాధార ఆరోపణలపై ఐపీఎస్‌ అధికారుల సంఘం మండిపాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఐపీఎస్‌ అధికారుల బదిలీలపై ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోందని ఐపీఎస్‌ అధికారుల సంఘం మండిపడింది. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగానే బదిలీలు జరిగినట్లు సోమవారం ఓ ప్రకటనలో స్పష్టంచేసింది. శాంతిభద్రతల పరిరక్షణలో అహర్నిశలు శ్రమించే పోలీసుల నిస్వార్థ సేవలను, ప్రతిష్టను దెబ్బతీసేలా ఎల్లో మీడియా రాసిన కథనాలను తీవ్రంగా ఖండించింది. పోలీసులు తమ విధి నిర్వహణలో భాగంగా తీసుకునే చర్యలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే సంబంధిత అధికారులను సంప్రదించి వాస్తవాలు తెలుసుకోవచ్చని సూచించింది. పోలీసు అధికారులపై నిరాధార ఆరోపణలు చేయడం సరైన చర్యకాదని హితవు పలికింది. పదేపదే బాధ్యతారాహిత్య కథనాలు ప్రచురిస్తే సివిల్, క్రిమినల్‌ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. రాష్ట్ర ప్రభుత్వానికి పరిపాలన అవసరాలకు తగ్గట్లుగా ఐపీఎస్‌ అధికారుల బదిలీ, పోస్టింగులు చేసుకునే అధికారం ఉంటుందని స్పష్టంచేసింది.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

కారుమూరి సమక్షంలో 200 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు చేరిక

ఇరగవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు ఆకర్షితులై, వారు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు గ్రామంలో సోమవారం మంత్రి సమక్షంలో జనసేన, టీడీపీలకు చెందిన 200 మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిలో 15 కుల సంఘాల వారు, మహిళలు అధిక సంఖ్యలో చేరగా, వీరికి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తూర్పువిప్పర్రు గ్రామంలో శెట్టిబలిజ రామాలయం వద్ద ఉన్న శెట్టిబలిజ నాయకుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజ కులంలో మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయానికి కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రూ.25 లక్షల విలువైన వైద్యం అందేలా మార్పులు చేస్తూ అందించిన ఆరోగ్యశ్రీ కార్డులను మంత్రి లబ్ధిదారులకు అందజేశారు.



మంత్రి కారుమూరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు

సంక్షేమ పాలనకు మెచ్చి..



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న అబ్బయ్యచౌదరి

పెదవేగి: ఏలూరు జిల్లా పెదవేగి మండలం కూచింపూడిలో టీడీపీ, జనసేన పార్టీలకు భారీ షాక్‌ తగిలింది. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి పాలనకు, దెందులూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులైన సుమారు 200 మంది టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీ బాణాసంచాతో ఘనస్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. చేరికల కార్యక్రమానికి ముందు కూచింపూడి మెయిన్‌ రోడ్డు నుంచి వైఎస్సార్‌ విగ్రహం వరకు భారీ బైక్‌ ర్యాలీ నిర్వహించి, కేక్‌ కట్‌ చేశారు. అనంతరం ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి వైఎస్సార్‌ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య, పెదవేగి సొసైటీ చైర్మన్‌ పెనుమాక వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఎదుర్కోలేకే..

భీమవరం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీకి ఉన్న ప్రజాబలాన్ని ఢీకొట్టడం ప్రతిపక్ష పార్టీలకు సాధ్యమయ్యే పనికాదని గ్రహించడం వల్లే మొత్తం పార్టీలన్నీ మూకుమ్మడిగా దాడికి సిద్ధమవుతున్నాయని ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన క్షత్రియ యూత్‌ ఉద్దరాజు రాజేష్‌వర్మ ఆధ్వర్యంలో సోమవారం పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శ్రీనివాస్‌ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఎం జగన్‌ గత ఐదేళ్లుగా జనరంజకమైన పాలన అందించడంతో అందరి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని, దీంతో రానున్న ఎన్నికల్లో మరోసారి ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించడం ఖాయమైందని చెప్పారు. జగన్‌ ప్రజా బలాన్ని చూసి భయపడిన ప్రతిపక్ష పార్టీల నాయకులు ఒంటరిగా పోటీ పడలేక మూకుమ్మడిగా పోటీకి రావాలని చూస్తున్నాయని ఎద్దేవా చేశారు. టీడీపీ, జనసేన వంటి పార్టీలు ఒంటరిగా పోటీ చేస్తే తమ పార్టీ కార్యాలయాలను మూసేసే పరిస్థితి ఏర్పడుతుందని గ్రహించడం వల్ల చంద్రబాబు గతంలో గెల్చుకున్న 23 స్థానాలైనా దక్కించుకోవడానికి పొత్తుల కోసం పాకులాడుతున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ విమర్శించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ 175 సీట్లు గెలిచి తీరుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నరసాపురం పార్లమెంట్‌ అభ్యర్థి గూడూరి ఉమాబాల, రాష్ట్ర యువత నాయకుడు గ్రంధి రవితేజ, ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్‌ తిరుమాని ఏడుకొండలు తదితరులున్నారు. పార్టీలో చేరినవారిలో ఉద్దరాజు అప్పలరాజు, కూనపరాజు దుర్గరాజు, ముదునూరి శివనాగరాజు, అల్లూరి వెంకట కృష్ణంరాజు, పి.చల్లారావు, సుబ్రమణ్యం, కూనపరాజు వాసురాజు తదితరులు ఉన్నారు.



పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న గ్రంధి శ్రీనివాస్‌

వీరశైవ ఆగమ పద్ధతిలోనే మహాకుంభాభిషేకం

- హైకోర్టుకు నివేదించిన దేవదాయశాఖ

సాక్షి, అమరావతి: శ్రీశైలంలో ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే మహాకుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలను వీరశైవ ఆగమ పద్ధతుల ప్రకారమే నిర్వహిస్తామని దేవదాయశాఖ అధికారులు హైకోర్టుకు నివేదించారు. ఈ వివరాలను రికార్డ్‌ చేసిన హైకోర్టు, తమ ముందున్న వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ధీరజ్‌సింగ్‌ ఠాకూర్, న్యాయమూర్తి రావు రఘునందన్‌రావు ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. శ్రీశైలంలో నిర్వహించతలపెట్టిన మహాకుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలను వీరశైవ ఆగమ పద్ధతుల ప్రకారమే నిర్వహించేలా ఆదేశించాలని అఖిల భారత వీరశైవ ధార్మిక ఆగమ పరిషత్‌ చైర్మన్‌ సాగర్‌ హైకోర్టులో లంచ్‌మోషన్‌ రూపంలో పిల్‌ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం సీజే ధర్మాసనం విచారించింది. పిటిషనర్‌ న్యాయవాది వి.వి.సతీష్‌ వాదనలు వినిపిస్తూ.. మహాకుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలను వీరశైవ ఆగమ పద్ధతిలోనే నిర్వహించాలని గతంలోనే తీర్మానించారని తెలిపారు. ప్రస్తుతం అందుకు విరుద్ధంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారని చెప్పారు. ఈ వాదనలను ప్రభుత్వ న్యాయవాది (జీపీ) రజనీ రెడ్డి తోసిపుచ్చారు. వీరశైవ ఆగమ పద్ధతుల్లోనే మహాకుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. మరో సీనియర్‌ న్యాయవాది వి.ఎస్‌.ఆర్‌.ఆంజనేయులు స్పందిస్తూ.. ఆగమశాస్త్రం ప్రకారం కార్యక్రమాలను నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ సింగిల్‌ జడ్జి వద్ద పిటిషన్‌ దాఖలు చేశామన్నారు. ఆ వ్యాజ్యం ఒకటిరెండు రోజుల్లో విచారణకు రానున్నదని తెలిపారు. అలా అయితే ఈ వ్యవహారాన్ని సింగిల్‌ జడ్జి వద్దే తేల్చుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది.



లేనివాటిని ఆశించి ఉన్నవాటిని పాడు చేసుకోకు.
ఇప్పుడు నువ్వు కలిగి ఉన్నవి ఒకప్పుడు నీకు లేనివేనని గుర్తుకు తెచ్చుకో!
– ఎపిక్యురస్

సాక్షి
మంగళవారం, 13 ఫిబ్రవరి 2024

ఇంకావుంది!

ఎక్కడైనా ఎన్నికలు ముగిసి, ఫలితాలు వచ్చాక రాజకీయంగా సుస్థిరత నెలకొంటుందని ఆశించడం సహజం. పాకిస్తాన్‌లో మాత్రం అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి. దాయాది దేశంలోని ఇటీవలి 12వ జనరల్ ఎలక్షన్ ఓటింగ్ సరళి, తాజా ఫలితాలు చూస్తే... ఎన్నికలు ముగిశాయి కానీ, అసలు కథ ఇంకా మిగిలే ఉందని అర్థమవుతోంది. చిత్రమేమిటంటే, సొంతంగా ప్రభుత్వ ఏర్పాటుకు సంఖ్యాబలం లేకపోయినా పాక్ మాజీ ప్రధానులు నవాజ్ షరీఫ్, ఇమ్రాన్ ఖాన్‌లు ఇరువురూ ఎన్నికల్లో తమదే విజయమని ప్రకటించుకోవడం! ఇక, 2018 ఎన్నికల్లో ఇమ్రాన్‌కు అనుకూలంగా వ్యవహరించిన సైన్యం జనరల్ ఆసిమ్ మునీర్ సారథ్యంలో ఈసారి సంకీర్ణ ప్రభుత్వ నిర్మాణం దిశగా పావులు కదుపుతోంది. పోలింగ్‌కు ముందూ, తర్వాత నిస్సిగ్గుగా రిగ్గింగ్‌కు పాల్పడి ఎన్నికలను ప్రహసనంగా మార్చిన ఆర్మీ ఇప్పటికీ పగ్గాలను తన చేతుల్లో ఉంచుకొని, 'హైబ్రిడ్' నమూనా ప్రభుత్వాన్ని నడపాలని చూస్తోంది. కౌంటింగ్‌లో రిగ్గింగ్ సాగకుంటే, జాతీయ అసెంబ్లీలో మూడింట రెండొంతుల మెజారిటీ ఇమ్రాన్‌కే వచ్చి ఉండేదని అభిప్రాయం. ఇప్పుడు రెండోస్థానంలో నిలిచిన నవాజ్ షరీఫ్ గద్దెనెక్కినా, కొత్త సర్కార్ సైతం సైన్యం చేతిలో కీలుబొమ్మగానే కొనసాగనుంది.

ఎన్నికల్లో ఓటర్లు ఇమ్రాన్ వైపు మొగ్గారన్నది సుస్పష్టం. కానీ ఒకపక్క రకరకాల కేసుల్లో శిక్షలు పడి, కారాగారంలో ఉన్న ఇమ్రాన్ రాజకీయ పదవిని అధిష్ఠించడంపై నిషేధం ఎదుర్కొంటున్నారు. పైగా, ఆయన నేతృత్వంలోని పాకిస్తాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ (పీటీఐ)కు ఎన్నికల చిహ్నమైన క్రికెట్ బ్యాట్ సైతం ఈసారి దూరమైంది. దాంతో ఆ పార్టీ తరఫున అభ్యర్థులందరూ స్వతంత్రులుగానే గెలిచారు. కాబట్టి ఏదో ఒక రిజిస్టర్డ్ పార్టీతో జతకడితే తప్ప... సాంకేతికంగా చూసినా, చట్టపరంగా చూసినా ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ఏ ఇతర పార్టీతోనూ కలిసేందుకు పీటీఐ ఇష్టపడకపోవడం పెద్ద ఇబ్బంది. మరోపక్క ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం కోసం వివిధ పార్టీల మధ్య చర్చోపచర్చలు సాగుతున్నాయి. పీటీఐ పక్షాన గెలిచిన వారిలో కొందరు ఇప్పటికే గోడ దూకుతున్నట్టు వార్త. వేరొకపక్క ఎన్నికల్లో రిగ్గింగ్, కౌంటింగ్ ప్రక్రియలో తప్పులు సహా పలు అక్రమాలు జరిగాయంటూ పలువురు కోర్టుకెక్కుతున్నారు. వెరసి, జాతీయ ఎన్నికలు ముగిసి, ఫలితాలు వచ్చాయన్న మాటే కానీ... పాకిస్తాన్‌లో పరిస్థితులు గందరగోళంగా ఉన్నాయి.

ఎన్నికల ఫలితాలు, చివరకు వాటి పర్యవసానాలు ఏమైనప్పటికీ... ఒకరకంగా ఈ ఎన్నికల్లో అసలైన విజేతలు సాధారణ పాకిస్తానీ ప్రజలు. సర్వశక్తిమంతమైన సైన్యం ఆ దేశంలో ప్రజాస్వామ్యం వేళ్ళూనుకోకుండా చేయడంలో పేరుమోసింది గనక ఎన్నికలు తూతూమంత్రమనీ, ప్రధాని ఎవరు కావాలన్నది మిలటరీ ముందే నిర్ణయించేసిందనే భావన నెలకొంది. అందుకు తగ్గట్టే, గతంలో సైన్యంతో సత్సంబంధాలు లేకపోవడంతో 1999లో పదవీచ్యుతుడైన నవాజ్ షరీఫ్ సరిగ్గా ఎన్నికల వేళకు ప్రవాసం నుంచి పాక్‌కు తరలివచ్చారు. వస్తూనే ఆయనపై ఆరోపణలన్నీ గాలికి పోయాయి. అలాగే ఒకప్పుడు సైన్యం సాయంతో గద్దెనెక్కి, ప్రస్తుతం దాని కరుణాకటాక్షాలకు దూరమైన ఇమ్రాన్, ఆయన పార్టీ అరెస్టులను ఎదుర్కోవాల్సి వచ్చింది. పాక్‌లో అధికార వ్యవస్థకు పర్యాయపదంగా మారిన సైన్యం ఎన్నికల్ని రిగ్ చేయాలని చూసింది. ఇన్నింటి మధ్య కూడా ప్రజలు ధైర్యంగా ఓటేశారు. ప్రజాస్వామ్య ఆకాంక్ష పట్ల ఆశలు రేకెత్తించారు.

ఇమ్రాన్‌ను పోటీకి దూరంగా ఉంచి, ఆ పార్టీని గద్దెనెక్కకుండా చేయాలన్న ఆర్మీ వ్యూహాలను ప్రజలు తిరస్కరించారు. తెర వెనుక నుంచి ఆడించేది ఆర్మీయే అని అంతర్జాతీయంగా అందరూ అనుకున్నా సామాన్యులకు నిన్న మొన్నటి వరకు ఆర్మీ పట్ల గౌరవం ఉండేది. కానీ, ప్రస్తుతం సైనిక జోక్యం పట్ల ప్రజలు సుముఖంగా లేరని తాజా ఎన్నికల ఫలితాలు తొలిసారిగా నిరూపించాయి. జాతీయ అసెంబ్లీలో నేరుగా ఎన్నికలు జరిగే 266 స్థానాల్లో ఎక్కువ సీట్లను ఇమ్రాన్ పార్టీ సమర్థించిన స్వతంత్రులే గెలిచారు. అతిపెద్ద పక్షంగా నిలిచారు. తర్వాతి స్థానాల్లో నవాజ్ షరీఫ్ 'పాకిస్తాన్ ముస్లిమ్ లీగ్ – నవాజ్' (పీఎంఎల్-ఎన్), బిలావల్ భుట్టో 'పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ' (పీపీపీ) నిలిచాయి. హంగ్ పార్లమెంట్ ఏర్పడినా ప్రజాతీర్పు ఇమ్రాన్ వైపుందనేది స్పష్టం. దాన్ని తోసిపుచ్చే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. పీఎంఎల్-ఎన్, పీపీపీ నేతలు ప్రభుత్వ ఏర్పాటుకు కూటమి కట్టాలని చర్చలు చేస్తున్నారు. పీటీఐ సైతం తమ సమర్థనతో గెలిచినవారంతా పార్లమెంట్‌లో కలసికట్టు కూటమిగా నిలిచేందుకు ఏం చేయాలా అని చూస్తోంది. ఏమైనా, ఇప్పటికే పలు సంక్షోభాల్లో కూరుకుపోయిన పొరుగుదేశం దీర్ఘకాలిక రాజకీయ అనిశ్చితిలో కొనసాగడం వాంఛనీయం కాదు.

రాగల రోజుల్లో సైన్యం పర్యవేక్షణలో పీఎంఎల్, పీపీపీల మధ్య కొత్త కూటమి ఏర్పాటుకై బేరసారాలు తప్పవు. పరస్పర ప్రయోజనాలే ప్రాతిపదికైన ఆ సర్కారైనా ఎంత స్థిరంగా ఉంటుందో ఊహించలేం. పాకిస్తానీ పెద్దలు ఇకనైనా ప్రజల భావావేశాలను గ్రహించాలి. ప్రజాభిప్రాయానికి భిన్నంగా ప్రవర్తిస్తే ఇక ప్రజాస్వామ్యానికి అర్థమేముంది! 'గులామీ న మంజూర్' (బానిసత్వాన్ని సమర్థించబోము) అని వినిపిస్తున్న నినాదాల్నీ, మంగళవారం నుంచి పీటీఐ చేపట్టదలచిన నిరసనల్నీ కొట్టేయలేం. 'ప్రజాస్వామ్య విక్రయానికి విపణి సిద్ధమైం'దన్న విమర్శల్ని నిజం చేస్తే అంతకన్నా ఘోరం లేదు. పేరుకు మిగిలిన ప్రజాస్వామ్యం, ఎన్నికల తర్వాత సైతం అనిశ్చితి నెలకొనడం ... పాకిస్తాన్ ప్రజల పాలిట శాపం. సరిహద్దు సమస్యలు, మరోమారు తలెత్తిన మతపరమైన హింసాత్మక తీవ్రవాదం, ఆర్థికరంగ సంక్షోభం నేపథ్యంలో ప్రస్తుతానికి పాక్ కథ సశేషమే!

సైన్యంలోని అవినీతిపై చైనా పోరాటం

విశ్లేషణ



జయదేవ రానాడే

2013 నుండి నిరంతర ప్రయత్నాలు చేసినప్పటికీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ప్రజా విముక్తి సైన్యం(పీఎల్ఏ)లోని అవినీతిని తొలగించలేకపోయారు. దానికోసం ఆయన అమలు చేసిన పర్యవేక్షణ వ్యవస్థ కూడా పనిచేసినట్లు లేదు. జిన్‌పింగ్‌కు మరింత ఇబ్బంది కలిగించే విషయం ఏమిటంటే, సీనియర్ అధికారులందరూ ఆయన ద్వారానే పదోన్నతి పొందారు. అవినీతి ఆరోపణలపై విచారణను ఎదుర్కొంటున్న కనీసం 70 మంది పీఎల్ఏ అధికారులను తాము గుర్తించినట్లు ఒక కెనడా థింక్ ట్యాంక్ పేర్కొంది. ఇక, తైవాన్‌పై దాడికి పీఎల్ఏ సిద్ధంగా లేదని మరో నివేదిక పేర్కొంది. పీఎల్ఏ రాజకీయ విశ్వసనీయతను, సైద్ధాంతిక నిబద్ధతను బలోపేతం చేయడానికి చైనా అధ్యక్షుడు ఒక కఠినమైన ప్రచారం నిర్వహించనున్నారనేది స్పష్టం.

గత సంవత్సరం మధ్య నుండి చైనీస్ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ–ప్రజా విముక్తి సైన్యం) ఉన్నత స్థాయిలలో స్పష్టంగా గందరగోళం కనిపిస్తోంది. చైనా సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ) నిర్వహించిన నూతన సంవత్సర ప్రదర్శనలో జనవరి 29న కనిపించిన సీఎంసీ సీనియర్ వైస్ చైర్మన్ జనరల్ జాంగ్ యూక్సియాను, రక్షణ మంత్రి జనరల్ లీ షాంగ్‌ఫును ఆకస్మికంగా తొలగించడం గురించి సుదీర్ఘకాలంపాటు చైనా ప్రభుత్వం వివరణ ఇవ్వలేదు. వీరిద్దరికీ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో సన్నిహిత కుటుంబ సంబంధాలు ఉండటం అనిశ్చితిని మరింతగా పెంచింది. అవినీతి లేదా రాజకీయ క్రమశిక్షణను ఉల్లంఘించిన ఆరోపణలపై చాలా మంది సీనియర్ అధికారులను ఇటీవలి నెలల్లో పదవుల నుండి తొలగించారు. అవినీతి ఆరోపణలపై విచారణలో ఉంచిన కనీసం 70 మంది పీఎల్ఏ అధికారులను తాము గుర్తించినట్లు ఒక కెనడా థింక్ ట్యాంక్ (మేధా సంస్థ) పేర్కొంది. అదనంగా, తైవాన్ పై దాడికి పీఎల్ఏ సిద్ధంగా లేదని పీఎల్ఏ అధికారులు జిన్‌పింగ్‌కు తెలియజేసినట్లు మరో నివేదిక పేర్కొంది. అవినీతిని నిర్మూలించడం, రాజకీయ క్రమశిక్షణ, విశ్వసనీయతను నిర్ధారించడంపై చైనా అధ్యక్షుడు దృష్టి సారించడంతో, పీఎల్ఏ పూర్తిగా 'ప్రక్షాళన' లేదా దిద్దుబాటుకు లోనవుతుందనే విషయం దాదాపు నిశ్చయమైంది.

కదులుతున్న సోపానక్రమం

గత ఏడాది సెప్టెంబర్‌లో జనరల్ లీ షాంగ్‌ఫు ఆకస్మికంగా ప్రజల దృష్టి నుండి అదృశ్యమైనప్పటి నుండి, ఇది ఎందుకు జరిగింది, అతని స్థానంలో ఎవరు ఉంటారు? అనే దానిపై నిరంతర ఊహాగానాలు కొనసాగుతున్నాయి. జిన్‌పింగ్ మరొక ఆశ్రితుడైన విదేశాంగ మంత్రి క్విన్ గ్యాంగ్ జూలైలో ఆకస్మికంగా, ఇప్పటికీ వివరించలేని విధంగా అదృశ్యమవడం కారణంగా మరింతగా ఊహాగానాలు పెరిగాయి. బహుశా వారు అవినీతికి పాల్పడ్డారనీ, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారనీ ఆ తర్వాత సంకేతాలు వచ్చాయి. ఆసక్తికరంగా, వీరిద్దరూ చైనా కమ్యూనిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యులుగా తమ స్థానాన్ని మాత్రం నిలుపుకొన్నారు.

2023 సంవత్సరం అక్టోబరులో జనరల్ లి షాంగ్‌ఫు అధికారికంగా రక్షణ మంత్రి పదవి నుండి వైదొలిగారు. అయితే పీఎల్ఏ మాజీ నేవీ కమాండర్ జనరల్ డాంగ్ జున్‌ను ఆయన వారసుడిగా నియమించటానికి మరో మూడు నెలలు పట్టింది. మొదటిసారిగా, మాజీ పీఎల్ఏ నేవీ కమాండర్‌ను రక్షణ మంత్రిగా నియమించడం వలన పీఎల్ఏ పదాతి బలగం, పీఎల్ఏ రాకెట్ బలగం గురించి సందేహాలు తలెత్తాయి. అదే సమయంలో, ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు జనరల్ జాంగ్ చాలా కాలం గైర్హాజరు కావడం, మళ్లీ అడపాదడపా సుదీర్ఘకాలం కనిపించకపోవడం వల్ల, జిన్‌పింగ్‌తో ఆయన సంబంధాలు దెబ్బతిన్నాయని ఊహాగానాలు వచ్చాయి. జనవరి 16న బీజింగ్‌లోని సెంట్రల్ పార్టీ స్కూల్‌లో 'అధిక నాణ్యత, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించడం'పై జరిగిన అధ్యయన సెషన్‌లో జనరల్ జాంగ్, జనరల్ హీ వీడాంగ్ వెనుక మూడవదైన చివరి వరుసలో కూర్చున్నట్లు ప్రభుత్వ యాజమాన్యంలోని సీసీటీవీ కవరేజ్ చూపించింది. ఇది పీఎల్ఏ సోపానక్రమం విషయంలో చాలా అసాధారణమైనది.



చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్

తనిఖీ పరిధిలోకి వచ్చినప్పటికీ...

పీఎల్ఏలో దశాబ్దాలుగా అవినీతి రాజ్యమేలుతున్న సంగతి తెలిసిందే. 2012 నవంబర్‌లో సెంట్రల్ మిలిటరీ కమిషన్ చైర్మన్‌గా జిన్‌పింగ్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే, పీఎల్ఏను చైనా కమ్యూనిస్టు పార్టీకి చెందిన అవినీతి నిరోధక సంస్థ అయిన కేంద్ర క్రమశిక్షణా తనిఖీ కమిషన్ పరిధిలోకి తీసుకువచ్చారు. దానిని ఏడాది పొడవునా సైద్ధాంతిక, అవినీతి వ్యతిరేక ప్రచారాలకు గురిచేశారు. పీఎల్ఏ ఆధునీకరణ, ఆల్-రౌండ్ టెక్నాలజీ అప్‌గ్రేడ్‌పై కొత్త, ప్రధాన ప్రాధాన్యత కారణంగా భారీ మొత్తంలో డబ్బు అందుబాటులోకి వచ్చేది. పీఎల్ఏ రాకెట్ ఫోర్స్ ముఖ్యంగా క్షిపణుల జాబితాను పెంచడానికి, కొత్త రకాల క్షిపణులను ప్రవేశపెట్టడానికి, అనేక భూగర్భ గోతులను నిర్మించడానికి చేసిన కృషి కారణంగా పెద్ద మొత్తాలను అందుకుంది. పీఎల్ఏ సామగ్రి అభివృద్ధి విభాగానికి సంబంధించిన రక్షణ శాస్త్రీయ సంస్థల్లోని అధికారుల తొలగింపు, వారు కూడా అవినీతికి పాల్పడ్డారని నిర్ధారిస్తుంది.

తాను కనీవినీ ఎరుగని స్థాయిలో అవినీతి వ్యతిరేక ప్రచారం సాగించినప్పటికీ, పీఎల్ఏలో ఇంత పెద్ద ఎత్తున అవినీతి కొనసాగడంపై జిన్‌పింగ్ ఆగ్రహం చెందారు. దీని ఫలితంగా 2017 నాటికి అవినీతి ఆరోపణలపై 40 శాతం మంది అధికారులను తొలగించారు. రిపోర్టింగ్, పర్యవేక్షణ యంత్రాంగం పని చేయలేదనీ, దానిని పర్యవేక్షించడానికి పార్టీ చేసిన ప్రయత్నాలను పీఎల్ఏ ప్రతిఘటించిందనీ ఇది సూచిస్తుంది. దీనికి అనుగుణంగా, 2024 జనవరి 1న నాటి పీఎల్ఏ దినపత్రిక సంపాదకీయం, అవినీతిపై పోరాటానికి ప్రాధాన్యతనిస్తూ మూడుసార్లు 'అవినీతి'ని ప్రస్తావించింది! అప్పటి నుండి, పీఎల్ఏ అవినీతిని అరికట్టాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పే దాదాపు అరడజను కథనాలు వచ్చాయి.

కఠిన ప్రచారం

ఇంతలో, రహస్య పీఎల్ఏ రాకెట్ ఫోర్స్ కమాండర్, పొలిటికల్ కమిస్సార్, జనరల్ లీ యుచావో, జనరల్ గ్జు జోంగ్‌బోలను, వరుసగా వారి పదవుల నుండి తొలగించారు. అవినీతి ఆరోపణలపై వీరిపై విచారణ సాగించారు. విశ్వసనీయ నివేదికల ప్రకారం, ఈ అవినీతి సొమ్ము విలువ మొత్తం 2 బిలియన్ డాలర్లు అని అంచనా. డిసెంబర్ 29న, చైనా పార్లమెంటుగా పేర్కొనే నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ తొమ్మిది మంది సీనియర్ పీఎల్ఏ అధికారులను వారి పదవుల నుండి తొలగించింది. 2023 జూన్‌లో, అణువ్యతిరేక దాడిని ప్రారంభించడం కోసం చర్యలను పర్యవేక్షించిన జనరల్ లి యుచావో, జనరల్ జు, ఆయన సహాయకులు లియు గ్వాంగ్బిన్, జాంగ్ జెన్‌జాంగ్‌లను కూడా వారి పదవుల నుండి తొలగించారు. పీఎల్ఏ సామగ్రి అభివృద్ధి విభాగం అధికారులైన జాంగ్ యులిన్, రావో వెన్‌మిన్‌లను తొలగించడం మరింత ఆసక్తికరంగా ఉంది. గత నెల ప్రారంభంలో, దాదాపు 15 మంది సీనియర్ పీఎల్ఏ రాకెట్ ఫోర్స్ అధికారులను కూడా తొలగించి విచారణలో ఉంచారు. వారిలో ఐదుగురు ఆ సంస్థకు చెందిన గత లేదా ప్రస్తుత కమాండర్లు.

2013 నుండి నిరంతర ప్రయత్నాలు చేసినప్పటికీ, జిన్‌పింగ్, పీఎల్ఏ నుండి అవినీతిని తొలగించలేకపోయారు. పైగా ఆయన అమలులో ఉంచిన పర్యవేక్షణ వ్యవస్థ కూడా పనిచేసినట్లు లేదు. జిన్‌పింగ్‌కు మరింత ఇబ్బంది కలిగించే విషయం ఏమిటంటే, సీనియర్ అధికారులందరూ ఆయన ద్వారానే పదోన్నతి పొందారు. జనరల్ లి షాంగ్‌ఫు వంటి ఆయన సన్నిహిత వ్యక్తులు కూడా వారి స్థానాల నుండి తొలగించబడిన అధికారులలో ఉన్నారు. పీఎల్ఏ రాజకీయ విశ్వసనీయతను, సైద్ధాంతిక నిబద్ధతను బలోపేతం చేయడానికి ఒక కఠినమైన కేంపెయిన్ నిర్వహించనున్నారని స్పష్టం అవుతోంది.

వ్యాసకర్త 'సెంటర్ ఫర్ చైనా ఎనాలిసిస్ అండ్ స్ట్రాటెజీ' అధ్యక్షుడు ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అంత నవ్వేంటి!



సాగరికా ఘోష్ మీద జోకులు వేయాల్సిన అవసరం లేదు. ఆమె జర్నలిస్టు మాత్రమే. ఇద్దరు మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌లు – టి.ఎన్.శేషన్, ఎం.ఎస్. గిల్ – కాంగ్రెస్‌లో చేరారని మీకు తెలుసా? ఇండియాలో నిష్పక్షపాతంగా ఉండటం అంటే 'యాంటీ-బీజేపీ' అనే కదా అర్థం. (రాజ్యసభ అభ్యర్థులలో ఒకరిగా సాగరికను తృణమూల్ కాంగ్రెస్ ఎంపిక చేసిన సందర్భం).

– అభిషేక్ బెనర్జీ, కాలమిస్ట్

దౌత్య భారత్



ఎనిమిది మంది భారతీయ నౌకాదళ సీనియర్ అధికారులను ఖతార్ విడుదల చేసిన వార్తలతో సోమవారం సానుకూలంగా ఆరంభం అయింది. గూఢచర్య ఆరోపణలపై ఖతార్ వీరికి విధించిన మరణశిక్ష రద్దయి, విడుదల అవటం అనేది ప్రధాని మోదీ ఆధ్వర్యంలో నూతన భారతదేశ విదేశీ సంబంధాల మెరుగుదలను సూచిస్తోంది.

– సుధీర్ చౌదరి, జర్నలిస్ట్

ఇస్తానన్నవే కదా!



ఫిబ్రవరి 13న ఢిల్లీలో ప్రదర్శనకు తరలి వెళుతున్న లక్షలాది మంది రైతుల ప్రధాన డిమాండ్లు: కనీస మద్దతు ధర భరోసాకు చట్టం, ఎమ్మెస్ స్వామినాథన్ నివేదిక అమలు. నిజానికి ఈ డిమాండ్లు 2021 ఢిల్లీ కిసాన్ మోర్చా సమయంలో రైతులకు కేంద్ర ప్రభుత్వం హామీలుగా ఇచ్చినవే!

– గుర్పంథీర్ సింగ్ వారిచ్ పంజాబ్ రైతుబిడ్డ

కాంగ్రెస్ 'రత్న'



మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. అది కూడా తన తండ్రి శంకర్‌రావ్ చవాన్‌కు భారత రత్న ఇవ్వకుండానే! బీజేపీకి ఇది మంచి డీల్. 'ఇండియా' కూటమికి మాత్రం డీలా పడే పరిణామం.

– అభయ్, రాజకీయ వ్యాఖ్యాత

అక్టోబర్ 7



ఐ.డి.ఎఫ్. (ఇజ్రాయిల్ రక్షణ దళాలు) గాజాలోని చిట్టచివరి ఆశ్రయం రఫా పైన కూడా బాంబు దాడులు ప్రారంభించడం చూస్తుంటే, అక్టోబర్ 7న హమాస్ దాడుల అనంతరం... "ఈ యుద్ధాన్ని ఇజ్రాయిల్ ప్రారంభించలేదు. కానీ ఇజ్రాయిల్ పూర్తి చేస్తుంది" అని బెంజమిన్ నెతన్యాహు అన్న మాటలు గుర్తుకొస్తున్నాయి.

– అభిజిత్ మజుందార్, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

సజీవ స్వరం 'రేడియో'

ఆకాశవాణి వార్తలు చదువుతున్నది అద్దంకి మన్నార్... భాయియో ఔర్ బెహనో మై అమీన్ సయానీ బోల్ రహాహూ... ప్రాంతీయ వార్తలు చదువుతున్నది సురమౌళి... రేడియో సిలోన్ నుంచి మీనాక్షీ పొన్నుదురై... ఇంకా రేడియో అక్కయ్య, అన్నయ్య, చిన్నక్క, రాంబాబు... ఇట్లా ఎన్నో గొంతులు ఈ తరానికి పరిచయం లేకపోవచ్చు. కానీ ఒకనాడు ఇంటింటా మార్మోగాయి. టీవీలూ, ఇంటర్నెట్‌కూ ప్రజలు ఎంత అలవాటుపడినప్పటికీ అర్థవంతమైన, ఆరోగ్యవంతమైన భాషా వినియోగానికీ, భావాల ప్రసారానికీ రేడియో ఎంతో ఉపయోగపడే మాధ్యమం.

1981 ఆగస్టులో మొదలైన ఎంటీవీ ప్రారంభ కార్యక్రమంలో వీడియో కిల్ రేడియో స్టార్ అని పాట పాడారు. అయినా రేడియో అనేక ఆటుపోట్లు, అవరోధాల నడుమ ఇంకా సజీవంగానే ఉన్నది. దేశంలో నేటికీ ఆకాశవాణి 23 భాషల్లో, 179 మాండలికాల్లో తన ప్రసారాలను కొనసాగిస్తున్నది. భౌగోళికంగా దేశంలో 92 శాతం ఉన్న ప్రాంతాలకూ, 99.19 శాతం ప్రజలకూ తన ప్రసారాలను వినిపిస్తున్నది. బుందేల్‌ఖండ్, గఢ్వాలీ, అవధ్, సంథాలీ లాంటి భాషల్లో 180కి పైగా కమ్యూనిటీ రేడియోలు ఉన్నాయంటే దాని రీచ్‌ను అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రసార విస్తృతిని గమనించే ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' పేరున ప్రజలతో తన భావాలను పంచుకునేందుకు రేడియోను వాహకంగా ఉపయోగించుకుంటున్నారు.

ఇంతటి ప్రభావవంతమైన రేడియో ప్రసారాలను మోర్స్ 1844లో కనిపెట్టిన టెలిగ్రాఫ్ సుసాధ్యం చేసింది. టెలిగ్రాఫ్, టెలిఫోన్ ప్రాచుర్యంలోకి రాకముందే వ్యాక్యూమ్ ట్యూబ్ ద్వారా ధ్వని తరంగాలను పంపించే ప్రక్రియ రావడంతో రేడియో ప్రసారాలు సాధ్యమయ్యాయి. అమెరికాలో 1910–12 ప్రాంతంలోనే రేడియో మార్గదర్శకాలు రూపొందాయి. 1922 నాటికి ఇంగ్లండ్‌లో రేడియో ప్రసారాలు స్థిరీకరించబడి, 'బీబీసీ' ఏర్పడింది. మనదేశంలో రేడియో వ్యవస్థ 1926లో ప్రారంభమైంది. ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ ముంబై, కోల్‌కతా నగరాల్లో 1927లో రేడియో కేంద్రాలను ఆరంభించింది. 1930లో ఆ సంస్థ ఇండియన్ స్టేట్ బ్రాడ్‌కాస్టింగ్ సంస్థగా మారింది. 1936లో ఆల్ ఇండియా రేడియోగానూ, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆకాశవాణి గానూ మారింది.



అనేక మార్పు, చేర్పులకు లోనై దేశవ్యాప్తంగా విస్తరించిన ఆకాశవాణిని 1997లో దూరదర్శన్‌తో కలిపేసి సమాచార ప్రసారాల శాఖ నుంచి విడగొట్టారు. కొత్తగా ప్రసారభారతి చట్టాన్ని తెచ్చి నూతన వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఇతర మాధ్యమాలతో రేడియో తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్నది. అయినప్పటికీ ఎలాంటి కేబుల్ ఛార్జీ, నెట్‌ఛార్జీ లేకుండా వినియోగదారులకు అందుతున్నది. ఎప్పటికీ అద్భుతమైన, అనువైన వినోద, సమాచార సాధనంగా రేడియో నిలిచిపోతుంది.

– వారాల ఆనంద్ | కవి, అనువాదకుడు (నేడు ప్రపంచ రేడియో దినోత్సవం)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

సారాంశం
సరికొండ చలపతి

స్ట్రీట్ ఫుడ్.. ఆ 'పాత' మధురమే..



కుమారి ఆంటీ ఒక్కసారి మన చూపులన్నీ స్ట్రీట్ ఫుడ్ వైపు మరోసారి లాగేసింది కానీ, వీధిలో నిలబడి ఓ కప్పు చాయ్, ఓ సాయంత్రం నాలుగు ప్లేట్ల పానీపూరీ విత్ ప్యాజ్, కాసింత చాట్ .. బాగా వేయించిన ఫిష్ ఫ్రై.. గరం గరం మిర్చి బజ్జీలు, వేడి వేడి ఇడ్లీలు, వావ్ అనిపించే వడాపావ్‌లు.. తినని సగటు జీవి ఉంటాడా..

మన రోడ్లన్నీ ఘుమ ఘుమలాడే రెస్టారెంట్లే కదా.. మన కడుపు నింపే వారి కడుపు నింపుకొని నలభీములు తిరుగాడే ప్లేస్‌లే కదా.. పల్లె, పట్నం తేడా లేదు. వెజ్ నాన్ వెజ్ తేడాల్లేవు. ఎక్కడికివెళ్లినా రోడ్డు టిఫిన్ సెంటర్ల నుంచి మినీ 'స్ట్రీట్ హోటళ్ల' దాకా ఎన్నో .. ధరలు తక్కువ.. ఉన్నంతలో రుచీ ఎక్కువే.

అయితే స్ట్రీట్ ఫుడ్‌కు.. రామాయణ, మహాభారతాలకు ఉన్నంత చరిత్ర ఉంది. ఆనాటి నుంచే నగరాల్లోని వీధుల్లో 'వేయించిన గింజలు, రొట్టెలు' వంటివి అమ్మేవారట. పాత రుచులపై మొహం మొత్తిన కొద్దీ, జనం పెరిగిన కొద్దీ.. మెల్లగా కొత్త కొత్త రుచులు పుట్టుకొచ్చాయి. స్థానిక ఆచారాలు, ఆహార అలవాట్లను బట్టి ఎక్కడికక్కడ కొత్త వెరైటీలు మొదలయ్యాయి.

షాజహాన్ చాట్ ...

మొఘలుల కాలం నాటికి స్ట్రీట్ ఫుడ్ బాగా ప్రాచుర్యంలోకి వచ్చిందట. షాజహాన్ ఆగ్రా నుంచి ఢిల్లీకి రాజధానిని మార్చినప్పుడు.. వర్తకులు, రోజువారీ పనిచేసుకునేవారు మధ్యాహ్నం కడుపు నింపుకోవడానికి వీలుగా 'చాట్ స్టాల్స్‌'ను ఏర్పాటు చేయించాడని అంటారు. అలా మొదలైన 'చాట్' ఇప్పుడు దేశంలో ఎక్కడ చూసినా కనిపిస్తోంది.

గ్రీస్ .. ఫ్రై ఫిష్..

ప్రపంచవ్యాప్తంగా చూస్తే.. గ్రీస్ సామ్రాజ్యంలో పది వేల ఏళ్ల కిందే 'స్ట్రీట్ ఫుడ్' అమ్మకాలు మొదలయ్యాయట. ప్రధాన రహదారుల పక్కన ఫ్రై చేసిన చేప ముక్కలను అమ్మేవారట. తర్వాత ఇది రోమ్‌కు విస్తరించిందని పురాతత్వ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. అయితే నాడు 'స్ట్రీట్ ఫుడ్' ధనవంతుల కేనని, వారు ఇళ్లలో వండుకోకుండా తెప్పించుకుని తినేవారని అంటున్నారు. తర్వాత నగరాలు విస్తరించి, జనాభా పెరిగే కొద్దీ.. 'స్టాల్స్' పెరిగిపోయి పేదల ఫుడ్‌గా మారింది.

ఈజిప్ట్ బ్రెడ్..

■ క్రీస్తుపూర్వం 1200వ సంవత్సరం సమయంలోనే ఈజిప్ట్‌లోని సిర్సా నగర వీధుల్లో గోధుమ రొట్టెలను అమ్మినట్టు పురాతత్వ తవ్వకాల్లో గుర్తించారు.

స్టూడెంట్స్‌కు నంబర్ వన్

స్ట్రీట్ ఫుడ్ ఏనాడో భారత సంస్కృతిలో, చరిత్రలో ఓ భాగమైపోయింది. మెల్లగా ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలకూ విస్తరించింది. కాలేజీ స్టూడెంట్లు, ఉద్యోగులు, రోజువారీ పనిచేసుకునే వారు, ఏదో ఓ పనిపై బయటికి వెళ్లే వారు.. ఇలా అందరికీ 'స్ట్రీట్ స్టాల్స్' తోనే కడుపు నిండేది. ఇలాంటి వారు ఎక్కువగా ఎక్కడెక్కడ ఉంటారో.. అలాంటి ప్రాంతాలన్నీ స్ట్రీట్ ఫుడ్‌కు అడ్డాలే.

■ ఇటీవల వారణాసిలో నిర్వహించిన అధ్యయనంలోనూ ఈ విషయం స్పష్టమైంది. 25–45 ఏళ్ల మధ్య వయసువారిలో 42 శాతం, 14–21 ఏళ్ల మధ్య వయసువారిలో 61 శాతం మంది ఉద్యోగులు, విద్యార్థులు మధ్యాహ్నం పూట 'స్ట్రీట్ ఫుడ్'తోనే బండి లాగించేస్తామని చెప్పడం గమనార్హం.

■ రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఉన్న మహారాణా ప్రతాప్ వ్యవసాయ, సాంకేతిక వర్సిటీ విద్యార్థుల 'స్ట్రీట్ ఫుడ్' అలవాటుపై ఇటీవల ఓ సర్వే జరిగింది. రుచిగా, ధర తక్కువగా ఉండటం, త్వరగా తినేయగలగడం, స్నేహితులతో కలసి సరదాగా వెళ్లి తినడం వల్ల 'స్ట్రీట్ ఫుడ్‌'కు ప్రాధాన్యత ఇస్తామని 88.3 శాతం మంది యువకులు, 90 శాతం మంది యువతులు వెల్లడించారు.

ఫుడ్ పెట్టే... స్ట్రీట్

స్ట్రీట్‌ఫుడ్ విక్రయించేవారు.. అందరి కడుపు నింపుతూ, తామూ పొట్టపోసుకుంటున్నారు. మన దేశంలో స్ట్రీట్ ఫుడ్‌తో ఉపాధి పొందుతున్నవారు కోటి మంది వరకు ఉంటారని అంచనా. ఇందులో ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి పెద్ద నగరాల్లోనే 60 లక్షల మంది దాకా ఉన్నారు. ఈ నగరాల్లో రోజూ ఓ పూట బయటే తిని బతుకు వెళ్లదీస్తున్నవారూ లక్షల మంది ఉన్నారు.

■ ఇలా అమ్మేవాళ్లు, తినేవాళ్లు కలసి దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికీ ఓ చెయ్యి వేస్తున్నారు. దేశంలో స్ట్రీట్‌ఫుడ్ రోజువారీ వ్యాపారం విలువ రూ.8 వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా. అంటే ఏడాదికి రూ.30 లక్షల కోట్లపైమాటే.

■ దేశంలో ప్రాంతాన్ని బట్టి 2 శాతం నుంచి 10 శాతం మంది జనాభా స్ట్రీట్ ఫుడ్, దానిపై ఆధారపడిన పనులతోనే ఉపాధి పొందుతున్నారు.

సాటి లేని వెరైటీ..

దేశంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలనే తేడా లేదు.. సమోసాలు, మిర్చీలు, బజ్జీలు, పానీపూరీ, చాట్, ఇడ్లీ, దోశ వంటివాటితోపాటు కబాబ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, బిర్యానీల దాకా 'స్ట్రీట్ స్టాల్స్'లో దొరకని వెరైటీలంటూ లేవు. జిలేబీ వంటి స్వీట్లనూ అలా రోడ్డుపక్కన నిలబడి లాగించేయొచ్చు.

స్ట్రీట్ ఫుడ్‌లో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం.. ఏ నగరానికి ఆ నగరమే ప్రత్యేకం. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో పోహ, జిలేబీ కాంబినేషన్ ఊరిస్తే.. ముంబైలో వడాపావ్ నోరూరిస్తుంటుంది. యూపీలో ఆలూ టిక్కీ ఆకర్షిస్తే.. కోల్‌కతా నగర వీధుల్లో చేపల ఫ్రై, కబాబ్ రోల్స్ రారమ్మని పిలుస్తుంటాయి.

■ ఒక అంచనా ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోకెల్లా ఇండియాలో ఫుడ్ వెరైటీలు ఎక్కువ. పదో, ఇరవయ్యో కాదు.. స్ట్రీట్‌ఫుడ్‌లోనే వందల రకాలు ఉన్నాయి మరి.

స్ట్రీట్ ఫుడ్ పండుగే..

'నోయిడా ఉత్సవ్'.. ఇక్కడ అన్ని స్ట్రీట్ ఫుడ్‌లు దొరకబడును!

ఢిల్లీ శివార్లలోని నోయిడాలో ఏటా ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు జరిగే 'నోయిడా ఉత్సవ్' స్ట్రీట్‌ఫుడ్‌కు వెరీ స్పెషల్. 'నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండార్స్ ఆఫ్ ఇండియా (నస్వీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవంలో.. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు చెందిన విభిన్నమైన స్ట్రీట్ ఫుడ్‌లన్నీ అందుబాటులో ఉంటాయి.

ఆహా.. ఈ జన్మమే రుచి చూడడానికి దొరికెరా..!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.చవితి రా.8.26 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర సా.6.07 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** తె. 5.24 నుండి 6.54 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.50 నుండి 9.34 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.50 వరకు, **అమృతఘడియలు:** ప.1.36 నుండి 3.06 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.33, **సూర్యాస్తమయం:** 5.56.

చేనేత కార్మికుల అభివృద్ధికి సీఎం కృషి ఎనలేనిది

- వైఎస్సార్‌సీపీ జాతీయ కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి ఉద్ఘాటన
- వైఎస్సార్, ప్రగడ కోటయ్య చేనేత భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న విజయసాయిరెడ్డి.

తాడేపల్లి రూరల్: చేనేత కార్మికుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి చెప్పారు. మంగళగిరిలోని నిడమర్రు రోడ్డులో వైఎస్సార్, ప్రగడ కోటయ్య పేరిట ప్రభుత్వం నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ చేనేత భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. మేనిఫెస్టోలో లేని సంక్షేమ పథకాలను సైతం బీసీలకు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. చేనేత వస్త్ర వ్యాపారుల కోసం ప్రత్యేకంగా రూ.5.50 కోట్లతో 40 షాపుల కాంప్లెక్స్‌ను మునిసిపాలిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిందని చెప్పారు. కులగణనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లోని ప్రతి సామాజిక వర్గానికి సరైన న్యాయం జరిగేందుకు, ప్రాధాన్యం కల్పించేందుకు కులగణన తప్పనిసరి అని స్పష్టం చేశారు. 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గానికి చెందిన సర్వే సత్యనారాయణను మల్కాజ్‌గిరి జనరల్ సీట్‌లో పోటీకి నిలబెట్టి గెలిపించారని గుర్తుచేశారు. అదే విధానాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు ఏపీలో అమలు చేస్తున్నారన్నారు. కర్నూలు, అనంతపురం, హిందూపురం, రాజమండ్రిలో బీసీలను నిలబెట్టి గెలిపించారని చెప్పారు. కులగణనతో అన్ని కులాలకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు ఆర్థికంగా వెనుకబడిన కులాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుందని తెలిపారు. మంగళగిరి అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాలలోని మండలాలను మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు.

త్వరలో స్వర్ణకారుల కార్పొరేషన్

రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణకారులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకారుల సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు విజయసాయిరెడ్డి ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్వర్ణకారులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వర్ణకారుల సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నారని, ఇప్పటికే సంబంధిత అధికారులతో చర్చిస్తున్నట్లు వెల్లడించారు. మంగళగిరిలో స్వర్ణకారుల పరిస్థితి గురించి గంజి చిరంజీవి తన దృష్టికి తీసుకురావడంతో సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లామని, చెప్పిన వెంటనే కార్పొరేషన్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లను చూడాలని ముఖ్యమంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్, మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పాల్గొన్నారు.

అండగా ఉన్నా ఆర్తనాదాలే..

రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు

- ఆరు పంటలకు కనీస మద్దతు ధర ప్రకటన
- సీఎం యాప్ ద్వారా మార్కెట్ ధరల పర్యవేక్షణ
- కనీస మద్దతు దక్కని ఉత్పత్తుల కొనుగోలు
- రూ.65 వేల కోట్లు చెల్లించి 3.38 కోట్ల టన్నుల ధాన్యం సేకరణ
- రూ.7,757.87 కోట్ల ఇతర పంటల ఉత్పత్తుల కొనుగోలు
- బాబు ఐదేళ్ల పాలనలో రూ.43,559 కోట్ల విలువైన ఉత్పత్తుల కొనుగోలు
- అదే వైఎస్ జగన్ ప్రభుత్వంలో రూ.72,445 కోట్లు ఉత్పత్తుల కొనుగోలు
- బాబు హయాంలో ఏటా సగటున రూ.8,711 కోట్ల విలువైన ఉత్పత్తులు కొనుగోలు
- గత 57 నెలల్లో ఏటా సగటున రూ.16వేల కోట్ల విలువైన ఉత్పత్తుల కొనుగోలు
- అయినా నోటికొచ్చినట్లు విపక్షాల రాద్ధాంతం



సాక్షి, అమరావతి: వంద అబద్ధాలు ఆడైనా ఒక పెళ్లి చేయాలని పెద్దలంటారు. దీనినే స్ఫూర్తిగా తీసుకున్న రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఇదే సిద్ధాంతంతో లక్షలాది అబద్ధాలు ఆడైనా సరే సీఎం వైఎస్ జగన్‌ను గద్దె దించాలని కంకణం కట్టుకున్నాయి. అందుకే నిత్యం ఉన్నవీ లేనివీ పోగేసి ఇష్టారాజ్యంగా నోటికొచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం విమర్శలు చేస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం మీద నిరంతరం దుమ్మెత్తి పోస్తున్న ఈనాడు దినపత్రిక కథనాల్లోని అంశాలనే తీసుకుని కొన్ని రాజకీయ పార్టీలు పాచిపోయిన ఆరోపణలనే చేస్తున్నాయి. తాజాగా.. రైతుల మద్దతు ధర విషయంలోనూ వాటి రంకెలు తారాస్థాయికి చేరాయి. రైతులకు అడుగడుగునా అండగా ఉన్నా విపక్షాల ఆర్తనాదాలు మామూలుగా లేవు. ఎందుకంటే.. రైతుకు తాను పండించిన ప్రతీ పంటకు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) దక్కేలా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుంటే వాస్తవాలు తెలుసుకోకుండా విపక్షాలు విమర్శించడం విడ్డూరంగా ఉంది. వాస్తవానికి.. మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను 99.5 శాతం తుచ తప్పకుండా అమలుచేస్తున్న ప్రభుత్వంపై నిరంతరం బురద జల్లుతూ ఈనాడు అబద్ధాలను అచ్చేస్తోంది. ఈ క్షుద్ర పత్రిక రాసిన అంశాలనే పట్టుకుని కొందరు అవగాహన, అర్థంపర్థంలేకుండా అదే పనిగా ప్రభుత్వం మీద చేస్తున్న విమర్శలపై 'ఫ్యాక్ట్‌చెక్' ఏమిటంటే..

మార్కెట్‌లో జోక్యంతో రైతులకు మేలు..

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటుచేయడమే కాదు సీఎం యాప్ ద్వారా మార్కెట్ ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ మద్దతు ధర దక్కేలా సీఎం జగన్ సర్కారు చేస్తోంది. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద వ్యాపారులతో పోటీపడి కొనుగోలు చేయడం ద్వారా రైతులకు మద్దతు ధర దక్కేలా చేసింది. పొగాకు, పత్తితో జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, మొక్కజొన్న, కందులు, పెసలు, మినుములు, వేరుశనగ, పసుపు, ఉల్లి, టమాటా తదితర పంట ఉత్పత్తులకు మద్దతు ధర దక్కని ప్రతీసారి మార్కెట్‌లో జోక్యం చేసుకుని కొనుగోలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. కేంద్రం మద్దతు ధరలు ప్రకటించని మిర్చి, పసుపు, ఉల్లి, చిరుధాన్యాలు, అరటి, చీనీ వంటి పంటలకు దేశంలో మద్దతు ధర ప్రకటించడమే కాదు..ఆ ధరకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తగ్గకుండా చూసింది. ఉదా.. మిరపకు రూ.7వేలు, పసుపుకు రూ.6,850, ఉల్లికి రూ.770, చిరుధాన్యాలకు రూ.2,500, అరటికి రూ.800, బత్తాయికి రూ.1,400 వచ్చేలా చూస్తోంది.

మద్దతు ధర కల్పనకు పంచసూత్రాలు..

మద్దతు ధర కల్పించే విషయంలో ధాన్యంతో సహా పంట ఉత్పత్తులను ఆర్బీకేల ద్వారానే రైతుల నుంచి మాత్రమే కొనేలా ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ తీసుకోవటం, కొనుగోళ్లలో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యమివ్వడం, నాణ్యతకు పెద్దపీట వేయడం, నేరుగా రైతు ఖాతాల్లోకే నగదు జమ అనే పంచ సూత్రాలను నిక్కచ్చిగా అమలుచేస్తూ విప్లవాత్మక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం నాంది పలికింది. ఇలా ప్రభుత్వం తీసుకున్న పలు చర్యల ఫలితంగా ప్రస్తుతం వ్యవసాయ, వాణిజ్య పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో ఎమ్మెస్పీకి మించి ధరలు పలుకుతున్నాయి. దీంతో ఈ ఏడాది కొనుగోలు చేయాల్సిన అవసరం పెద్దగా కన్పించడంలేదు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా ఈ 57 నెలల్లో ధరలు పడిపోయినపుడు ఈ రకమైన భరోసా ఇవ్వడంతో మార్కెట్లో ధరలు స్థిరపడ్డాయి. చంద్రబాబు హయాంలో రూ.5వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ ఐదేళ్లలో ఏ ఒక్క బడ్జెట్‌లోనూ పైసా కూడా ప్రత్యేకంగా కేటాయించిన పాపాన పోలేదు.

బాబు కంటే రెట్టింపు కొనుగోలు..

ఇక పంట ఉత్పత్తుల కొనుగోలు విషయానికి వస్తే టీడీపీ తన ఐదేళ్లలో 3.74 లక్షల మంది రైతుల నుంచి రూ.3,322 కోట్ల విలువైన 9 లక్షల టన్నుల ఉత్పత్తులు కొనుగోలు చేస్తే.. సీఎం వైఎస్ జగన్ హయాంలోని ఈ 57 నెలల్లో 6.18 లక్షల మంది రైతుల నుంచి రూ.7,757.87 కోట్ల విలువైన 21.61 లక్షల టన్నుల ఉత్పత్తులు కొనుగోలు చేసింది. అంటే.. రెట్టింపు కన్నా అధికం. చరిత్రలో ఎన్నడూలేని విధంగా రూ.139.90 కోట్ల విలువైన పొగాకుతో పాటు రూ.1,789 కోట్ల విలువైన పత్తిని సైతం ఈ ప్రభుత్వం కొనుగోలు చేసింది. పోనీ ధాన్యం రైతులకైనా చంద్రబాబు మేలు చేశాడా అంటే అదీలేదు. టీడీపీ ఐదేళ్లలో 17.94 లక్షల మంది రైతుల నుంచి రూ.40,237 కోట్ల విలువైన 2.65 కోట్ల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, ఈ 57 నెలల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం రైతు క్షేత్రాల నుంచి ఆర్బీకేల ద్వారా 37.34 లక్షల మంది రైతుల నుంచి 3.38 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు రూ.65 వేల కోట్లు చెల్లించింది. టీడీపీ హయాంలో ధాన్యం, ఇతర పంటల కొనుగోలుకు రూ.43,559 కోట్లు వెచ్చిస్తే, ఈ ప్రభుత్వం ఈ 57 నెలల్లో ఏకంగా రూ.72,445 కోట్లు ఖర్చుచేసింది. అంటే.. సగటున ఏడాదికి చంద్రబాబు హయాంలో రూ.8,711 కోట్లు వెచ్చిస్తే, జగన్ ప్రభుత్వం ఏటా సగటున రూ.16,099 కోట్లు వెచ్చించింది. అంటే.. బాబు ఐదేళ్లతో పోలిస్తే ఈ 57 నెలల్లో రెట్టింపు విలువైన పంట ఉత్పత్తులను వైఎస్ జగన్ ప్రభుత్వం కొనుగోలు చేసింది.

గతంలో అరకొరగా ధాన్యం సేకరణ..

నిజానికి.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ గతంలో సేకరణ కేంద్రాలకే పరిమితం అయ్యేది. అవికూడా అరకొరగానే ఉండేవి. దీన్ని పూర్తిగా మారుస్తూ నేరుగా ఫాంగేట్ వద్దే ఆర్బీకేల పర్యవేక్షణలో రైతుల భాగస్వామ్యంతో ధాన్యం కొనుగోలు ఈ ప్రభుత్వంలో హయాంలోనే జరుగుతోంది. రైస్‌మిల్లు ఎంపికలో మిల్లర్లను సంప్రదించాల్సిన అవసరంలేకుండా చేసింది. కొనుగోలు కేంద్రం వారే బ్యాంకు గ్యారంటీ లభ్యత, ధాన్యం రకం, మిల్లు లక్ష్యము, మిల్లు దూరం వంటి అంశాల ఆధారంగా ఆటోమేటిక్ పద్ధతిలో ఎంపిక చేసి రవాణా చేస్తోంది.

'జీఎల్టీ' భరిస్తున్న ఏకైక ప్రభుత్వం..

మరోవైపు.. ధాన్యం కొనుగోలు సందర్భంగా రైతు పొలం నుంచే నేరుగా కొనుగోలుకు అయ్యే జీఎల్‌టీ (గన్నీ బ్యాగ్‌లు, లేబర్, ట్రాన్స్‌పోర్టు) ఖర్చులను ప్రభుత్వమే భరిస్తోంది. ధాన్యం కొనుగోలు సందర్భంలో టన్నుకు రూ.2,523 (గోనె సంచులకు రూ.1,750, కూలీలకు రూ.220, రవాణా ఛార్జీలకు రూ.468తో పాటు ఒకసారి వాడిన గోనె సంచులకు రూ.85), ఇతర పంట ఉత్పత్తుల సేకరణ సందర్భంలో క్వింటాకు రూ.418 చొప్పున భరిస్తోంది. ఇక గోనె సంచుల, హమాలీ, రవాణా చార్జీలకు సంబంధించి 2022–23 పంట కాలానికి 15,74,285 మంది రైతుల ఖాతాలకు రూ.237.11 కోట్లు జమచేయగా, ఖరీఫ్ 2023–24 పంట కాలానికి సంబంధించి ఇప్పటివరకు 6,83,825 మంది రైతుల ఖాతాలకు రూ.91.47 కోట్లు జమచేశారు. గతంలో ఈ పరిస్థితిలేదు. ఇలా గోతాలు, కూలీలు, రవాణా ఖర్చుల (జీఎల్‌టీ) రూపంలో ఎకరాకు రూ.10 వేల వరకు ప్రభుత్వమే భరిస్తోంది. కానీ, గతంలో రైతులకు గోనె సంచులను సమకూర్చే పనిని గతంలో మిల్లర్లకు వదిలేసేవారు. అవి సరిపడా దొరక్క రైతులు చాలా ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక దీనికి చెక్ పెట్టింది. ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్, పీఏసీఎస్‌లు రైతులకు గోనె సంచులను సమకూరుస్తున్నాయి. పైగా.. సేకరించిన ధాన్యాన్ని గతంలో రవాణా అనేది గందరగోళంగా ఉండేది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బందుల్లేవు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ కొన్ని ఏజెన్సీలను, రవాణాదారులను నియమించింది. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సజావుగా కొనుగోలు చేసిన ధాన్యం రవాణా కొనసాగుతోంది. ఇంత చేస్తున్నా దీన్ని మొక్కుబడిగా కొనుగోలు, నామమాత్రపు కొనుగోలు అంటారా? ధరల స్థిరీకరణ ద్వారా మద్దతు ధర కల్పన విషయంలో ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుంటే వాస్తవాలు తెలుసుకోకుండా విపక్షాలు విమర్శించడం విడ్డూరంగా ఉంది.

స్టూడియోకు రెండెకరాలు అడిగితే తప్పేంటి?

నా ప్రాంత అభివృద్ధి కోసమే మినీ స్టూడియో

- విలేజ్‌లో వినాయకుడు, కుదిరితే కప్పు కాఫీ, పాఠశాల, ఆనందో బ్రహ్మ, సిద్ధా లోకం, యాత్ర, యాత్ర 2 సినిమాలు
- సేవ్ ది టైగర్స్, సైతాన్‌వెబ్ సిరీస్‌లు
- ఇలా అనుభవం గడించిన దర్శక నిర్మాతను
- మా ప్రాంతం వాళ్లకు మేలు జరిగేలా చూస్తుంటే దుష్ప్రచారం చేస్తారా?
- ఇక్కడ స్టూడియో వల్ల ఎంతో మందికి ఎన్నో ఉపయోగాలు
- ఇన్నేళ్ల ఇండస్ట్రీలో రాయలసీమకు ఎవరైనా ఏమైనా చేశారా?
- దర్శక నిర్మాత మహి వి.రాఘవ్ ఆవేదన



సాక్షి, అమరావతి: 'నేను రాయలసీమకు చెందినవాణ్ణి. వెనుకబడిన నా ప్రాంత అభివృద్ధి కోసమే మదనపల్లి సమీపంలోని హార్సిలీ హిల్స్‌లో మినీ స్టూడియో నిర్మించేందుకు స్థలం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి దరఖాస్తు చేశాను. నిజంగా నా ప్రాంతానికి మంచి చేయాలనే సంకల్పం నాకు లేకపోతే హార్సిలీ హిల్స్‌లో ఎందుకు స్టూడియో నిర్మించాలనుకుంటాను? వైజాగ్‌లోనో, హైదరాబాద్‌లోనో స్టూడియో కోసం స్థలం కావాలని అడిగేవాణ్ణి కదా!' అని దర్శక నిర్మాత మహి వి.రాఘవ్ అన్నారు. మమ్ముట్టి, జీవా ప్రధాన పాత్రల్లో రాఘవ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'యాత్ర 2' చిత్రం ఈ నెల 8వ తేదీన విడుదలైన విషయం తెలిసిందే. ఈ సినిమా చేసినందుకుగాను హార్సిలీ హిల్స్‌లో ఏపీ ప్రభుత్వం రాఘవ్‌కు స్టూడియో నిర్మాణం కోసం రెండెకరాల భూమి ఇచ్చిందంటూ ఓ వర్గం మీడియాలో వార్తలొచ్చాయి. వాటిపై స్పందిస్తూ సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో వివరాలు ఇలా ఉన్నాయి.

పుట్టి పెరిగిన ప్రాంతం మేలు కోరి..

'నేను 2008లో సినీ పరిశ్రమలోకి అడుగు పెట్టాను. రచయిత, నిర్మాత, దర్శకుడిగా 16 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉంటున్నా. మూన్ వాటర్ పిక్చర్స్, 3 ఆటమ్ లీవ్స్ అనే రెండు నిర్మాణ సంస్థలను స్థాపించా. నిర్మాత, దర్శకుడిగా అందరికీ సుపరిచితుడినే. 'విలేజ్‌లో వినాయకుడు, కుదిరితే కప్పు కాఫీ, పాఠశాల, ఆనందో బ్రహ్మ, యాత్ర, సిద్ధా లోకం ఎలా ఉంది, యాత్ర 2' వంటి సినిమాలు, 'సేవ్ ది టైగర్స్, సైతాన్'అనే వెబ్ సిరీస్‌లను రూపొందించా. నేను రాయలసీమ ప్రాంతంలోని మదనపల్లిలో పుట్టి, పెరిగాను. అక్కడే చదివాను. సినీ పరిశ్రమలో రాయలసీమ ప్రాంతానికి పెద్దగా ప్రాధాన్యం ఉండదు. ఈ ప్రాంతంలో షూటింగ్స్ చేయటానికి ఎవరూ ఆసక్తి చూపించరు. 'పాఠశాల, యాత్ర 2, సిద్ధా లోకమెలా ఉంది' సినిమాలతో పాటు 'సైతాన్' వెబ్ సిరీస్ రాయలసీమలోనే చిత్రీకరించా. మరీ ముఖ్యంగా మదనపల్లి, కడప ప్రాంతాల్లో రూపొందించా. ఈ ప్రాజెక్ట్స్‌కు దాదాపు రూ.20 నుంచి రూ.25 కోట్లు ఖర్చు చేశాను. ఇందుకు కారణం నేను పుట్టి పెరిగిన ప్రాంతానికి నా వంతుగా ఏదో చేయాలనే ఉద్దేశమే. అందుకోసమే నేను సంపాదించిన డబ్బుని అక్కడ ఖర్చు పెట్టాను. అక్కడ సినిమాలు చేయటం వల్ల భోజనాలు, జూనియర్ ఆర్టిస్టులు.. ఇలా పలు రకాలుగా స్థానికులకు ఉపయోగం ఉంటుందని భావించా. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకునే రాయలసీమలో మినీ స్టూడియో నిర్మించాలనుకున్నా. తద్వారా స్థానికులకు ఉపయోగంగా ఉంటుందని ఆలోచించా. బుద్ధి ఉన్నవాడెవడైనా దీని గురించి ఆలోచించాలి. నేనేమీ స్టూడియో నిర్మాణం కోసం యాభై, వంద ఎకరాలు అడగలేదు. కేవలం రెండు ఎకరాల్లో మాత్రమే మినీ స్టూడియో నిర్మించాలనుకున్నా. దాని వల్ల అక్కడ ఎవరైనా షూటింగ్స్ చేసుకోవాలనుకునే వారికి ఉపయోగకరంగా ఉంటుంది. అందరికీ ప్రాథమిక సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. అందులో తప్పేముంది? చేయనివారు ఎలాగూ చేయరు. ఇన్నేళ్ల ఇండస్ట్రీలో రాయలసీమకు ఎవరైనా ఏమైనా చేశారా? ఏమీ చేయలేదు. మీరు చేయరు... చేసేవారిని చేయనివ్వరు.. ఓ వర్గం మీడియా దీని గురించి కాస్త కూడా ఆలోచించలేదు. వాళ్లకు ప్రియమైన ప్రభుత్వం ఎవరెవరికో భూములను ఎక్కడెక్కడో ఇచ్చింది. వాళ్లకు నచ్చిన వాళ్లకు, ఇష్టమైన వాళ్లకు భూములు ఇచ్చుకుంది. వీటి గురించి ఎవరూ మాట్లాడరు. నేను నా ప్రాంతంలో కేవలం రెండెకరాల్లో, అక్కడి ప్రజలకు ఉపయోగపడే ఉద్దేశంతో మినీ స్టూడియో కట్టాలనుకుంటే మాత్రం రాద్ధాంతం చేస్తున్నారు' అని మహి.వి.రాఘవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబు ట్రాప్‌లో జంగా కృష్ణమూర్తి

- బీసీల ఆత్మగౌరవం నిలుపుతున్న సీఎం జగన్‌పై నిందలా!
- జగన్ పాలనలో బీసీలు ఆత్మగౌరవంతో తలెత్తుకు తిరుగుతున్నారు
- సమాచార శాఖ మంత్రి వేణు

సాక్షి, అమరావతి: సాధారణ ఎన్నికలవేళ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పూర్తిగా చంద్రబాబు ట్రాప్‌లో పడిపోయారని సమాచారశాఖ మంత్రి వేణుగోపాలకృష్ణ ధ్వజమెత్తారు. బీసీల ఆత్మగౌరవం నిలుపుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై నిందలు వేయటం సరికాదని హితవు పలికారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. జంగా చేసిన ఆరోపణలు ఉపసంహరించుకుంటే బాగుంటుందన్నారు. టీడీపీ టికెట్ ఇస్తే జంగా తీసుకోవచ్చు. కానీ.. వైఎస్సార్‌సీపీపై నిందలు వేసి జంగా తన స్థాయి తగ్గించుకోవద్దని సూచించారు. బీసీల ఆత్మగౌరవ రక్షకుడిగా నిలిచిన నేత సీఎం జగన్ అని కొనియాడారు. ఆయన పాలనలో బీసీలు ఆత్మగౌరవంతో తలెత్తుకు తిరుగుతున్నారని చెప్పారు. బీసీల అభ్యున్నతికోసం సీఎం జగన్ ఎంత పాటుపడుతున్నారో జంగాతో సహా బీసీలందరికీ తెలుసన్నారు. రాష్ట్రంలో 11 మంది బీసీ మంత్రులున్నారని, వారివద్దే కీలకమైన శాఖలన్నీ ఉన్నాయని గుర్తు చేశారు. బీసీల అవసరాలు తీర్చడానికి బీసీలు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వగలరని ఆలోచించి బీసీలకు మంత్రివర్గంలో అత్యధిక స్థానాలు వారికి ఇచ్చారన్నారు. నేతి బీరకాయలో నెయ్యి ఉండదని.. టేస్ట్ ఉంటుందని గుర్తు చేశారు. గతంలో చంద్రబాబు బీసీలను ఏ విధంగా అణచివేశాడో బీసీలంతా చూశారన్నారు.

కృష్ణమూర్తి అన్యాయంగా అభాండాలు వేశారు: వైఎస్సార్‌సీపీ

'ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి. ఎందుకండీ అన్యాయంగా ఇన్ని అభాండాలు వేస్తారు? 2014లో మీకు సీఎం జగన్ టికెట్ ఇచ్చింది వాస్తవం కాదా? ఆ ఎన్నికల్లో మీరు ఓడిపోయింది వాస్తవం కాదా?' అని వైఎస్సార్‌సీపీ పేర్కొంది. ఎన్నికల్లో మీరు ఓడిపోయినా కూడా ఈ రోజు వరకూ జగనన్న మీకు అండగా ఉన్నది వాస్తవం కాదా? 2019లో మీరు గెలిచే అవకాశంలేకనే కదా కాసు మహేశ్‌కి టికెట్ ఇచ్చారు. ఇది వాస్తవం కాదా?.. మొదటి నుంచి మీకు పార్టీలో జగనన్న సముచిత స్థానాన్ని కట్టబెట్టింది వాస్తవం కాదా?' అంటూ వైఎస్సార్‌సీపీ పార్టీ వెబ్‌సైట్‌లో ట్వీట్ చేసింది.

నింద వేయడం సరికాదు

'మీ ఆలోచన వేరేగా ఉందని మీ వ్యాఖ్యల ద్వారా అర్థమైంది. వెళ్తూవెళ్తూ నింద వేయడం మీ స్థాయికి సరికాదు. మీరు ఏ ప్రతిపాదన చేసినా.. సీఎం జగన్ దాన్ని అమల్లో పెట్టారు. రాష్ట్రంలో రూ.2.55 లక్షల కోట్లను సీఎం జగన్ ప్రజల ఖాతాల్లో వేస్తే.. అందులో రూ.1.80 లక్షల కోట్లు బీసీల ఖాతాల్లోకే వెళ్లాయి. 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తే అందులో అత్యధిక శాతం బీసీలే. బీసీలకు రాజ్యాధికారం జగనన్నతోనే సాధ్యం అనడానికి మనిద్దరం సాక్ష్యం. కులగణన కూడా జరిపించి బీసీల ఆత్మగౌరవం నిలబెడుతున్న సీఎంపై నిందలు వేయడం మంచిదా? ఇలా మాట్లాడటానికి మీకు మనసెలా వచ్చింది. మీరు సీటు ఆశించి ఉండొచ్చు. అది దక్కకపోయి ఉండొచ్చు. టీడీపీ ఆఫర్ చేసి ఉండొచ్చు. దానికోసం సీఎం జగన్‌పై నింద వేసేస్తారా?' అని మంత్రి వేణు వ్యాఖ్యానించారు.

అసత్య రాతలు.. తప్పుడు వ్యాఖ్యలు

- ఏపీలో జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనతో చింతలేని ఉన్నత విద్య
- ఏడాదికి సగటున రూ.4,044కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం
- టీడీపీ హయాంలో రూ.2,428 కోట్లు మాత్రమే
- సీఎం జగన్ వచ్చిన తర్వాతే విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఇది చూసి ఓర్వలేకే ఎల్లో మీడియా దుష్ప్రచారం
- వాటిని చదివి అవగాహనలేక కొన్ని ప్రతిపక్షాలు అర్థరహిత విమర్శలు
- తిరిగి ప్రతిపక్షాల విమర్శలనే పెద్దపెద్ద హెడ్డింగ్‌లతో ముద్రిస్తున్న ఎల్లో మీడియా
- ఐదేళ్లలో టీడీపీ రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం రూ.18,576 కోట్ల చెల్లింపు
- 16.73 లక్షల మంది విద్యార్థులకు రూ.1778 కోట్లు బకాయిపెట్టిన చంద్రబాబు
- పాత బకాయిలను సైతం తీర్చిన సీఎం జగన్
- ఒకప్పుడు రూ.35 వేలలోపు ఇస్తే.. ఇప్పుడు రూ.3 లక్షల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్

చంద్రబాబు హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా..	
ఇంజనీరింగ్	రూ.35,000
ఎంబీఏ	రూ.27,000
ఫార్మా-డీ	రూ.68,000

సీఎం జగన్ పాలనలో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా..

విద్యా సంస్థ	కోర్సు	ఫీజు
ట్రిపుల్ ఐటీ శ్రీసిటీ	బీటెక్(ఈసీఈ)	రూ.3,05,000
దామోదరం సంజీవయ్య లావర్సిటీ	ఎల్‌ఎల్‌బీ(5ఏళ్లు)	రూ.2,45,900
ఎస్వీ అగ్రికల్చర్ కాలేజ్ తిరుపతి	ఎంబీఏ(అగ్రి బిజినెస్)	రూ.1,96,460
ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్	ఎంబీఏ	రూ.1,83,650
ఏఎన్‌యూ	ఎంఎస్సీ(ఫోరెన్సిక్ కెమిస్ట్రీ)	రూ.1,80,750
శ్రీకృష్ణదేవరాయ కాలేజీ	బీఎస్సీ (హార్టికల్చర్)	రూ.1,73,090
ఏయూ ఫార్మాసూటికల్స్ సైన్స్	ఎంఫార్మా(స్పెషల్)	రూ.1,58,500
చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్	ఫార్మా-డీ	రూ.1,25,000

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 'జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన' పథకాలు చింతలేని ఉన్నత విద్యను అందిస్తున్నాయి. ఐటీఐ నుంచి ఐఐటీ, వైద్య విద్య వరకు పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ కల్పిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఎందరో పేదింటి విద్యార్థులను అత్యున్నత ప్రమాణాలు కలిగిన కళాశాలల్లో చదివే అవకాశం కల్పిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ఇది ఎల్లో మీడియాకు ఏమాత్రం రుచించట్లేదు. పేదింటి బిడ్డను ప్రభుత్వం ఉన్నత చదువులకు తీసుకెళ్తుంటే ఓర్వలేక దుష్ప్రచారానికి పాల్పడుతోంది. దీనికి తోడు అసలు ప్రభుత్వ పథకం లక్ష్యం, అది ఎలా అమలవుతోంది కనీస పరిజ్ఞానం లేని కొన్ని ప్రతిపక్షాలు ఈ తప్పుడు వార్తల ఆధారంగా అర్థరహిత విమర్శలు చేస్తున్నాయి. తిరిగి వాటినే మళ్లీ ఎల్లో మీడియా పెద్దపెద్ద హెడ్డింగ్‌లతో ముద్రిస్తూ పైశాచిక ఆనందం ప్రదర్శిస్తోంది. వాస్తవానికి చంద్రబాబు పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన చెల్లింపులు ఏడాదికి సగటున రూ.2,428 కోట్లుగా ఉంటే ప్రస్తుత ప్రభుత్వం ఏడాదికి రూ.4,044కోట్లుగా ఉంది.



అప్పట్లో అప్పులు చేసి ఫీజులు కట్టే దుస్థితి

గత ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అమలు కాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అనేక అవస్థలు పడేవారు. ప్రభుత్వం కాలేజీలకు సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెంచేవి. పరీక్షలకు హాల్‌టికెట్లు, పాసైతే సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందిపెట్టేవి. ఫలితంగా చాలా కుటుంబాలు అప్పులుచేసి మరీ తమ పిల్లలను చదివించాల్సిన దుస్థితి ఉండేది. కళాశాలల ఫీజుల కంటే తక్కువగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంతో పేదలపై మరింత భారం పడేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టడంతో పేదింటి బిడ్డల చదువులకు భరోసా దక్కింది. టీడీపీ ప్రభుత్వంలో అత్యధికంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఏడాదికి రూ.35 వేలలోపు ఇస్తే.. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏకంగా రూ.3లక్షలకు వరకు చెల్లిస్తూ పేదల విద్యను పట్టం కడుతోంది. జవాబుదారీ తనం పెంచేలా, పారదర్శకంగా తల్లి, విద్యార్థి జాయింట్ బ్యాంకు ఖాతాల్లో ప్రతి త్రైమాసికానికి విద్యాదీవెనను జమ చేస్తోంది.

టీడీపీ హయాంలో సగటు చెల్లింపు స్వల్పం..

గత టీడీపీ ప్రభుత్వంలో ఫీజురీయింబర్స్‌మెంట్ కింద సగటున ఏడాదికి రూ.2066 కోట్లు, హాస్టల్ ఖర్చుల కింద రూ.362 కోట్లు మాత్రమే చెల్లించేది. ఈ లెక్కన ఐదేళ్లలో రూ.12,141 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో ప్రభుత్వం 2017 నుంచి 16.73 లక్షల మంది విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.1778 కోట్లు చెల్లించకుండా బకాయిలు పెడితే.. సీఎం జగన్ ప్రభుత్వం ఆ బకాయిలను కూడా తీర్చింది.

ఈ ప్రభుత్వంలో పెరిగిన ఖర్చు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు 27లక్షల మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన కింద ఏకంగా రూ.18,576 కోట్లు (గత ప్రభుత్వ బకాయిలతో కలిపి) చెల్లించింది. ఏడాదికి సగటున విద్యాదీవెన కింద రూ.2835 కోట్లు, వసతి దీవెన కింది అత్యధికంగా రూ.1068.94 కోట్లు ఖర్చు చేస్తోంది.

ఆదాయ పరిమితి పెంపుతో లబ్ధి

గతంలో వసతి దీవెనలో రూ.4వేల నుంచి రూ.10వేల మధ్య స్లాబ్ పెట్టిమరీ ఇచ్చేవారు. కానీ సీఎం జగన్ స్లాబ్ విధానాన్ని తొలగించి అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి సమానంగా ఆర్థిక సాయం అందిస్తున్నారు. పేద విద్యార్థులకు భోజన వసతి ఖర్చు కోసం ఏడాదికి రెండు వాయిదాల్లో ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నారు. ఇక్కడ వీలైనంత మందిని అర్హులుగా చేర్పించేందుకు కుటుంబ వార్షిక ఆదాయం పరిమితిని పెంచింది. గతంలో బీసీ, ఈబీసీ, కాపు, మైనార్టీలకు రూ.లక్ష ఉంటే, ఎస్సీ, ఎస్టీ, డీబ్ల్యూలకు రూ.2లక్షలకు ఉండేది. కానీ, ఇప్పుడు అన్ని వర్గాలు వారికీ కుటుంబ వార్షిక ఆదాయ పరిమితిని రూ.2.5 లక్షలకు పెంచి ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చారు. పీజీ విద్యలో ప్రైవేటు కళాశాలల దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వ వర్సిటీ విద్యను ప్రోత్సహించేలా అక్కడే పూర్తి రీయింబర్స్‌మెంట్ ఇస్తోంది.

ఒకే రోజు... ఐదు ఎన్నికలు

ఇండోనేసియా అధ్యక్ష పదవికి ముగ్గురు నేతల మధ్య హోరాహోరీ

రేపే జాతీయ, స్థానిక ఎన్నికల సమరం

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల్లో ఒకటైన ఇండోనేసియాలో పార్లమెంట్, స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధమైంది. దేశ జనాభా 27 కోట్లు కాగా, 20 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. 17 ఏళ్లు నిండినవారంతా ఓటు వేయడానికి అర్హులే. ఈ నెల 14వ తేదీన జరిగే ఎన్నికల్లో విజయం కోసం ప్రధానంగా మూడు పార్టీలు హోరీహోరీగా తలపడుతున్నాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడితోపాటు నేషనల్, ప్రావిన్షియల్, రీజినల్, రిజెన్సీ, సిటీ స్థాయిల్లో ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు. మొత్తం ఐదు బ్యాలెట్ పేపర్లపై ఓటు వేయాల్సి ఉంటుంది. జాతీయ, స్థానిక ఎన్నికలు ఒకే రోజు జరగడం ఇండోనేసియా ప్రత్యేకత. అయితే, ఈ ఎన్నికల్లో ఓటు వేయడం తప్పనిసరి కాదు. అయినా ప్రజలు ఉత్సాహంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొంటారు. 2019లో జరిగిన ఎన్నికల్లో 81 శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. దేశంలో 575 పార్లమెంట్ స్థానాలు ఉండగా, 18 జాతీయ పార్టీలు ఎన్నికల బరిలో నిలిచాయి. వివిధ స్థాయిలో మొత్తం 20,616 పదవులకు 2,58,602 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అధ్యక్షుడి పదవీ కాలం ఐదేళ్లు. అమెరికా అధ్యక్షుడి తరహాలో రెండుసార్లు మాత్రమే పదవిలో కొనసాగడానికి అర్హత ఉంటుంది. ప్రస్తుత అధ్యక్షుడు జొకో విడొడో(జొకోవి) వరుసగా రెండుసార్లు గెలిచారు. పదేళ్లపాటు పదవిలో కొనసాగారు. ఆయన రెండు టర్మ్‌లు పూర్తయ్యాయి. కాబట్టి పది సంవత్సరాల తర్వాత ఈసారి మార్పు తప్పనిసరి కాబోతోంది. మొత్తం జనాభాలో 90 శాతం మంది ముస్లింలే ఉన్న ఇండోనేషియాలో పోలీసులకు, సైనికులకు ఎన్నికల్లో ఓటు వేసే హక్కు లేదు.

\- సాక్షి, నేషనల్ డెస్క్



ఈస్ట్ జావాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సుబియాంటో

సుబియాంటోకు విజయావకాశాలు!

ఇండోనేసియా ఎన్నికల్లో అధ్యక్ష పదవిపై ప్రధానంగా ముగ్గురు నేతలు కన్నేశారు. ఇండోనేషియా జాతీయవాద పార్టీ అయిన గెరింద్రా పార్టీ నుంచి మాజీ సైనికాధికారి ప్రబొవో సుబియాంటో(72) పోటీలో ఉన్నారు. ఇదే పార్టీ నుంచి ఉపాధ్యక్ష పదవికి జొకో విడొడో తనయుడైన 36 ఏళ్ల గిబ్రాన్ రాకాబుమింగ్ రాకా బరిలో నిలిచారు. 2014, 2019 ఎన్నికల్లో అధ్యక్ష పదవికి సుబియాంటో పోటీపడ్డారు. రెండుసార్లు ఓటమి పాలయ్యారు. మూడోసారి అదృష్టం పరీక్షించుకుంటున్నారు. జొకోవి ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా పనిచేసిన సుబియాంటోపై పలు తీవ్ర అభియోగాలు ఉన్నాయి. 1990వ దశకంలో సైనికాధికారిగా పని చేస్తున్న సమయంలో 20 మందికిపైగా ప్రజాస్వామ్య ఉద్యమ కార్యకర్తలను కిడ్నాప్ చేయించినట్లు ప్రచారం జరిగింది. వారిలో 10 మందికిపైగా ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. సుబియాంటో ఈస్ట్ తిమోర్, పపువా న్యూ గినియా దేశాల్లో మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారు. 1998లో సైన్యం నుంచి తప్పుకున్నారు. 2020 వరకు తమ దేశంలో ప్రవేశించకుండా ఆయనపై అమెరికా నిషేధం విధించింది. గిబ్రాన్ రాకాబుమింగ్ కూడా వివాదాస్పదుడే. ప్రస్తుతం సురకర్తా సిటీ మేయర్‌గా పనిచేస్తున్నాడు. తమను గెలిపిస్తే దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని, ప్రజల జీవనాన్ని మెరుగుపరుస్తామని సుబియాంటో, గిబ్రాన్ హామీ ఇస్తున్నారు. గెరింద్రా పార్టీకి ఇతర చిన్నాచితక పార్టీలు మద్దతిస్తున్నాయి. ఇప్పుడు అంచనాలను బట్టి చూస్తే ప్రబొవో సుబియాంటో తదుపరి అధ్యక్షుడయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

40 కొత్త నగరాలు నిర్మిస్తాం అనీస్ బాస్వెదాన్



జకార్తా మాజీ గవర్నర్, విద్యావేత్తగా పేరుగాంచిన అనీస్ బాస్వెదాన్(54) స్వతంత్ర, ప్రతిపక్ష అభ్యర్థిగా అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు. ఆయన అమెరికాలో విద్యాభ్యాసం చేశారు. స్వదేశంలో తొలుత విద్యారంగంలోకి, తర్వాత రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. విద్యాశాఖ మంత్రిగానూ వ్యవహరించారు. ఇక అనీస్ సహచరుడిగా ఉపాధ్యక్ష పదవికి నేషనల్ అవేకెనింగ్ పార్టీ నేత, పీపుల్స్ రిప్రెజెంటేటివ్ కౌన్సిల్ డిప్యూటీ స్పీకర్ ముహైమిన్ ఇస్కాందర్(57) బరిలో ఉన్నారు. వీరికి మరో రెండు పార్టీలు మద్దతిస్తున్నాయి. ఎన్నికల్లో తమను గెలిపిస్తే దేశవ్యాప్తంగా 40 కొత్త నగరాలు నిర్మిస్తామని అనీస్ బాస్వెదాన్, ఇస్కాందర్ హామీ ఇస్తున్నారు. యువత కోసం కొత్త ఉద్యోగాలు సృష్టిస్తామని చెబుతున్నారు.

అధ్యక్ష బరిలో విద్యావేత్త ప్రనొవో



మెగావతి సుకర్నోపుత్రి సారథ్యంలోని ఇండోనేషియన్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ స్ట్రగుల్ నుంచి అధ్యక్ష పదవికి గాంజార్ ప్రనొవో(55), ఉపాధ్యక్ష పదవికి మహ్‌ఫుద్ ఎండీ(66) పోటీలో ఉన్నారు. ప్రనొవో గతంలో సెంట్రల్ జావా గవర్నర్‌గా సేవలందించారు. మహ్‌ఫుద్ ఎండీకి గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ స్ట్రగుల్‌తో మరో మూడు పార్టీలు జట్టుకట్టాయి. ఇద్దరు అభ్యర్థులపై ఎలాంటి ఆరోపణలు, వివాదాలు లేకపోవడం కలిసివచ్చే అంశంగా భావిస్తున్నారు. సామాన్య ప్రజల సమస్యలు తమకు తెలుసని, అధికారం అప్పగిస్తే వారి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని ప్రనొవో, మహ్‌ఫుద్ విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. ప్రజలకు సామాజిక సాయం పంపిణీ చేస్తామని, ఉద్యోగుల వేతనాలు పెంచుతామని అంటున్నారు.

కీలక ప్రచారాంశాలు?

- ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాల్లో ఉన్నట్లుగానే ఇండోనేషియాలోనూ ఎన్నో సమస్యలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ఆర్థిక వృద్ధి 2022లో 5.3 శాతం కాగా, 2023లో అది 5.05 శాతానికి పడిపోయింది. దేశంలో ప్రజల జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. కుటుంబాలను పోషించుకోవడం కష్టతరంగా మారింది.
- నిరుద్యోగ సమస్య వేధిస్తోంది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరువైపోయాయి. ఉద్యోగులు, కార్మికులకు వేతనాలు తగ్గిపోయాయి. మొత్తం ఓటర్లలో సగానికిపైగా ఓటర్లు 40 ఏళ్లలోపు యువతే ఉన్నారు. వారే నిర్ణయాత్మక శక్తిగా తీర్పు ఇవ్వబోతున్నారు.
- దేశంలో మానవ హక్కుల హననం, ప్రజాస్వామ్య వ్యవస్థ పతనమవుతుండడంపై యువత పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు. ఎన్నికలు పారదర్శకంగా జరుగుతాయన్న నమ్మకం తమకు లేదని చెబుతున్నారు. అక్రమాలకు తావు లేకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

భారత్ దౌత్య విజయం

8 మంది భారత నేవీ మాజీ అధికారుల విడుదల

- ఖతార్ నుంచి స్వదేశానికి చేరుకున్న ఏడుగురు అధికారులు
- గూఢచర్యం ఆరోపణలపై వీరికి మరణ శిక్ష విధించిన అక్కడి కోర్టు
- ప్రధాని మోదీ జోక్యంతోనే వీరికి విముక్తి లభించిందన్న విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ: దౌత్యంలో భారత్ ఘన విజయం సాధించింది. గూఢచర్యం ఆరోపణలపై మూడు నెలల క్రితం ఖతార్ కోర్టు మరణ శిక్ష విధించిన 8 మంది భారత నేవీ మాజీ అధికారులను అక్కడి ప్రభుత్వం విడుదల చేసింది. వీరిలో ఏడుగురు సోమవారం ఢిల్లీకి చేరుకున్నారు. మరో అధికారిని త్వరలో స్వదేశానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలను కొనసాగిస్తామని విదేశాంగ శాఖ తెలిపింది. ఖతార్‌లో చిక్కుకున్న కెప్టెన్ నవ్‌తేజ్ గిల్, సౌరభ్ వశిష్ట్, కమాండర్లు పూర్ణేందు తివారీ, అమిత్ నాగ్‌పాల్, ఎస్‌కే గుప్తా, బీకే వర్మ, సుగుణాకర్ పాకాల, సైలర్ రాగేశ్‌లు విడుదల కాగా, కమాండర్ తివారీ అక్కడే ఉన్నారు. వీరు ఏడుగురూ దోహా నుంచి ప్రైవేట్ విమానంలో బయలుదేరి సోమవారం ఉదయం 2.35 గంటలకు ఢిల్లీకి చేరుకున్నారు. వీరంతా విమానంలో ఎక్కాకే కుటుంబసభ్యులకు విషయం చెప్పారు. ఈ కేసులో పరిణామాలను ప్రధాని మోదీ స్వయంగా పర్యవేక్షించారని, మన వాళ్లను సురక్షితంగా తీసుకువచ్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలనూ ఆయన వినియోగించుకున్నారని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా చెప్పారు. ఖతర్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్–తానీ వీరికి క్షమాభిక్ష ప్రకటించారా లేదా అనేది వెల్లడించలేదు. 'విడుదలయ్యారా లేక క్షమాభిక్ష పెట్టారా అనే విషయాలను కాకుండా, వీరంతా స్వదేశానికి, తమ ఇళ్లకు చేరుకున్నారా లేదా అన్నదే మనం చూడాలి. ఈ విషయంలో ఖతార్ రాజుకు భారత్ కృతజ్ఞతలు తెలిపింది'అని వినయ్ క్వాత్రా చెప్పారు.

అల్-డహ్రా కంపెనీలో ఉద్యోగులుగా వెళ్లి..

ఖతార్‌లోని అల్ డహ్రా అనే కంపెనీలో భారత్ నేవీకి చెందిన 8 మంది మాజీ అధికారులు పనిచేసేవారు. 2022 ఆగస్టులో అక్కడి అధికారులు వారిని అరెస్ట్ చేశారు. గత ఏడాది మార్చి 25వ తేదీన వారిపై గూఢచర్యం ఆరోపణలు మోపారు. ఆ తర్వాత మేలో ఆ కంపెనీ కార్యకలాపాలను నిలిపివేసింది. ఆరోపణలేమిటనే విషయాన్ని రెండు ప్రభుత్వాలూ వెల్లడించలేదు. విచారణ జరిపిన ఖతార్ అప్పీల్ కోర్టు అక్టోబర్ 26వ తేదీన 8మందికీ మరణ శిక్ష విధిస్తూ తీర్పిచ్చింది. డిసెంబర్‌లో మరణ శిక్షను కోర్టు రద్దు చేసింది. దాని స్థానంలో 8 మంది భారతీయులకు మూడు నెలల నుంచి 25 ఏళ్ల వరకు జైలు శిక్షలు విధిస్తూ, అప్పీలుకు గడువిచ్చింది. డిసెంబర్‌లో మోదీ ఖతార్ వెళ్లారు. అనంతరం పలుమార్లు జాతీయ భద్రతా సలహాదారు దోవల్ అక్కడి ప్రభుత్వంతో చర్చలు జరిపారు. ఆయన సంప్రదింపుల ఫలితంగా నేవీ మాజీ అధికారుల విడుదల సాధ్యమైందని చెబుతున్నారు.

యూఏఈ, ఖతార్ పర్యటనకు మోదీ

యూఏఈలో రెండు రోజుల పర్యటన నిమిత్తం మోదీ సోమవారం బయలుదేరారు. ప్రధాని 14న ఖతార్ రాజధాని దోహాకు చేరుకుంటారు. భారత నేవీ మాజీ అధికారుల విడుదల నేపథ్యంలో ఖతార్ పర్యటన జరగనుండటం గమనార్హం. యూఏఈతో వాణిజ్యం, డిజిటల్ రంగాల్లో పూర్తిస్థాయిలో సహకారం పెంచుకోవడమే లక్ష్యంగా ప్రధాని పర్యటన ప్రధాన ఉద్దేశమని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా చెప్పారు. దోహాలో ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్–తానీతో ప్రధాని చర్చలు జరుపుతారన్నారు. విదేశాల నుంచి భారత్ దిగుమతి చేసుకునే ఎల్‌ఎన్‌జీలో 48 శాతం ఒక్క ఖతార్ నుంచి కావడం గమనార్హం. గత కొన్నేళ్లుగా రెండు దేశాల మధ్య వాణిజ్యంలో గణనీయంగా పెరుగుదల నమోదవుతోంది. 2008లో చివరిసారిగా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ సారథ్యంలో భారత్ నుంచి అత్యున్నతస్థాయి ప్రతినిధి వర్గం ఖతార్ వెళ్లింది.

గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడి

67 మంది పాలస్తీనియన్ల దుర్మరణం

రఫా: హమాస్ దాడికి ప్రతీకారంగా గాజా స్ట్రిప్‌పై దండెత్తి భీకర దాడులకు దిగిన ఇజ్రాయెల్ సోమవారం మరింత రెచ్చిపోయింది. గాజా స్ట్రిప్‌లోని ఒక భవంతిపై వైమానిక దాడులు చేసింది. దీంతో భవనం నేలమట్టమై అందులోని 67 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారిలో చిన్నారులు, మహిళలు సైతం ఉన్నారు. సోమవారం నాటి దాడిలోనే కాదు అక్టోబర్ ఏడున మొదలైన ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటిదాకా మైనర్లే ఎక్కువ మంది మరణించారని గాజా ఆరోగ్య శాఖ పేర్కొంది. ఇప్పటిదాకా 12,300 మంది మైనర్లు ఈ యుద్ధంలో బలయ్యారు. మరోవైపు రఫా పట్టణంలో దాడులు చేస్తూ ఆక్రమించుకున్న భవనాలను సోదాలు చేస్తూ ఇద్దరు బందీలను ఇజ్రాయెల్ సైన్యం కాపాడింది. యుద్ధంలో బందీలను కాపాడటం ఇదే తొలిసారి. సైన్యం కాపాడిన ఇద్దరిని 60 ఏళ్ల ఫెర్నాండో సిమోన్, 70 ఏళ్ల లూయిస్ హర్‌గా ఇజ్రాయెల్ సైన్యం గుర్తించింది.

రాజ్యసభకు సోనియా.. బరేలీకి ప్రియాంక





న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత, రాయ్‌బరేలీ ఎంపీ సోనియా గాంధీ త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల బరి నుంచి తప్పుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ బాధ్యతలను కూతురు ప్రియాంకా గాంధీ వాద్రాకు అప్పగిస్తారని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 77 ఏళ్ల సోనియా గాంధీ రాజస్తాన్‌లోని జైపూర్ నుంచి లేదా హిమాచల్ ప్రదేశ్ నుంచి రాజ్యసభకు నామినేట్ చేసేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ నెల 27వ తేదీన దేశవ్యాప్తంగా ఉన్న 56 సీట్లకు జరిగే రాజ్యసభ ఎన్నికలకుగాను నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేదీ ఈ నెల 15. దీంతో, ఒకట్రెండు రోజుల్లోనే సోనియా గాంధీ అభ్యర్థిత్వంపై స్పష్టత రానుంది. అదే సమయంలో, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రియాంకా గాంధీ వాద్రాను దశాబ్దాలుగా కుటుంబానికి కోటగా ఉన్న రాయ్‌బరేలీ నుంచి బరిలోకి దించనున్నారు. రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక బరిలో తొలిసారిగా నిలవనున్నారు.

కాంగ్రెస్‌కు అశోక్ చవాన్ రాజీనామా



ముంబై: లోక్‌సభ ఎన్నికల ముందు మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగలింది. మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నేత అశోక్ చవాన్ సోమవారం కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. ఆయన బీజేపీలో చేరబోతున్నట్లు ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్‌కు రాజీనామా చేయాలన్న నిర్ణయం తన వ్యక్తిగతమని అశోక్ చవాన్ చెప్పారు. బీజేపీలో చేరికపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఒకటి రెండు రోజుల్లో తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని వెల్లడించారు. ఆయన తన ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్‌కు సమర్పించారు. మహారాష్ట్రలో సీనియర్ నాయకులు బాబా సిద్దిఖీ, మిలింద్ దేవ్‌రా ఇటీవలే కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే.

ఫిన్లాండ్ అధ్యక్షుడిగా అలెగ్జాండర్ స్టబ్



హెల్సింకీ: ఫిన్లాండ్ అధ్యక్ష ఎన్నికల్లో మాజీ ప్రధాన మంత్రి అలెగ్జాండర్ స్టబ్ విజయం సాధించారు. ఆదివారం జరిగిన రెండో దఫా ఎన్నికల్లో 'గ్రీన్ లెఫ్ట్' మద్దతుతో బరిలోకి దిగిన స్వతంత్ర అభ్యర్థి, మాజీ విదేశాంగ మంత్రి పెకా హావిస్టోకు 48.4 శాతం ఓట్లు రాగా, నేషనల్ కొలిషన్ పార్టీ అభ్యర్థి అలెగ్జాండర్‌కు మెజారిటీ మార్క్ దాటి 51.6 శాతం ఓట్లు పడ్డాయి. దీంతో 55 ఏళ్ల అలెగ్జాండర్ మార్చి నెలలో అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆరోగ్యకరమైన పోటీకి చిరునామాగా నిలిచే యురోపియన్ దేశం ఫిన్లాండ్‌లో ఎన్నికల ఫలితాలు వెలువడగానే ప్రత్యర్థి హావిస్టోకు చెందిన పార్టీ కార్యక్రమంలో అలెగ్జాండర్ పాల్గొనడం విశేషం. అలెగ్జాండర్ 2014–15 కాలంలో ప్రధానిగా, తర్వాత కొంతకాలం ఆర్థిక మంత్రిగా, విదేశాంగ మంత్రిగా సేవలందించారు.

సిసోడియాకు తాత్కాలిక బెయిల్

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి విచారణ ఖైదీగా జైలులో గడుపుతున్న ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ మంత్రి మనీశ్ సిసోడియాకు సోమవారం స్వల్ప ఊరట దక్కింది. ఆయనకు మూడు రోజుల తాత్కాలిక బెయిల్ లభించింది. ఒక వివాహ వేడుక నిమిత్తం ఆయనకు బెయిల్ మంజూరుచేస్తూ స్పెషల్ జడ్జి ఎంకే నాగ్‌పాల్ ఉత్తర్వులిచ్చారు. ఆయన అభ్యర్థనను అంగీకరించిన న్యాయస్థానం ఫిబ్రవరి 13వ తేదీ నుంచి 15 వరకు మధ్యంతర బెయిల్ మంజూరుచేసింది. తోబుట్టువు కుమార్తె వివాహానికి హాజరయ్యేందుకు ఈయనకు కోర్టు అనుమతులిచ్చింది.

గడువులోగా నియామకాలు: మోదీ

రోజ్‌గార్ మేళాలో లక్ష మందికి నియామక పత్రాలు

న్యూఢిల్లీ: ఉద్యోగాల నియామకాల ప్రక్రియను పారదర్శకత తీసుకొచ్చామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. నిర్దేశిత గడువులోగా నియామకాలు పూర్తి చేస్తున్నామని చెప్పారు. గతంలో రిక్రూట్‌మెంట్ల విషయంలో అంతులేని జాప్యం జరిగేదని, తాము అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితికి చరమగీతం పాడామని, లంచగొండితనం నిర్మూలించామని అన్నారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఇచ్చిన ఉద్యోగాల కంటే తమ పదేళ్ల పాలనలో 1.5 రెట్లు అధికంగా ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడించారు. రోజ్‌గార్ మేళాలో భాగంగా ప్రధాని మోదీ సోమవారం లక్ష మందికిపైగా యువతకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియామక పత్రాలు అందజేశారు. వీరంతా వివిధ ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో ఉద్యోగాలు సాధించారు. తమ పాలనలో వివక్షకు తావు లేకుండా యువతకు సమాన అవకాశాలు లభిస్తున్నాయని, కష్టపడే తత్వం, నైపుణ్యం ఉంటే ప్రభుత్వ ఉద్యోగాలు సులభంగా సాధించవచ్చని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

బీజేపీ కార్యకర్తలతో రాహుల్ కరచాలనం

కోర్బా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అనుకూలంగా నినాదాలు చేస్తున్నవారితో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కరచాలనం చేశారు. ప్రేమలో గొప్ప బలం ఉందని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. సంబంధిత వీడియోను కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్'లో షేర్ చేసింది. రాహుల్ యాత్ర ప్రస్తుతం కోర్బా జిల్లాలో కొనసాగుతోంది. ఆయన వాహనంపై ఉండగా, రోడ్డుకు ఇరువైపులా బీజేపీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో బారులు తీరారు. కాషాయం రంగు కండువాలు ధరించారు. హనుమంతుడి చిత్రం ముద్రించి ఉన్న జెండాలు చేతపట్టుకున్నారు. రాహుల్ గాంధీని చూడగానే 'జైశ్రీరామ్, మోదీ, మోదీ' అంటూ బిగ్గరగా నినాదాలు చేయడం ప్రారంభించారు. ఇది గమనించిన రాహుల్ వాహనం దిగి వచ్చి వారి వద్దకు చేరుకున్నారు. వారిలో కొంత మందితో కరచాలనం చేశారు. తర్వాత తన వాహనంపైకి చేరుకున్నారు. జనంపైకి గాలిలోనే ముద్దులు విసిరారు. అంతకుముందు ఆయన సీతామఢీలో కాంగ్రెస్ మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగించారు. బీజేపీ పాలనలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగంతో ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. మత విద్వేషం రెచ్చగొడుతూ దేశంలో విభజన రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు.



ఢిల్లీ సరిహద్దులోని సింఘు వద్ద మోహరించిన భద్రతా సిబ్బంది



సింఘు వద్ద రోడ్డుపై అడ్డంగా ఉంచిన బారికేడ్లు

నేడే రైతుల 'చలో ఢిల్లీ'

- డిమాండ్ల సాధనకు పోరుబాట పట్టిన అన్నదాతలు
- 2 వేలకు పైగా ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధం
- 'చలో ఢిల్లీ'కి అనుమతి నిరాకరించిన ఢిల్లీ పోలీసులు
- దేశ రాజధానిలో నెల రోజులపాటు 144 సెక్షన్

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో నెల రోజులపాటు సభలు, ప్రదర్శనలు, ర్యాలీలకు అనుమతి లేదని, నగరంలోకి ట్రాక్టర్ల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు పోలీసులు తేల్చిచెప్పారు. ఢిల్లీలో నెల రోజులపాటు 144 సెక్షన్ అమలవుతుందని ప్రకటించారు. ఈ మేరకు ఢిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరా సోమవారం ఉత్తర్వు జారీ చేశారు. ఈ నెల 12 నుంచి వచ్చే నెల 12వ తేదీ దాకా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, జనం గుంపులుగా గుమికూడవద్దని పేర్కొన్నారు. రైతు సంఘాల 'చలో ఢిల్లీ'కి అనుమతి లేదని స్పష్టం చేశారు. రోడ్లను దిగ్బంధించడం, ప్రయాణికుల రాకపోకలను అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిటీలో ట్రాక్టర్ల ర్యాలీలపై పూర్తిస్థాయిలో నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. నగర పరిధిలో అనుమానిత వస్తువులు, పేలుడు పదార్థాలు, బాణాసంచా, ఇతర అనుమతి లేని ఆయుధాలు, ప్రమాదకరమైన రసాయనాలు, పెట్రోల్, సోడా సీసాలు రవాణా చేయడంపైనా నిషేధం విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. రెచ్చగొట్టే నినాదాలు, ప్రసంగాలు, సోషల్ మీడియాలో అనుచిత మెసేజ్‌లు పంపడంపైనా నిషేధం ఉందన్నారు. భూసేకరణలో తీసుకున్న భూములకు పరిహారం పెంచడం, పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తూ చట్టం తీసుకురావడంతోపాటుఇతర డిమాండ్ల సాధన కోసం రైతులు మంగళవారం తలపెట్టిన 'చలో ఢిల్లీ' కార్యక్రమ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, గత అనుభవాల దృష్ట్యా పోలీసులు ఆంక్షలు కఠినతరం చేసినట్లు తెలుస్తోంది.

రోడ్లపై బారికేడ్లు.. కొయ్యముక్కలు

సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చాతోపాటు పలు రైతు సంఘాలు చలో ఢిల్లీకి పిలుపునిచ్చాయి. 13వ తేదీన పార్లమెంట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని ప్రకటించాయి. పంజాబ్, ఉత్తరప్రదేశ్, హరియాణా రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఢిల్లీలో 2 వేలకు పైగా ట్రాక్టర్లతో ఢిల్లీలో నిరసన చేపట్టేందుకు రైతులు సిద్ధమయ్యారు. నిరసనకారులను అడ్డుకోవడానికి వివిధ అంచెల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాహనాలను దారి మళ్లిస్తున్నారు. సరిహద్దుల్లో రోడ్లపై మేకుల్లాంటి పదునైన కొయ్యముక్కలు బిగించారు.

రైతు సంఘాలతో మంత్రుల చర్చలు

కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అర్జున్ ముండా సోమవారం చండీగఢ్‌లో రైతు సంఘాల నేతలతో రెండో దశ చర్చలు ప్రారంభించారు. సంయుక్త కిసాన్ మోర్చా నేత జగజీత్ దలీవాల్, కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ప్రధాన కార్యదర్శి శర్వన్ తదితరులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. రైతుల డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూల ధోరణితో ఉందని, చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విరమించుకోవాలని మంత్రులు కోరారు. మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలంటూ 2020–2021 కాలంలో చేపట్టిన రైతుల ఉద్యమం సందర్భంగా వారిపై పెట్టిన కేసులను ఉపసంహరించుకునేందుకు ఒప్పుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రతినిధులు చెప్పారు.

బలపరీక్ష నెగ్గిన నితీశ్ సర్కారు

వాకౌట్ చేసిన ఎన్‌డీయేతర ప్రతిపక్షాలు



పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో నెగ్గింది. ప్రభుత్వానికి అనుకూలంగా 129 మంది ఎమ్మెల్యేలు ఓటేయగా, ఎన్‌డీయేతర పక్షాల సభ్యులంతా బలపరీక్ష సమయంలో సభ నుంచి వాకౌట్ చేశారు. 243 మంది సభ్యులున్న అసెంబ్లీలో ఎన్‌డీఏకి జేడీయూ, బీజేపీలతోపాటు మాజీ సీఎం జితన్ రామ్ మాంఝీకి చెందిన హెచ్‌ఏఎం, ఒక స్వతంత్ర అభ్యర్థి కలిపి 128 మంది సభ్యుల బలముంది. అయితే, చివరి నిమిషంలో ప్రతిపక్ష ఆర్‌జేడీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు అధికార పక్షంలో చేరారు. మొదటగా ఆర్‌జేడీకి చెందిన అసెంబ్లీ స్పీకర్ అవధ్ బిహారీ చౌదరిపై అధికార పక్షం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. తీర్మానానికి ఆర్జేడీ ఎమ్మెల్యేలు ముగ్గురితోపాటు 125 మంది అనుకూలంగా ఓటేయగా, 112 మంది తిరస్కరించారు. ఈ సమయంలో జేడీయూ, బీజేపీ ఎమ్మెల్యేలు కొందరు సభకు రాలేదని ఎన్‌డీఏ వర్గాలు తెలిపాయి. అనంతరం జరిగిన బలపరీక్షలో వీరు నితీశ్ సర్కారుకు అనుకూలంగా ఓటేసినట్లు తెలిసింది. నితీశ్ ప్రభుత్వం బలపరీక్షలో నెగ్గినట్లు ప్రకటించగానే బీజేపీ సభ్యులు జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం నితీశ్ కుమార్ అరగంటపాటు ప్రసంగించారు. గత ప్రభుత్వంలో మిత్రపక్షాలైన ఆర్జేడీ, కాంగ్రెస్‌లతోపాటు ప్రతిపక్ష ఇండియా కూటమిపై దుమ్మెత్తిపోశారు.

ప్రసంగం పూర్తి పాఠం చదవని గవర్నర్

తమిళనాట మరోసారి బహిర్గతమైన గవర్నర్, డీఎంకే సర్కార్ విభేదాలు



గవర్నర్ రవి

సాక్షి, చెన్నై: తమిళనాట అధికార డీఎంకే పార్టీ ప్రభుత్వాన్ని తరచూ విమర్శించే ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి సోమవారం మరోసారి ప్రభుత్వ విధానాన్ని తప్పుబట్టారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ముందు, తర్వాత జాతీయ గీతాలాపన ఉండాలని, ఆ సంస్కృతికి డీఎంకే సర్కార్ చరమగీతం పాడిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాన్ని నిరసిస్తూ ఆయన సోమవారం తన ప్రసంగాన్ని శాసనసభలో పూర్తిగా చదవకుండానే వదిలేశారు. 'జాతీయగీతాన్ని ప్రసంగం ముందు, తర్వాత ఆలపించాలన్న నియమావళిని ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వం సిద్ధంచేసిన ప్రసంగపాఠంలోని అంశాలు సత్యదూరంగా ఉన్నాయి. ఇలాంటి అసత్యాలను నా ప్రసంగం ద్వారా వినిపిస్తే రాజ్యాంగాన్ని అపహాస్యం చేసినట్టే' అని గవర్నర్ రవి అన్నారు. ప్రసంగంలో మొదటి వాక్యాలు చదివాక, ప్రసంగ పాఠాన్ని పూర్తిచేయబోనని తేల్చిచెప్పారు. దీంతో ఆయన తరపున ఆ ప్రసంగం తమిళ తర్జుమాను స్పీకర్ చదివి వినిపించారు. చదవడం పూర్తవగానే జాతీయగీతం ఆలపించాల్సి ఉండగా సీట్లోంచి లేచి గవర్నర్ వెళ్లిపోయారు.

బుల్డోజర్లతో ఇళ్లు కూల్చడం ఫ్యాషనైంది!

భోపాల్: చట్ట పరమైన ప్రక్రియను అమలు చేయడానికి బదులుగా క్రిమినల్ కేసుల్లో నిందితుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చడం ఇప్పటి అధికారులకు ఫ్యాషన్‌గా మారిందని మధ్యప్రదేశ్ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఉజ్జయినికి చెందిన రాహుల్ లాంగ్రి ఓ వ్యక్తి ఆస్తిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలున్నాయి. రాహుల్ బెదిరించి, దాడి చేయడంతోనే ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదైంది. ఈ మేరకు పోలీసులు రాహుల్‌ను అరెస్ట్ చేశారు. దీనిపై పోలీసులు స్థానిక అధికారుల సాయంతో రాహుల్ ఇంటిని బుల్డోజర్‌తో నేలమట్టం చేయించారు. దీనిపై రాహుల్ భార్య హైకోర్టును ఆశ్రయించారు. ఒక్క రోజు ముందు నోటీసు ఇచ్చిన అధికారులు ఆ ఇల్లు తమదని ఎంత మొత్తుకున్నా వినకుండా ధ్వంసం చేశారని ఆరోపించారు. ఇంటిని కూల్చడం అక్రమమని, ఉన్నఫళంగా నిర్మాణాలను కూల్చడం ఫ్యాషన్‌గా మారిందని జడ్జి అన్నారు. కూల్చివేతకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



చలికాలం వీడ్కోలు తీసుకునే సమయంలో బెంగళూరులో పూల చెట్లు విరబూస్తున్నాయి. శేషాద్రి రోడ్డులో కనువిందు

సంక్షేమానికి పెద్దపీట

- గ్యారంటీ పథకాలతో ప్రజలకు లబ్ధి
- అసెంబ్లీలో గవర్నర్ గెహ్లాట్ ప్రసంగం
- నిధుల గురించి కేంద్రంపై పరోక్ష విమర్శలు
- అసెంబ్లీ సమావేశాలకు నాంది



సోమవారం అసెంబ్లీలో గవర్నర్ గెహ్లాట్ ప్రసంగం, ఆలకిస్తున్న సభ్యులు

శివాజీనగర: రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ వైపు దృష్టి పెట్టింది, అన్ని పథకాలు ప్రజలకు సంతృప్తిని కలిగించడమే లక్ష్యం. రాష్ట్రంలో గ్యారంటీ పథకాలు దేశానికే ఆదర్శం అయ్యాయి అని గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ పేర్కొన్నారు. సోమవారం నుంచి ఈ నెల 23 వరకు జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తొలిరోజు గవర్నర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. ఉదయం గవర్నర్ అసెంబ్లీకి చేరుకోగానే సభాపతులు, మంత్రులు ఆయనకు సాదర స్వాగతం పలికి అసెంబ్లీలోకి తోడ్కొని వెళ్లారు. ఈ సందర్భంగా గెహ్లాట్, సిద్దరామయ్య ప్రభుత్వం రూపొందించిన ప్రసంగాన్ని ప్రారంభించారు.

కొత్త విద్యా విధానం

సంపద కొందరు వ్యక్తుల వద్ద కేంద్రీకృతమైతే అది అభివృద్ధి కాదన్నారు. జన సమూహాన్ని మొత్తం ఆర్థికవృద్ధిలో భాగస్వాముల్ని చేయాలని గవర్నర్ అన్నారు. యువతకు ఉద్యోగాలు లభించేవిధంగా కొత్త విద్యా విధానాన్ని అమలు చేస్తామన్నారు. వ్యవసాయ, పరిశ్రమల, సేవా రంగాల్లో కొత్త భరోసాలను సృష్టించడమే సర్కారు లక్ష్యమన్నారు. గ్యారంటీ పథకాల వల్ల 1.2 కోట్లకు పైగా కుటుంబాలు దారిద్ర్య రేఖ నుండి బయటికి వచ్చాయన్నారు.

నిధుల వాటా ఏదీ?

ప్రభుత్వ ప్రజోపయోగ పథకాలకు లభించాల్సిన నిధులు లభించటం లేదని పరోక్షంగా కేంద్రం తీరును గవర్నర్‌చే ప్రస్తావించారు. దేశంలోనే అత్యధిక పన్నులు వసూలయ్యే 2వ రాష్ట్రం కర్ణాటక అయింది. కానీ ఆ పన్నుల వాటాలు పొందే రాష్ట్రాల్లో 10వ స్థానంలో ఉంది. ధర్మబద్ధ వాటాను పొందేందుకు ప్రభుత్వం అన్ని విధాల ప్రయత్నాలు చేస్తోందని గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నారు.

కరువు సహాయక పనులు

కరువును సమర్థంగా ఎదుర్కొన్నట్లు గవర్నర్ చెప్పారు. పరిహార చర్యల కోసం 31 జిల్లాలకు రూ. 324 కోట్ల మంజూరు, 32.50 లక్షల మంది రైతులకు తలా రూ. 2 వేలు చెల్లించినట్లు తెలిపారు. తాగునీరు, పశువుల మేతకు ఇబ్బంది కాకుండా చర్యలు తీసుకోవడమైనదని అన్నారు. మెట్రో రైల్వే మార్గాల అభివృద్ధి, రవాణా, పర్యాటకం, విద్యా రంగాల అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు చెప్పారు. సామాజిక విప్లవవేత్త బసవణ్ణను రాష్ట్ర సాంస్కృతిక నేతగా ప్రకటించినట్లు తెలిపారు.

అబద్ధాల ప్రసంగం: అశోక్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులను చేయలేదు. గవర్నర్ ప్రసంగంలో అపద్దాలు చెప్పించిందని బీజేపీపక్ష నేత ఆర్.అశోక్ ఆరోపించారు. విధానసౌధ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం అబద్ధాల పుట్ట. ప్రజల సొమ్మును దోచుకోవడానికే ఈ ప్రభుత్వం పరిమితమైంది. కేంద్ర ప్రభుత్వ పథకాలను తమవన్నట్లు ప్రసంగంలో చెప్పుకొన్నారు. 5వ గ్యారంటీ అయిన యువనిధి పథకం ఏదీ, ఒక్క నిరుద్యోగికి అయినా రూపాయి భృతి ఇచ్చారా అని విమర్శించారు. కరువు పనులు సక్రమంగా లేవు, కేంద్రంపై నిందలు వేశారు. సర్వజనుల శాంతి తోట అన్నారు, కానీ రాష్ట్రమే మండుతోంది. హిందువులపై దాడులు జరుగుతున్నాయి. ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయి. కన్నడ పోరాటదారులను జైళ్లలోకి వేశారు అని ధ్వజమెత్తారు.



ప్రసంగిస్తున్న గవర్నర్ గెహ్లాట్

చట్టసభలో జై శ్రీరాం, జై భీం

- బీజేపీ, కాంగ్రెస్ నినాదాలు

శివాజీనగర: అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు జై శ్రీరాం అని నినాదాలు చేశారు. దీనికి ప్రతిగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జై భీం అంటూ నినాదాలు సాగించారు. కేసరి రంగు శాలువాలను ధరించి బీజేపీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. సభ ఆరంభానికి ముందుగా సభ లోపల కేసరి శాలువా వేసుకొని వచ్చిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జై శ్రీరామ్ అని నినదించారు. గవర్నర్ ప్రసంగం హిందీలో సాగింది. ఇది ముగించి ఆయన జై హింద్, జై కర్ణాటక అనగానే, బీజేపీ సభ్యులు జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. అంతలోనే జాతీయ గీతం వినిపించింది. తరువాత గవర్నర్ వెంట సభాపతులు, సీఎం సిద్దరామయ్య తదితరులు సభ నుంచి బయటకు వెళ్లారు. ఈ సమయంలో ఇరువర్గాలు నినాదాలతో హోరెత్తించారు. తరువాత వాకౌట్ చేస్తున్నట్లు బీజేపీ ఎమ్మెల్యేలు ప్రకటించారు.



కాషాయ కండువాలతో బీజేపీ ఎమ్మెల్యేలు

న్యూస్‌రీల్

అన్నింటా దేశం పురోగమించాలి



తుమకూరు: ప్రపంచంలో భారతదేశం ఒక శక్తిగా ముందుకు సాగుతోంది. ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంచుకోవడంతో పాటు పిల్లల్లోనూ ప్రేరేపించాలని ప్రముఖ పాత్రికేయుడు ధన్యకుమార్ అన్నారు. సోమవారం తమకూరు జూనియర్ కళాశాలలో జరిగిన దేశ జాగృతి అభియానలో పాల్గొని మాట్లాడారు. భారతదేశం అనేక సంవత్సరాల పాటు కొంత మంది పరాయి దేశస్తుల చేతుల్లో ఉండిపోయిందన్నారు. ఎంతోమంది మహానుభావులు పోరాటాలు, ప్రాణత్యాగాలు చేసి స్వాతంత్ర్యాన్ని తెచ్చారని అన్నారు. నేడు మనం అనుభవిస్తున్నది ఆ స్వాతంత్ర్యమేనని అన్నారు. ఒక్క క్రికెట్ మ్యాచ్‌లో విజయం సాధిస్తే అది దేశం మొత్తం గెలుపు కాదని, అన్ని రంగాల్లో మనం దేశం విజయం సాధించాలని, అప్పుడు మన దేశం వైపు చూడాలి అంటే శత్రువులు కూడా భయపడతారని చెప్పారు.

పైప్‌లైన్ గుంతలో పడి వ్యక్తి మృతి



పుట్టరాజు (ఫైల్)

దొడ్డబళ్లాపురం: రోడ్డు పక్కన పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలో పడి బెంగళూరు కగ్గలీపురలోని వాసుదేవపుర గ్రామ నివాసి మృతి చెందాడు. పుట్టరాజు (37) పని నిమిత్తం ఫిబ్రవరి 8న బైక్‌పై హలగూరుకు వెళ్లి రాత్రి తిరిగివస్తూ శివనహళ్లి వద్ద రోడ్డుపక్కన పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలో ప్రమాదవశాతు పడి పుట్టరాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి దయానంద సాగర్ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స ఫలించక పుట్టరాజు సోమవారం మృతి చెందాడు. పుట్టరాజు సోదరుడు బెంగళూరు నీటి సరఫరా, భూగర్భ డ్రైయినేజీ బోర్డుపై పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కాపాడండయ్యా

- ఎస్పీకి కొత్త జంట వినతి



పవన్, లావణ్య

పుట్టపర్తి టౌన్: కులాలు వేరైనా ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు, కానీ ఈ పెళ్లి ఏమాత్రం ఇష్టం లేని పెద్దలు ఆ జంటను తుదముట్టించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమను కాపాడాలని సోమవారం స్పందన కార్యక్రమంలో ఓ ప్రేమ జంట జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని రక్షణ కోరింది. వివరాలు.. పుట్టపర్తి నియోజవర్గం ఓడీచెరువు మండలం ఇనగలూరుకు గ్రామానికి చెందిన లావణ్య (22), పవన్‌కుమార్ (24) వేరువేరు కులాకు చెందిన వారు. ప్రేమలో పడి పెళ్లి చేసుకుని బెంగుళూరులో పని చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే తమ తల్లిదండ్రులు చంపాలని చూస్తున్నారని, ఫోన్ లోకేషన్ ఆధారంగా వెతుకుతున్నారని, గ్రామానికి వెళితే చంపుతారని, రక్షణ కావాలని మొరపెట్టుకున్నారు. ప్రేమజంటకు రక్షణ కల్పించి, ఫిర్యాదుపై విచారణ చేయాలని పోలీసులను ఎస్పీ ఆదేశించారు.

ఆస్తిపన్ను పేరుతో దోపిడీనా?

- బెంగళూరు బీజేపీ ఎమ్మెల్యేల ధ్వజం



బనశంకరి: బెంగళూరు మహానగర పాలికె పరిధిలో ఆస్తిపన్ను సేకరణలో తలెత్తిన లోపాలను సరిదిద్దాలని సోమవారం బీజేపీ ఎమ్మెల్యేలు బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్‌కు మనవిచేశారు. బీబీఎంపీ ఆస్తిపన్ను పేరుతో దోపిడీ చేస్తోందని నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్వయం ఆస్తి పన్ను ప్రకటనలో పొరపాటు చేశారంటూ భారీ జరిమానా, బకాయిలపై వడ్డీ విధిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇలా 76 వేల ఇళ్లకు నోటీసులు జారీ చేశారని ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. ప్రజా వ్యతిరేక చర్యలతో నగర ప్రజలు ఇక్కట్లకు గురి అవుతారని దీనిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కు అవకాశం కల్పించాలని కోరారు. 30 ఇన్‌టూ 40 సైటుకు రూ. 10 లక్షలు పన్ను చెల్లించాలని అంటున్నారని, ఇదేమి పన్ను దోపిడీ, ప్రజలు ఆత్మహత్యకు పాల్పడేలా ఉందని యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ ఆరోపించారు. పరిష్కరించకపోతే బీబీఎంపీ ఆఫీసుకు తాళం వేస్తామని ఎమ్మెల్యేలు హెచ్చరించారు. ఎమ్మెల్యేలు రవి సుబ్రమణ్య, బైరతి బసవరాజ్, మునిరాజు, సీకే.రామమూర్తి, నేతలు సప్తగిరిగౌడ, ఎస్.హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

యాసిడ్ లీకై పలువురికి అస్వస్థత

దొడ్డబళ్లాపురం: నీటి శుద్ధికి ఉపయోగించే సల్ఫ్యూరిక్ యాసిడ్ పైప్ లీక్ కావడంతో 10 మందికి పైగా అస్వస్థతకు గురైన సంఘటన రామనగర తాలూకా ఐజూరులోని మల్లేశ్వర కాలనీలో చోటుచేసుకుంది. స్థానికంగా ఉన్న పంచాయతీ వాటర్ ఫిల్టర్ కేంద్రం 2004 నుంచి పనిచేయడం లేదు. దీంతో తుప్పుపట్టిన పైప్ నుండి సల్ఫ్యూరిక్ యాసిడ్ లీక్ అయ్యింది. ఘాటైన వాసన వ్యాపించింది. అది పీల్చిన జనం కొందరు మూర్ఛపోయారు. అధికారులు వచ్చి లీకేజీని అరికట్టారు. అస్వస్థులైనవారు మళ్లీ కోలుకున్నారు.

డీకేశి- సీబీఐ కేసు వాయిదా

యశవంతపుర: కేపీసీసీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్‌పై దాఖలైన ఆదాయానికి మించిన ఆస్తులు కేసులో సీబీఐ విచారణను రాష్ట్ర ప్రభుత్వం వాపస్ తీసుకోవడాన్ని ప్రశ్నిస్తూ సీబీఐ, బీజేపీ ఎమ్మెల్యే బసవనగౌడ పాటిల్ యత్నాల్ దాఖలు చేసిన కేసులో సమయం కావాలని ప్రభుత్వం కోరింది. సోమవారం హైకోర్టులో న్యాయమూర్తులు జస్టిస్ కే.సోమశేఖర్, ఉమేశ్‌ల ధర్మాసనం విచారించింది. తమ వాదనను వినిపించడానికి సమయం ఇవ్వాలని అడ్వకేట్ జనరల్ శశికిరణ్‌శెట్టి కోరడంతో జడ్జిలు విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు. పాటిల్ పిటిషన్‌పై డీకే తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి అభ్యంతరం తెలిపారు. వీటి మధ్య లోకాయుక్త ఈ కేసులోకి తమను కూడా అనుమతించాలని వేసిన పిటిషన్‌ను ధర్మాసనం స్వీకరించింది.

ఆస్పత్రిలో తాళి మాయం

యశవంతపుర: చికిత్సకెళ్లిన మహిళ మెడలోని బంగారు చైన్ చోరీ అయిన ఘటన బెంగళూరు మూడలపాళ్యలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జరిగింది. రాజేశ్వరి అనే మహిళ ఈనెల 8న ఎద నొప్పి అని భర్తతో కలిసి ఆస్పత్రికి వెళ్లారు. వైద్యులు ఈసీజీ చేయడానికి ఆభరణాలను తీసేయాలని తెలిపారు. ఆమె తాళి చైన్‌ను తీసి భర్తకు ఇస్తుండగా, అక్కడ పని చేస్తున్న నర్సు వద్దని చెప్పి, తలదిండు కింద పెట్టింది. చికిత్స ముగిసిన తరువాత రాజేశ్వరి దంపతులు ఇంటికెళ్లిపోయారు. మరుసటి రోజున మెడలో తాళి లేదని ఆమె గమనించి వెంటనే ఆస్పత్రికెళ్లి విచారించగా బంగారు చైన్ ఏదీ లేదని చెప్పారు. దీంతో రాజేశ్వరి గోవిందరాజనగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు నర్సులతో పాటు ఒక స్వీపర్‌పై అనుమానం ఉందని ఫిర్యాదులో తెలిపారు.

ప్రమాదం వెంటే పశ్చాత్తాపం

- ఒకరు ప్రమాదంలో మృతి, మరొకరు ఆత్మహత్య
- కొడగు జిల్లాలో విషాదం



తమ్మయ్య, విద్యార్థి దనల్ సుబ్బయ్య (ఫైల్)



బనశంకరి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలింది. ఇలాంటి ఘటనల్లో వాహనదారు తన తప్పేం లేదని, అతడే అడ్డదిడ్డంగా వచ్చాడని వాదిస్తారు. కానీ నా వల్ల నిండుప్రాణం పోయిందనే వ్యథతో వాహనదారు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కొడగు జిల్లా మడికెరి రూరల్‌లో జరిగింది.

ఏం జరిగిందంటే

వివరాలు.. హెచ్‌డీ తమ్మయ్య (57) శుక్రవారం బైక్ మీద వెళ్తుండగా మడికెరి చైన్‌గేట్ వద్ద మరో బైక్‌ను ఢీకొన్నాడు. ఆ బైక్‌పై వెళ్తున్న డిగ్రీ ఫైనలియర్ విద్యార్థి దనల్ సుబ్బయ్య (24) లారీకి తగలడంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు యువకున్ని ఆసుపత్రికి తరలించగా శనివారం పరిస్థితి విషమించి చనిపోయాడు. ఇది తెలియగానే తమ్మయ్యలో తీవ్ర పశ్చాత్తాపం మొదలైంది. అతని చావుకు తానే కారణమని మనోవ్యథకు గురై తమ్మయ్య ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. ప్రమాదంపై మడికెరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో, ఆత్మహత్యపై మడికెరి గ్రామాంతర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

కవి శిఖరం కవితా కృష్ణ అస్తమయం



కవితా కృష్ణ

తుమకూరు: కన్నడ సీనియర్ సాహితీ వేత్త, కవి, నాటక కళాకారుడు, విద్యా వాచస్పతి అయిన డాక్టర్. కవితా కృష్ణ (79) తుమకూరు నగర సమీపంలో క్యాత్సంద్రలోని స్వగృహంలో ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. ఆయన సుమారు 60 సంవత్సరాల నుంచి సాహిత్యం, కన్నడ పోరాటాల్లో నిమగ్నమయ్యారు. కవితా కృష్ణ సుమారు 190 పుస్తకాలను రచించారు. అలా కన్నడ కవిగా, రచయితగా గొప్ప పేరు పొందారు. తుమకూరు జిల్లాలో మాత్రమే కాకుండా రాష్ట్రమంతటా కవితా కృష్ణకు అభిమానులు, శిష్యులు ఉన్నారు. ఆయన విద్వత్తును మెచ్చి రాష్ట్ర ప్రభుత్వం, అనేక కళా సంఘాలు అవార్డులతో సన్మానించాయి. సోమవారం ఉదయం వరకు ఆయన భౌతికాయాన్ని ఇంటి ముందు ప్రజల సందర్శనార్థం ఉంచారు. మంత్రి రాజన్న తదితరులు నివాళులర్పించారు. తుమకూరు గార్డెన్ రోడ్డులో ఉన్న శ్మశానవాటిలో అంత్యక్రియలు జరిగాయి.



భౌతికకాయానికి ప్రజల నివాళులు



కావేరి నీటిని తమిళనాడుకు వదలరాదంటూ సోమవారం మండ్యలో జిల్లా రైతు సంఘాల నిరసన. మళ్లీ ఆందోళనల్ని చేపడతామని తెలిపారు

అకౌంటెంట్‌ను బలిగొన్న బస్సు

యశవంతపుర: కేఎస్ ఆర్టీసీ బస్సు స్కూటర్‌ను ఢీకొన్న ప్రమాదంలో అకౌంటెంట్ మృతి చెందిన ఘటన యశవంతపుర పరిధిలో జరిగింది. నాగసంద్రకు చెందిన రాజేంద్ర (50) నెలమంగలలోని ప్రైవేట్ సంస్థలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నారు. సోమవారం 11 గంటల సమయంలో మేక్రి సర్కిల్‌లోని జీఎస్టీ ఆఫీసుకు స్కూటర్‌పై బయల్దేరాడు. యశవంతపుర మెట్రోస్టేషన్ వద్ద తురువెకెరె నుంచి బెంగళూరు మెజెస్టిక్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఆయనను ఢీకొట్టింది. రాజేంద్ర తలకు బలమైన గాయాలై ప్రాణాలు వదిలాడు. యశవంతపుర ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి కేసు నమోదు చేశారు.

వ్యాన్ ఢీకొని మహిళ..

క్యాంటర్ వ్యాన్ ఢీకొని వివాహిత మరణించిన ఘటన బెంగళూరు గ్రామాంతర జిల్లా హోసకోట పరిధిలో జరిగింది. బన్నేరుఘట్టకు చెందిన సుధ (30) బంధువులతో కలిసి ఆలయానికి వెళ్లి ఆపై హోసకోటలోని బంధువుల ఇంటికెళ్లింది. మధ్యాహ్నం టీబీ సర్కిల్‌లో రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన క్యాంటర్ ఢీకొనడంతో సుధా అక్కడికక్కడే చనిపోయింది.

రుణ మాఫీ కావాలి



ఈ బడ్జెట్లో అన్నదాతలకు రుణమాఫీని చేయాలని కోరుతూ సోమవారం బెంగళూరు ఫ్రీడం పార్క్‌లో మహిళా రైతుల ఆందోళన

ఆధ్యాత్మిక జాగృతి వేదిక

- ఆరురోజుల సుత్తూరు జాతర సమాప్తం

మైసూరు: ఒకవైపు ఆధ్యాత్మిక వేడుకలు, మరోవైపు జానపద వినోద సంబరాలతో సుత్తూరు జాతర అశేష జనవాహినిని అలరించింది. నంజనగూడు తాలూకాలోని సుత్తూరులో ఆరురోజుల నుంచి జరుగుతున్న శివరాత్రీశ్వర శివయోగి జాతర మహోత్సవం వేడుకలు సమాప్తమయ్యాయి. నిత్యం ఉదయం, సాయంత్రం ఓం నమఃశ్శివాయ అంటూ ధార్మిక కార్యక్రమాలు, అలాగే పల్లె సంస్కృతికి అద్దం పట్టే ఆటపాటలతో జాతర కొనసాగింది. యువకుల కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి.

కపిలా హారతి, తెప్పోత్సవం

చివరిరోజు ఆదివారం రాత్రి కపిలా నదిలో హారతి వేడుక నేత్రపర్వంగా జరిగింది. శివరాత్రి దేశికేంద్ర స్వామి హారతిని ప్రారంభించారు. తరువాత రంగు రంగుల టపాసుల పేలుళ్ల వెలుగులను విరజిమ్మాయి. తరువాత కపిలా నదిలో తెప్పోత్సవం శోభాయమానంగా సాగింది. మఠంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. వందలాది మహిళలు, యువకులు మట్టి దీపాలను వివిధ రూపాల్లో వెలిగించారు. ఉత్సవాల్లో జిల్లా అధికార, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.



భక్తులతో జాతర కళకళ



కపిలా హారతిని ఆరంభిస్తున్న స్వామీజీ తదితరులు



కనువిందుగా కపిలా హారతి



నదిలో రమణీయంగా తెప్పోత్సవం

కొబ్బరి నూనె దిగుమతుల్ని ఆపాలి

తుమకూరు: ఇతర దేశాల నుంచి కొబ్బరి నూనె దిగుమతిని నియంత్రించి టెంకాయ రైతులను రక్షించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కర్ణాటక రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేశారు. తుమకూరు నగరంలో సోమవారం మీడియాతో వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం విదేశాల నుంచి కొబ్బరి నూనె దిగుమతులను తగ్గించాలని కోరారు. ఇక్కడ కొబ్బరి రైతులు పండించిన కొబ్బరిని కొనుగోలు చేసి నూనె తయారు చేయాలని డిమాండ్ చేశారు. ధరలు పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

నా కొడుకు అమాయకుడు: కుమార

దొడ్డబళ్లాపురం: ప్రధాని నరేంద్రమోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని అవుతారని, దీన్ని ఎవ్వరూ ఆపలేరని జేడీఎస్ మాజీ సీఎం కుమారస్వామి అన్నారు. సోమవారం హాసన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తన కుమారుడు నిఖిల్‌ను అణచివేయడానికి చాలామంది ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నిఖిల్ చాలా అమాయకుడన్నారు. మండ్య జిల్లాలో జేడీఎస్ అభ్యర్థి గెలవాల్సిందేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై అకారణంగా ఆరోపణలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో అవినీతి తాండవిస్తోందని, కాంగ్రెస్ దోచుకుంటోందని ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీకి సీట్లు ముఖ్యం కాదని, బీజేపీ, జేడీఎస్ కలిసి 28 సీట్లు గెలవాలన్నదే లక్ష్యమన్నారు.

క్లుప్తంగా

మురుగు నీటి తొలగింపు


మిషన్‌తో మురుగు నీటిని తొలగిస్తున్న దృశ్యం

కంప్లి: హూవినహడగలి పట్టణంలోని వ్యాకరణ తీర్థ చంద్రశేఖర్ శాస్త్రి రోడ్డులో నిల్వ చేరిన భూగర్భ డ్రైనేజీ మురుగు నీటిని పురసభ ముఖ్యాధికారి మల్లేశప్ప పజ్జి జెట్టింగ్ మిషన్ తెప్పించి ఒకే రోజులో సంపూర్ణంగా తొలగించి స్వచ్ఛతను కాపాడారు. అదే విధంగా మురుగు కాలువల్లో నిండిన పూడికను కూడా తొలగించి ఇళ్లలో వాడే నీటిని ఎలాంటి అడ్డంకులు లేకుండా పారేలా చర్యలు తీసుకున్నారు. పట్టణ సమస్యపై వెంటనే స్పందించి స్వచ్ఛత అందించడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కృషి చేసిన ముఖ్యాధికారిని ప్రజలు అభినందించారు.

పార్టీలో పలువురి చేరిక


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్ తదితరులు

గంగావతి: ఇతర పార్టీల నుంచి కోళూరు, హిటాన్నల్ గ్రామాలకు చెందిన పలువురు సోమవారం కొప్పళ ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు శ్రమించాలన్నారు. సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలన్నారు. వారికి జెడ్పీ మాజీ అధ్యక్షులు రాజశేఖర్ హిట్నాల్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

భక్త మార్కండేయ జయంతి


జయంతిని ఆచరిస్తున్న సమాజ ప్రముఖులు

గంగావతి: నగరంలోని మార్కండేయ సర్కిల్‌లో సోమవారం పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ జయంతిని ఘనంగా జరిపారు. సమాజ బాంధవులందరూ చేరి మార్కండేయుడి చిత్రపటానికి పూజలు నెరవేర్చారు. సమాజ ఉపాధ్యక్షులు శేఖరప్ప మాట్లాడుతూ భక్త మార్కండేయ తమ తపస్సుతో ఈశ్వరుడే ప్రత్యక్షమై తనకు చిరంజీవిగా ఆయుష్షును ప్రసాదించారన్నారు. అలాంటి మహానుభావుడు పుట్టిన కులంలో మనం జన్మించడం పద్మశాలీయులందరూ చేసుకున్న పుణ్యమన్నారు. తమ జీవితాన్ని మెరుగు పరచుకునేందుకు, తమ పిల్లల భవిష్యత్తు కోసం, మంచి విద్యాభ్యాసం చెప్పించేందుకు భక్త మార్కండేయ తపోమార్గాన్ని ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సమాజ ప్రముఖులు నేకార్ సంజీవ్‌కుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

అంగడిలో రూ.5 లక్షల నగదు చోరీ

హుబ్లీ: కిటికీ గ్లాస్ పగలగొట్టి లోపలికి వెళ్లిన దొంగలు ఆ అంగడిలో ఉన్న నగదును చోరీ చేసి పరారైన ఘటన నగరంలోని మూరుసావిర మఠం వద్ద చోటు చేసుకుంది. అమిత్ రాథోడ్‌కు చెందిన పాత్రల విక్రయ దుకాణంలో ఈ చోరీ జరిగింది. మూరు సావిర మఠం ప్రధాన ద్వారానికి ఆనుకుని ఉన్న ఈ భవనంలోకి గ్లాసులు పగలగొట్టి లోపలికి చొరబడిన దొంగలు డ్రాలో ఉన్న రూ.5 లక్షల నగదును చోరీ చేసి పరారైనట్లు బాధితుడు అమిత్ సోమవారం కమరిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువతలో గుండెజబ్బుల సమస్య


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కంప్లి: కోవిడ్ అనంతరం 30 ఏళ్ల యువతలో గుండెజబ్బుల సమస్య అధికం అయిందని వైద్యాధికారి డాక్టర్ గురుబసవరాజ్ అన్నారు. ఆయన సోమవారం కురుగోడు తాలూకాలోని ముష్టిగట్టి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరంలో మాట్లాడారు. గ్రామీణ ప్రజలు మలేరియా, డెంగీ, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. డాక్టర్ గురుబసవరాజ్, డాక్టర్ లక్ష్మణ్ నాయక్, దివ్య, పుష్పా ప్రమోద్, వైద్య విద్యార్థులు రోగులను పరీక్షించారు. బీపీ, షుగర్, స్తన క్యాన్సర్ గర్భకోశ క్యాన్సర్, కంటి పరీక్షలను చేశారు. శిబిరంలో సుమారు 300 మందికి ఆరోగ్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. 55 మంది అవయవదానానికి పేర్లు నమోదు చేసుకున్నారు. 20 మందికి కంటి పరీక్షల అనంతరం కంటి అద్దాలను అందించారు. శిబిరంలో జీపీ అధ్యక్షులు బసవరాజ్, పీడీఓ దేవరాజ్, తాలూకా ఎస్టీ వర్గాల సంక్షేమ అధికారి గాదిలింగప్ప పాల్గొన్నారు.

దేవదుర్గలో ఇసుక రగడ

- పోలీస్‌పై ఎమ్మెల్యే బంధువుల దాడి!
- ఠాణా ముందు ఎమ్మెల్యే కరెమ్మ ధర్నా
- తాము ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని ధ్వజం

రాయచూరు రూరల్: జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా సాగిస్తున్న మాఫియాకు చెందిన ట్రాక్టర్‌ను అడ్డుకున్న పోలీస్ కానిస్టేబుల్‌పై ఎమ్మెల్యే తనయుడు, గుమాస్తా, సోదరుడు కలిసి దాడి చేసిన ఘటన దేవదుర్గలో జరిగింది. ఆదివారం సాయంత్రం కృష్ణా నదీ తీరంలోని దొడ్డంబళి, గోపాలపురల నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సీఐ సదలగి సమాచారం అందించారు. పోలీస్ కానిస్టేబుల్ హనుమంతరాయ ట్రాక్టర్‌ను అడ్డుకోవడంతో ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ తనయుడు సంతోష్, గుమాస్తా రామణ్ణ నాయక్, తమ్ముడు తిమ్మారెడ్డి ప్రభుత్వ అతిథిగృహానికి పిలిచి కానిస్టేబుల్‌పై దాడి చేశారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గాయపడిన పోలీస్ కానిస్టేబుల్ హనుమంతరాయ దేవదుర్గ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పోలీస్ స్టేషన్ వద్ద ఎమ్మెల్యే ధర్నా

అయితే అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న పోలీస్ కానిస్టేబుల్ హనుమంతరాయ తమను కులం పేరుతో దూషించినందుకు మాత్రమే ప్రభుత్వ అతిథి గృహానికి పిలిచి మాట్లాడామని, తమను దూషించినందుకు పోలీసు కానిస్టేబుల్‌పైనే కేసు నమోదు చేయాలని ఒత్తిడి చేస్తూ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ తన మద్దతుదారులతో ఆదివారం రాత్రి దేవదుర్గ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు.

ఎనిమిది మందిపై కేసు నమోదు

కాగా పోలీస్ కానిస్టేబుల్ హనుమంతరాయపై దాడి చేసిన ఘటనలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సదలిగి వెల్లడించారు. దాడికి పాల్పడిన ఎమ్మెల్యే కుమారుడు సంతోష్, సోదరుడు తిమ్మారెడ్డి, సోదరి కుమారుడు మల్లప్ప, వ్యక్తిగత సహాయకుడు ఇలియాస్, రఫీక్, దావూద్, అవంతి భీమన్న, రమేష్‌లపై కేసు నమోదు చేశామన్నారు.


ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్యే కరెమ్మ నాయక్


గాయపడిన కానిస్టేబుల్


తనయుడు సంతోష్


సోదరుడు తిమ్మారెడ్డి


గుమాస్తా రామణ్ణ నాయక్

బాలింతల కోసం బేబీ ఫీడింగ్ రూం


బేబీ ఫీడింగ్ రూంను ప్రారంభించిన దృశ్యం

మాలూరు: తాలూకాలోని చిక్కతిరుపతి శ్రీప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయానికి వచ్చే బాలింత భక్తుల కోసం ప్రత్యేక బేబీ ఫీడింగ్ రూం ఏర్పాటు చేసినట్లు టీపీ ఈఓ సెల్వమణి తెలిపారు. సోమవారం బేబీ ఫీడింగ్ రూంను ఆయన ప్రారంభించి మాట్లాడారు,. ఆలయానికి ప్రతి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తారు. ప్రత్యేక రోజుల్లో భక్తుల సంఖ్య భారీగా ఉంటుంది. వారిలో బాలింత భక్తులు తమ చంటి పిల్లలకు పాలివ్వడానికి పడుతున్న ఇబ్బంది దృష్ట్యా వారి అనుకూలం కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేశామన్నారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ వ్యవస్థాపక సమితి మాజీ సభ్యుడు ఆలంబాడి ఎన్ సురేష్‌బాబు, పి.శ్రీనాథ్ శెట్టి, ఆలయ అర్చకుడు రవిస్వామి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పాదపూజ


కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ తదితర అధికారులు, ప్రముఖులు

గంగావతి: శ్రీరామనగర్‌లోని విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు పాదపూజను జరిపారు. కార్యక్రమాన్ని డీఎస్పీ రుద్రేష్ ఉజ్జినకొప్ప ప్రారంభించి మాట్లాడుతూ గతంలో మంచి చదువు కోసం సుదూరంలోని మంగళూరు, బెంగళూరు, ధార్వాడలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. నేడు ఆ ప్రాంతవాసులే తాలూకాలో ఏర్పాటు చేసిన విద్యా సంస్థ వైపు చూస్తున్నారని, ఈ ఘనత సంస్థ అధ్యక్షుడికే దక్కుతుందన్నారు. ఈ పాఠశాలలో తన ఇద్దరు పిల్లలను సైతం చదివించానని, వారు మంచి భవిష్యత్తు పొందారన్నారు. సంస్థ అధ్యక్షుడు నెక్కంటి సూరిబాబు, డీఎస్పీ పాటిల్, శ్రీరామనగర్ గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

పౌర సేవకులకు సన్మానం


పౌర కార్మికులు, వాటర్‌మెన్లను సన్మానించిన దృశ్యం

కోలారు: తాలూకాలోని అరాభికొత్తనూరు జీపీ కార్యాలయంలో సోమవారం పౌర కార్మికులు, వాటర్‌మెన్లను సన్మానించారు. జెడ్పీ ఉప కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ సమస్యల పరిష్కారంలో పంచాయతీలు కీలక పాత్రను పోషిస్తాయన్నారు. పంచాయతీ పాలన వ్యవస్థలో మహిళలకు, ఎస్సీలకు, వెనుకబడిన వర్గాలకు అందిస్తున్న రిజర్వేషన్ సౌకర్యాలను అందిస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకంలో 256 రకాల వివిధ పనులను జీపీలో నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. దీని ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జీపీ ఉపాధ్యక్షుడు నాగేంద్ర, స్థాయీ సమితి అధ్యక్షుడు గోపాలకృష్ణ, సభ్యుడు ఏఎస్ నంజుండగౌడ పాల్గొన్నారు.

పెళ్లింట ఘోర విషాదం


రోదిస్తున్న మృతుడు కాంతరాజు భార్య లావణ్య


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు


శోకసంద్రంలో దాసప్పనపాళ్య గ్రామం

- బొలెరోని ఢీకొన్న లారీ
- ముగ్గురు మృతి, 10 మందికి పైగా గాయాలు
- అగళి మండలంలో ప్రమాదం

రొళ్ల: పెళ్లి తిరిగింపులు ముగించుకుని స్వగ్రామానికి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి నవవరుని బంధువులైన అమ్మాజక్క(33), కాంతరాజు(39), గోవిందప్ప(72) అనేవారు దుర్మరణం చెందారు. మరో పది మందికి పైగా తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే రొళ్ల మండలం దాసప్పనపాళ్యకు చెందిన మంజునాథ్‌కు, తుమకూరు జిల్లా శిరా తాలూకా హుచ్చగిరేనహళ్లి చెందిన తేజస్వినితో శిర సమీపంలోని మరడిగుడ్డ రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం పెళ్లి జరిగింది.

మృత్యుశకటమైన లారీ

సాయంత్రం దాసప్పనపాళ్య గ్రామం నుంచి బొలెరో వాహనంలో 20 మందికి పైగా వధువు ఇంట్లో తిరిగింపులు చూసుకొని ఇళ్లకు బయల్దేరారు. అగళి మండలం ఇరిగేపల్లి మలుపు వద్ద ఎదురుగా వస్తున్న సిమెంట్ లారీ... వీరి బొలెరో వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అమ్మాజక్క, కాంతరాజు, గోవిందప్ప అక్కడికక్కడే మృతి చెందారు. ఈరక్యాతరాయప్ప, నాగన్న, గౌరమ్మ, రాఖీ, నరసింహమూర్తి, రాధమ్మ, కమలమ్మ, అక్కమ్మ, సుమక్క, జగన్నాథ్, అనిల్ మరికొందరిని హిందూపురం, తుమకూరు, బెంగళూరు ఆస్పత్రులకు తరలించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా మడకశిర ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. మృతుల బంధుమిత్రుల రోదనలతో ఆస్పత్రి, గ్రామం దద్దరిల్లింది.


మృతురాలు అమ్మాజక్క(ఫైల్)


మృతుడు కాంతరాజు(ఫైల్)


మృతుడు గోవిందప్ప(ఫైల్)

వివాహిత ఆత్మహత్య

హిందూపురం అర్బన్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... బెంగళూరు సమీపంలోని బాగలగుంటె గ్రామానికి చెందిన రాజేంద్ర, పుష్పలత (38) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో ఒకరికి పెళ్లి చేశారు. ఈ క్రమంలో అక్కడ ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో నాలుగు నెలల క్రితం హిందూపురానికి వలస వచ్చారు. కొంత కాలం తర్వాత పుష్పలత తన చెల్లెలు పూర్ణిమ వద్దకెళ్లారు. అక్కడ పరిస్థితులు సహకరించకపోవడంతో నాలుగు రోజుల క్రితం హిందూపురం చేరుకుని పరిగి బస్టాండ్ సమీపంలో అద్దె ఇంట్లోకి మకాం మార్చారు. అప్పటికే ఆర్థిక ఇబ్బందులు తాళలేక జీవితంపై విరక్తి పెంచుకున్న పుష్పలత సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ హరూన్ బాషా తెలిపారు.

కర్మాగార యాజమాన్యం తీరుపై ధర్నా

కంప్లి: 12 నెలల పాటు పండించిన చెరుకును నరకడానికి అనేక వ్యతిరిక్త పరిస్థితులను ఎదుర్కొంటుండటం తమ దౌర్భాగ్యమని చక్కెర రైతులు వాపోయారు. హూవినహడగలి తాలూకా కొంబళిలో చెరుకును పండించినా గంగాపుర విజయనగర షుగర్స్ కర్మాగార యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ట్రాక్టర్లను నిలిపి రైతులు ధర్నా చేశారు. అనంతరం చెరుకు రైతులు మాట్లాడుతూ విజయనగర షుగర్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం సకాలంలో చెరుకును నరికించక పోవడంతో దిగుబడి క్షీణించి రైతులు అపారనష్టం అనుభవిస్తున్నామన్నారు. రాష్ట్రంలో వరిపంటపై ఆశలు పెట్టుకొని కూడా ఎంతో మంది వర్షాలు లేక నష్టపోయారన్నారు. అయితే తమ పరిధిలో షుగర్ ఫ్యాక్టరీ ఉన్నా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విషయం తెలిసిన వెంటనే పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరి రైతులతో చర్చించి శాంతింపజేశారు.


రైతులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

నియామకం


మీనళ్లి తాయణ్ణ

బళ్లారిటౌన్: జిల్లా జేడీఎస్ అధ్యక్షుడుగా మీనళ్లి తాయణ్ణను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్‌డీ కుమారస్వామి సోమవారం ఆదేశాలను జారీ చేశారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పార్టీలో నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ముందడుగు వేయాలని ఆయన సూచించారు.

వెట్టి పద్ధతి రద్దు కోసం జాగృతి జాతా


ప్రతిజ్ఞ చేయిస్తున్న సీనియర్ జడ్జి మహాలక్ష్మి

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగిలో వెట్టి పద్ధతి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాగృతి జాతా నిర్వహించారు. సోమవారం కోర్టు ఆవరణలో సీనియర్ జడ్జి మహాలక్ష్మి విజిలెన్స్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. వెట్టి పద్ధతి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలోని మదకరి సర్కిల్‌కు చేరుకున్న పాదయాత్రలో న్యాయవాది సి.విరుపాక్షప్ప ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కులవృత్తికి వ్యతిరేకంగా అమలులో ఉన్న చట్టంపై అవగాహన కల్పించి, సమాజానికి విధేయత లేని కులవృత్తి నిర్మూలనకు అందరూ కట్టుబడాలని సూచించారు. కోర్టు విభాగాధిపతి నాగరాజు, టీపీ ఈఓ వై.రవికుమార్, కార్మిక అధికారిణి మంజుల, విద్యాశాఖ జగదీశ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జీఎం మల్లికార్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలపై భయాందోళన వద్దు

హొసపేటె: విద్యార్థులు పరీక్షలపై భయాందోళనకు గురికారాదని స్నేహితుల సంఘం అధ్యక్షుడు, సామాజిక సేవకుడు బీ.అబ్దుల్ రహిమాన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని తమ పాఠశాలలో విద్యార్థినులకు స్నేహితుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని విడిచి పెట్టి ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. విద్యార్థి జీవితం అమూల్యమైనదన్నారు. పరీక్షలకు సమయం తక్కువగా ఉందని, టెన్త్ పరీక్షలు దగ్గర పడుతున్నందున ప్రతి క్షణాన్ని శ్రద్ధగా చదువుకు కేటాయించాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల శ్రమ వృథా కాకూడదన్నారు. బాధ్యతాయుతంగా సాధన చేసి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులు పరీక్షలను తెలివి, చతురత, సమయప్రజ్ఞతో ఎదుర్కోవాలన్నారు. జానపద పరిషత్ తాలూకా అధ్యక్షుడు కేఎం.వీరేశ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

రాజకీయాల్లో సేవాభావం అవసరం

కేజీఎఫ్: రాజకీయాన్ని వృత్తిగా కాకుండా సేవా మనోభావంతో కూడిన ప్రవృత్తిగా చేసుకోవాలని, బంగారుపేటె ఎమ్మెల్యే, కర్ణాటక మౌలిక సౌకర్యాల అభివృద్ధి, ఆర్థిక మండలి అధ్యక్షుడు ఎస్ఎన్ నారాయణస్వామి ఆ మనోభావంతో రాజకీయం చేస్తున్నారని రాష్ట్ర ప్రాథమిక పాఠశాలల ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం తాలూకా అధ్యక్షుడు బి.నారాయణస్వామి తెలిపారు. సోమవారం బంగారుపేటె పట్టణ సమీపంలోని ఎస్ఎన్‌సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్యే అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే ఆమూలాగ్ర అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రంలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారన్నారు. కోలారు జిల్లాలో ఏ నియోజకవర్గంలోనూ చేయని అభివృద్ధి కార్యక్రమాలను బంగారుపేటె ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే నిర్వహిస్తున్న సామాజిక సేవల ద్వారానే పదవులు ఆయనను వెతుక్కుంటూ వస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే సేవా మనోభావాన్ని చూసే ఆయనకు ప్రభుత్వం మండలి పదవిని కట్టబెట్టిందన్నారు. సంఘం కార్యాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, కోశాధికారి కె.నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి కేటీ నాగరాజ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నారాయణస్వామిని అభినందిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో ఆరాధన మహోత్సవం


ప్రత్యేక అలంకరణలో వెంకటగిరియప్ప స్వామి

మాలూరు: తాలూకాలోని డీఎన్ దొడ్డి గ్రామంలో ఉన్న పురాతన శ్రీవెంకటగిరియప్ప స్వామి ఆలయంలో ప్రతియేటా నిర్వహించేలా వెంకటగిరియప్ప స్వామి ఆరాధన మహోత్సవాలను ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిమాన్వితుడైన వెంకటగిరియప్ప స్వామికి తాలూకాలో అపార సంఖ్యలో ఉన్న భక్త బృందం ఆరాధనా మహోత్సవాలను పురస్కరించుకుని ప్రధాన అర్చకుల నేతృత్వంలో విశేష పూజలు జరిగాయి. వెంకటగిరియప్ప స్వామి మూల విగ్రహానికి విశేష పూల అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

గ్రామీణాభివృద్ధికి కృషి

కోలారు: గ్రామీణాభివృద్ధికి కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే కే.మంజునాథ్ తెలిపారు. ఆయన సోమవారం అరాభికొత్తనూరు గ్రామంలో నూతన జీపీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. జీపీ భవనం ప్రజల సొత్తు. తమ గ్రామంలో ఎలాంటి సమస్య వచ్చినా పంచాయతీ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. మహాత్మాగాంధీ గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన కన్న కలలను సాకారం చేయాలన్నారు. గ్రామాల, పంచాయతీల అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి గతంలో ప్రధాన మంత్రి మన్‌మోహన్ సింగ్ ఉపాధి హామీ పథకాన్ని తెచ్చి నిధులు అందించి గ్రామాలను అభివృద్ధి చేశారన్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులను తిరిగి అభివృద్ధి రూపంలో అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు తీసుకు వస్తోందన్నారు. నగర శివార్లలో రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.100 కోట్లు, ఎస్ఎన్ఆర్ ఆస్పత్రిలో మౌలిక సౌకర్యాల కోసం రూ.10 కోట్లు అందించిందన్నారు. ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులు, జెడ్పీ మాజీ అధ్యక్షురాలు చౌడేశ్వరి, వక్కలేరి రాము, టీపీ ఈఓ మునియప్ప పాల్గొన్నారు.


జీపీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మంజునాథ్

సంఘం అధ్యక్షుడిగా ఎన్నిక


నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న దృశ్యం

కోలారు: కేజీఎఫ్ తాలూకా యాదవ సంఘం అధ్యక్షుడిగా ఏ.ఉమేష్ ఎన్నికయ్యారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన యాదవ సంఘం సమావేశంలో కేజీఎఫ్ తాలూకా యాదవ సంఘం పదాధికారుల ఎన్నిక జరిగింది. అనంతరం జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె నారాయణస్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యేల సహకారంతో యాదవ సంఘానికి స్థలం పొందాలన్నారు. సంఘం సంఘటితమైతేనే ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని సౌకర్యాలను పొందవచ్చన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన సముదాయాన్ని ముందుకు తేవాలన్నారు. నూతనంగా ఎన్నికైన పదాధికారులు సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తమ సమాజాన్ని ఎస్సీ సముదాయంలోకి చేర్చాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జీ.సురేష్ బాబు, సముదాయ ప్రముఖులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువల వెల్లడే జాతా ఉద్దేశం

కోలారు: విశిష్టమైన రాజ్యాంగంపై జాగృతి జాతాలో రాజ్యాంగ విలువల గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయడమే జాతా ముఖ్య ఉద్దేశమని జిల్లాధికారి అక్రం పాషా తెలిపారు. సోమవారం నగరంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో స్కౌట్స్ విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్ర పురస్కృత అవార్డు ప్రదాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాను విద్యార్థి దశలో ఉండగా స్కౌట్స్ కార్యక్రమాల్లో పాల్గొన్నానన్నారు. స్కౌట్స్ లేదా ఎన్‌సీసీ విద్యార్థుల్లో క్రమశిక్షణ, శాంతి, సమయ ప్రజ్ఞ, సేవా మనోభావాలను పెంపొందింపజేస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ దేశ భక్తిని పెపొందించుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. జాతా ప్రతి నిత్యం ఒక గ్రామ పంచాయతీలో సంచరిస్తుందన్నారు. దీని ద్వారా గ్రామీణ ప్రజలకు రాజ్యాంగాన్ని గురించి అవగాహన కల్గిస్తారన్నారు. రాజ్యాంగ ధ్యేయం, ఉద్దేశాలు, ఆశయాల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. అనంతరం రాష్ట్ర అవార్డు గ్రహీత విద్యార్థులకు ప్రశస్తి పురస్కారాలు అందించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ముఖ్య కమిషనర్ కె వి శంకరప్ప, డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


స్కౌట్స్ విద్యార్థులకు ప్రశస్తి ప్రదానం చేస్తున్న దృశ్యం

వైభవంగా వాసవి ఆత్మార్పణ దినోత్సవం

శ్రీనివాసపురం: పట్టణంలోని ఎంజీ రోడ్డులో ఉన్న శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో విశేష పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారి దర్శనం చేసుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వాలెంటైన్స్‌కు బెంగళూరు గులాబీలు


బెంగళూరు దగ్గర ఓ గులాబీ తోట


కబ్బన్‌పార్క్‌లో ఓ జంట ఫొటోషూట్

- చుట్టుపక్కల వేలాది ఎకరాల్లో తోటల పెంపకం
- పలు దేశాలకు ఎగుమతి

బనశంకరి: గులాబీ పుష్పాలు ఆహ్లాదభావాన్ని కలిగిస్తాయి, అవి ప్రేమకు కూడా చిహ్నం. కానీ చాలామందికి గులాబీ పూల తోటల పెంపకం జీవనాధారం. బెంగళూరు రూరల్ ప్రాంతాలు, సమీప చిక్కబళ్లాపుర, రామనగర జిల్లాల్లో గులాబీ తోటలు విస్తారంగా సాగులో ఉన్నాయి. దీంతో ప్రతి వాలెంటైన్స్ డే కి గులాబీ పూల ఎగుమతిలో రైతులు, వ్యాపారులు బిజీగా ఉంటారు. బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయం నుంచి విదేశాలకు కోటికిపైగా గులాబీపూలు ఎగుమతి అవుతుండటం విశేషం. 2022 తో పోలిస్తే గత ఏడాది 14 శాతం ఎగుమతులు పెరిగాయి. ఈసారి డిమాండ్ మరింతగా ఉందని పుష్ప వేలం కేంద్రం (ఐప్యాబ్) అధికారులు తెలిపారు.

విస్తృతంగా సాగు

బెంగళూరు పరిసరాలు, చిక్కబళ్లాపుర, రామనగర జిల్లాల తోటల్లో మేలిరకం గులాబీలు పూస్తాయి. అనేకమంది రైతులు డ్రిప్, నీడ వసతి ద్వారా ఇళ్ల వద్దే పూల సాగు చేస్తున్నారు. కరోనా సమయంలో గిరాకీ లేక పూల మార్కెట్ భారీగా నష్టపోయింది. ప్రస్తుతం మార్కెట్ ఊపందుకోవడంతో గులాబీల కోసం ఆర్డర్లు పెరిగాయి.

ఈసారి మంచి ధర : తాజ్ మహల్ రకం గులాబీ పువ్వు ధర ఒకటి రూ. 20 వరకు ఉంది. తాజ్‌మహల్, సమురాయ్, గోల్డ్ స్ట్రైక్ ఎల్లో, హాట్ షాట్, బోనియర్, సొరస్, జ్యూమిలియా, రాక్‌స్టార్, డచ్ రకాల గులాబీలకు డిమాండు ఉంటోంది. బెంగళూరు నుంచి కౌలాలంపూర్, సింగపూర్, కువైట్, మనీలా, న్యూయార్క్, లెబనాన్, మాల్దీవ్స్, జోర్డాన్, దుబాయి తదితర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. మనదేశంలోని ప్రధాన నగరాలకూ పూలు వెళ్తాయి.


ప్రేమికుల రోజుకు సిద్ధం


మేలురకం గులాబీలు

క్లుప్తంగా

రెడ్డి సముదాయం అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే సతీష్ రెడ్డిని సన్మానిస్తున్న మురళీధర్ రెడ్డి

బొమ్మనహళ్లి: కర్ణాటక రెడ్డి జన సంఘం నూతన డైరెక్టర్ల ఎన్నికల్లో తాను ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని సామసంద్రపాళ్యకు చెందిన యువ నాయకుడు కే.మురళీధర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన రెడ్డి జన సంఘం పెద్దలు దామోదర్ రెడ్డి, కే.వాసుదేవా, మాలా శ్రీనివాస్ రెడ్డి, బాబు రెడ్డిలతో కలిసి బొమ్మనహళ్లి ఎమ్మెల్యే సతీష్ రెడ్డిని కలిసి ఆయన పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో రెడ్డి సముదాయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

సాహితీవేత్తకు నివాళులు


నివాళులర్పిస్తున్న దృశ్యం

తుమకూరు: ప్రముఖ కన్నడ సాహితీవేత్త డాక్టర్. కవితా కృష్ణ సుమారు 350కి పైన పుస్తకాలను రాయడంతో పాటు సాహిత్య రంగంలో ఎంతో రాణించారు. కన్నడనాడు, నుడి, నేల, నీరు పోరాటాల్లో గొంతెత్తారని తుమకూరు జిల్లా వెనుకబడిన వర్గాల సమాఖ్య అధ్యక్షుడు ధనియా కుమార్ అన్నారు. సోమవారం సమాఖ్య ఆధ్వర్యంలో కవిత కృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కన్నడ కంఠీరవ దివంగత డాక్టర్ రాజ్‌కుమార్‌తో కలిసి గోకాక్ పోరాటంలో పాల్గొన్నారని, ఆయన రచనలు ఉన్నట్లే ఆయన మాటలు కూడా బాగుండేవని అన్నారు. ఆయన తుమకూరు జిల్లావాసి కావడం గర్వకారణమని చెప్పారు. క్యాన్సర్ వల్ల ఆయన మరణించడం బాధాకరమని పేర్కొన్నారు.

ఒంటరి ఏనుగు సంచారం


వసతి గృహాల వద్ద తిరుగుతున్న ఏనుగు

యశవంతపుర: మడికేరి జిల్లా సోమవారపేట తాలూకా రిజర్వు అటవీ ప్రాంత సమీపంలో ఓ ఏనుగు ప్రత్యక్షమైంది. పగటిపూట సంచరిస్తుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ కాఫీతోటలో ఒంటి ఏనుగు తిరుగుతూ కనిపించింది. ఆర్‌ఆర్‌టీ సిబ్బంది, అటవీశాఖ ఏనుగును అటవీ ప్రాంతంలో తరిమివేయడానికి యత్నించగా వారిపై ఏనుగు దాడికి యత్నించింది. సోమవారం ఉదయం కాజూరు, ఆర్‌ఆర్‌టీ సిబ్బంది వసతి గృహం వద్ద ఏనుగు కొద్దిసేపు హల్‌చల్ చేసింది.

బెంగళూరు ఉపనగర రైల్వే ప్రాజెక్ట్ త్వరలో పూర్తి

శివాజీనగర: బెంగళూరు ఉపనగర రైల్వే ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ ప్రాజెక్ట్ బైయ్యప్పనహళ్లి–చిక్కబాణవార కారిడార్ సివిల్ పనులు ప్రగతిలో ఉన్నాయి. హీలలిగె–రాజనకుంట కారిడార్ సివిల్ పనులు టెండర్‌ను ఫైనల్‌చేసి త్వరలోనే పనులు ఆరంభించనున్నట్లు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ తెలిపారు. అసెంబ్లీలో ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగం చేసిన గవర్నర్, కర్ణాటక రాష్ట్రంలో ప్రాంతీయ త్వరిత సంచారం, సంపర్కం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ఏడాది విజయపుర విమానాశ్రయం ప్రారంభమవుతుందని, హాసన, రాయచూరు విమానాశ్రయ పనులను గడువులోగా పూర్తి అవుతాయన్నారు.

చెరువుల అభివృద్ధితోనే భూగర్భ జలాల వృద్ధి


రామపాద చెరువు అభివృద్ధి పనుల దృశ్యం

గౌరిబిదనూరు: తాలూకా బెళ్లాల బొమ్మసంద్ర గ్రామానికి చెందిన రామపాద చెరువు అభివృద్ధి పనులకు సోమవారం గౌరిబిదనూరు సేవా ప్రతిష్ఠానం ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. చెరువుల అభివృద్ధితో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని, పశువులకు తాగునీరు అందుబాటులోకి వస్తుందన్నారు. చెరువులో తీసిన సారవంతమైన మట్టిని రైతులు తమ పొలాలలకు తీసుకొని వెళ్లచ్చన్నారు. రైతులు సైతం ఈ మహత్తర కార్యానికి చేతులు కలపాలన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, వీరేశ్, ఉపేంద్ర, నరసింహమూర్తి దయానంద పాల్గొన్నారు.

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: మైసూరు జిల్లా హుణసూరు తాలూకా బన్నికుప్పె గ్రామ ప్రజలకు కొన్ని రోజులుగా కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కింది. ఈ చిరుత తరచూ గ్రామంలోకి చొరబడి మేకలు, వీధి కుక్కలను బలి తీసుకునేది. దీంతో ప్రజలు భయాందోళనలో బతుకుతున్నారు. చిరుతను పట్టుకోవడానికి బోనులు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి ఆహారం కోసం వచ్చిన చిరుత ఓ పొలంలో పెట్టిన బోనులో చిక్కింది. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

పులి దాడిలో దూడ మృతి

పులి దాడిలో లేగదూడ మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా హుణసూరు తాలూకా ముత్తరాయన హోసహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఆదివారం అర్ధరాత్రి అల్లం తోటలో కట్టి ఉంచిన లేగదూడను పులి చంపి పారిపోయింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులను పులి కోసం గాలిస్తున్నారు.

మంత్రి రామలింగారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు

- దొడ్డ నివాసి అరెస్టు


అరెస్టైన మునేగౌడ

దొడ్డబళ్లాపురం: రాష్ట్ర మంత్రి రామలింగారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన దొడ్డ నివాసి మునేగౌడను విధానసౌధ పోలీసులు అరెస్టు చేసారు. ఇటీవల విధానసౌధ ముందు జరిగిన జనస్పందన కార్యక్రమంలో మంత్రిని మునేగౌడ అసభ్యపదజాలంతో నిందించాడు. డ్రైవింగ్ లైసెన్స్ పొందే విషయంలో దేవనహళ్లి ఆర్టీఓ అధికారులపై మునేగౌడ గత ఆరేళ్లుగా పోరాడుతున్నాడు. ఈ విషయంలో సంయమనం కోల్పోయి దయామరణం ప్రసాదించాలని రాష్ట్రపతికి కూడా మనవి చేసుకున్నాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 8న విధానసౌధ ముందు జరిగిన జనస్పందన కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి రామలింగారెడ్డిని అసభ్యపదజాలంతో దూషించాడు. అధికారులపై కూడా చెలరేగిపోయి సవాళ్లు విసిరాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న విధానసౌధ పోలీసులు దొడ్డ పట్టణంలో ముత్తాంబిక ఆలనీలో నివసిస్తున్న మునేగౌడను అరెస్టు చేసి జుడీషియల్ కస్టడీకి అప్పగించారు. సహనం కోల్పోయి మాట్లాడినట్లు మునేగౌడ పోలీసుల వద్ద చెప్పుకున్నాడు.

పుట్టణ్ణ విజయం కోసం కృషి చేయండి

బొమ్మనహళ్లి: ఉపాధ్యాయ శాసన మండలి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న పుట్టణ్ణ తన విద్యార్థి దశ నుంచే పోరాటాలు చేస్తున్నారని, ఆయనను మరోసారి ఎన్నికల్లో గెలిపించాలని ఆనేకల్ ఎమ్మెల్యే శివణ్ణ ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. బెంగళూరు నగర జిల్లా పరిధి ఆనేకల్ తాలూకా మరసూరులో స్థానిక ఉపాధ్యాయుల సమావేశంలో పుట్టణ్ణతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంగ్రెస్ అభ్యర్థిగా పుట్టణ్ణ బరిలో ఉన్నారని, ఉపాధ్యాయులు పుట్టణ్ణను గెలిపిస్తే అధికార కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉపాధ్యాయుల డిమాండ్లను పరిష్కరించడానికి కృషి చేస్తారన్నారు. అభ్యర్థి పుట్టణ్ణ మాట్లాడుతూ...తనను మరోసారి ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు రామోజీగౌడ, స్ఫూర్తి పాఠశాల వ్యవస్థాపకులు గోపాల రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు లింగణ్ణ, రఘుపతి రెడ్డి, పద్మనాభ, శివప్ప, రవికుమార్, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సమవస్త్రాలు పంపిణీ


క్రీడాకారులతో మంత్రి సుధాకర్

చిక్కబళ్లాపురం: ఈనెల 15 నుంచి 19 వరకు గుజరాత్ అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ అంతర్ జిల్లాల అథ్లెటిక్ పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సుధాకర్ సమవస్త్రాలు, క్రీడా సామగ్రి అందజేసి మాట్లాడారు. మంచి ప్రతిభ చూపి పతకాలను తీసుకురావాలన్నారు.

బీజేపీది మత రాజకీయం

శివాజీనగర: శాసనసభ ఉభయ సభల్లో ప్రతిపక్ష బీజేపీ నాయకులు కేసరి శాలువా ధరించి పాల్గొనడాన్ని న్యాయ, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి హెచ్.కే.పాటిల్ ఖండించారు. బీజేపీ నాయకులకు పార్లమెంటరీ వ్యవస్థలో నమ్మకం లేదు. దేవుని పేరుతో, మతం పేరుతో రాజకీయం చేస్తున్నారు. వీరికి ప్రజలే గుణపాఠం చెబుతారని మండిపడ్డారు.

స్థల వివాదంపై కేసు

యశవంతపుర: ప్రభుత్వ జాగాలో ఉన్న సిటీ రిజర్వు పోలీసు ఆయుధాగారంలోకి దూరి గొడవకు దిగిన కొందరు వ్యక్తులపై జ్ఞానభారతి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 8న ఉళ్లాల ఉపనగరలోని సీఎఆర్ పశ్చిమ విభాగంలో జాగాలోకి ప్రవేశించిన 20 మంది అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందితో గొడవ చేశారు. ఈ జాగా మాది, ఖాళీ చేయండి అని రగడపడ్డారు. దీంతో అక్కడి కానిస్టేబుల్ రుద్రేశ్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదుతో అపరిచిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

పొలంలో శివలింగం లభ్యం

మైసూరు: మైసూరు జిల్లాలోని హుణసూరు తాలూకాలోని బిళికెరె హోబ్లి పరిధిలో ఉన్న అస్వాల్ గ్రామంలో పురాతన కాలం నాటి శివలింగం తవ్వకాల్లో బయటపడింది. రైతు దొడ్డ బుచ్చయ్య అల్లం పొలంలో దుక్కి దున్నుతున్న సమయంలో నాగలికి ఏదో గట్టిగా అడ్డం పడింది. పరిశీలించిన రైతు శివలింగంగా గుర్తించి వెలికితీశాడు. శివలింగం మీద నంది, సూర్య, చంద్రుల ముద్రలున్నాయి. గ్రామస్తులు వచ్చి అక్కడే ప్రతిష్ఠాపన చేసి పూజలు చేశారు.

లేపాక్షి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి

లేపాక్షి: మాఘ మాసం సందర్భంగా లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం వీరభద్రస్వామి, పాపనాశేశ్వరుడు, రఘునాథస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చారు. అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహామంగళారతి తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

కిక్ బాక్సింగ్‌లో సిల్వర్ మెడల్స్

బనశంకరి: అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌లో కర్ణాటక అసోసియేషన్ ఆఫ్ కిక్ బాక్సింగ్‌లో చలాది సతీశ్, దాసరి మనోజ్ సిల్వర్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ కిక్ బాక్సింగ్ (డబ్ల్యూఏకేఓ) ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 11 తేదీ వరకు ఢిల్లీ ఎంకే.జాదవ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 3వ అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ టోర్నీలో మచిలీపట్టణానికి చెందిన చలాది సతీశ్ రెండు సిల్వర్‌మెడల్స్ సాధించారు. అదే విధంగా మరో బాక్సింగ్ ఫైటర్ మనోజ్ రజత పతకం కైవసం చేసుకుని అంతర్జాతీయంగా భారత పతాకాన్ని ఎగురవేశారు.


కిక్ బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటిన చలాది సతీశ్, దాసరి మనోజ్

వివాహిత ఆత్మహత్య

యశవంతపుర: ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బెంగళూరు రాజగోపాలనగర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. మోహన్ థియేటర్ సమీపంలోని ఇంటిలో ఎవరు లేని సమయంలో కావ్య (22) ఆత్మహత్య చేసుకుంది. తుమకూరు జిల్లా కుణిగల్‌కు చెందిన కావ్యకు రెండేళ్ల క్రితం ప్రవీణ్‌తో వివాహమైంది. దంపతులకు ఏడాది వయసున్న చిన్నారి ఉంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియటంలేదు. రాజగోపాలనగర పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి భర్త, అత్తమామలను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

మహాదేవపురలో వీధి కుక్కల బెడద


వీధికుక్క దాడి చేస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర పరిధిలో వీధి కుక్కలు పేట్రేగిపోతున్నాయి. పాదచారులపై దాడులు చేస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తాజాగా బ్రిజేశ్ అనే వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా వీధికుక్కలు ముట్టడించి తీవ్రంగా కరిచాయి. దీంతో బాధితుడు సోషల్ మీడియాలో తన గోడును వెల్లబోసుకున్నాడు. వీధికుక్కలను నియంత్రించాలని కార్పొరేషన్ అధికారులకు, ఎమ్మెల్యే మంజుల లింబావలికి విజ్ఞప్తి చేశారు.

బైక్‌ను ఢీకొన్న టెంపో, మహిళ మృతి

తుమకూరు: టెంపో బైక్‌ను ఢీకొనడంతో మహిళ మృతి చెందగా యువకుడు గాయపడిన ఘటన తుమకూరు జిల్లా కుణిగల్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. మృతురాలిని మంజుల (47)గా గుర్తించారు. గాయపడిన ఆమె కుమారుడు కిరణ్ (24)ను ఆస్పత్రికి తరలించారు. కుణిగల్ తాలూకా హేరూరు వంతెన వద్ద తల్లి కుమారుడు బైక్‌పై వస్తుండగా వెనుకనే వేగంగా వచ్చిన టెంపో ఢీకొంది. దీంతో మంజుల రోడ్డుపై పడి తీవ్ర గాయాలతో మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కృష్ణరాజపురం: అనేక సమస్యలు, సవాళ్ల మధ్య విమానాశ్రయం రోడ్డు కారిడార్ జాతీయ రహదారి 35 అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని మహాదేవపుర ఎమ్మెల్యే మంజుల లింబావలి అన్నారు. నియోజకవర్గంలోని విమానాశ్రయం కారిడార్ ఎన్‌హెచ్ 35 రోడ్డు వెడల్పు, అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, ఇప్పటికే మాజీ మంత్రి లింబావలి కేఆర్‌డీసీఎల్, బీబీఎంపీ, బెస్కాం, జలమండలి అధికారులతో సమావేశం నిర్వహించారని తెలిపారు.

హోసూరు వార్తలు..

తారురోడ్డు పనులకు భూమిపూజ

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని ఆచుబాళం గ్రామ పంచాయతీ ప్రజల చిరకాల కోరికను తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ తీర్చారు. తళి సమీపంలోని అటవీ ప్రాంత గ్రామమైన ఆచుబాళం గ్రామపంచాయతీలోని గ్రామాలకు తారురోడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తూ వచ్చారు. అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆచుబాలం గ్రామపంచాయతీలోని ఏడు గ్రామాలకు సరైన రోడ్ల వసతులు లేవని, ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తారురోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయడంతో స్పందించిన ఆయన సంబంధిత శాఖాధికారులతో చర్చించి రూ. 3.33 కోట్ల నిధులను మంజూరు చేయించారు. దీంతో సోమవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.



బంగారం పంపిణీ

హోసూరు: క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ఫిర్యాదుల స్వీకారంలో తాగునీరు, రోడ్ల వసతి, మురుగు కాల్వల ఏర్పాటు, వీధి దీపాలు, వృద్ధాప్య పెన్షన్, ఉచిత కుట్టు యంత్రాలు, ఇళ్ల పట్టాలు అందజేయాలని కోరుతూ 248 మంది వినతులను అందజేశారు. ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్ శరయు పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అంగవికల సంక్షేమ శాఖ ద్వారా తొమ్మిది మంది లబ్ధిదారులకు తలా రూ. 45 వేలు విలువచేసే 8 గ్రాముల బంగారాన్ని పెళ్లి సహాయంగా అందజేశారు. డీఆర్‌వో సాధన కురల్, అధికార్లు పన్నీర్‌సెల్వం, సుందరరాజ్, పద్మలత, మురుగేషన్, దాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

బైకిస్టు దుర్మరణం

- ముగ్గురికి గాయాలు


మృతుడు వెంకటపతి (ఫైల్)

క్రిష్ణగిరి: ద్విచక్ర వాహనంలో వెళ్తూ దుకాణం ముందు నిలిచి ఉన్న వ్యక్తులను ఢీకొన్న ప్రమాదంలో వాహనదారుడు తీవ్ర గాయాలతో మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... సూళగిరి వాణియర్ వీధికి చెందిన వెంకటపతి (21) ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంలో హోసూరు వైపు వెళ్తూ ఒమిదేపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన బైక్ అదుపుతప్పి ఓ దుకాణం ముందు నిలిచి ఉన్న వ్యక్తులను ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న వెంకటపతి తీవ్రంగా గాయపడి ఘటన స్థలంలనే మృతి చెందగా సూళగిరికి చెందిన సహాయం (21), భోగీపురంకు చెందిన శేఖర్ (23), పూవరసన్ (20)లు గాయపడ్డారు. వీరిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

పథకాలపై ఫొటో ప్రదర్శన

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా కావేరిపట్టణం సమీపంలోని సుండేకుప్పం పంచాయతీ మణినగర్ ప్రాంతంలో సోమవారం ప్రజా సంబంధ శాఖ ఫొటో ప్రదర్శనను ఏర్పాటు చేసింది. తమిళనాడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు రకాల సంక్షేమ పథకాల ఫొటోలను ఇందులో ప్రదర్శించారు. సుండేకుప్పం, చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన 500 మందికిపైగా తిలకించారు.

డ్రైనేజీలో పడి కూలీ మృతి

హోసూరు: మురుగు కాల్వలో పడి బిహార్ కార్మికుడు మృతి చెందిన ఘటన హడ్కోలో జరిగింది. వివరాల మేరకు సంజయ్‌రామ్ (41), హోసూరు – బాగలూరు రోడ్డులోని బృందావన్‌నగర్‌లో నివాసముంటూ కూలి పనులు చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం అదే ప్రాంతంలోని మురుగుకాల్వలో పడి శవంగా కనిపించాడు. గమనించిన స్థానికులు హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేయగా చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో జారి పడి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కరెంటు షాక్‌తో కార్మికుడు..

హోసూరు: భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుడు విద్యుత్ తీగ తగిలి మృతి చెందిన ఘటన సిఫ్‌కాట్‌లో చోటు చేసుకొంది. వివరాల మేరకు హోసూరు పారిశ్రామికవాడ జూజువాడి జైభీమ్ నగర్‌కు చెందిన క్రిష్ణన్ (51). ఆదివారం చిన్నయలసగిరి ప్రాంతంలో భవననిర్మాణ పనులు నిర్వహిస్తుండగా ఆకస్మాత్తుగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్ర గాయాలేర్పడి ఘటనా స్థలంలో చనిపోయాడు. సిఫ్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మిత్రుల గొడవ

- ఎయిర్ పిస్తోల్‌తో బెదిరింపు

శివమొగ్గ: శివమొగ్గ జిల్లా సాగర పట్టణంలో ఇద్దరి స్నేహితుల మధ్య గొడవ జరిగింది. ఓ స్నేహితుడు పిస్తోల్‌తో బెదిరించాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం, మాధ్యమాల్లో రావడంతో పోలీసులు రంగంలోకి దిగి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఎయిర్ పిస్తోల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... సాగర పట్టణంలోని జేసీ రోడ్డులో ఉంటున్న దర్శన్ (19), నవీన్ (25) స్నేహితులు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో వారి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. ఈ కారణంతో దర్శన్ తన వద్ద ఉన్న పిస్తోల్ తీసుకుని నవీన్‌ను బెదిరించాడు. బెదిరింపులు చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పట్టణ పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పిస్తోల్‌ను పరిశీలించగా అది ఎయిర్ పిస్తోల్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



టీడీపీ కోసం ఇదేనా మీ పెట్టుబడి సాయం!

పెట్టుబడి సాయం గాలికొదిలేశారంటూ రామోజీ రోత రాజకీయం

- కరువు, మిచాంగ్ పెట్టుబడి సాయం పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు
- ఈ నెలాఖరులో చెల్లిస్తామని బడ్జెట్‌లో ప్రస్తావన
- అయినా బాబుకు మేలు చేయాలని ఈనాడు దుష్ప్రచారం



సాక్షి, అమరావతి: ప్రకృతి వైపరీత్యాల వేళ పంట నష్టపరిహారంతో సీఎం వైఎస్ జగన్ సర్కారు రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుంటే ఈనాడు పత్రిక మాత్రం బురద జల్లడమే పనిగా పెట్టుకుంది. కరువుతోపాటు మిచాంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు సీజన్ ముగియకుండానే ఇన్‌పుట్ సబ్సిడీ (పంట నష్టపరిహారం) జమ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క ఏర్పాట్లు చేస్తుంటే.. ఈనాడు మాత్రం 'సంక్రాంతి పోయింది.. సెట్టింగులూ తీసేశారు..!'అంటూ వ్యంగ్యంగా రైతులను తప్పుదోవ పట్టించేలా తన ఆక్రోశాన్ని వెళ్లగక్కుతూ విషం కక్కింది.

ఆరోపణ: ఖరీఫ్‌లో 31 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు

వాస్తవం దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులు ఖరీఫ్‌తో పాటు ప్రస్తుత రబీ సీజన్‌లోను కొనసాగుతున్నాయి. ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 84.94 లక్షల ఎకరాలు కాగా 63.46లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. వర్షాభావ పరిస్థితుల వలన 21.48 లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. పూర్తి స్థాయి గణాంకాలతో ఎన్నిసార్లు అధికారులు వివరణ ఇచ్చినా... ఈనాడు మాత్రం పదేపదే 31 లక్షల ఎకరాల్లో పంటలు సాగవలేదంటూ అబద్ధాలు అచ్చేస్తూనే ఉంది. 6 ప్రామాణికాలు (వర్షపాతం, పంట విత్తిన విస్తీర్ణం, ఉపగ్రహ ఆధారిత పంటల పరిస్థితి, జల ప్రవాహం, భూగర్భజలాలు, జలాశయాల స్థాయిలు) ఆధారంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 7 జిల్లాల్లో 103 కరువు మండలాలుగా గుర్తించారు. బెట్ట పరిస్థితుల వల్ల 14.07 లక్షల ఎకరాలలో 33 శాతం కన్నా ఎక్కువ శాతం పంట నష్టపోయిన 6.96 లక్షల మంది రైతులకు రూ.847.27 కోట్ల పెట్టుబడి రాయితీ చెల్లించాలని లెక్క తేల్చారు. రబీ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో సాధారణ విస్తీర్ణం 55.28 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటికే 39.15 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. వరి సాధారణ విస్తీర్ణం 19.53 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటికే 12.62 లక్షల ఎకరాల్లో సాగైంది. రబీలో 35 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయని, వరి 11.40 లక్షల ఎకరాలలో మాత్రమే సాగైందంటూ ఈనాడు అబద్ధాలు అచ్చేసింది.

ఆరోపణ: మిచాంగ్ వల్ల 20 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం

వాస్తవం రబీ సీజన్ ప్రారంభంలో విరుచుకుపడిన మిచాంగ్ తుఫాన్ వల్ల 22 జిల్లాల్లో 6.56 లక్షల ఎకరాల్లో 33 శాతం కన్నా ఎక్కువ శాతం పంట నష్టపోయిన 4.61 లక్షల రైతులకు రూ.442.35 కోట్లు పెట్టుబడి రాయితీ చెల్లించాలని లెక్క తేల్చారు. ఈ విషయం ఎన్నిసార్లు చెప్పినా ఈనాడు పట్టించుకోకుండా తుఫాన్ వల్ల 20 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అడ్డగోలుగా అబద్ధాలు అచ్చేస్తూనే ఉంది. గత 57 నెలలుగా వైపరీత్యాలు సంభవించిన ప్రతీసారి ఆ సీజన్ చివరలో పరిహారం ఇస్తున్నారు. ఇలా ఇంతవరకు 22.85 లక్షల మంది రైతులకు రూ.1,976.44 కోట్ల పెట్టుబడి రాయితీని అందించింది.

ఆరోపణ: ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపు గాలికొదిలేశారు

వాస్తవం ఖరీఫ్‌లో కరువు, రబీలో మిచాంగ్ తుఫాన్ వల్ల 20.63 లక్షల ఎకరాలలో పంటలు నష్టపోయిన 11.57 లక్షల మంది రైతులకు అంచనా వేసిన రూ.1,289.38 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని సీజన్ చివర్లో నేరుగా రైతుల ఖాతాలో జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల్లో కూడా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఈ నెలాఖరులోనే ఇన్‌పుట్ సబ్సిడీ పరిహారం చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టుగా అధికారికంగా ప్రకటించారు. అయినా సరే ఇవేమీ ఈనాడుకు పట్టదు. ఎందుకంటే ఎన్నికల సమయంలో ప్రభుత్వంపై బురద జల్లుతూ రైతులను గందరగోళ పరిచేలా విషంకక్కడమే పనిగా పెట్టుకుంది.

నారాయణ లైంగికంగా వేధిస్తున్నారు

- మాజీ మంత్రి నారాయణపై ఆయన మరదలు పోలీసులకు ఫిర్యాదు
- తన ప్రాణాలకు రక్షణ కల్పించాలని ఎస్పీకి విజ్ఞప్తి
- ఎస్పీని కలవనివ్వకుండా అడ్డుపడిన భర్త, కుటుంబసభ్యులు
- మీడియాతోనూ మాట్లాడనివ్వకుండా ఆటంకాలు


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న పొంగూరు ప్రియ


సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'మాజీ మంత్రి పొంగూరు నారాయణ నన్ను నిత్యం వేధింపులకు గురిచేసేవాడు. నారాయణతోపాటు నా భర్త సుబ్రహ్మణ్యం, అల్లుడు పునీత్‌ల నుంచి నాకు ప్రాణహాని ఉంది. రక్షణ కల్పించండి' అంటూ పొంగూరు కృష్ణప్రియ అలియాస్ ప్రియ సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ తగిన చర్యలు తీసుకోవాలని నెల్లూరు నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. సుమారు 29 ఏళ్ల క్రితం పొంగూరు సుబ్రహ్మణ్యం అలియాస్ మణితో తనకు వివాహమైందని, నాటి నుంచే బావ నారాయణ తనను లైంగికంగా వేధిస్తూనే ఉన్నాడని కృష్ణప్రియ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన స్త్రీ లోలుడని, ఎంతో మంది మహిళల జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. ఆయన నెల్లూరులోని హరనాథపురంలో ఉన్న సమయంలో తనను అనేక రకాలుగా హింసించేవాడని, అన్నం పెట్టుకుని తన గదికి రమ్మని చెప్పేవాడని, వెళ్లనందుకు తనను కొట్టేవాడని తెలిపారు. ఈ విషయాన్ని భర్తకు చెబితే బావ మాటే వినమని చెప్పేవాడని తెలిపారు. తన అత్త పేరుపై ఉన్న ఇంటిని సైతం నారాయణ తన పేరుపై మార్పు చేసుకుని ఆమె పట్ల దురుసుగా ప్రవర్తించేవాడని, ఇదే విషయాన్ని పలుమార్లు అత్త తన వద్ద బాధపడిందని ప్రియ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన చేష్టలు భరించలేక గతంలో హైదరాబాద్ రాయదుర్గం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అప్పటి నుంచి వేధింపులు మరింత అధికమయ్యాయని వాపోయారు. పరువు కాపాడుకోవడం కోసం నారాయణ తనకు మానసిక సమస్యలున్నాయనే తప్పుడు ప్రచారానికి తెరలేపారని ప్రియ పేర్కొన్నారు. తాను మానసికంగా దృఢంగా ఉన్నానని తెలిపారు. తనకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చిందని, ప్రస్తుతం కోలుకుంటున్నానని.. అయినా నారాయణ తనను వేధిస్తూనే ఉన్నారన్నారు. అమరావతి అసైన్డ్ భూముల విషయంలోనూ తన వద్ద పక్కా ఆధారాలున్నాయని, అవసరమైతే పోలీసులకు ఇస్తానని ఫిర్యాదులో తెలిపారు.

అడుగడుగునా అడ్డంకులు

కృష్ణప్రియ తాను ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేసేందుకు వెళ్లనివ్వకుండా ఆమె భర్త, కుటుంబ సభ్యులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. రోడ్డుపైనే అడుకుని ఆమెను తమ వెంట తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయినా ఆమె తప్పించుకుని ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతుండగా భర్త అడ్డుతగిలారు. అయినా తన బావ, భర్త, అల్లుడు చేష్టలను మీడియాకు వివరించారు. కాగా, ఆమె భర్త మీడియాతో మాట్లాడుతూ తన భార్య మానసిక పరిస్థితి బాగా లేదని, ఆమె ఆరోపణలన్నీ అవాస్తవమన్నారు.

టీడీపీలో టికెట్ల బేరం!

- జోనల్ కమిటీలా అభ్యర్థుల్ని నిర్ణయించేది?
- బీద రవిచంద్ర, కిలారు రాజేష్‌లకు ఇక్కడి పరిస్థితులు తెలుసా?
- టికెట్ విషయంలో చర్చించేందుకు హైదరాబాద్‌కు పిలవడమేంటి?
- పోటీలో ఎక్కువ మంది ఉన్నారంటూ రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు అడుగుతున్నారు
- డబ్బులివ్వకుంటే రాబిన్‌శర్మ రిపోర్టు నెగిటివ్ అని పక్కన పెడుతున్నారు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో కట్టలు తెంచుకుంటున్న టీడీపీ నేతల ఆక్రోశం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో తెలుగుదేశం పార్టీ నేతలు అధిష్టానం తీరుపై కుతకుత ఉడికిపోతున్నారు. అధికార పార్టీ దూకుడు మీద ఉండగా.. టీడీపీ అసలు అభ్యర్థులనే ప్రకటించకుండా జాప్యం చేస్తుండడంపై ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండగా.. ఒకవైపు పొత్తులు, మరోవైపు కమిటీల పేరుతో ఎంతో కాలంగా పనిచేసిన లీడర్లను కూడా హీనంగా చూస్తున్నారని టీడీపీ నేతలు వాపోతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పోటీలో ఎక్కువ మంది అభ్యర్థులు ఉన్నారంటూ ఎక్కువ డబ్బు డిమాండు చేయడం గతంలో ఎప్పుడూ చూడలేదని ఒక సీనియర్ నేత వ్యాఖ్యానించారు.

మమ్మల్ని నిర్ణయించేది జోనల్ కమిటీనా?

తెలుగుదేశం పార్టీలో ఇటీవలే జోనల్ కమిటీని వేశారు. రాయలసీమకు సంబంధించిన ఈ జోనల్ కమిటీలో బీద రవిచంద్రయాదవ్, కిలారి రాజేష్ ఉన్నారు. వీళ్లిద్దరి పెత్తనం ఎక్కువైందనేది ఇక్కడి నేతల ఆవేదన. చీటికి మాటికి హైదరాబాద్ పిలుస్తున్నారని, అక్కడికి వెళితే 'మీ నియోజకవర్గంలో పోటీ ఎక్కువగా ఉంది. మీరు చెబుతున్న డబ్బుకైతే మీకు టికెట్ ఇవ్వడం కష్టం' అని చెబుతున్నారని అంటున్నారు. ఇద్దరు అభ్యర్థులను ఒక్కొక్కరి చొప్పున (వన్ టూ వన్) పిలిచి డబ్బులు అడుగుతున్నారని, టికెట్ కోసం రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు ఇవ్వడానికి ఇన్నేళ్లు జెండా మోయడం దేనికని మండిపడుతున్నారు.

రాబిన్ శర్మ రిపోర్టులంటూ..

ప్రస్తుతం టీడీపీ వ్యూహకర్తగా పనిచేస్తున్న రాబిన్‌శర్మ వ్యవహారం తీవ్ర విమర్శలకు తావిస్తున్నట్టు ఆ పార్టీ నేతలు అంటున్నారు. ప్రతి ఒక్కరినీ పిలిచి, మీకు రిపోర్టులు నెగిటివ్‌గా ఉన్నాయని చెబుతున్నారని, ఈ రిపోర్టులను ఆధారం చేసుకుని జోనల్ కమిటీ మెంబర్లు డబ్బులు అడుగుతున్నట్టు నేతలు వాపోతున్నారు. ఎవరికైతే టికెట్ ఇవ్వకూడదనే ఆలోచన ఉందో వారికి సంబంధించి రాబిన్ శర్మ రిపోర్టు నెగిటివ్‌గా ఉందని చెబుతున్నారని, డబ్బులిచ్చిన వారికి రిపోర్టు బాగుందని అంటున్నారంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

టూమెన్ కమిటీ ఇంకెన్నాళ్లు?

ఉమ్మడి అనంతపురం జిల్లాలో శింగనమల, మడకశిర రెండూ రిజర్వుడు నియోజకవర్గాలు. శింగనమలలో ఇద్దరు ఓసీ నేతలతో టూమెన్ కమిటీ వేశారు. ఇక్కడ ఈ ఇద్దరిదే పెత్తనం. మడకశిరలోనూ అంతే. మైనింగ్ మాఫియాగా ఉన్న గుండుమల తిప్పేస్వామి అక్కడ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఆయన చెప్పిందే వేదమని, ఎస్సీలను డమ్మీ చేశారని టీడీపీ ఎస్సీ నేతలు ఆరోపిస్తున్నారు. కాలపరిమితి లేని కమిటీగా వ్యవహరిస్తున్నారని, తమను వీరినుంచి విముక్తి చేయాలని వారు కోరుతున్నారు.

పేదల ఇళ్లపై కుళ్లు రాతలేలా?

పేదలకు మేలు జరుగుతుంటే రామోజీ ఓర్వలేనితనం

- దేశ చరిత్రలోనే తొలిసారి పేదల ఇళ్లకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్
- ఇప్పటికే 8 లక్షల మంది స్వయంగా వచ్చి రిజిస్ట్రేషన్లు
- రాష్ట్రంలో 17 వేల లేఅవుట్లలో 30.61 లక్షల మందికి నివాసాలు
- ఒక్కో లేఅవుట్ ఒక్కో ఊరిగా తయారైంది
- ప్లాట్ గుర్తింపునకు జియో ట్యాగ్
- కళ్లముందు వాస్తవాలు కనిపిస్తున్నా.. లేదులేదంటూ రామోజీ దుష్ప్రచారం



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఒకేసారి 30 లక్షల మందికిపైగా పేదలకు ఇళ్ల స్థలాలను అప్పగించడం... వాటికి ఇప్పుడు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేస్తుండడం పెత్తందారు రామోజీరావుకు మింగుడు పడటంలేదు. నిరుపేదలు సొంతింట్లో ఉండటాన్ని జీర్ణించుకోలేక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై తన వంకర రాతలతో బురదజల్లి అలిసిపోయాడు. ఇక మిగిలిందల్లా ఆ ఇళ్ల స్థలాలకు ఇప్పుడు రిజిస్ట్రేషన్లు చేస్తుండడాన్ని కూడా మాయాజాలమంటూ తప్పుడు రోత రాతలు రాస్తోంది. దేశ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో 30 లక్షలకు పైగా పక్కా ఇళ్ల నిర్మాణం చేపడుతూ నిరుపేదల సొంతింటి కలను సీఎం జగన్ సాకారం చేస్తుండడాన్ని, ఆ ఇళ్లను ఒక విలువైన ఆస్తిగా పేదలకు ఇచ్చేందుకు రిజిస్ట్రేషన్ చేయడాన్ని తప్పు పడుతూ ప్రజలను, నిరుపేదలు ఆందోళన చెందేలా ప్రయత్నాలు చేస్తోంది. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు'పథకం కింద వైఎస్సార్, జగనన్న కాలనీల రూపంలో ఏకంగా 17,005 ఊళ్లను కొత్తగా నిర్మించడం వారి కళ్లకు కనిపించడంలేదు. ఒక్కో కాలనీ ఒక్కో ఊరుగా మారుతున్నా ఆ పత్రికకు కనిపించదు. ఒక్కో పేదింటి అక్కచెల్లెమ్మ పేరిట ఇంటి రూపంలో రూ.20 లక్షల వరకూ విలువైన స్థిరాస్తి సమకూరుస్తుంటే ఈనాడుకు ముచ్చెమటలు పడుతున్నాయి. పేదలకు ఇంత పెద్దమేలు జరుగుతుండడం ద్వారా వైఎస్సార్‌సీపీకి ఆదరణ పెరుగుతుండడం.. అదే సమయంలో చంద్రబాబుకు రాజకీయ భవిష్యత్తు కనుచూపు మేరలో కనిపించకపోవడంతో రామోజీరావు గంగవెర్రిలెత్తిపోతున్నారు. దీంతో ఏదో రకంగా బాబుకు మేలు చేయాలని దింపుడు కళ్లెం ఆశతో వైసీపీ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సేవలపైనా నిత్యం వక్రీకరించడమే విధిగా పెట్టుకున్నారు.

జియో ట్యాగ్ ఉంటే ప్లాట్లు గుర్తించడం కష్టమెలా అవుతుంది?

ప్లాట్ ఎక్కడ ఉందో గుర్తించలేని స్థితిలో లబ్ధిదారులు ఉన్నారనడం పచ్చి అబద్ధం. ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పుడే ప్లాట్లు విభజన చేసి సరిహద్దు రాళ్లు వేశారు. లబ్ధిదారులను వారి ప్లాట్లలో ఫోటోలు తీసుకుని జియోట్యాగ్ కూడా చేశారు. ప్లాటులో నిలబడి ఫోటో దిగడం ద్వారా లబ్ధిదారులకు వారి ప్లాటు ఎక్కడ ఉందో తెలుసు. 'పచ్చ'పాతంతో చూసే ఈనాడుకు ఇవేమీ కనిపించవు. కేటాయించిన ప్లాట్‌లో ఫోటో దిగి జియో ట్యాగ్ చేయడమంటే వారి ప్లాట్ ఎక్కడ ఉందో తెలుసనే కదా? ఇది పేదలను బురిడీ కొట్టించే పన్నాగం ఎలా అవుతుంది..? గుంటూరు జిల్లాలో పేరేచర్ల లేఅవుట్‌లో 9,219 ఇళ్లను మంజూరు చేశారు. ఇంకా 6,152 ఇళ్ళకు సంబంధించి రెండవ విడత గృహ నిర్మాణ కార్యక్రమంలో ఇళ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే మంజూరైన ఇళ్లలో 1,230 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, 486 రూఫ్ స్థాయిలోనూ, మిగతావి బేస్‌మెంట్ స్థాయిలోనూ ఉన్నాయి. మూడవ ఆప్షన్ కింద ఇళ్ల నిర్మాణానికి పదిమంది కాంట్రాక్టర్లను నియమించి, మూడు ఇటుక తయారీ కేంద్రాలను సైతం ఏర్పాటు చేశారు. ఈ లేఅవుట్‌లో ప్రతిరోజు సుమారు వెయ్యి మంది కార్మికులు పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ వాస్తవాలను చూడని ఈనాడు ప్రభుత్వంపై ఆక్రోశంతో విషం చిమ్ముతూ తన దిగజారుడుతనానికి ప్రదర్శించుకుంటోంది.

రిజిస్ట్రేషన్ చేయడం మాయాజాలమా?

పేదలందరికీ స్థలంతో పాటు ఇల్లు కూడా కట్టించి ఇస్తామని హామీ ఇచ్చిన వైఎస్ జగన్ 31 లక్షల 19 వేల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అందులో 22 లక్షల ఇళ్లు మంజూరు చేసి, నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను రిజిస్ట్రేషన్ చేయడం వల్ల బ్యాంకుల్లో తక్కువ వడ్డీకి రుణం తెచ్చుకునే సౌలభ్యం ఏర్పడుతుంది. ప్రభుత్వమే ఆయా రిజిస్ట్రేషన్లను చేస్తుంది కాబట్టి బ్యాంకులు రుణం మంజూరు చేస్తాయి. డాక్యుమెంట్ రిజిస్టర్ అయి ఉంటుంది కాబట్టి డేటా బేస్‌లో ఆ వివరాలన్నీ పదిలంగా ఉంటాయి. ఎప్పుడంటే అప్పుడు సర్టిఫైడ్ కాపీ పొందడానికి అవకాశం ఉంటుంది. ఫోర్జరీ చేస్తారని గానీ, ట్యాంపర్ చేస్తారని గాని భయం ఉండదు. అమ్మే సమయంలో ఆ డాక్యుమెంట్ ఉంటే సరిపోతుంది. ఎటువంటి లింకు డాక్యుమెంట్లు అవసరం లేదు. నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. పేదలకు లబ్ధి చేకూరే రిజిస్ట్రేషన్ మాయాజాలం అవుతుందా? ఇప్పటికే 8 లక్షల మంది లబ్ధిదారులు తమ పేరున పట్టాలను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మొదటి దశలో కృష్ణాజిల్లా కంకిపాడు మండలం గొడవర్రులో మొదటి దశ ఒకటవ లేఅవుట్‌లో 53 ఎకరాల 33 సెంట్లు 345 మంది లబ్ధిదారులకు, రెండో లేఅవుట్‌లో 29 ఎకరాల 66 సెంట్లు భూమిలో 777 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రైవేట్ అధీనంలో ఉన్న భూమిని రూ.43.93 కోట్లతో కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన భూమిని విజయవాడ మున్సిపల్ అధికారులకు లేఅవుట్ అభివృద్ధి కోసం అప్పగించారు.

అమలాపురం సీటు కోసం సిగపట్లు

సాక్షి, అమలాపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం అసెంబ్లీ బరిలో ఈసారి టీడీపీకి అవకాశం లేదనే ప్రచారం బలంగా జరుగుతోంది. ఇక్కడ నుంచి జనసేన పోటీ చేస్తుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే అంశంపై జనసేన పార్లమెంటరీ ఇన్‌చార్జి శేఖర్‌తోపాటు, మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ల నాగ సతీష్ ఆదివారం పవన్ కళ్యాణ్‌ను కలిశారు. అమలాపురం ఆత్మగౌరవానికి సంబంధించిందని వదులుకోవద్దని ఆయనకు స్పష్టం చేసినట్టు సమాచారం. అయితే సీటును జనసేనకు ఇవ్వడాన్ని టీడీపీ నేత ఆనందరావు వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. టీడీపీ నేతలు వాసంశెట్టి సుభాష్, గంధం పల్లంరాజు పేరుతో ఆనందరావుకు మద్దతుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. సుభాష్, పల్లంరాజులు కోనసీమకు అంబేడ్కర్ పేరును ప్రభుత్వం పెట్టిన సమయంలో జరిగిన అల్లర్లలో నిందితులుగా ఉన్నారని, వారి పేరిట ప్రచారం చేపడితే ఉన్న కాస్త అవకాశాలనూ కోల్పోతామని టీడీపీ క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.

కేసులు ఉంటేనే పదవులిస్తాం

- శంఖారావం యాత్రలో నారా లోకేశ్


శ్రీకాకుళంలో లోకేశ్ ప్రసంగిస్తుండగానే వెళ్లిపోతున్న మహిళలు

నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస రూరల్: గత నాలుగున్నరేళ్లలో ఎవరిపై పెద్దపెద్ద కేసులు నమోదు అయ్యాయో వారిని గుర్తించి పదవులు ఇచ్చే బాధ్యత తనదేనని టీడీపీ నేత నారా లోకేశ్ అన్నారు. రెండవ రోజు శంఖారావం యాత్రలో భాగంగా సోమవారం నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలసలో నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. రెడ్ డైరీలో ఉన్నవాళ్లను టీడీపీ ప్రభుత్వం వచ్చాక శిక్షిస్తానని మరోసారి తన ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. చంద్రబాబును 53రోజులపాటు పెట్టిన జైలు బ్యారక్, ఆయనతో తాము ములాఖత్ అయిన గది చంద్రబాబు హయాంలో కట్టినవేనని గుర్తుచేశారు. రెండు నెలల్లో తాడేపల్లి గేట్లు బద్దలుగొడతామన్నారు. కాగా, నరసన్నపేటలో టీడీపీ అభ్యర్థిగా తన పేరును లోకేశ్ ప్రకటిస్తారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తి ఆశపడి భంగపడ్డారు. మరోపక్క శ్రీకాకుళంతోపాటు అన్ని సభల్లోనూ లోకేశ్ మాట్లాడుతుండగానే మహిళలు వెళ్లిపోవడం కనిపించింది.

పొత్తుల కోసం చంద్రబాబు వెంపర్లాట


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన పరిరక్షణ సమితి నేతలు

1,233వ రోజు రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : మూడు రాజధానుల అంశం యావత్ రాష్ట్ర ప్రజల మనసులో ఆలోచన రేకెత్తించిందని, ఒక రాజధాని, మూడు రాజధానుల అజెండాతోనే ఎన్నికలు జరగనున్నాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు చెప్పారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 1,233వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ అవినీతి సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుని తరతరాలు ఈ ప్రాంతంలో తిష్టవేయాలని కొంతమంది కులవాదులు చేసిన యత్నాలు బెడిసి కొట్టడంతో అక్కసుతో బహుజనులకు సంక్షేమం అందకుండా తప్పుడు కేసులు వేసి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. చంద్రబాబు పొత్తుల కోసం వెంపర్లాడుతూ ఢిల్లీ పెద్దల కాళ్లు పట్టుకుంటున్నారని, జనసేన వారాహి ఎక్కడ ఆగిపోయిందో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఏం మేలు చేస్తామో చెప్పకుండా ప్రభుత్వ పథకాలను అడ్డుకుంటూ తప్పుడు కేసులతో శునకానందం పొందుతున్న బాబు అండ్ కోకు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలుగన్న బహుజన రాజ్యాధికారం సాధించే దిశగా సీఎం జగన్ ముందుకెళుతున్నారని, త్వరలో తమ ఆశయాలు సాధించి తీరుతామని స్పష్టంచేశారు. షర్మిల ఎల్లో మీడియా ఇచ్చిన స్క్రిప్టును చదవడం మానేసి ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తే మేలని హితవుపలికారు. బహుజన పరిరక్షణ సమితి నేతలు పులి దాసు, ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, బూదాల సలోమీ, బూదాల సామ్యు, బొలిమేర శ్యామ్యూల్, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి పలువురు దళిత నేతలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం జిల్లాకు ఏం మంచి చేశారు లోకేశ్!

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సూటి ప్రశ్న
- లోకేశ్‌ను నమ్మిన క్యాడర్ నాశనమే: ఆకుల వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్, పక్కన ఆకుల వెంకటేశ్వరరావు

టెక్కలి: టీడీపీ హయాంలో శ్రీకాకుళం జిల్లాకు ఏం మంచి చేశారని లోకేశ్ ఇక్కడ పర్యటిస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సూటిగా ప్రశ్నించారు. రెడ్‌బుక్ చేతపట్టుకుని బెదిరింపులు, కక్ష సాధింపులు తప్ప లోకేశ్‌కు ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన లేదని ఆయన మండిపడ్డారు. ఈసారి టెక్కలిలో అచ్చెన్నాయుడును చిత్తుగా ఓడిస్తామని చెప్పారు. టీడీపీకి చెందిన ఆకుల వెంకటేశ్వరరావుతో కలిసి దువ్వాడ శ్రీనివాస్ సోమవారం టెక్కలిలో మీడియాతో మాట్లాడుతూ 70 ఏళ్లుగా తమ ప్రాంతంలో కలగా ఉన్న పోర్టును సీఎం వైఎస్ జగన్ సాకారం చేశారని తెలిపారు. టీడీపీ పాలనలో పోర్టు పేరుతో 15వేల ఎకరాలు దోచుకునే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. టీడీపీ పాలనలో ఆఫ్‌షోర్ నిర్మాణం పేరుతో కాలయాపన చేశారని, వైఎస్సార్‌సీపీ పాలనలో ఆఫ్‌షోర్ పూర్తి చేయడానికి రూ.850 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లా అభివృద్ధికి రూ.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించాలని కేంద్రం కోరితే, ఎంపీ రామ్మోహన్‌నాయుడు రూ.18 కోట్లకే ప్రతిపాదనలు పంపారన్నారు.

నా ముందే లోకేశ్‌ను అచ్చెన్న తిట్టారు: ఆకుల వెంకటేశ్వరరావు

నారా లోకేశ్‌ను నమ్ముకున్న క్యాడర్ సర్వనాశనమైపోతోందని, టీడీపీలో 33 ఏళ్లు పనిచేసిన తాను తీవ్రంగా మోసపోయానని ఆకుల వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తంచేశారు. లోకేశ్ వల్ల పార్టీ సంకనాకిపోతుందని తన ఎదుటే తీవ్రంగా దూషించిన అచ్చెన్నాయుడు, ఇవాళ ఏం ముఖం పెట్టుకుని లోకేశ్‌ను జిల్లాకు తీసుకువచ్చారని ఆయన ప్రశ్నించారు. టీడీపీ, చంద్రబాబు కోసం సుమారు 33 ఏళ్లు తన జీవితాన్ని అంకితం చేశానని, అయితే తనను తీవ్రంగా నష్టపరచి తన కుటుంబాన్ని నడిరోడ్డుకు ఈడ్చారని వెంకటేశ్వరరావు వాపోయారు. చంద్రబాబు, లోకేశ్‌లు సీనియర్, జూనియర్ ఎన్టీఆర్ కుటుంబాలకు వెన్నుపోటు పొడిచారన్నారు. టీడీపీ కార్యకర్తలు తనలా అత్యుత్సాహం ప్రదర్శించి నష్టపోవద్దని విజ్ఞప్తి చేశారు. తనకు జరిగిన అన్యాయంపై ఎంపీ రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకువెళితే... న్యాయం చేస్తానని చెప్పి ముఖం చాటేశారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ పతనానికి, శ్రీకాకుళం జిల్లాలో బాబాయ్, అబ్బాయ్ ఓటమి కోసం పనిచేస్తానని వెంకటేశ్వరరావు చెప్పారు.

బీసీలకు సీటివ్వడం 'లావు'కు నచ్చలేదు

- లావు శ్రీకృష్ణదేవరాయలను గుంటూరు వెళ్లాలని సీఎం జగన్ చెప్పారు
- కానీ బలహీనవర్గాలకు అవకాశమివ్వడం ఇష్టం లేక లావు శ్రీకృష్ణ పార్టీనే వీడారు
- అలాంటి వ్యక్తి అవసరమా.. అనే విషయాన్ని పల్నాడు ప్రజలు ఆలోచించాలి
- మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, నరసరావుపేట: నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి బడుగు, బలహీనవర్గాలకు అవకాశమిద్దామంటే.. అది నచ్చని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఏకంగా వైఎస్సార్‌సీపీని వదిలి వెళ్లిపోయారని మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. నరసరావుపేటలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నరసరావుపేట ఎంపీగా ఇప్పటివరకు బీసీలకు అవకాశం లభించలేదు. ఆ దిశగా ఏ ప్రధాన పార్టీ కూడా ఆలోచించలేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సోషల్ ఇంజనీరింగ్‌లో భాగంగా కీలక పదవులివ్వాలన్న ఆశయంతో పనిచేస్తున్న సీఎం జగన్.. ఈసారి నరసరావుపేట లోక్‌సభ స్థానాన్ని బీసీలకు కేటాయించారు. లావు శ్రీకృష్ణదేవరాయలను గుంటూరు నుంచి పోటీ చేయాలని సీఎం జగన్ సూచించారు. కానీ నరసరావుపేట స్థానాన్ని బీసీలకు కేటాయించడం ఇష్టం లేక లావు శ్రీకృష్ణదేవరాయలు వైఎస్సార్‌సీపీనే వదిలేశారు. ఇలాంటి వ్యక్తి బీసీ ద్రోహి కాదా? ఇలాంటి వ్యక్తి పల్నాడుకు అవసరమా? ఒక బీసీకి సీటు ఇస్తే ఇంత కడుపు మంట ఎందుకో అర్థం కావడం లేదు. ఇలాంటి వారికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలి' అని మంత్రి అంబటి సూచించారు. విద్యావంతుడు, రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనిల్‌కుమార్‌యాదవ్‌ను నరసరావుపేట నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున అఖండ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ నెల 14న నరసరావుపేటలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని.. దాన్ని విజయవంతం చేయాలని ప్రజలను, పార్టీ శ్రేణులను మంత్రి కోరారు.

అయోమయంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు..

వైఎస్సార్‌సీపీ 175 శాసనసభ నియోజకవర్గాలు, 25 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసి గెలిచేందుకు సిద్ధంగా ఉంటే.. ప్రతిపక్ష పార్టీలు తీవ్ర గందరగోళంలో ఉన్నాయని మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. జనసేన.. బీజేపీతో పొత్తులో ఉందో, టీడీపీతో ఉందో తెలియని పరిస్థితి ఆ పార్టీ నాయకుల్లో ఉందన్నారు. మూడు పార్టీలు కలసి పోటీ చేస్తాయో, లేదో.. ఏ పార్టీకి ఎన్ని సీట్లు కేటాయిస్తారో.. అనే అయోమయంలో ప్రతిపక్ష పార్టీల నాయకులున్నారని మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు.

అర్థం చేసుకోవడం ముఖ్యం

ముంబై నగర మురికివాడల్లో నివసించే పిల్లల భవిష్యత్తును రూపొందించడంలో 32 ఏళ్లుగా నిమగ్నమైన ఉపాధ్యాయిని, సామాజిక కార్యకర్త డాక్టర్ ఆనంది సింగ్ రావత్. సుదీర్ఘ బోధనా అనుభవంలో పిల్లల మనస్తత్వాన్ని దగ్గరుండి అర్థం చేసుకున్న మానసిక నిపుణురాలు. పిల్లలు రోల్ మోడల్‌గా భావించే ఈ టీచర్ ఇన్నేళ్లుగా చేసిన ప్రయత్నం ఎంతోమందిలో స్ఫూర్తిని నింపుతుంది.



‘‘మూడు దశాబ్దాలకు పైగా పిల్లలతో కలిసి ఉండటం వల్ల వారి మనస్తత్వాన్ని సులువుగా అర్థం చేసుకునే స్థితి నాకు అలవడింది. ఆ ఆలోచనతో ‘మేము, పిల్లలు, వారి మనస్తత్వ శాస్త్రం’ పేరుతో పుస్తకం తీసుకువచ్చాను. టీచర్‌గా పిల్లల మనస్తత్వంపై, వారి వికాసంపై అనేక రకాల పరిశోధనల కథనాలు నేను రాసిన పుస్తంలో ఉన్నాయి. ఇవన్నీ టీచర్లకు, తల్లిదండ్రులకు మార్గదర్శకం అవుతాయి. ఇది పిల్లల మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడంలో సహాయపడుతుంది.

పిల్లల మనసులను చదవాలి

హైపర్ యాక్టివ్, కోపం, పిరికితనం... ఇలా పిల్లలు భిన్నమైన వ్యక్తిత్వాలు కలిగి ఉంటారు. అటువంటి పరిస్థితిలో పిల్లల వ్యక్తిత్వాన్ని పరిగణనలోకి తీసుకొని వారితో మాట్లాడాలి. పిల్లల ప్రవర్తన వెనక ఉన్న మనస్తత్వాన్ని అర్థం చేసుకుంటే తప్ప వారి సమస్యలను పరిష్కరించలేరు.

బాల్యంలో పిల్లల మనసులో నిలిచిపోయే విషయాలు లేదా సంఘటనలు వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయి. రోజూ తల్లిదండ్రుల పోట్లాడుకుంటుంటే పిల్లవాడికి భవిష్యత్తులో పెళ్లి పట్ల విముఖత ఏర్పడుతుంది. లేదా తన జీవిత భాగస్వామితో ఎలా ప్రవర్తించాలో అర్థం కాకపోవచ్చు. చదువుకోవడానికి వచ్చే మురికివాడల పిల్లల జీవితం సంపన్నుల పిల్లల కంటే భిన్నంగా ఉంటుంది. వారి సమస్యలు, అవసరాలు లెక్కలేనన్ని ఉంటాయి. ప్రేమ, ఆప్యాయత వారికి లభించడం లేదు. ఈ పిల్లలకు కనీస అవసరాలు కూడా తీరడం లేదు. ఇంట్లో వాతావరణం బాగుండదు. దీని ప్రభావం కొన్నిసార్లు వారి హృదయాన్ని, మనస్సును గాయపరుస్తుంది. అప్పుడు వారు క్లాసులో మౌనంగా ఉంటారు. ఎవరితోనూ మాట్లాడరు. అలాంటి పిల్లలను పక్కకు తీసుకెళ్లి వారితో మాట్లాడతాను. వారి మనస్సులను చదువుతాను. వారి సమస్యలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. క్లాసులో పిల్లలెవరూ విచారంగా, మౌనంగా ఉండకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నాను.

తల్లిదండ్రులూ అర్థం చేసుకోలేరు

పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడతాను. వారి ఇంటి, మానసిక పరిస్థితిని అర్థం చేసుకుంటాను. వారి పొరపాట్లను ప్రేమగా వారికి తెలియజెబుతాను. పిల్లల ముందు ఎలా ఉండాలి, వారితో ఎలా మాట్లాడాలో వివరిస్తాను. ఇంట్లో తల్లిదండ్రులు పోట్లాడుకోవడం చూసిన పిల్లలు స్కూల్లో ఇతర పిల్లలతో ఇలాగే ప్రవర్తిస్తారు. ఈ పిల్లల ఇంటి వాతావరణం వారి బాల్యాన్ని నాశనం చేసే సామాజిక సమస్య. వారి జీవన స్థితిగతులను అర్థం చేసుకోవడానికి నాకు సంవత్సరాలు పట్టింది. చిన్న పిల్లల మనసు అర్థం చేసుకోవాలంటే వాళ్ల మనసు లోతుల్లోకి వెళ్లాలి. వాళ్లతో కలిసిపోవాలి. అప్పుడే వాళ్ల కష్టాలు అర్థం చేసుకోవడం తేలికైంది. అప్పుడు పిల్లలు కూడా నేను చెప్పేది వినడం, అర్థం చేసుకోవడం ప్రారంభించారు.

హృదయ విదారక కథలు

కుటుంబంలో తగాదాలు, ఇల్లు కూలిపోవడం, అమ్మ లేదా నాన్న కొట్టడం, కొన్నిసార్లు సవతి తండ్రి, కొన్నిసార్లు



● మురికి వాడల పిల్లలతో ఆనంది సింగ్ రావత్

సవతి తల్లితో బాధలు... దీంతో ఈ పిల్లల బాల్యాన్ని తుంగలో తొక్కేసినట్టవుతుంది. ఈ పిల్లలను తిరిగి స్కూల్‌కు తీసుకురావడానికి చాలా కష్టపడాల్సిన పరిస్థితులు ఎదురయ్యేవి.

భయపెట్టే సంఘటనలు

రోహన్ (పేరుమార్చాం) తన మనసులో ఏదో దాచుకుంటున్నట్టు, భయం భయంగా ఉండేవాడు. నేను అతనితో మాట్లాడినప్పుడు అతను విపరీతంగా ఏడవడం ప్రారంభించాడు. వారి ఇల్లు చాలా చిన్నది కాబట్టి కుటుంబ సభ్యులందరూ ఒకే గదిలో పడుకునేవారు. తన తల్లిదండ్రులు రాత్రి పూట వ్యక్తిగతంగా గడపడం చూశాడు రోహన్. తన తండ్రి అమ్మను హింసిస్తున్నాడని మనసులో భయం పెట్టుకుని ఎవరితో మాట్లాడకుండా మదనపడుతుండేవాడు. తల్లిదండ్రులకు, ఆ పిల్లవాడికి కౌన్సెలింగ్ ఇచ్చాక సంతోషంగా ఉండటం మొదలుపెట్టాడు.

ఆరవ తరగతి చదువుతున్న సోఫియా (పేరు మార్చాం) తన డైరీలో ఏదో రాసుకోవడం గమనించాను. అడిగితే, ఎవరూ చూడకుండా చూపిస్తానంది. క్లాస్ రూమ్ నుంచి మరో గదికి తీసుకెళ్లి అడిగితే, డైరీ చూపించింది. ఆ డైరీ చదివినప్పుడు నా కన్నీళ్లు ఆపుకోలేకపోయాను.

సోఫియా తల్లి మళ్లీ పెళ్లి చేసుకుంది. తన తల్లితో కలిసి కొత్త తండ్రి దగ్గరకు వెళ్లాల్సి వచ్చింది. అక్కడ కొత్త తండ్రి, అతని తమ్ముడు సోఫియాను బాధపెడుతున్నారు. ఆ అమ్మాయి ఎవరికీ ఏమీ చెప్పలేక తన తండ్రికి డైరీలో ఉత్తరాలు రాసుకుంది. ఆ తర్వాత వాళ్ల అమ్మను కలిసి మాట్లాడాను. ఆమె సోఫియా పట్ల జాగ్రత్తలు తీసుకుంది. ఇలాంటి ఎన్నో సంఘటనలు, మరెన్నో గాథలు పిల్లల నుంచి తెలుసుకున్నవి, పరిష్కరించినవి ఉన్నాయి.

టీచర్‌ని కావాలనుకున్నాను..

ముంబైలోని సాధారణ కుటుంబంలో పుట్టి, పెరిగాను. చిన్నప్పటి నుంచి టీచర్ కావాలనుకున్నాను. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఇంటర్మీడియెట్ తర్వాత ఫీజు కట్టడానికి డబ్బుల్లేక ట్యూషన్లు చెప్పడం మొదలుపెట్టాను. మాంటిస్సోరి కోర్సు చేశాను. ఇదే పిల్లలకు నన్ను దగ్గర చేసింది.

ప్రిన్సిపల్ ప్రోత్సాహంతో

నేను పనిచేసే చోట ప్రిన్సిపల్ బీఎడ్ కాలేజీలో చేర్పించారు. ఆ తర్వాత రెండేళ్లకు ప్రైవేట్ స్కూల్లో ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత పెళ్లి అయింది. అత్తింటి ప్రోత్సాహంతో ఎం.ఏ. డిగ్రీ పొందాను. నాకు ఇద్దరు పిల్లలు. వారిని పెంచడంతో పాటు ఇంటి పనులు, స్కూల్ పనుల వల్ల సమయం అస్సలు ఉండేది కాదు. పిల్లలు పెద్దవాళ్లయ్యాక పీహెచ్‌డీ పూర్తిచేశాను. నాకూతురు మెడిసిన్ చదువుతుండగా నేను పీహెచ్‌డీ చేస్తున్నాను. అలాగని నా జీవితం వడ్డించిన విస్తరి ఏమీ కాదు. కుటుంబంలో ఎన్నో ప్రమాదాలు జరిగినా, కష్టాలు ఎదురైనా పూర్తి నిజాయితీతో నా పని చేస్తూ వచ్చాను. నేను చదువు చెప్పే పిల్లలు బాగా రాణిస్తున్నారని అర్థమయ్యాక నాకు చాలా ఆనందం కలుగుతుంది.

వినూత్నం

సూఫీ కథక్ 25



ఈ అందెల రవళి ‘ఆహా’ ‘ఓహో’లకు పరిమితమైనది కాదు.
అద్భుతమైన రెండు కళారూపాల సంగమం.
చరిత్రలోని కళను వర్తమానంలో వెలిగించే అఖండ దీపం.
విస్మరణకు గురైన కళాకారులకు ఇచ్చే అరుదైన నీరాజనం...

పాతికేళ్ల క్రితం సూఫీ కథక్ కళతో ప్రస్థానం ప్రారంభించింది మంజరి చతుర్వేది.

‘సూఫీ, పంజాబీ జానపద సంగీత ప్రదర్శనలు ఇవ్వడం, నలుపు రంగు దుస్తులు ధరించడం, ఖవ్వాలితో కథక్ చేయడం లాంటివి చూసి శాస్త్రీయ కళను వక్రీకరిస్తుంది అని కొందరు నాపై విమర్శ చేశారు. అయితే అవేమీ నా ప్రయాణాన్ని ఆపలేదు’ అంటుంది లక్నోకు చెందిన మంజరి.

చిత్ర నిర్మాత ముజఫర్ అలీ, గురువు ప్రోతిమా బేడితో కలిసి ఈ నృత్య రూపంపై పనిచేసింది. మొదట్లో స్పందన ఎలా ఉన్నప్పటికీ సంగీత ప్రియులు సూఫీ కథక్‌ను ప్రశంసిస్తున్నారు.

‘ఇది నా గురువుల ఆశీర్వాదంగా భావిస్తున్నాను’ అంటుంది మంజరి.

పండిట్ అర్జున్ మిశ్రా వద్ద కథక్, కళానిధి నారాయణ్ వద్ద అభినయ్, ఫాహిమ్– ఉద్–దిన్ దాగర్ వద్ద సూఫీ సంగీతం నేర్చుకుంది. సూఫీ సాధువులు, ఆధ్యాత్మికవేత్తలందరినీ తన గురువుగా భావిస్తుంది. ‘సూఫీ కథక్’ తొలి ప్రదర్శన ఢిల్లీలో ఇచ్చింది. ఇప్పటి వరకు 26 దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చింది. కైలాష్ ఖేర్, ఉస్తాద్ శౌకత్ అలీ ఖాన్, సబ్రీ బ్రదర్స్‌లాంటి ఎంతోమంది కళాకారులతో కలిసి పనిచేసింది.

> **పాతికేళ్ల ప్రయాణంలో...**
> పాతికేళ్ల ప్రయాణంలో ఎన్నో నేర్చుకున్నాను. విమర్శలు, ప్రశంసలను ఒకే రకంగా స్వీకరించాను. విస్మరణకు గురైన కళాకారులను రంగస్థలంపై తీసుకువచ్చాను. నేను తెలుసుకున్నది ఏమిటంటే... ప్రయాణం ఎప్పుడూ సంతోషకరమైనదే. కాలంతో పాటు ఎన్నో విషయాలు నేర్చుకుంటూ, విశ్లేషిస్తూ వెళతాం.
> – మంజరీ చతుర్వేది



ఇరాన్, టర్కీ, మొరాకోకు చెందిన కళకారులతో గొంతు కలిపింది. సూఫీ తత్వంలోని సంగీత, నృత్యరూపాలను లోతుగా అధ్యయనం చేసింది. ‘రాజనర్తకీమణుల నృత్యాలలో అద్భుత ప్రతిభ దాగి ఉన్నప్పటికీ ప్రశంసించడానికి మాత్రం మనకు మనసు రాదు’ అంటున్న మంజరి విస్మరణకు గురైన కళాకారుల ప్రతిభను వెలుగులోకి తెస్తుంది. రకరకాల ప్రాజెక్ట్‌లు చేపట్టింది. వాటిలోని ఖ్వాజా ప్రాజెక్ట్ మన దేశంలో సూఫీ ప్రతిధ్వనులను వినిపిస్తుంది. సూఫీ కవులను తెర పైకి తెస్తుంది. గొప్ప కవుల జీవితాన్ని, సాహిత్యాన్ని కళ్ల ముందు ఆవిష్కరిస్తుంది. 18వ శతాబ్దానికి చెందిన సూఫీ ఆధ్యాత్మికవేత్త, పంజాబ్‌కు చెందిన కవి బాబా బుల్లేహ్ షా. ఆయన ఆధ్యాత్మిక కవిత్వాన్ని తన నృత్యప్రదర్శనల ద్వారా ఈ తరానికి చేరువ చేస్తుంది మంజరి.

‘స్వీయ అన్వేషణ, ఆధ్యాత్మిక జ్ఞానోదయం కోసమే షా తన జీవితాన్ని అంకితం చేశాడు. కళాత్మక రూపాలు అణచి వేయబడుతున్న కాలంలో ఆయన మౌనంగా కూర్చోలేదు. నియమాలను ధిక్కరించి పంజాబ్ వీధుల్లో తిరుగుతూ పాటలు పాడేవాడు. నృత్యాలు చేసేవాడు. ధిక్కార స్వరాన్ని వినిపించేవాడు’ అంటుంది మంజరి.

మంజరి చతుర్వేదికి ప్రపంచవ్యాప్తంగా శిష్యులు ఉన్నారు. శిక్షణలో భాగంగా ‘నాద్ ధ్యాన్’ చేయిస్తుంది.

‘ప్రదర్శన ఇవ్వడానికి పండిట్ జస్రాజ్ నన్ను ఆహ్వానించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇలాంటి సంఘటనలు నేను సరియైన దారిలోనే ప్రయాణిస్తున్నాను అనే ధైర్యాన్ని ఇస్తాయి’ అంటుంది మంజరి చతుర్వేది.

ఎక్కడి నుంచైనా...
మోటర్ ఆన్, ఆఫ్!

- రైతులు ఊరికి వెళితే పంటలకు నీళ్లు పెట్టాలంటే ఇబ్బంది
- ఓ స్టార్టప్ కంపెనీ రూపొందించిన ఈ పరికరం ద్వారా ఫోన్‌తో బోర్ మోటర్‌ను ఎక్కడి నుంచైనా ఆపరేట్ చేయొచ్చు
- ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐ.ఓ.టి.)తో పాటు క్లౌడ్ బేస్డ్ టెక్నాలజీతో తయారైన ఎంబెడ్డెడ్ స్టార్టర్ ఇది
- దొంగల భయం లేని ఈ పరికరం ఎంతో ఉపయోగకరంగా ఉందంటున్న రైతులు

సాగుబడి
ధనిష్ట కార్తె: ఫిబ్రవరి 19 వరకు
శతభిష కార్తె: 20 నుంచి



● మోటర్‌ను ఫోన్‌తో ఆన్ చేస్తున్న తిరుపతిరెడ్డి



● మొబైల్‌తోనే స్ప్రింక్లర్లను ఆన్ చేస్తున్న సత్తయ్య

> **ఈ పరికరం లేకపోతే వ్యవసాయమే చేయకపోదును!**
> 8 ఎకరాలలో వ్యవసాయం చేస్తున్నా. పొలానికి సుమారుగా 600 మీటర్ల దూరం నుంచి సాగు నీరు సరఫరా చేస్తున్నా. దూరంలో బోర్ ఉండటంతో పైపులు చాలా సార్లు ఊడిపోతుండేవి. అప్పుడు మోటర్‌ను బంద్ చేసేందుకు అంత దూరం నడచుకుంటూ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఎక్కడ ఉన్నా ఫోన్ ద్వారానే మోటర్‌ను ఆన్, ఆఫ్ చేస్తున్నా. సెల్‌ఫోన్‌తో బోర్ మోటర్ ఆఫ్, ఆన్ చేయడం అందుబాటులోకి రావడంతో చాలా ఇబ్బందులు తప్పాయి. ఈ పరికరం లేకపోతే నేను వ్యసాయం కూడా చేయకపోదును.
> **– నాగర్తి తిరుపతి రెడ్డి** (94415 44819), మాచాపూర్, చిన్నకోడూరు మండలం, సిద్ధిపేట జిల్లా

> **ఊరికి వెళ్లినా ఇబ్బంది లేదు..**
> ఊరికి వెళితే పంటలకు నీళ్లు పెట్టాలంటే ఇబ్బందులు ఉండేవి. పక్కన రైతును బతిమిలాడుకునే వాళ్లం. అదే ఇప్పుడు న్యాస్త స్టార్టర్‌తో ఎక్కడికైనా ఫంక్షన్‌కు, ఊరికి సంతోషంగా వెళ్లి వస్తున్నా. అక్కడి నుంచే మోటర్‌ను సెల్‌ఫోన్‌లో నుంచే ఆన్, ఆఫ్ చేస్తున్నా. ఇది ఎంతో ఉపయోకరంగా ఉంది.
> **– పంపరి సత్తయ్య** (9989385961), చిన్నకోడూరు, చిన్నకోడూరు మండలం, సిద్ధిపేట జిల్లా

వరి, మొక్కజొన్న, మిర్చి.. ఇలా పంట ఏదైనా సమయానికి సాగు నీటిని అందించటం ముఖ్య విషయం. స్వయంగా పొలానికెళ్లి మోటారు స్విచ్ ఆన్, ఆఫ్ చేయటం సాధారణంగా రైతు చేసే పని. అయితే, ఏదైనా పని మీద రైతు ఊరికి వెళ్లాల్సి వస్తే.. పక్క పొలంలో రైతును బతిమాలుకొని పంటలకు నీళ్లు పెట్టేందుకు మోటర్ ఆన్, ఆఫ్ చేయించేవారు. ఇప్పుడు అలా ఎవర్నీ ఇబ్బంది పెట్టక్కర్లేదు, రైతు ఇబ్బంది పడక్కర్లేదు. ఎందుకంటే, రైతు ఎంత దూర ప్రాంతం వెళ్లినా సరే ఫోన్ నెట్‌వర్క్ ఉంటే చాలు.. మొబైల్ ఫోన్ ద్వారా ఎప్పుడు అంటే అప్పుడు బోర్ మోటర్‌ను ఆన్ చేసుకోవచ్చు, పని పూర్తయ్యాక ఆఫ్ చేసుకోవచ్చు. న్యాస్త అనే స్టార్టప్ కంపెనీ వారు అత్యాధునిక సాంకేతికతతో విలక్షణ స్టార్టర్‌ను అందుబాటులోకి తెచ్చారు.

సిద్ధిపేట జిల్లాలో చిన్నకోడూరు మండలంలో పలువురు రైతులు దీన్ని వినియోగిస్తున్నారు. ఈ పరికరాన్ని మోటారు వద్ద అమర్చుకోవడం వలన ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా మోటర్‌ను ఆన్ చేసుకునే వెసులుబాటు ఏర్పడటంతో తమకు చాలా ఇబ్బందులు తప్పాయంటున్నారు రైతులు. నలుగురు యువ విద్యావంతులు స్థాపించిన ‘న్యాస్త’ స్టార్టప్ కంపెనీ రాజేంద్రనగర్‌లోని జాతీయ వ్యవసాయ పరిశోధనా యాజమాన్య సంస్థ (నార్మ్) ఎ–ఐడియాలో ఇంక్యుబేషన్ సేవలు పొంది రూపొందించిన ఈ పరికరంలో మొబైల్‌లో మాదిరిగానే ఒక సిమ్ కార్డు ఉంటుంది. దాని ద్వారా మెసేజ్ రూపంలో పొలంలో నీటి మోటర్‌కు సంబంధించిన సమాచారం.. అంటే మోటర్‌కు నీరు సరిగ్గా అందుతోందా? విద్యుత్తు ఓల్టేజి ఎంత ఉంది? మోటర్ నీటిని సరిగ్గా ఎత్తిపోస్తోందా లేదా? వంటి సమాచారం ఎప్పటికప్పుడు రైతు మొబైల్‌కు మెసేజ్‌లు వస్తాయి. సంవత్సరానికి ఒక్కసారి ఈ సిమ్‌కు రీచార్జి చేయిస్తే సరిపోతుంది. ఫోన్ సిగ్నల్స్ ఉండే ఎక్కడి నుంచైనా మోటర్‌ను ఆఫ్, ఆన్ చేసుకునే అవకాశం ఉంటుంది. నీరు లేకపోయినా, విద్యుత్తు హెచ్చుతగ్గులు వచ్చినా మోటర్ స్విచ్ ఆఫ్ అయిపోయి.. రైతుకు మొబైల్‌లో సందేశం వస్తుంది.

ఉపయోగాలెన్నో... ఎప్పుడు కావాలంటే అప్పుడు (అడ్‌హాక్ మోడ్) న్యాస్త మొబైల్ యాప్ ద్వారా ఆన్ చేసుకోవచ్చు, ఆఫ్ చేసుకోవచ్చు.

ఏయే వేళల్లో మోటర్ నడవాలి (ఇంట్రవెల్స్ మోడ్)?: భూగర్భంలో నీరు తక్కువగా ఉన్న చోట నిరంతరంగా బోర్లు నడిపితే కాలిపోతాయి. విద్యుత్తు ప్రసారం ఉండే సమయాలకు అనుగుణంగా మోటర్‌ను ఏ సమయానికి ఆన్ చెయ్యాలి? ఏ సమయానికి ఆఫ్ చేయాలి? అని టైమ్ సెట్ చేస్తే చాలు. ఆ ప్రకారంగా అదే ఆన్ అవుతుంది, అదే ఆఫ్ అవుతుంది.

షెడ్యులర్ మోడ్: ప్రతి రోజు ఒకే సమయంలో ఆన్ అయ్యేలా షెడ్యూల్ ఫిక్స్ చేసుకోవచ్చు. ఇలా టైం ఫిక్స్ చేసుకోవడం వలన ప్రతి రోజు పంటలకు సాగు నీళ్ల తగిన మోతాదులో అందించే అవకాశం ఉంటుంది.

దొంగల భయం లేదు... వరి, కూరగాయలు, పామాయిల్, మొక్కజొన్న తదితర పంటలు పండిస్తున్న 117 మంది రైతులు ఈ స్టార్టర్ ద్వారా లబ్ధి పొందుతున్నారని న్యాస్త స్టార్టప్ సహ వ్యవస్థాపకులు భార్గవి (83673 69514) తెలిపారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐ.ఓ.టి.)తో పాటు క్లౌడ్ బేస్డ్ టెక్నాలజీతో ఈ ఎంబెడ్డెడ్ స్టార్టర్ పనిచేస్తుంది. అందువల్ల పొలంలో నుంచి ఎవరైనా ఇతరులు దీన్ని దొంగతనంగా తీసుకెళ్లినా వారు వినియోగించలేరని, దాన్ని ఆన్ చేయగానే మొబైల్ నెట్‌వర్క్ ద్వారా దాని లొకేషన్ ఇట్టే తెలిసిపోతుందని ఆమె ‘సాక్షి’కి తెలిపారు. ఓవర్ ద ఎయిర్ (ఒ.టి.ఎ.) సర్వర్ ద్వారా ఈ స్టార్టర్లను తాము నిరంతరం పర్యవేక్షిస్తూ ఉంటామని, సాంకేతికంగా అప్‌డేట్ చేయటం చాలా సులభమన్నారు. రైతు ఒక్క సిమ్ ద్వారా అనేక మోటర్లను వాడుకోవటం ఇందులో ప్రత్యేకత అని ఆమె వివరించారు.

– గజవెల్లి షణ్ముఖ రాజు, సాక్షి, సిద్ధిపేట

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్


చౌడు సాగుకు చేదోడు కొత్త బ్యాక్టీరియా!

- కేరళలోని తీరప్రాంత ‘పొక్కలి’ వరి సాగయ్యే సేంద్రియ మాగాణుల్లో గుర్తింపు
- దాని పేరు సూడోమోనాస్ తైవానెన్సిస్ (పికె7)
- ఈ బ్యాక్టీరియాతో ఉప్పు నీటిలోనూ సజావుగా సాధారణ వరి సాగు



సాధారణ వరి వంగడాల పంటకు ఉప్పు నీరు తగిలితే ఆకులు పసుపు రంగులోకి మారిపోయి, ఎదుగుదల లోపించి, దిగుబడి తగ్గిపోతుంది. అయితే, కేరళ తీరప్రాంతంలో లోతట్టు మాగాణుల్లో ఉప్పు నీటిలోనూ పొక్కలి వరి వంగడం చక్కగా పెరిగి మంచి దిగుబడినిస్తుంది. ఇందుకు దోహదపడుతున్న మట్టి మర్మమేమిటి? అని అల్లాపుఝలోని సనాతన ధర్మ కాలేజీకి చెందిన పరిశోధకులు అధ్యయనం చేసి ఓ సరికొత్త బ్యాక్టీరియాను కనుగొన్నారు. పొక్కలి రకం వరి సాగయ్యే సేంద్రియ పొలాల్లోని మట్టిలో ఉండే సూడోమోనాస్ తైవానెన్సిస్ (పికె7) వల్లనే ఉప్పు నీటిని ఆ పంట తట్టుకోగలుగుతోందని వారు తేల్చారు.

కుట్టనాడ్ ప్రాంతంలో విస్తారంగా సాగయ్యే యుఎంఎ అనే రకం వరికి ఉప్పునీటి బెడద ఎక్కువైన నేపథ్యంలో ఈ అధ్యయనం జరిగింది. పికె7తో పాటు పంట పెరుగుదలకు దోహదం చేసే రైజోబ్యాక్టీరియా (ఎస్.టి.–పిజిపిఆర్‌లు) కూడా వాడి యుఎంఎ రకం వరిని ప్రయోగాత్మకంగా సాగు చేసి చూశారు. ఈ బ్యాక్టీరియాలు వాడి సాగు చేస్తే హెక్టారుకు 7,595 కిలోల ధాన్యం దిగుబడి వస్తే.. వాడకుండా సాగు చేస్తే హెక్టారుకు 7,344 కిలోల దిగుబడి మాత్రమే వచ్చింది. అంటే.. పికె7 బ్యాక్టీరియా ఉప్పు వల్ల కలిగే ప్రతికూలతను తట్టుకొని వరి పంట నిలబడే వ్యవస్థను సృష్టిస్తోందని అర్థమవుతోందని పరిశోధకులు నిర్ధారణకు వచ్చారు. 2022 డిసెంబర్ – ఏప్రిల్ 2023 మధ్య కాలంలో జరిగిన ఈ అధ్యయన వివరాలతో కూడిన వ్యాసం జర్నల్ ఆఫ్ అగ్రానమీ అండ్ క్రాప్ సైన్స్‌లో ప్రచురితమైంది. మన చౌడు భూముల్లోనూ వరి, తదితర పంటల సాగుకు ఈ బ్యాక్టీరియా ఉపయోగపడుతుందేమో మన శాస్త్రవేత్తలు పరిశోధించాలి.



● ‘పొక్కలి’ పొలంలో మట్టి సేకరణ

67.3 లక్షల హెక్టార్లలో చౌడు సమస్య

మన దేశంలో చౌడు బారుతున్న నేలల (సాల్ట్–ఎఫెక్టెడ్ సాయిల్స్) విస్తీర్ణం ఇటీవల కాలంలో వేగంగా పెరుగుతోంది. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఎఆర్)కు చెందిన కేంద్రీయ చౌడు నేలల పరిశోధనా సంస్థ (సిఎస్ఎస్ఆర్ఐ) ఇటీవల నిర్వహించిన అధ్యయనం ప్రకారం మన దేశంలో 67 లక్షల 30 వేల హెక్టార్ల సాగు భూమి చౌడుబారింది. 2050 నాటికి ఇది రెట్టింపవుతుందని ఆ సంస్థ హెచ్చరిస్తోంది. భూములు చౌడుబారటం వల్ల మన దేశంలో ఏటా 1.68 కోట్ల టన్నుల పంట దిగుబడిని నష్టపోతున్నాం. ఈ పంట విలువ రూ. 23 వేల కోట్లు (2015 నాటి ధరల ప్రకారం). చౌడు భూముల్లో పంటలు బతకవు. బతికినా పెద్దగా పెరిగి దిగుబడినివ్వవు. వ్యవసాయోత్పత్తిని దెబ్బతీయటమే కాదు సాంఘిక–ఆర్థిక స్థితిగతులను సైతం చౌడు సమస్య అతలాకుతలం చేస్తుంది.

మురుగునీటి పారుదల సదుపాయం సమర్థవంతంగా లేకపోవటం, భూముల్లో అతిగా నీరు నిల్వ ఉండిపోవటం ఇందుకు ప్రధాన కారణాలు. రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడటం వంటి అస్థిర వ్యవసాయ పద్ధతులు, పంటలకు అందించే భూగర్భ జలాల నాణ్యత నాసికరంగా ఉండటం కూడా తోడవుతున్నాయి. చౌడు సమస్య మన దేశానికే పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా 260 కోట్ల చిన్న, సన్నకారు రైతుల జీవనోపాధి దెబ్బతింటోంది. ఏటా వీరికి కలుగుతున్న నష్టం 630 కోట్ల డాలర్లని అంచనా. వంద దేశాల్లో 83.5 కోట్ల హెక్టార్ల భూమి చౌడుబారిన పడింది. ఇందులో మనుషుల పనుల వల్ల చౌడువారిన భూములు 7.6 కోట్ల హెక్టార్లు ఈ నేపథ్యంలో కేరళలో కనుగొన్న కొత్త సూక్ష్మజీవి చౌడు భూముల సాగులో కొత్త శకానికి నాంది పలుకుతుందని ఆశిద్దాం.

13న బయోచార్ సొసైటీ ఆవిర్భావం

కట్టె పుల్లల నుంచి పర్యావరణ హితమైన బయోచార్ (బొగ్గు పొడి) ఉత్పత్తిని, వాడకాన్ని పెంపొందించే సదుద్దేశంతో భారతీయ బయోచార్ సొసైటీ ఆవిర్భవిస్తోంది. బొగ్గు పొడి సుస్థిర వ్యవసాయానికి దోహదపడుతుంది. దీంతో పాటు నీటి శుద్ధి, పారిశుద్ధ్యం తదితర అనేక రంగాల్లో వినియోగిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా బయోచార్‌కు కార్బన్ క్రెడిట్స్ చేకూర్చే పరిస్థితులు ఉండటంతో జీవనోపాధులను పెంపొందించడానికి కూడా ఇది దోహదపడనుంది. ఈ నెల 13వ తేదీన సాయంత్రం 5–7 గంటల మధ్య హైదరాబాద్ యూసఫ్‌గూడలోని ఎన్.ఐ.–ఎం.ఎస్.ఎం.ఇ. కార్యాలయ ఆవరణలో బయోచార్ సొసైటీ ఆవిర్భావ సభ జరగనుంది. ఆర్.కె. మెహతా చైర్మన్‌గా, డా. నక్కా సాయిభాస్కర్‌రెడ్డి ప్రెసిడెంట్‌గా, ఎస్.కె. గుప్తా కార్యదర్శిగా భారతీయ బయోచార్ సొసైటీ ఆవిర్భవిస్తోంది. వివరాలకు.. 6305 171 362.

1 నుంచి పల్లెసృజన శోధా యాత్ర

గ్రామీణుల్లో నిగూఢంగా దాగి ఉన్న తరతరాల జ్ఞానాన్ని శోధించడానికి, ప్రకృతితో మమేకమైన వారి జీవన విధానం గురించి తెలుసుకోవడానికి కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి గ్రామం నుంచి గన్నారం గ్రామం వరకు చిన్న శోధాయాత్ర నిర్వహించనున్నట్లు పల్లెసృజన సంస్థ అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశం తెలిపారు. మార్చి 1 నుంచి 3 వరకు జరిగే ఈ యాత్రలో రూ.500 రుసుము చెల్లించి ఆసక్తిగల వారెవరైనా ముందుగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవచ్చు. ఇతర వివరాలకు.. 98660 01678, 99666 46276.



స్విమ్మింగ్ 100 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో కొత్త ప్రపంచ రికార్డు

ప్రపంచ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో పురుషుల 100 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు నమోదైంది. దోహాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల 4×100 మీటర్ల రిలే ఫైనల్లో చైనా స్విమ్మర్ పాన్ జాన్లె తన అంచెను 46.80 సెకన్లలో పూర్తి చేశాడు. ఈ క్రమంలో డేవిడ్ పోపోవిచి (రొమేనియా: 46.86 సెకన్లు) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును పాన్ జాన్లె బద్దలు కొట్టాడు. చైనా బృందం రిలే రేసును 3ని:11.08 సెకన్లలో ముగించి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఇటలీ జట్టుకు రజతం, అమెరికా జట్టుకు కాంస్య పతకం లభించాయి.

రన్నరప్ సిక్కి రెడ్డి జోడీ



అజర్‌బైజాన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణకు చెందిన సిక్కి రెడ్డి–సుమిత్ రెడ్డి జోడీ రన్నరప్‌గా నిలిచింది. బాకులో జరిగిన ఫైనల్లో సిక్కి–సుమిత్ ద్వయం 21–13, 20–22, 10–21తో భారత్‌కే చెందిన సతీశ్–ఆద్యా వరియత్ జోడీ చేతిలో ఓడిపోయింది. 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రెండో గేమ్‌లో సిక్కి జోడీ ఒక మ్యాచ్ పాయింట్‌ను చేజార్చుకోవడం గమనార్హం.

ఉమామహేశ్‌కు స్వర్ణం



గ్రనాడా (స్పెయిన్): ప్రపంచకప్ జూనియర్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ షూటర్ మద్దినేని ఉమా మహేశ్ స్వర్ణ పతకంతో మెరిశాడు. సోమవారం జరిగిన జూనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత షూటర్లు స్వర్ణ, రజత, కాంస్య పతకాలను నెగ్గి క్లీన్ స్వీప్ చేశారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 19 ఏళ్ల ఉమామహేశ్ 252.1 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచాడు. పార్థ్ రాకేశ్ మానే 250.6 పాయింట్లతో రజతం, అజయ్ మలిక్ 229 పాయింట్లతో కాంస్యం గెలిచారు. జూనియర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత క్రీడాకారిణులు ఇషా తక్సాలే (251.8 పాయింట్లు) స్వర్ణం, శాంభవి క్షీరసాగర్ (227.6 పాయింట్లు) కాంస్యం నెగ్గారు.

రామ్‌కుమార్ శుభారంభం



బెంగళూరు: భారత ప్లేయర్ రామ్‌కుమార్ రామనాథన్ బెంగళూరు ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టెన్నిస్ టోర్నీలో శుభారంభం చేశాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 462వ ర్యాంకర్ రామ్‌కుమార్ 6–7 (4/7), 7–5, 6–4తో మాక్సిమి జాన్వీర్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. 2 గంటల 26 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్‌కుమార్ ఏడు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు.

రాహుల్ అవుట్

- గాయం నుంచి ఇంకా కోలుకోని భారత బ్యాటర్
- దేవదత్ పడిక్కల్‌కు అవకాశం



రాజ్‌కోట్: భారత సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ మూడో టెస్టుకూ దూరమయ్యాడు. గాయంతో అతన్ని రెండో టెస్టు నుంచి తప్పించి... ఇటీవలే మూడో టెస్టుకు ఎంపిక చేశారు. ఫిట్‌నెస్ సంతరించుకుంటేనే తుది జట్టుకు ఆడతాడని సెలక్షన్ సమయంలోనే స్పష్టం చేశారు. తాజాగా అతను పూర్తిగా కోలుకునేందుకు మరికొంత సమయం పట్టనుండటంతో మూడో టెస్టు నుంచి తప్పించారు. అతని స్థానంలో కర్ణాటక ఎడంచేతి వాటం బ్యాటర్ దేవదత్ పడిక్కల్‌ను ఎంపిక చేశారు. 'రాహుల్ వందశాతం ఫిట్‌నెస్‌తో ఉంటేనే తుది జట్టుకు పరిగణిస్తామని ఇదివరకే చెప్పాం. అతను 90 శాతం కోలుకున్నట్లు తెలియడంతో రాజ్‌కోట్ టెస్టుకూ పక్కన బెట్టాం. అతని పరిస్థితిని బోర్డు మెడికల్ టీమ్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది' అని బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారు. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో పునరావాస శిబిరంలో ఉన్న రాహుల్ నాలుగో టెస్టుకల్లా కోలుకుంటాడని ఆశాభావంతో ఉన్నట్లు ఆయన చెప్పారు. భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య మూడో టెస్టు 15 నుంచి రాజ్‌కోట్‌లో జరుగుతుంది.

రాజ్‌కోట్‌కు ఇంగ్లండ్

స్వల్ప విరామం కోసం అబుదాబి వెళ్లిన ఇంగ్లండ్ క్రికెట్ జట్టు సోమవారం తిరిగి భారత్ చేరుకుంది. వారంపాటు అక్కడ సేదతీరిన పర్యాటక జట్టు మూడో టెస్టు కోసం రాజ్‌కోట్ వేదికకు వచ్చింది. మంగళవారం సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (ఎస్‌సీఏ) గ్రౌండ్‌లో ఇంగ్లండ్ ఆటగాళ్లు నెట్ ప్రాక్టీస్ చేస్తారని స్థానిక వర్గాలు తెలిపాయి. స్పిన్నర్ జాక్ లీచ్ మోకాలి గాయంతో మిగతా టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. అతను అబుదాబి నుంచే స్వదేశానికి పయనమయ్యాడు. స్పిన్ త్రయం హార్ట్‌లీ, రేహాన్ అహ్మద్, బషీర్‌లతో పాటు పార్ట్‌టైమ్ స్పిన్ పాత్ర పోషించే జో రూట్ అందుబాటులో ఉండటంతో లీచ్ స్థానంలో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఇంకెవరినీ ఎంపిక చేయలేదు. నిజానికి అతను తొలిటెస్టు మాత్రమే ఆడాడు. లీచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 2 వికెట్లే తీశాడు. తర్వాతి రెండో టెస్టుకు దూరమయ్యాడు.

ఐదేళ్ల తర్వాత...

- ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్ టాప్–100లో భారత ప్లేయర్
- కెరీర్ బెస్ట్ 98వ ర్యాంక్‌కు సుమిత్ నగాల్



న్యూఢిల్లీ: నిరీక్షణ ముగిసింది. ఐదేళ్ల తర్వాత అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్ టాప్–100లో మళ్లీ భారత ప్లేయర్ పేరు కనిపించింది. ఆదివారం ముగిసిన చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టోర్నీలో విజేతగా నిలిచిన సుమిత్ నగాల్ ఏకంగా 23 స్థానాలు ఎగబాకి తొలిసారి టాప్–100లోకి దూసుకొచ్చాడు. సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో 26 ఏళ్ల సుమిత్ 630 పాయింట్లతో కెరీర్ బెస్ట్ 98వ ర్యాంక్‌లో నిలిచాడు. 2019లో ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తర్వాత ఓ భారత టెన్నిస్ ప్లేయర్ ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో టాప్–100లోకి రావడం విశేషం. 1973లో ఏటీపీ ర్యాంకింగ్స్ ప్రవేశపెట్టాక భారత్ నుంచి టాప్–100లో నిలిచిన పదో ప్లేయర్‌గా సుమిత్ నగాల్ గుర్తింపు పొందాడు. ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం భారత్‌కే చెందిన రోహన్ బోపన్న వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... గతంలో లియాండర్ పేస్, మహేశ్ భూపతి నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచారు. మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సింగిల్స్ విభాగంలో సానియా మీర్జా కెరీర్ బెస్ట్ 27వ ర్యాంక్‌లో, డబుల్స్ విభాగంలో నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచింది.

ఏటీపీ ర్యాంకింగ్స్‌లో టాప్–100లో నిలిచిన భారత ప్లేయర్లు

ప్లేయర్	బెస్ట్ ర్యాంక్	ఎప్పుడు
విజయ్ అమృత్‌రాజ్	18	1980
రమేశ్ కృష్ణన్	23	1985
సోమ్‌దేవ్ వర్మన్	62	2011
శశి మీనన్	71	1975
లియాండర్ పేస్	73	1998
ఆనంద్ అమృత్‌రాజ్	74	1974
ప్రజ్నేశ్ గుణేశ్వరన్	75	2019
యూకీ బాంబ్రీ	83	2018
జస్జీత్ సింగ్	89	1974
సుమిత్ నగాల్	98	2024

భారత జట్టుకు నాలుగో పరాజయం



రూర్కెలా: మహిళల ప్రొ లీగ్ హాకీ టోర్నీలో భారత జట్టుకు నాలుగో పరాజయం ఎదురైంది. చైనా జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 1–2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఆట 7వ నిమిషంలో సంగీత కుమారి చేసిన గోల్‌తో భారత్ ఖాతా తెరిచి 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే 14వ నిమిషంలో గు బింగ్‌ఫెంగ్ గోల్‌తో చైనా స్కోరును 1–1తో సమం చేసింది. అనంతరం 53వ నిమిషంలో గు బింగ్‌ఫెంగ్ చైనా జట్టుకు రెండో గోల్ అందించి విజయాన్ని ఖాయం చేసింది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు తమకు లభించిన ఐదు పెనాల్టీ కార్నర్‌లనూ వృథా చేసింది. తొమ్మిది జట్లు పోటీపడుతున్న ప్రొ లీగ్‌లో ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న భారత్ ఒకే ఒక విజయంతో మూడు పాయింట్లు సంపాదించి ఐదో స్థానంలో ఉంది.

సెమీస్‌లో పింక్ పాంథర్స్

కోల్‌కతా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు సెమీఫైనల్లోకి ప్రవేశించింది. యూపీ యోధాస్‌తో జరిగిన మ్యాచ్‌లో పింక్ పాంథర్స్ 67–30తో గెలిచింది. జైపూర్ ప్లేయర్ అర్జున్ 20 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ గెలుపుతో పింక్ పాంథర్స్ 82 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లోకి రాగా... పుణేరి పల్టన్ 81 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. మిగతా మ్యాచ్‌ల ఫలితాలతో సంబంధం లేకుండా ఈ రెండు జట్లు టాప్–2లో నిలవనున్నాయి. దాంతో ఈ రెండు జట్లకు సెమీఫైనల్ బెర్త్‌లు ఖరారయ్యాయి. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 46–34తో యు ముంబాను ఓడించింది.

రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో ఆంధ్ర

ఉత్తరప్రదేశ్‌తో మ్యాచ్ 'డ్రా'



శశికాంత్



నితీశ్

సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే గ్రూప్ 'బి' నుంచి ముంబై, ఆంధ్ర జట్లు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లు ఖరారు చేసుకున్నాయి. ఎనిమిది జట్లున్న గ్రూప్ 'బి'లో ఆరు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాక ముంబై 30 పాయింట్లతో తొలి స్థానంలో, ఆంధ్ర 25 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాయి. కేరళ 14 పాయింట్లతో మూడో స్థానంలో, ఛత్తీస్‌గఢ్ 13 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాయి. ఈనెల 16 నుంచి జరిగే చివరిదైన ఏడో రౌండ్ మ్యాచ్‌ల్లో కేరళతో ఆంధ్ర; అస్సాంతో ముంబై తలపడతాయి. తమ చివరి మ్యాచ్‌లో ఆంధ్ర జట్టుపై ఇన్నింగ్స్ తేడాతో నెగ్గినా కేరళ జట్టు 21 పాయింట్లతో మూడో స్థానం వద్దే ఆగిపోతుంది కాబట్టి ముంబై, ఆంధ్ర జట్లకు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లు ఖాయమయ్యాయి. ఉత్తరప్రదేశ్‌తో సోమవారం ముగిసిన లీగ్ మ్యాచ్‌ను ఆంధ్ర జట్టు 'డ్రా'గా ముగించింది. ఓవర్‌నైట్ స్కోరు 271/5తో ఆట చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 145 ఓవర్లలో 9 వికెట్లకు 429 పరుగులు చేసింది. కెప్టెన్ రికీ భుయ్ (129; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) తన ఓవర్‌నైట్ స్కోరుకు మరో 29 పరుగులు జోడించి అవుటయ్యాడు. షేక్ రషీద్ (85; 10 ఫోర్లు), నితీశ్ కుమార్ రెడ్డి (53 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. మ్యాచ్‌లో 72 పరుగులు చేయడంతో పాటు 5 వికెట్లు పడగొట్టిన ఆల్‌రౌండర్ శశికాంత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

కెన్యా స్టార్ అథ్లెట్ దుర్మరణం

మారథాన్‌లో గతేడాది ప్రపంచ రికార్డు నెలకొల్పిన కెల్విన్ కిప్టమ్



నైరోబి: కెన్యా స్టార్ అథ్లెట్, పురుషుల మారథాన్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పిన కెల్విన్ కిప్టమ్ కారు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. కిప్టమ్ స్వయంగా నడుపుతున్న కారు అదుపుతప్పి పల్టీ కొడుతూ బలంగా చెట్టును ఢీకొంది. దుర్ఘటన సమయంలో కోచ్ హకిజిమానా, ఓ మహిళ కారులో ప్రయాణించగా... కిప్టమ్, కోచ్ ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాల పాలైన మహిళను హాస్పిటల్‌లో చేర్పించినట్లు పోలీసులు తెలిపారు. ఆమె పరిస్థితి కూడా విషమంగానే ఉంది. 24 ఏళ్ల కిప్టమ్ త్వరలో జరిగే పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించేందుకు శ్రమిస్తున్నాడు. గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన షికాగో మారథాన్ రేసులో (42.195 కిలోమీటర్లు; 2గం:00:35 సెకన్లు) కెల్విన్ కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. అంతకుముందు ఏప్రిల్‌లో జరిగిన లండన్ మారథాన్‌లోనూ కిప్టమ్ స్వర్ణ పతకం సాధించాడు.

బ్రెజిల్‌కు షాక్... 'పారిస్'కు అర్జెంటీనా



కరకస్ (వెనిజులా): బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టుకు అర్జెంటీనా షాక్ ఇచ్చింది. రియో, టోక్యో ఒలింపిక్స్ చాంపియన్ అయిన బ్రెజిల్... ఈసారి పారిస్ ఒలింపిక్స్‌లో 'హ్యాట్రిక్' టైటిల్ సాధించాలనే ఆశల్ని క్వాలిఫయింగ్ దశలోనే అర్జెంటీనా ఆవిరి చేసింది. దక్షిణ అమెరికా ఒలింపిక్ ఫుట్‌బాల్ క్వాలిఫయర్స్ మ్యాచ్‌లో ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా 1–0తో బ్రెజిల్‌ను కంగుతినిపించింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో 78వ నిమిషంలో లూసినో గొండో చేసిన గోల్‌తో అర్జెంటీనా విజయం సాధించింది. తద్వారా దక్షిణ అమెరికా క్వాలిఫయర్స్ నుంచి పారిస్ ఒలింపిక్స్‌కు రెండో జట్టుగా అర్జెంటీనా అర్హత సంపాదించింది. ఈ గ్రూప్‌లో ఇదివరకే పరాగ్వే 7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి అర్హత పొందింది. బ్రెజిల్ చివరిసారిగా 20 ఏళ్ల క్రితం 2004–ఏథెన్స్ ఒలింపిక్స్‌కు అర్హత సంపాదించలేదు. మరోవైపు అర్జెంటీనా 2004, 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో విజేతగా నిలిచింది.

మంచు పండగలో...



● సాయి పల్లవి

● సపోరో లొకేషన్‌లో...

మంచు పండగలో బిజీగా గడుపుతున్నారు సాయి పల్లవి. మంచు పండగ ఏంటీ అంటే.. జపాన్‌లోని సపోరో ప్రాంతంలో ఈ పండగ జరుగుతుంటుంది. ఇప్పుడు అక్కడే ఉన్నారు సాయి పల్లవి. ఆమెతో పాటు బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ కూడా వెళ్లారు. ఈ ఇద్దరూ జంటగా ఓ హిందీ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ సపోరోలో జరుగుతోంది. అక్కడ జరుగుతున్న మంచు పండగలో షూట్ చేస్తున్నారు. ఈ సెట్స్‌లోని వర్కింగ్ స్టిల్స్ కొన్ని వైరల్‌గా మారాయి. కాగా, ఇప్పటివరకూ సపోరోలో ఏ సినిమా చిత్రీకరణ జరగలేదు. తొలిసారి ఈ చిత్రానికి అనుమతి తెచ్చుకున్నారు. సునిల్ పాండే దర్శకత్వంలో సొంత ప్రొడక్షన్‌లో ఆమిర్ ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే... 'మహరాజ్' అనే చిత్రం ద్వారా జునైద్ ఖాన్ హీరోగా పరిచయం కానున్నారు. ఈ ఏడాదే ఈ చిత్రం రిలీజ్ కానుంది. ప్రస్తుతం సాయి పల్లవి కాంబినేషన్‌లో చేస్తున్నది జునైద్‌కి రెండో సినిమా. ఇక సాయి పల్లవికి హిందీలో ఇది తొలి చిత్రం.

ఆ స్ఫూర్తితోనే ఈ కథ రాశాను

– డైరెక్టర్ వీఐ ఆనంద్

''సూపర్ నేచురల్ ఫ్యాంటసీ జోనర్‌లో 'ఊరు పేరు భైరవకోన' సినిమా రూపొందింది. మనిషి చనిపోయిన తర్వాత 11 రోజులు ఆత్మ తాలూకు ప్రయాణం ఎలా ఉంటుందన్నది గరుడ పురాణంలో చదివాను. ఆ స్ఫూర్తితో ఈ చిత్రకథ రాశాను. యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా చాలా ఎంజాయ్ చేస్తారు'' అని డైరెక్టర్ వీఐ ఆనంద్ అన్నారు. సందీప్ కిషన్ హీరోగా నటించిన చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించిన ఈ సినిమా ఈ 16న రిలీజవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వీఐ ఆనంద్ పంచుకున్న విశేషాలు.



● సందీప్ కిషన్‌కి రెండు ఐడియాలు చెబితే 'ఊరు పేరు భైరవకోన' కథకు ఎగ్జయిట్ అయ్యాడు. నాకు కూడా ఈ కథ చేస్తే చాలా కొత్తగా ఉంటుంది, ఒక ట్రెండ్ సెట్ చేసేలా ఉంటుందని ఫిక్స్ అయ్యాం. రాజేశ్ దండా ఈ కథ వినగానే ఎగ్జయిట్ అయ్యారు. సందీప్, నా మంచి కోరే అనిల్ సుంకరగారు కూడా ఈ ప్రాజెక్ట్‌లోకి రావడంతో ఈ సినిమా ప్రారంభమైంది. బిగ్ స్క్రీన్స్‌పై విజువల్, సౌండ్ పరంగా ఆడియన్స్‌కి గొప్ప అనుభవాన్ని ఇచ్చే సినిమా ఇది. ● ఈ చిత్రకథలో కర్మ సిద్ధాంతం, గరుడపురాణం, శివదండం.. వంటి నేపథ్యాలు ఉన్నాయి కాబట్టి 'ఊరు పేరు భైరవకోన' యాప్ట్ అనిపించి ఆ టైటిల్ ఫిక్స్ చేశాం. 'టైగర్' టైమ్‌లో ఉన్న ఫైర్, ప్యాషన్ సందీప్‌లో ఇప్పుడూ ఉన్నాయి. ప్రతి సినిమాని తొలి సినిమాలానే చేస్తున్నాడు. నా కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్స్‌తో వస్తున్న సినిమా ఇది. ● నేను గతంలో అల్లు అర్జున్‌తో ఓ సినిమాతో పాటు, గీతా ఆర్ట్స్‌లో ఓ మూవీ చేయాల్సింది. కొన్ని కారణాల వల్ల పట్టాలెక్కలేదు. ప్రస్తుతం హీరో నిఖిల్‌తో ఓ సినిమా చర్చల్లో ఉంది. అలాగే ఓ పెద్ద హీరోకి యాక్షన్ కథ రాస్తున్నాను.

ప్రభాస్‌కు జోడీగా?



● రష్మిక

'యానిమల్' సినిమాలో గీతాంజలి పాత్రలో నటించి, ప్రేక్షకులను మరింత మెప్పించారు రష్మికా మందన్నా. 'అర్జున్ రెడ్డి', 'కబీర్‌సింగ్' వంటి హిట్ ఫిల్మ్స్ తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన చిత్రం ఇది. కాగా సందీప్‌రెడ్డి నెక్ట్స్ ఫిల్మ్ 'స్పిరిట్'. ఈ చిత్రంలో ప్రభాస్ హీరో. ఆయన ఓ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా ఈ సినిమాలో హీరోయిన్‌గా రష్మికా మందన్నా నటించనున్నారని, రష్మికకు సందీప్ రెడ్డి వంగా ఇటీవలే 'స్పిరిట్' కథను కూడా నరేట్ చేశారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. మరి.. 'స్పిరిట్' సినిమాలో ప్రభాస్‌కు జోడీగా రష్మికా మందన్నా కనిపిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

త్వరలో సైరన్



● కీర్తీ సురేష్, 'జయం' రవి, అనుపమ

సైరన్ మోగించడానికి రెడీ అయ్యారు 'జయం' రవి, కీర్తీ సురేష్, అనుపమా పరమేశ్వరన్. ఆంథోని భాగ్యరాజ్ దర్శకత్వంలో 'జయం' రవి, కీర్తీ సురేష్, అనుపమా పరమేశ్వరన్ హీరో హీరోయిన్లుగా నటించిన తమిళ చిత్రం 'సైరన్'. ఈ నెల 23న ఈ చిత్రం విడుదల కానుంది. తెలుగులో గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మహేశ్వర్ రెడ్డి మూలి విడుదల చేస్తున్నారు. ''దర్శకుడిగా నా ఫస్ట్ మూవీనే పెద్ద హీరోతో చేయడం కలలా ఉంది. ఈ చిత్రం అద్భుతంగా వచ్చింది'' అని ఆంథోని భాగ్యరాజ్ అన్నారు. ''ఈ చిత్రంలో రెండు విభిన్నమైన పాత్రలు చేశాను. ఆంథోని భాగ్యరాజ్ బాగా తెరకెక్కించారు. ఎమోషన్స్ ప్రధానంగా సాగే ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ తన సంగీతంతో ప్రాణం పోసాడు. తమిళ, తెలుగు ప్రేక్షకులను మా 'సైరన్' ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది'' అన్నారు 'జయం' రవి.

తండ్రిని ప్రేమించండి



● ఎస్పీ చరణ్, శ్రీ హర్ష

శ్రీ హర్ష, కషికా కపూర్ జంటగా ప్రముఖ గాయకుడు ఎస్పీ చరణ్ ఓ కీలక పాత్రలో పవన్ కేతరాజు దర్శకత్వంలో 'లవ్ యువర్ ఫాదర్' చిత్రం ఆరంభమైంది. కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, అన్నపురెడ్డి సామ్రాజ్య లక్ష్మి నిర్మిస్తున్నారు. తొలి సన్నివేశానికి మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌కి చెందిన చామకూర శాలిని కెమెరా స్విచ్చాన్ చేయగా, సీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గోపాల్ రెడ్డి క్లాప్ కొట్టారు. మహేశ్ రాఠీ మాట్లాడుతూ– ''తండ్రీ కొడుకుల అనుబంధం, భావోద్వేగాలను చూపించేలా 'లవ్ యువర్ ఫాదర్' ఉంటుంది'' అన్నారు. ''కిశోర్ రాఠీగారి జీవితంలోని ఓ చిన్న ఘటన తీసుకుని ఈ చిత్రకథ రాశాను'' అన్నారు పవన్ కేతరాజు. ''ఇది నా మొదటి సినిమా'' అన్నారు శ్రీహర్ష. కెమెరామేన్ మణీంద్ర కుమార్, నటి రియా మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ.

రజాకార్ తీసినందుకు ధన్యవాదాలు

– కె. రాఘవేంద్ర రావు



● యాటా సత్యనారాయణ, రాఘవేంద్ర రావు, రాధా మనోహర్ దాస్, గూడూరు నారాయణ రెడ్డి, అనసూయ

''రజాకార్' ట్రైలర్ చూశాక రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఎంతో మంది త్యాగాల వల్లే ఈ రోజు మనం ప్రశాంతంగా ఉన్నాం. చరిత్ర గురించి నేటి తరానికి చెప్పాలని 'రజాకార్' చిత్రాన్ని తీసిన గూడూరు నారాయణ రెడ్డి, నా శిష్యుడు యాటా సత్యనారాయణకి థ్యాంక్స్. ఇలాంటి సినిమాని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలి'' అని దర్శకుడు కె. రాఘవేంద్రరావు అన్నారు. బాబీ సింహా, వేదిక, అనుష్యా త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే, అనసూయ ప్రధాన పాత్రల్లో యాటా సత్యనారాయణ దర్శకత్వం వహించిన చిత్రం 'రజాకార్'. గూడూరు నారాయణ రెడ్డి నిర్మించిన ఈ సినిమా మార్చి 1న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, మరాఠీ, హిందీ భాషల్లో విడుదలవుతోంది. ఈ చిత్రం తెలుగు ట్రైలర్ విడుదల వేడుకకి కె. రాఘవేంద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యాటా సత్యనారాయణ మాట్లాడుతూ– ''రజాకార్లు చేసిన అన్యాయాలను నేటి తరానికి చెప్పేందుకే ఈ సినిమా తీశాం'' అన్నారు. గూడూరు నారాయణ రెడ్డి మాట్లాడుతూ– ''మన హైదరాబాద్ చరిత్ర గురించి, సెప్టెంబర్ 17 ప్రాముఖ్యత గురించి చాలా మందికి తెలియదు. అందుకే నా ఆస్తులు అమ్మి, ఈ చరిత్రను సినిమాగా తీశా'' అన్నారు. ''ఈ సినిమాలో రెండు అద్భుతమైన పాటలు రాశాను'' అన్నారు సుద్దాల అశోక్ తేజ. ఈ వేడుకలో జేకే భారవి, రాధా మనోహర్ దాస్, అనసూయ తదితరులు మాట్లాడారు.

సందేశం ఉండేలా చూసుకుంటాను



● హరనాథ్ పొలిచెర్ల

''నా ప్రతి సినిమాలో ఓ సందేశం ఉండేలా చూసుకుంటాను. అయితే గొప్ప గొప్ప సందేశాలు ఇచ్చే స్థాయి కాదు నాది. కానీ, సమాజం పట్ల కళాకారుడిగా నాకు బాధ్యత ఉంటుంది. దాన్ని ప్రతి క్షణం గుర్తు పెట్టుకుంటాను. 'డ్రిల్' కోసం చాలా కష్టపడ్డాం.. ఫైనల్ ఔట్‌పుట్ చూసుకున్నాక ఆ కష్టాలన్నీ మర్చిపోయా'' అని హరనాథ్ పొలిచెర్ల అన్నారు. ఆయన లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'డ్రిల్'. ఈ నెల 16న ఈ సినిమా రిలీజవుతున్న సందర్భంగా హరనాథ్ పొలిచెర్ల మాట్లాడుతూ– ''అమెరికాలో డాక్టర్‌గా బిజీగా ఉన్నా నా లక్ష్యం కోసం మళ్లీ నటన వైపు వచ్చాను. నేను చేసిన 'హోప్' సినిమాకు జాతీయ అవార్డు వచ్చింది. 'డ్రిల్' క్రైమ్ బేస్డ్ మూవీ. ఇందులో పోలీస్ ఆఫీసర్ పాత్ర చేశాను. ఈ సినిమాలో హంతకుడు డ్రిల్లింగ్ మిషన్ వాడి హత్యలు చేస్తుంటాడు.. అందుకే 'డ్రిల్' టైటిల్ పెట్టాం'' అన్నారు.

పైలెట్ తాన్యా శర్మ



● రుహానీ శర్మ

వరుణ్ తేజ్ హీరోగా నటించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. శక్తీ ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా రినైసన్స్ పిక్చర్స్‌పై రూపొందిన ఈ సినిమా మార్చి 1న తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ మూవీలో వరుణ్ తేజ్ ఐఏఎఫ్ ఆఫీసర్‌గా, మానుషీ చిల్లర్ రాడార్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. రుహానీ శర్మ ఎయిర్ ఫోర్స్ పైలెట్ తాన్యా శర్మ పాత్ర చేశారు. ఆమె ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▼	523	71,072
నిఫ్టీ ▼	166	21,616

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (11.30 గంటలకు)

నాస్‌డాక్‌	16,044	▲ 53
డోజోన్స్‌	38,845	▲ 174
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,574	▲ 1
డాక్స్‌	17,037	▲ 111
షాంఘై	2,866	▲ 36
నికాయ్‌	36,897	▲ 34

• అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

బులియన్‌ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,301
బంగారం (99.5 స్వచ్ఛత)	62,052
వెండి (కేజీ)	71,140

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	82.63	83.65
£	బ్రిటన్‌ పౌండ్‌	103.73	106.30
€	యూరో	88.57	90.92
¥	జపాన్‌ ఎన్‌ (100)	55.39	56.64
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	53.24	55.16
S$	సింగపూర్‌ డాలర్‌	59.28	64.01
SAR	సౌదీ రియాల్‌	21.18	22.80
UAE D	యూఏఈ దిర్హామ్‌	21.70	23.50
¥	చైనా యువాన్‌	10.42	12.49

కోల్‌ ఇండియా లాభం అప్‌

క్యూ3లో రూ. 9,094 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం కోల్‌ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్‌–డిసెంబర్‌ (క్యూ3)లో కన్సాలిడేటెడ్‌ నికర లాభం 18 శాతం ఎగసి రూ. 9,094 కోట్లను అధిగమించింది. ఇది కంపెనీ చరిత్రలోనే మూడో త్రైమాసికానికి అత్యధికంకాగా.. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 7,756 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 5.25 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్‌ ప్రకటించింది. దీంతో ఈ ఏడాదికి మొత్తం మధ్యంతర డివిడెండ్‌ రూ. 20.50కు చేరింది. ఈ క్యూ3లో ఆదాయం రూ. 35,169 కోట్ల నుంచి 36,154 కోట్లకు బలపడింది. బొగ్గు ఉత్పత్తి 11 శాతం పుంజుకుని 199 మిలియన్‌ టన్నులకు చేరింది. సరఫరాలు 9% వృద్ధి తో 191.3 ఎంటీని తాకాయి.

కోల్‌ ఇండియా షేరు బీఎస్‌ఈలో 5% పతనమై రూ. 433 వద్ద ముగిసింది.

హోండా ఎలివేట్‌ 'లవ్‌ డ్రైవ్‌' ఈవెంట్‌



హైదరాబాద్‌: హోండా కార్స్‌ ఇండియా తమ డీలర్లతో కలిసి వాలంటైన్స్‌ వీక్‌ను పురస్కరించుకొని డ్రీమ్‌ వ్యాలీ రిసార్ట్స్‌లో 'లవ్‌ డ్రైవ్‌' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించింది. దాదాపు 300 మందికి పైగా హోండా కస్టమర్లు ఈ వేడుకలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వినియోగదారులు 'హోండా కార్స్‌'తో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గతేడాది సెప్టెంబర్‌ విడుదలైన హోండా ఎలివేటర్‌ ఎస్‌యూవీ మోడళ్లు హైదరాబాద్‌లోనే 1000కి పైగా అమ్ముడయ్యాయి.

తగ్గిన పరిశ్రమల జోరు..

- డిసెంబర్‌లో ఉత్పత్తి వృద్ధి 3.8 శాతానికి పరిమితం
- మైనింగ్, విద్యుత్, క్యాపిటల్‌ గూడ్స్‌ పేలవం
- ఆహార ధరల ఊరట



న్యూఢిల్లీ: భారత్‌ మొత్తం స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) 25 శాతంపైగా వెయిటేజ్‌ ఉన్న పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి రేటు 2023 డిసెంబర్‌లో మందగించింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) 3.8 శాతంగా నమోదయ్యింది. 2022 ఇదే నెలలో ఈ రంగం వృద్ధి స్పీడ్‌ 5.1 శాతం. సమీక్షా కాలంలో మైనింగ్, విద్యుత్‌ ఉత్పత్తి విభాగాలు పేలవ పనితీరును ప్రదర్శించాయి. అయితే 2023 నవంబర్‌తో (2.4 శాతం) డిసెంబర్‌లో సూచీ పెరగడం (3.8 శాతానికి) కొంత ఊరటనిచ్చే అంశం. ఇక జనవరి వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్‌ ద్రవ్యోల్బణం 5.1%గా నమోదైంది. ఇది మూడు నెలల కనిష్ట స్థాయి.

కీలక రంగాలు ఇలా...

➤ జాతీయ గణాంకాల కార్యాలయం గణాంకాల ప్రకారం మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో 70 శాతం వెయిటేజ్‌ ఉన్న తయారీ రంగం వృద్ధి రేటు 3.6 శాతం (2022 డిసెంబర్‌) నుంచి 3.9 శాతానికి (2023 డిసెంబర్‌) పెరిగింది.

➤ విద్యుత్‌ ఉత్పత్తి వృద్ధి 10.4 శాతం నుంచి 1.2 శాతానికి పడిపోయింది.

➤ మైనింగ్‌ క్షీణతలోనే ఉంది. అయితే క్షీణ రేటు 10.1 శాతం నుంచి 5.1 శాతానికి తగ్గింది.

తొమ్మిది నెలల కాలంలో అప్‌

ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల (ఏప్రిల్‌–డిసెంబర్‌) కాలాన్ని చూస్తే.. మాత్రం ఐఐపీ వృద్ధి రేటు 5.5% నుంచి 6.1%కి పెరిగింది.

ఆహార ధరలు తగ్గుముఖం..

ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ కీలక నిర్ణయాలకు ప్రాతిపదిక అయిన ఆహార ద్రవ్యోల్బణం జనవరిలో 3 నెలల కనిష్ట స్థాయిలో 5.1 శాతానికి తగ్గింది. కూరగాయలు, పండ్లు, ఇతర ఆహార ఉత్పత్తుల ధరలు తగ్గడం దీనికి కారణమని అధికారిక గణాంకాలు పేర్కొన్నాయి. ఆహార ఉత్పత్తుల బాస్కెట్‌ను చూస్తే, డిసెంబర్‌లో ధరల భారం 9.53 శాతం పెరగ్గా, ఈ భారం జనవరిలో 8.3 శాతానికి తగ్గింది. ఆహారం, పానీయాల విభాగంలో 7.58%, హౌసింగ్‌ రంగంలో 3.20% ద్రవ్యోల్బణం నమోదైంది.



వైజాగ్‌ కొత్త ప్లాంటులో ఉత్పత్తి ఈ ఏడాదే!

అరబిందో ఫార్మా వెల్లడి



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: అరబిందో ఫార్మా ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌ వద్ద ఏర్పాటు చేస్తున్న ఇంజెక్టేబుల్స్‌ ప్లాంటులో వాణిజ్య కార్యకలాపాలు 2024–25 ఆర్థిక సంవత్సరం తొలి/రెండవ త్రైమాసికంలో ప్రారంభం కానున్నాయి. లేదా 2025–26 ప్రారంభంలో మొదలయ్యే అవకాశం ఉందని ఇన్వెస్టర్లతో కాన్ఫరెన్స్‌ కాల్‌ సందర్భంగా కంపెనీ సోమవారం వెల్లడించింది. చైనా ప్లాంటును పూర్తి స్థాయిలో స్థాపించామని, ఈయూ గుడ్‌ మాన్యుఫ్యాక్చరింగ్‌ ప్రాక్టీస్‌ ఆమోదం పొందినట్టు తెలిపింది. ఈ కేంద్రం వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి లేదా రెండవ త్రైమాసికం నుంచి ఆదాయాలను అందిస్తుందని వివరించింది. నాల్గవ త్రైమాసికంలో మార్జిన్‌ పరంగా కంపెనీ ఆశాజనకంగా ఉంది. ఓరల్‌ సాలిడ్స్‌ వృద్ధి బలంగా ఉంటుందని భావిస్తోంది. 20 శాతం ఎబిటా మార్జిన్‌ లక్ష్యాన్ని సాధించగలమని కంపెనీ ధీమాగా ఉంది. రెవ్లిమిడ్‌ ఔషధం ద్వారా రాబోయే త్రైమాసికాల్లో సగటున 150 మిలియన్‌ డాలర్లకుపైగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని అరబిందో పేర్కొంది. 2025–26లో బయోసిమిలర్ల విక్రయాల నుంచి పెద్ద ఎత్తున ఆదాయం ఉంటుందని తెలిపింది.

నికరలాభం 91 శాతం జంప్‌..

డిసెంబర్‌ త్రైమాసికంలో అరబిందో ఫార్మా నికర లాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 91 శాతం ఎగసి రూ.940 కోట్లు సాధించింది. ఎబిటా రూ.1,601 కోట్లు, ఎబిటా మార్జిన్‌ 21.8 శాతంగా ఉంది. టర్నోవర్‌ 14.7 శాతం అధికమై రూ.7,352 కోట్లు నమోదు చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.1.50 పైసలు మధ్యంతర డివిడెండ్‌ ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో అరబిందో ఫార్మా షేరు ధర బీఎస్‌ఈలో సోమవారం 1.59 శాతం ఎగసి రూ.1,018 వద్ద స్థిరపడింది.

'పేటీఎం' మీద చర్యలపై తగ్గేది లేదు..

- బాగా ఆలోచించే నిర్ణయాలు తీసుకుంటాం
- ఆర్‌బీఐ గవర్నర్‌ దాస్‌ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్స్‌ బ్యాంక్‌ (పీపీబీఎల్‌)పై ప్రకటించిన చర్యలను పునఃసమీక్షించే ప్రసక్తే లేదని రిజర్వ్‌ బ్యాంక్‌ గవర్నర్‌ శక్తికాంత దాస్‌ స్పష్టం చేశారు. అన్నీ ఆలోచించిన తర్వాతే తాము నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. తమ ప్రధాన లక్ష్యం కస్టమర్లు, డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడటమే తప్ప.. తాము పేటీఎంకి వ్యతిరేకమేమీ కాదని ఆయన పేర్కొన్నారు. ఫిన్‌టెక్‌ రంగానికి ఆర్‌బీఐ ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తూనే ఉందని, పరిశ్రమ మరింత వేగంగా వృద్ధి చెందాలన్నదే తమ ఆకాంక్ష అని దాస్‌ తెలిపారు.'అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే పీపీబీఎల్‌పై చర్యలు తీసుకున్నాం. కస్టమర్ల సందేహాల నివృత్తి కోసం ఈ వారంలోనే ఎఫ్‌ఏక్యూలను జారీ చేస్తాం' అని ఆర్‌బీఐ సెంట్రల్‌ బోర్డ్‌ ఆఫ్‌ డైరెక్టర్ల 606వ భేటీలో పాల్గొన్న సందర్భంగా దాస్‌ తెలిపారు. పదే పదే నిబంధనలను ఉల్లంఘిస్తోందన్న ఆరోపణల వల్ల దాదాపు అన్ని కార్యకలాపాలను నిలిపివేయాలంటూ పీపీబీఎల్‌ మీద ఆర్‌బీఐ ఆంక్షలు విధించడం తెలిసిందే. ఇవి ఫిబ్రవరి 29 తర్వాత నుంచి అమల్లోకి వస్తాయి. ఈ నేపథ్యంలోనే దాస్‌ స్పందన ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆర్థిక పరిస్థితులపై సమీక్ష..

ఆర్‌బీఐ సెంట్రల్‌ బోర్డ్‌ ఆఫ్‌ డైరెక్టర్ల సమావేశంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ ప్రసంగించారు. 2024–25 మధ్యంతర బడ్జెట్‌లో ప్రధానంగా దృష్టి పెడుతున్న అంశాలను వివరించారు. ఆర్థిక రంగం నుంచి ప్రభుత్వం ఏం ఆశిస్తోందనేది పేర్కొన్నారు.

సెయిల్‌ లాభం నేలచూపు

క్యూ3లో రూ. 423 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ స్టీల్‌ తయారీ దిగ్గజం సెయిల్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్‌–డిసెంబర్‌ (క్యూ3)లో కన్సాలిడేటెడ్‌ నికర లాభం 22 శాతం క్షీణించి రూ. 423 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 542 కోట్లు ఆర్జించింది. ఆదాయం తగ్గడం లాభాలను దెబ్బతీసింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 1 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఇందుకు ఈ నెల 20 రికార్డ్‌ డేట్‌గా ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 25,140 కోట్ల నుంచి 23,492 కోట్లకు బలహీనపడింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 24,825 కోట్ల నుంచి రూ. 23,141 కోట్లకు తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో సెయిల్‌ షేరు బీఎస్‌ఈలో 8 శాతం పతనమై రూ. 123 వద్ద ముగిసింది.

బ్యాంకింగ్, మెటల్‌ షేర్లలో లాభాల స్వీకరణ

ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూలతల ప్రభావం



ముంబై: రిటైల్‌ ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి గణాంకాల వెల్లడికి ముందు స్టాక్‌ మార్కెట్లో అప్రమత్తత చోటుచేసుకుంది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచీ ప్రతికూల సంకేతాలు అందాయి. ఫలితంగా సోమవారం 523 పాయింట్లు నష్టపోయి 71,072 వద్ద ముగిసింది. నిఫ్టీ 166 పాయింట్లు పతనమై 21,616 వద్ద నిలిచింది. ప్రారంభంలోనే సెన్సెక్స్‌ 127 పాయింట్లు పెరిగి 71,722 వద్ద, నిఫ్టీ 49 పాయింట్లు బలపడి 21,832 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. కీలక స్థూల ఆర్థిక గణాంకాల ప్రకటన నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, మెటల్, క్యాపిటల్‌ గూడ్స్, ఫైనాన్స్‌ సర్వీసెస్, వినిమయ, విద్యుత్, ఆయిల్‌ అండ్‌ గ్యాస్, మౌలిక రంగాలకు చిన్న, మధ్య తరహా షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. దీంతో బీఎస్‌ఈ స్మాల్, మిడ్‌ క్యాప్‌ సూచీలు వరుసగా 3.16%, 2.62%, చొప్పున నష్టపోయాయి. ఐటీ, ఫార్మా షేర్లకు మాత్రమే కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.127 కోట్ల షేర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,712 షేర్లు కొన్నారు. పలు దేశాల ఆర్థిక స్థితిగతులను ప్రతిబింబి పజేసే స్థూల ఆర్థిక డేటా వెల్లడి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తుండటంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

పార్క్‌ హోటల్స్‌ లిస్టింగ్‌ భేష్‌...

ఏపీజే సురేంద్ర పార్క్‌ హోటల్స్‌ లిస్టింగ్‌ రోజే భారీ లాభాలు పంచింది. ఇష్యూ ధర (రూ.155)తో పోలిస్తే బీఎస్‌ఈలో 21% ప్రీమియంతో రూ.187 వద్ద లిస్టయింది. ట్రేడింగ్‌లో 44% ఎగసి రూ.224 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివర్లో స్వల్ప లాభాల స్వీకరణ జరగడంతో 31% లాభపడి రూ.203 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్‌ విలువ రూ.4,341 కోట్లుగా నమోదైంది.

భవిత

• గ్రూప్‌1, గ్రూప్‌2 ప్రత్యేకం- కరెంట్‌ అఫైర్స్‌ కోసం
ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

కెరీర్‌ కౌన్సెలింగ్‌
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్‌ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐడీబీఐ బ్యాంక్‌లో 500 జూనియర్‌ అసిస్టెంట్‌ మేనేజర్‌ పోస్టులు

దేశవ్యాప్తంగా వివిధ జోన్లలో ఐడీబీఐ జూనియర్‌ అసిస్టెంట్‌ మేనేజర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మణిపాల్‌(బెంగళూరు),నిట్టే(గ్రేటర్‌ నోయిడా) విద్యా సంస్థలతో కలిసి పోస్ట్‌ గ్రాడ్యుయేట్‌ డిప్లొమా ఇన్‌ బ్యాంకింగ్‌ అండ్‌ ఫైనాన్స్‌(పీజీడీబీఎఫ్‌) కోర్సు ద్వారా పోస్టులను భర్తీ చేయనుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 500.
» **పోస్టుల వివరాలు:** జూనియర్‌ అసిస్టెంట్‌ మేనేజర్‌(గ్రేడ్‌–ఓ)–500(యూఆర్‌–203, ఎస్సీ–75,ఎస్టీ–37, ఈడబ్ల్యూఎస్‌–50, ఓబీసీ–135)
» **జోన్‌లు:** అహ్మదాబాద్, భోపాల్, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ముంబై, నాగ్‌పూర్, పుణె, భువనేశ్వర్, పాట్నా, చండీగఢ్, ఢిల్లీ, కోల్‌కతా, లక్నో.
» **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 31.01.2024 నాటికి 21 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ట వయసులో సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్‌ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారు పర్సనల్‌ ఇంటర్వ్యూలకు అర్హత సాధిస్తారు. ప్రతిభ, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేస్తారు.
» **వేతనం:** ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కాలం(6 నెలలు)లో నెలకు రూ.5000 ఇస్తారు. ఇంటర్న్‌షిప్‌(రెండు నెలలు) సమయంలో నెలకు రూ.15,000 చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకుని ఉద్యోగంలో చేరిన వారికి రూ.6.14 లక్షల నుంచి రూ.6.50 లక్షల వరకు వార్షిక వేతనం అందుతుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ రిజిస్ట్రేషన్‌/ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభం:** 12.02.2024.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 26.02.2024
» **ఆన్‌లైన్‌ పరీక్ష తేది:** 17.03.2024.
» **వెబ్‌సైట్‌:** www.idbibank.in

ఐఐఎస్సీ బెంగళూరులో పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాలు

బెంగళూరులోని ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సైన్స్‌(ఐఐఎస్సీ).. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» రీసెర్చ్‌ ప్రోగ్రామ్‌(పీహెచ్‌డీ/ఎంటెక్‌(రీసెర్చ్‌))
» **పీహెచ్‌డీ(సైన్స్‌):** విభాగాలు.. ఆస్ట్రానమీ అండ్‌ ఆస్ట్రోఫిజిక్స్, బయోకెమిస్ట్రీ, ఎకోలాజికల్‌ సైన్సెస్, హై ఎనర్జీ ఫిజిక్స్, ఇనార్గానిక్‌ అండ్‌ ఫిజికల్‌ కెమిస్ట్రీ, మెటీరియల్స్‌ రీసెర్చ్, మ్యాథమేటిక్స్‌ తదితరాలు.
» **ఎంటెక్‌(రీసెర్చ్‌), పీహెచ్‌డీ(ఇంజనీరింగ్‌):** విభాగాలు.. ఏరోస్పేస్‌ ఇంజనీరింగ్, అట్మాస్ఫియరిక్‌ అండ్‌ ఓషియానిక్‌ సైన్సెస్, కెమికల్‌ ఇంజనీరింగ్, సివిల్‌ ఇంజనీరింగ్, కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఆటోమేషన్,ఎర్త్‌ సైన్సెస్‌ తదితరాలు.
» **పీహెచ్‌డీ(ఇంటర్‌ డిసిప్లినరీ):** విభాగాలు.. బయో ఇంజనీరింగ్, ఎనర్జీ, మ్యాథమేటికల్‌ సైన్సెస్, వాటర్‌ రీసెర్చ్, సైబర్‌ ఫిజికల్‌ సిస్టమ్స్, క్లైమేట్‌ చేంజ్‌ బ్రెయిన్, కంప్యూటేషన్‌ అండ్‌ డేటా సైన్స్‌.
» **ఇంజనీరింగ్‌ ప్రోగ్రామ్‌(ఎంటెక్‌/ఎం.డీఈఎస్‌/ఎం.ఎంజీటీ):** ఎంటెక్‌ ప్రోగ్రామ్, మాస్టర్‌ ఆఫ్‌ డిజైన్‌(ఎం.డీఈఎస్‌), మాస్టర్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌(ఎం.ఎంజీటీ). **విభాగాలు:** ఏరోస్పేస్‌ ఇంజనీరింగ్, కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇంజనీరింగ్, సివిల్‌ ఇంజనీరింగ్, మెటీరియల్స్‌ ఇంజనీరింగ్, సస్టైనబుల్‌ టెక్నాలజీస్‌ తదితరాలు.
» **సైన్స్‌ ప్రోగ్రామ్‌(ఎంఎస్సీ):** **విభాగాలు:** లైఫ్‌ సైన్సెస్‌/కెమికల్‌ సైన్సెస్.
» **ఇంటిగ్రేటెడ్‌ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌: విభాగాలు:** బయోలాజికల్‌ సైన్సెస్, కెమికల్‌ సైన్సెస్, మ్యాథమేటికల్‌ సైన్సెస్, ఫిజికల్‌ సైన్సెస్.
» **ఎక్స్‌టర్నల్‌ రిజిస్ట్రేషన్‌ ప్రోగ్రామ్‌(ఈఆర్‌పీ) (పీహెచ్‌డీ/ఎంటెక్‌(రీసెర్చ్‌)):**
» **అర్హత:** కోర్సును అనుసరించి బ్యాచిలర్‌ డిగ్రీ, మాస్టర్స్‌ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్‌ గేట్‌ స్కోరు/జీప్యాట్‌ స్కోరు, నెట్‌ జేఆర్‌ఎఫ్, సీడ్, క్యాట్‌/జీమ్యాట్,జామ్‌ స్కోరు సాధించి ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 22.03.2024
» **వెబ్‌సైట్‌:** https://iisc.ac.in

నార్మ్‌లో పీజీడీఎం కోర్సులో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని నేషనల్‌ అకాడమీ ఆఫ్‌ అగ్రికల్చరల్‌ రీసెర్చ్‌ మేనేజ్‌మెంట్‌(నార్మ్‌) .. 2024–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీడీఎం(అగ్రి బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 66
» **అర్హత:** అగ్రికల్చర్‌ లేదా అనుబంధ విభాగాల్లో బ్యాచిలర్‌ డిగ్రీతోపాటు క్యాట్‌ 2023/సీమ్యాట్‌ 2024 స్కోరు సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** క్యాట్‌/సీమ్యాట్‌ స్కోరు, పర్సనల్‌ ఇంటర్వ్యూ, అనలిటికల్‌ రైటింగ్‌ స్కిల్‌ టెస్ట్, షార్ట్‌ ప్రెజెంటేషన్, ఎక్స్‌పీరియన్స్, అకడమిక్‌ స్కోర్, డైవర్సిటీ ఫ్యాక్టర్‌ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 29.02.2024
» **వెబ్‌సైట్‌:** https://naarm.org.in

రైల్వేలో.. అసిస్టెంట్‌ లోకో పైలట్‌

రైల్వే రిక్రూట్‌మెంట్‌ బోర్డ్‌ (ఆర్‌ఆర్‌బీ).. భారతీయ రైల్వేకు సంబంధించి ట్రాక్‌మెన్‌ నుంచి గెజిటెడ్‌ పోస్టుల వరకూ.. టెక్నికల్, నాన్‌-టెక్నికల్‌ ఉద్యోగాల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడుతుంది. ఆర్‌ఆర్‌బీ తాజాగా టెక్నికల్‌ విభాగంలో.. మొత్తం 5,696 అసిస్టెంట్‌ లోకో పైలట్‌ పోస్ట్‌లకు నోటిఫికేషన్‌ విడుదల చేసింది. ఐటీఐ నుంచి బీటెక్‌ వరకు.. పలు టెక్నికల్‌ అర్హతలతో పోటీ పడే అవకాశం ఉంది! ఈ నేపథ్యంలో.. ఆర్‌ఆర్‌బీ అసిస్టెంట్‌ లోకో పైలట్‌ పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్‌ అంశాలు, ప్రిపరేషన్‌ తదితర వివరాలు..

» దేశ వ్యాప్తంగా 21 ఆర్‌ఆర్‌బీల ద్వారా 5,696 పోస్ట్‌ల భర్తీ
» ఆర్‌ఆర్‌బీ-సికింద్రాబాద్‌ పరిధిలో 758 ఉద్యోగాలు
» రాత పరీక్ష, ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌లో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» పే లెవల్‌-2తో ప్రారంభ వేతనం; మరెన్నో నదుపాయాలు



మొత్తం 5,696 పోస్టులు

భారత రైల్వే శాఖ ప్రకటించిన నోటిఫికేషన్‌ ప్రకారం–21 ఆర్‌ఆర్‌బీల పరిధిలో మొత్తం 5,696 అసిస్టెంట్‌ లోకో పైలట్‌ పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు. ఆర్‌ఆర్‌బీ– సికింద్రాబాద్‌ పరిధిలో 758 ఖాళీలున్నాయి. వీటిలో దక్షిణ మధ్య రైల్వేలో 559 పోస్ట్‌లు, ఈస్ట్‌ కోస్ట్‌ రైల్వే పరిధిలో 199 పోస్ట్‌లు ఉన్నాయి. అదే విధంగా దక్షిణ మధ్య రైల్వేకు సంబంధించి ఆర్‌ఆర్‌బీ–ముంబై పరిధిలోనూ 26 పోస్ట్‌లను; ఈస్‌ కోస్ట్‌ రైల్వే జోన్‌కు సంబంధించి ఆర్‌ఆర్‌బీ–భువనేశ్వర్‌ పరిధిలో 280 పోస్ట్‌లను పేర్కొన్నారు. అభ్యర్థులు ఏదో ఒక ఆర్‌ఆర్‌బీకి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలనే నిబంధన విధించారు. సదరు ఆర్‌ఆర్‌బీ పరిధిలోని జోన్లను ప్రాధాన్యత క్రమంలో ఎంచుకోవాలి.

విద్యార్హత

• ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఇన్‌స్ట్రుమెంట్‌ మెకానిక్, మిల్‌రైట్‌/మెయింటనెన్స్‌ మెకానిక్, మెకానిక్‌ (రేడియో అండ్‌ టీవీ), మెకానిక్‌ (మోటార్‌ వెహికిల్‌), వైర్‌మ్యాన్, ట్రాక్టర్‌ మెకానిక్, ఆర్మేచర్‌ అండ్‌ కాయిల్‌ వైండర్, మెకానిక్‌ (డీజిల్‌), హీట్‌ ఇంజన్, టర్నరల్, మెకనిస్ట్, రిఫ్రిజిరేషన్‌ అండ్‌ ఎయిర్‌ కండిషనింగ్‌ మెకానిక్‌ ట్రేడ్‌లలో ఏదో ఒక ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి (లేదా)–మెకానికల్‌/ఎలక్ట్రికల్‌/ఎలక్ట్రానిక్స్‌/ ఆటోమొబైల్‌ ఇంజనీరింగ్‌ బ్రాంచ్‌లతో డిప్లొమా లేదా బీటెక్‌ ఉత్తీర్ణత ఉండాలి.

• వయసు: జూలై 1, 2024 నాటికి 18–30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ(నాన్‌-(క్రీమీ లేయర్‌) వర్గాలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

పే లెవల్‌-2తో ప్రారంభ వేతనం

అసిస్టెంట్‌ లోకో పైలట్‌గా ఎంపికైన వారికి పే లెవల్‌–2తో ప్రారంభ వేతనం లభిస్తుంది. రూ.19,900–రూ.34,500 వేతన శ్రేణి అందుతుంది. ప్రారంభంలో నెలకు వేతనం రూ.35వేలు అందుకోవచ్చు. లోకో పైలట్‌గా ఎంపికైన వారికి వేతనంతోపాటు ఇతర సదుపాయాలను కూడా రైల్వే శాఖ కల్పిస్తోంది. నివాసానికి క్వార్టర్స్, రవాణా, విద్య, వైద్యం, సబ్సిడీ క్యాంటీన్‌ వంటి అనేక సౌకర్యాలు పొందే వీలుంటుంది. అసిస్టెంట్‌ లోకో పైలట్‌గా నియమితులైన వారు..భవిష్యత్తులో లోకో పైలట్‌ (హైస్పీడ్‌) స్థాయికి చేరుకునే అవకాశం ఉంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

అసిస్టెంట్‌ లోకో పైలట్‌ పోస్ట్‌ల భర్తీకి మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌–1, కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌–2, కంప్యూటర్‌ బేస్డ్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్.

కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌-1

ఎంపిక ప్రక్రియలో తొలి దశగా కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌–1ను నిర్వహిస్తారు. ఈ పరీక్షలో.. మ్యాథమెటిక్స్, మెంటల్‌ ఎబిలిటీ, జనరల్‌ సైన్స్, జనరల్‌ అవేర్‌నెస్‌ విభాగాల నుంచి 75 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి ఒక గంట.

కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌-2

తొలిదశ సీబీటీ–1లో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు 15 మందిని చొప్పున ఎంపిక చేసి.. రెండో దశలో కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌–2ను నిర్వహిస్తారు. సీబీటీ–2 పరీక్షలో పార్ట్‌–ఎ, పార్ట్‌–బి ఉంటాయి. పార్ట్‌–ఎలో మ్యాథమెటిక్స్; జనరల్‌ ఇంటెలిజెన్స్‌ అండ్‌ రీజనింగ్; బేసిక్‌ సైన్స్‌ అండ్‌ ఇంజనీరింగ్‌ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 100 ప్రశ్నలతో 90 నిమిషాల వ్యవధిలో పార్ట్‌–ఎ ఉంటుంది. పార్ట్‌–బిలో సంబంధిత ట్రేడ్‌ నుంచి ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 75 ప్రశ్నలకు 60 నిమిషాల్లో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. పార్ట్‌–బి పూర్తిగా అర్హత పరీక్ష మాత్రమే. రెండు పేపర్లలోనూ నెగెటివ్‌ మార్కింగ్‌ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కును తగ్గిస్తారు.

ప్రాంతీయ భాషల్లో పరీక్ష

అసిస్టెంట్‌ లోకో పైలట్‌ ఎంపిక ప్రక్రియలో.. సీబీటీ–1, 2లను 13 ప్రాంతీయ భాషల్లోనూ నిర్వహించనున్నారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు తెలుగు లేదా ఉర్దూలో పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. మూడో దశ పరీక్ష సీబీఏటీని మాత్రం ఇంగ్లిష్‌ లేదా హిందీ మాధ్యమంలోనే నిర్వహిస్తారు.

మూడో దశ.. కంప్యూటర్‌ బేస్డ్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌

కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌–2లో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఒక్కో పోస్ట్‌కు ఎనిమిది మంది చొప్పున (1:8 నిష్పత్తిలో) మూడో దశ కంప్యూటర్‌ బేస్డ్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. ఇందులో భాగంగా.. సైకో మాటిక్‌ టెస్ట్, రీజనింగ్‌ టెస్ట్, అదే విధంగా పరిశీలన, తులనాత్మక పరిశీలనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. అదే విధంగా రియాక్షన్‌ టైమ్‌ టెస్ట్, ఫామ్‌ పర్సెప్షన్‌ టెస్ట్, గ్రూప్‌ బోర్డన్‌ టెస్ట్, స్పీడ్‌ పర్సెప్షన్‌ టెస్ట్, విజువల్‌ డిఫరెన్షియేటింగ్‌ టెస్ట్‌లు ఉంటాయి.

తుది జాబితా ఇలా

తుది జాబితా రూపకల్పనలో వెయిటేజీ విధానం ఉంటుంది. కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌–2లోని పార్ట్‌–ఎలో పొందిన మార్కులకు 70 శాతం వెయిటేజీ; కంప్యూటర్‌ బేస్డ్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌ మార్కులకు 30 శాతం వెయిటేజీ కల్పించి.. దానికి అనుగుణంగా తుది జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి చివరగా డాక్యుమెంట్‌ వెరిఫికేషన్‌ పేరుతో సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. ఈ దశను కూడా విజయవంతంగా పూర్తి చేసుకుంటే అసిస్టెంట్‌ లోకో పైలట్‌గా కొలువు సొంతమైనట్లే.

పరీక్షలో విజయానికి ఇలా

లోకో పైలట్‌ నియామకాలకు కీలకంగా నిలుస్తున్న కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌–1, టెస్ట్‌–2లలో విజయానికి సబ్జెక్ట్‌ వారీగా దృష్టి సారించాల్సిన అంశాలు..

మ్యాథమెటిక్స్‌

మ్యాథమెటిక్స్‌ సిలబస్‌లో నంబర్‌ సిస్టమ్, బాడ్‌మాస్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, ఎల్‌సీఎం, హెచ్‌సీఎఫ్; రేషియో అండ్‌ ప్రపోర్షన్; పర్సంటేజెస్, మెన్సురేషన్; టైం అండ్‌ వర్క్; టైం అండ్‌ డిస్టెన్స్; ఇంట్రస్ట్; ప్రాఫిట్‌ అండ్‌ లాస్, ఆల్జీబ్రా, ట్రిగనోమెట్రీ, జామెట్రీ, కేలండర్‌ అండ్‌ క్లాక్. వీటికోసం తొలుత పాఠశాల స్థాయి పాఠ్యపుస్తకాల్లోని ప్రాథమిక భావనలపై అవగాహన పెంపొందించుకోవాలి. దీంతో పాటు బ్యాంకు, ఎస్‌ఎస్‌సీ, రైల్వే పరీక్షలకు సంబంధించిన పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్‌ చేయడం లాభిస్తుంది.

జనరల్‌ ఇంటెలిజెన్స్, రీజనింగ్‌

సిలబస్‌లో అనాలజీస్, ఆల్ఫాబెటికల్, నంబర్‌ సిరీస్, కోడింగ్‌–డీకోడింగ్, మ్యాథమెటికల్‌ ఆపరేషన్స్, రిలేషన్‌షిప్స్, జంబ్లింగ్, వెన్‌డయాగ్రమ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్, సఫిషియెన్సీ; కన్‌క్లూజన్‌ అండ్‌ డెసిషన్‌ మేకింగ్; సిమిలారిటీస్‌ అండ్‌ డిఫరెన్సెస్; అనలిటికల్‌ రీజనింగ్; క్లాసిఫికేషన్; డైరెక్షన్‌ తదితర అంశాలపై దృష్టి సారించాలి.

జనరల్‌ అవేర్‌నెస్‌

జనరల్‌ అవేర్‌నెస్‌లో..జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు, క్రీడలు, చరిత్ర, భారత, ప్రపంచ జాగ్రఫీ, పాలిటీ, సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ, జనరల్‌ సైన్స్, ఐక్యరాజ్యసమితి, ఇతర ముఖ్యమైన అంతర్జాతీయ సంస్థలు, పర్యావరణ అంశాలు, కంప్యూటర్‌ ప్రాథమిక అంశాలు, దేశంలో రవాణా వ్యవస్థ, భారత ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ పథకాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

మెంటల్‌ ఎబిలిటీ

ఇందులో అనాలజీస్, నంబర్‌ సిరీస్, కోడింగ్, డీ కోడింగ్, రిలేషన్‌షిప్స్, సిలాజిజమ్, జంబ్లింగ్, వెన్‌ డయాగ్రమ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, క్లాసిఫికేషన్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్స్‌–ఆర్గ్యుమెంట్స్‌పై దృష్టి సారించాలి.

బేసిక్‌ సైన్స్, ఇంజనీరింగ్‌

ఇంజనీరింగ్‌ డ్రాయింగ్‌ (ప్రొజెక్షన్స్, వ్యూస్, డ్రాయింగ్‌ ఇన్‌స్ట్రుమెంట్స్, లైన్స్, జామెట్రిక్‌ ఫిగర్స్, సింబాలిక్‌ రిప్రెజెంటేషన్స్), యూనిట్స్, మెజర్‌మెంట్స్; మాస్‌ వెయిట్‌ అండ్‌ డెన్సిటీ; వర్క్‌ పవర్‌ అండ్‌ ఎనర్జీ; స్పీడ్‌ అండ్‌ వెలాసిటీ; హీట్‌ అండ్‌ టెంపరేచర్; బేసిక్‌ ఎలక్ట్రిసిటీ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

పార్ట్‌-బికు ఇలా

నిర్దేశిత ట్రేడ్‌లో ప్రశ్నలు అడిగే సీబీటీ–2లోని పార్ట్‌–బిలో రాణించడానికి అభ్యర్థులు సంబంధిత ట్రేడ్‌ అకడమిక్‌ పుస్తకాలను చదవాలి. ఇందులో పొందిన మార్కులను తుది జాబితా రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోరు. కానీ.. అభ్యర్థులు కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. కచ్చితంగా 35 శాతం మార్కులు పొందాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌ ద్వారా.
- ఆన్‌లైన్‌ దరఖాస్తు చివరి తేదీ:ఫిబ్రవరి 19, 2024
- ఆన్‌లైన్‌ దరఖాస్తు సవరణ: ఫిబ్రవరి 20–29
- సీబీటీ–1 పరీక్ష: జూన్‌–ఆగస్ట్‌లో నిర్వహించే అవకాశం. • సీబీటీ–2 పరీక్ష: సెప్టెంబర్‌లో నిర్వహించే అవకాశం
- సీబీఏటీ పరీక్ష తేదీ: నవంబర్‌లో నిర్వహించే అవకాశం
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌: www.rrbsecunderabad.gov.in,
- ఆన్‌లైన్‌ దరఖాస్తు వెబ్‌సైట్‌: www.recruitmentrrb.in/#/auth/landing

క్లుప్తంగా...

ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా శ్రీనివాసమూర్తి



తాడేపల్లిగూడెం: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఏపీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బూదరాజు శ్రీనివాసమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఉన్నత విద్యాశాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. గతంలో ఏపీ నిట్ డైరెక్టర్‌గా వ్యవహరించిన సీఎస్‌పీ రావు సస్పెండ్ కాగా, నాగపూర్‌లోని విశ్వేశ్వరయ్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వి.నిట్) డైరెక్టర్ ప్రమోద్ వి.పడోలేని ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నియమించారు. ఆయన 2022, ఏప్రిల్ 22వ తేదీ నుంచి ఈ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పూర్తిస్థాయి డైరెక్టర్ నియామకం కోసం కేంద్రం గతంలోనే నోటిఫికేషన్ ఇచ్చింది. తమకు వచ్చిన దరఖాస్తుల స్క్రూటినీ కూడా పూర్తి చేసింది. రాష్ట్రపతి పర్యవేక్షణలోని కేంద్ర ఉన్నతాధికారుల బృందం నిట్ డైరెక్టర్ నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రమోద్ వి.పడోలే స్థానంలో ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ప్రొఫెసర్ బూదరాజు శ్రీనివాసమూర్తిని నియమించారు.

చంద్రబాబుకు అమ్ముడుపోయిన పవన్

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్




తగరపువలస (విశాఖ జిల్లా): సామాజికన్యాయం పేరుతో పార్టీ పెట్టిన చిరంజీవి కాంగ్రెస్‌లో విలీనం చేశారని, ఆయన తమ్ముడు పవన్‌కళ్యాణ్ ఏమో కుక్క ఎముకలకు ఆశపడినట్లుగా చంద్రబాబు ఇచ్చిన 25 సీట్లకు అమ్ముడుపోయారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ విమర్శించారు. విశాఖ జిల్లా తగరపువలసలోని ఆంధ్రా బాప్టిస్ట్ చర్చ్‌లో 'సొంత ఊరికి శాంతి దూత రాక' పేరుతో సోమవారం నిర్వహించిన పాస్టర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తన ఉపాధ్యాయురాలు రాజేటి మార్తమ్మ, చిన్ననాటి మిత్రులతో పాల్ ముచ్చటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌లు ప్రధాని మోదీకి స్నేహహస్తం అందిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తాను విశాఖ ఎంపీగా పోటీ చేస్తానని, రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులను పోటీ చేయిస్తానని తెలిపారు. మమతా బెనర్జీ, కేజ్రీవాల్ మాదిరిగా తనపై కూడా కేంద్రం కుట్రలు చేస్తుందన్నారు.

బాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుకు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసింది. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం ముందు విచారకు వచ్చింది. సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే అందుబాటులో లేనందున విచారణను మూడు వారాల పాటు వాయిదా వేయాలని చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోరారు. సీఐడీ తరపు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ జోక్యం చేసుకొని.. గతంలో కౌంటర్ దాఖలు చేసేటప్పుడు కూడా ఇలాగే గడువు కోరారని గుర్తు చేశారు. అనంతరం ధర్మాసనం విచారణను వాయిదా వేస్తామని పేర్కొనగా.. నిర్దిష్ట తేదీని ప్రకటించాలని రంజిత్‌కుమార్ కోరారు. ధర్మాసనం స్పందిస్తూ 26వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

21 నుంచి బీజేపీ ప్రజాపోరు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 29 వరకు తొమ్మిది రోజుల పాటు ప్రజాపోరు పేరుతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ప్రజాపోరు కార్యక్రమ రాష్ట్ర కన్వీనర్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. మూడోసారి కూడా భాజపానే కేంద్రంలో గెలుస్తుందని సర్వేలు చెబుతున్నాయని, రాష్ట్రంలో కూడా బీజేపీ ప్రభుత్వం ఉంటే డబుల్ ఇంజన్ సర్కార్ సౌలభ్యంతో రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

కార్మిక శాఖ కమిషనర్‌గా ఆంజనేయులు

రెండు వారాలు ఎఫ్ఏసీ ఇచ్చిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: కార్మిక శాఖ కమిషనర్‌గా ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ వి.ఆంజనేయులుకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగించింది. కార్మిక శాఖ కమిషనర్‌గా ఉన్న శేషగిరిబాబు మంగళవారం నుంచి రెండు వారాలపాటు వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. ఈ క్రమంలో కార్మిక శాఖ కమిషనర్‌గా ఆంజనేయులుకు ప్రభుత్వం రెండు వారాలు ఎఫ్ఏసీ ఇచ్చింది.

15న వలంటీర్లకు వందనం

గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం ఫిరంగిపురంలో ప్రారంభించనున్న సీఎం జగన్

- తర్వాత అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పదిరోజులు రాష్ట్రమంతా కార్యక్రమాలు
- సత్కారంతోపాటు పనితీరు ఆధారంగా మూడు కేటగిరిల్లో అవార్డులు
- కనీసం ఏడాది నిరాటంకంగా పనిచేసిన ప్రతి వలంటీరు అర్హులే
- మొత్తం 2,55,464 మంది వలంటీర్లను సత్కరించనున్న ప్రభుత్వం
- వరుసగా నాలుగో ఏడాది.. వలంటీర్లకు వందనం



సాక్షి, అమరావతి: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా.. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో క్షేత్రస్థాయిలో పైరవీలు, అవినీతి అన్న వాటికి తావేలేకుండా.. కుల, మత, ప్రాంత, వర్గ తారతమ్యాలకు అతీతంగా.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలను అందజేయడంలో కీలకంగా పనిచేస్తున్న వలంటీర్లను ప్రభుత్వం వరుసగా నాలుగో ఏడాది కూడా సత్కరిస్తోంది. కనీసం ఏడాది పాటు నిరాటంకంగా పనిచేస్తున్న వలంటీర్లందరినీ సత్కరించి, మూడు కేటగిరిల్లో నగదు బహుమతులను కూడా అందజేయనుంది. ఈ వలంటీర్లకు వందనం నాలుగో విడత కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీన గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం ఫిరంగిపురంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. తర్వాత రాష్ట్రమంతటా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎక్కడికక్కడ స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఆ ప్రాంత వలంటీర్లను సత్కరించే కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడునెలల్లోనే 2019 ఆగస్టు 15వ తేదీన వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఒకపక్క ప్రతిపక్షాలు నిత్యం బెదిరింపు ధోరణులతో రాజకీయ ప్రకటనలు చేస్తున్నా.. కొన్ని పత్రికలు పనిగట్టుకుని నిరంతరం తమపై దుష్ప్రచారం కొనసాగిస్తున్నా.. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 2.5 లక్షల మందికి పైగా వలంటీర్లు తమ పనితీరుతోనే రాష్ట్ర ప్రజల మనన్నలతో పాటు దేశ ప్రజల ప్రశంసలు పొందుతున్న విషయం తెలిసిందే.

2,55,464 మందికి సత్కారం, నగదు బహుమతులు

వలంటీర్లకు వందనం పేరిట వరుసగా నాలుగో ఏడాది చేస్తున్న ఈ సత్కారానికి రాష్ట్రవ్యాప్తంగా 2,55,464 మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. వీరిలో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సేవావజ్ర, సేవారత్న అవార్డులతోను, నిరాటంకంగా ఏడాది పనిచేసిన వారికి సేవామిత్ర అవార్డుతోను సత్కరించి, నగదు బహుమతులు ఇవ్వనున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఐదుగురు వంతున మొత్తం 875 మంది వలంటీర్లకు సేవావజ్ర అవార్డు ప్రదానం చేయనున్నారు. ప్రతి మండలంలో, మున్సిపాలిటీలో ఐదుగురు వంతున, నగరపాలక సంస్థలో పదిమంది వంతున.. రాష్ట్రవ్యాప్తంగా 4,150 మందికి సేవారత్న అవార్డు, కనీసం ఏడాది పనిచేసిన మిగిలిన 2,50,439 మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డు అందజేస్తారు.

997 మందికి ప్రత్యేక బహుమతులు

ఈ అవార్డులకు అదనంగా.. తమ పరిధిలో వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలతో మెరుగైన లబ్ధిదారుల జీవన ప్రమాణాలపై ఉత్తమ వీడియోలు చిత్రీకరించిన వలంటీర్లకు ప్రత్యేక నగదు బహుమతులను కూడ ఈ ఏడాది కొత్తగా అందజేయనున్నట్టు అధికారులు తెలిపారు. మండల, మున్సిపల్, కార్పొరేషన్ స్థాయిల్లో ఒక్కొక్కటి వంతున 796 ఉత్తమ వీడియోలను ఎంపిక చేసి, వాటిని చిత్రీకరించిన వారికి రూ.15 వేలు ఇవ్వనున్నారు. నియోజకవర్గస్థాయిలో ఒక్కొక్కటి వంతున 175 ఉత్తమ వీడియోలను ఎంపికచేసి, వాటిని చిత్రీకరించిన వారికి రూ.20 వేలు అందజేయనున్నారు. జిల్లాస్థాయిలో ఒకటి వంతున ఉత్తమ వీడియో ఎంపికచేసి వాటిని చిత్రీకరించిన 26 మందికి రూ.25 వేల చొప్పున ప్రత్యేక నగదు బహుమతి ఇవ్వనున్నారు.

మూడేళ్లుగా సత్కారం పొందిన వలంటీర్ల వివరాలు

ఏడాది	సత్కరించిన తేదీ	సత్కారం పొందిన వలంటీర్ల సంఖ్య
తొలి ఏడాది	14-04-2021	2,20,993
రెండో ఏడాది	07-04-2022	2,33,333
మూడో ఏడాది	19-05-2023	2,33,719

నాలుగో ఏడాది 15-02-2024న సత్కారం పొందనున్న వలంటీర్ల సంఖ్య 2,55,464

ఎకో ఇండియాతో డీఎంఈ ఎంవోయూ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలలు, బోధనాస్పత్రుల్లోని వైద్యులు, సిబ్బందిలో నైపుణ్యాలను పెంపొందించి ప్రజలకు మరింత నాణ్యమైన, మెరుగైన వైద్య సేవల కల్పన కోసం ఎకో(ఎక్స్‌టెన్షన్ ఫర్ కమ్యూనిటీ హెల్త్ కేర్ అవుకమ్స్) ఇండియాతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఎంవోయూ చేసుకుంది. డీఎంఈ డాక్టర్ నరసింహం, ఎకో ఇండియా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సందీప్ భల్లా సోమవారం విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. వర్చువల్ విధానంలో డీఎంఈ వైద్యులు, సిబ్బందికి ఎకో ఇండియా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనుందని డాక్టర్ నరసింహం తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటికే ఆస్పత్రుల బలోపేతానికి అనేక చర్యలు చేపట్టిందన్నారు. ఆస్పత్రుల్లో పుష్కలంగా మానవ వనరులు ఉన్నాయని, వారిలో నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు.



గార్గేయపురం ఊరి బయటనున్న 200 ఏళ్ల నాటి అడెన్ సోనియా వృక్షం





అడెన్ సోనియా వృక్షంను క్రేన్ల సాయంతో తరలిస్తున్న దృశ్యాలు



నగర వనంలో నాటిన అడెన్ సోనియా వృక్షం

ఆపరేషన్ 'అడెన్ సోనియా'

- 200 ఏళ్ల మహా వృక్షాన్ని సురక్షితంగా తరలించిన అటవీ శాఖ
- మూడు రోజులు శ్రమించి గార్గేయపురం నుంచి కర్నూలు సిటీ ఫారెస్ట్‌కు తరలింపు
- 60 టన్నుల వృక్షానికి కెమికల్ ట్రీట్‌మెంట్ చేసి సజీవంగా ప్రతిష్ట

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ ఆపరేషన్ 'అడెన్ సోనియా' కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసింది. అటవీ శాఖ అధికారి పల్లె శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులు శ్రమించి 200 ఏళ్ల చరిత్ర కలిగిన మహా వృక్షానికి మరో 200 ఏళ్ల జీవితాన్ని కల్పించారు. కర్నూలు మండలం గార్గేయపురం గ్రామం వెలుపల పోతున్న సూరత్ హైవే రోడ్ మధ్యలో అడెన్ సోనియా(బావో బాబ్) ఉండడంతో ఆ వృక్షాన్ని కూల్చివేయకుండా వేర్లతో సహా పెకలించారు. 60 టన్నుల బరువు ఉన్న వృక్షాన్ని సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్నూలు నగర వనానికి భారీ ట్రాలీ లారీపై సురక్షితంగా తరలించారు. నగర వనంలో గుంతను తీసి అందులో వృక్షాన్ని సజీవంగా ప్రతిష్ఠించారు. వృక్షానికి ఫంగస్ రాకుండా వేర్లకు కెమికల్ ట్రీట్‌మెంట్ చేసి నల్ల రేగడి మట్టి, వర్మీ కంపోస్ట్‌ను వినియోగించారు. డీఎఫ్‌వో శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ అడెన్ సోనియా వృక్షం వందల ఏళ్లు బతుకుతుందన్నారు. ఈ వృక్షాలు అరుదుగా ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ సైంటిస్టుల సూచనలు తీసుకొని రూ.5 లక్షల వ్యయంతో మూడు రోజుల పాటు 30 మంది సిబ్బంది, నాలుగు క్రేన్‌లు, రెండు జేసీబీలతో వృక్షాన్ని తరలించామన్నారు. 400 టన్నుల భారీ క్రేన్‌తో వృక్షాన్ని నిలబెట్టామని చెప్పారు. నగర వనానికి ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. కర్నూలు రేంజర్ రమణారెడ్డి పర్యవేక్షించారు.

వీసీఐసీలో రెండు పారిశ్రామిక పార్కులకు శ్రీకారం

- 4,300 ఎకరాల్లో నక్కపల్లి పారిశ్రామికవాడను అభివృద్ధి చేస్తున్న ఏపీఐఐసీ
- ఈ నోడ్ ద్వారా రూ.33,500 కోట్ల పెట్టుబడులు, 26,700 మందికి ఉపాధి అవకాశం
- 12 వేల ఎకరాల్లో శ్రీకాళహస్తి (చిత్తూరు) ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి
- దీనిద్వారా రూ.19,700 కోట్ల పెట్టుబడులు, 42,680 మందికి ఉపాధి అవకాశం
- త్వరలో చెన్నై–బెంగళూరు కారిడార్‌లో క్రిస్ సిటీ అభివృద్ధి పనులకు భూమిపూజ


సాక్షి, అమరావతి : అన్నిరకాల మౌలిక వసతులతో పారిశ్రామికపార్కులను అభివృద్ధి చేయడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించాలన్న లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు భారీ పారిశ్రామికపార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్ (వీసీఐసీ) రెండోదశ అభివృద్ధిలో అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద, చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి వద్ద పారిశ్రామికపార్కులను అభివృద్ధి చేయనుంది. నక్కపల్లి వద్ద 4,300 ఎకరాల్లో, చిత్తూరు నోడ్‌లో భాగంగా శ్రీకాళహస్తి వద్ద 12 వేల ఎకరాల్లో ఈ పారిశ్రామికపార్కుల అభివృద్ధి పనులను త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులు మీదుగా ప్రారంభించడానికి రాష్ట్ర పరిశ్రమలశాఖ ఏర్పాట్లు చేస్తోంది. నక్కపల్లిలో తొలిదశలో స్టార్టప్ ఏరియా కింద 1,120 ఎకరాలను రూ.395 కోట్లతో అభివృద్ధి చేయడానికి పరిపాలన అనుమతులు లభించాయి. దీన్లో భాగంగా రూ.298.15 కోట్ల విలువైన పనులకు ఏపీఐఐసీ టెండర్లు పిలిచింది. చిత్తూరు నోడ్‌లో తొలిదశలో 2,648 ఎకరాల స్టార్టప్ ఏరియాను రూ.423 కోట్లతో అభివృద్ధి చేయడానికి పరిపాలన అనుమతులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా రూ.303.39 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు సీఎం జగన్ శ్రీకారం చుట్టనున్నారు. ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు రుణం ద్వారా వీసీఐసీలో 23,046 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న సంగతి తెలిసిందే. రెండోదశ కింద రూ.1,633 కోట్లతో వివిధ పారిశ్రామికపార్కులను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం ఏడీబీ రూ.1,130 కోట్ల రుణం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.

రెండు పార్కుల ద్వారా 69,380 మందికి ఉపాధి

కొత్తగా అభివృద్ధి చేస్తున్న ఈ రెండు పార్కుల ద్వారా 69,380 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. నక్కపల్లి పారిశ్రామికపార్కు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రూ.33,500 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా 26,700 మందికి ఉపాధి లభించనుంది. ఇది కాకుండా నక్కపల్లి వద్ద 2,001.8 ఎకరాల విస్తీర్ణంలో బల్క్ డ్రగ్ పార్కును ఈపీసీ విధానంలో నిర్మించడానికి ఏపీఐఐసీ టెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. శ్రీకాళహస్తి నోడ్ ద్వారా రూ.19,700 కోట్ల పెట్టుబడులతో పాటు 42,680 మందికి ఉపాధి లభించనుంది. వీటితోపాటు చెన్నై–బెంగళూరు కారిడార్‌లో భాగంగా కృష్ణపట్నం వద్ద క్రిస్ సిటీ పేరుతో భారీ పారిశ్రామిక నగర నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ముగిసింది. త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభించడానికి పరిశ్రమలశాఖ ప్రణాళికలను సిద్ధం చేసింది.

మదనపల్లెలో అనిబిసెంట్ యూనివర్సిటీ

బీటీ ప్రభుత్వ కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



బీటీ కళాశాల భవనం

మదనపల్లె: మదనపల్లెకు మహర్దశ పట్టింది. రాయలసీమలో చారిత్రక నేపథ్యం కలిగిన బిసెంట్ థియోసఫికల్ ఎయిడెడ్ కళాశాలను ప్రభుత్వ పరం చేయాలన్న పట్టణ ప్రజల ఆకాంక్షను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాకారం చేయడమే కాకుండా, ఎన్నికల సమయంలో ఎంపీ మిథున్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అనిబిసెంట్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ తాజాగా జీవో విడుదల చేసింది. దీంతో పట్టణ ప్రజలు, పూర్వవిద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థుల సమక్షంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్. దేశాయ్ తిప్పారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, వైస్‌చైర్మన్ జింకాచలపతి, నాయకులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. దేశాయ్‌తిప్పారెడ్డి, నిసార్‌అహ్మద్‌లు మాట్లాడుతూ బీటీ కళాశాల రోజురోజుకీ ప్రాభవాన్ని కోల్పోతున్న తరుణంలో కళాశాలకు పునరుజ్జీవం కల్పిస్తూ, ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు కృషిచేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలను జీవితాంతం గుర్తుపెట్టుకుంటామన్నారు.

యూరప్‌లోనూ 'సిద్ధం'

అట్టహాసంగా యాత్ర-2 విజయోత్సవాలు



యూరోప్ దేశాల్లో సిద్ధం సభలు, యాత్ర 2 సెలబ్రేషన్స్

సాక్షి,అమరావతి: యూరప్ దేశాల్లో సిద్ధం సభలు ఉత్సాహంగా సాగుతున్నాయి. యాత్ర-2 విజయోత్సవాలను అక్కడి ప్రవాసాంధ్రులు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ యూరప్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నెదర్లాండ్స్ ఐండ్‌హోవెన్ ప్రాంతంలో తొలిసారి భారీ కార్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే యాత్ర-2 సినిమాను ప్రదర్శించారు. కేక్ కట్ చేసి విజయోత్సవం జరిపారు. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన కార్తీక్‌యల్లాప్రగడ మాట్లాడుతూ.. చెప్పిందే చేసి చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారని కొనియాడారు. వైఎస్సార్ ఆనాడు రెండడుగులు వేసి పేదలకు సహాయం చేస్తే సీఎం వైఎస్ జగన్ పదడుగులు ముందుకేసి సహాయం చేస్తున్నారని పేర్కొన్నారు. భారత్‌లో తొలిసారి రాజకీయాల్లో సోషల్ ఇంజినీరింగ్‌ను ప్రవేశపెట్టిన ఘనత జగన్‌దేనని, దైవాంశ సంభూతులకే ఇది సాధ్యమని కొనియాడారు. ఎన్నికల మ్యానిఫెస్టోను జగన్ నూరుశాతం అమలు చేశారన్నారు. కార్యక్రమాల్లో నెదర్లాండ్స్, బెల్జియంలోని ప్రవాసాంధ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలకు తాము దూరంగా ఉన్నా.. వైఎస్సార్ సిద్ధాంతాలకు చాలా దగ్గరగా ఉన్నామని నినదించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీఎన్ఆర్‌టీఎస్ ఛైర్మన్ వెంకట్ మేడపాటి, అమెరికా నుంచి యాత్ర-2 ప్రొడ్యూసర్ శివా మేక, డైరెక్టర్ మహీ వి రాఘవ పాల్గొని వైఎస్సార్ సీపీ అభిమానులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నెదర్లాండ్స్ కో-ఆర్డినేటర్లు సారథి రెడ్డి వంగా, రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ బెల్జియం కో-ఆర్డినేటర్లు ప్రతాప్, చెన్నారెడ్డి, ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లండన్‌లో యాత్ర-2 సక్సెస్ మీట్

వైఎస్సార్‌సీపీ యూకే అండ్ యూరప్ ఆధ్వర్యంలో లండన్ మహానగరంలోని హౌన్స్‌లో వైఎస్సార్ సీపీ అభిమానుల సమక్షంలో యాత్ర-2 సక్సెస్ మీట్ వైభవంగా జరిగింది. వందలాది మంది ఇందులో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

తెలంగాణ

ఒక్కో ఎంపీ స్థానానికి ఐదేసి పేర్లు

- జాబితా ఖరారు చేసి ఢిల్లీకి పంపించనున్న రాష్ట్ర బీజేపీ
- లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతను మొదలుపెట్టిన నేతలు
- స్టేట్ ఎలక్షన్, మేనేజ్‌మెంట్ కమిటీల సమావేశాల నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా రాష్ట్ర బీజేపీ కసరత్తు మొదలుపెట్టింది. ఈ మేరకు సోమవారం నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర ఎన్నికల కమిటీ, ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీల సమావేశాలు జరిగాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపుతున్న వారు, దరఖాస్తులు, విజ్ఞప్తుల ద్వారా అందిన పేర్లతో స్థూలంగా రాష్ట్ర పార్టీ ఓ ప్రాథమిక జాబితాను సిద్ధం చేసుకునే పనిలో పడింది. త్వరలోనే కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమై అభ్యర్థుల జాబితాలపై చర్చించనున్నందున.. ఆలోగా ఒక్కో స్థానానికి ఐదేసి పేర్లను ప్రతిపాదిస్తూ జాబితాను ఢిల్లీకి పంపించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మరోసారి ఈ కమిటీ సమావేశమై ఐదేసి పేర్లు ఖరారు చేయనున్నట్టు తెలిసింది. సోమవారం జరిగిన సమావేశాల్లో పార్టీ నేతలు డా.కె.లక్ష్మణ్, డీకే అరుణ, అర్వింద్ మీనన్, ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ తివారీ (సంస్థాగత), ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఈటల రాజేందర్, పొంగులేటి సుధాకరరెడ్డి, ఏపీ జితేందర్‌రెడ్డి మురళీధర్‌రావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, బంగారు శ్రుతి, డా. కాసం వెంకటేశ్వర్లు యాదవ్, మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి పాల్గొన్నారు.

ఆ 37కమిటీలకు సభ్యులను నియమించాలని నిర్ణయం

ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశమైన సందర్భంగా రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ నిమిత్తం... బహిరంగసభలు, పర్యటనలు, సోషల్ మీడియా, మీడియా, పబ్లిసిటీ, ఎలక్షన్ మెటీరియల్ ఇలా 37 కమిటీలకు కన్వీనర్లు, సభ్యులను నియమించాలని నిర్ణయించారు. ఇక ఈ నెల 20 నుంచి రాష్ట్రంలోని ఐదు క్లస్టర్లలో(17లోక్‌సభ స్థానాల్లో) విజయ సంకల్ప రథ(బస్సు)యాత్రలను ప్రారంభించనున్న విషయం తెలిసిందే. సోమవారం జరిగిన యాత్ర క్లస్టర్స్ మీటింగ్‌లో ఆ యాత్రలకు చేయాల్సిన ఏర్పాట్లు, అందుకోసం నియమించాల్సిన కమిటీలపై చర్చించారు.

కృష్ణా ట్రిబ్యునల్ టీవోఆర్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కృష్ణా ట్రిబ్యునల్-2 టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీవోఆర్)పై దాఖలైన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కేంద్రం జారీచేసిన నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది జైదీప్‌గుప్తా వాదనలు వినిపిస్తూ.. కేసుకు సంబంధించి ప్లీడింగ్స్ పూర్తయ్యాయని, వాదనలకు కొంత సమయం కావాలని కోరారు. ట్రిబ్యునల్‌లో తదుపరి విచారణ కంటే ముందుగా.. అంటే మార్చి 5వ తేదీలోపు జాబితా చేయాలని కోరారు. పిటిషన్ స్వీకరించి ఏదో ఒక బుధవారం జాబితా చేస్తామని ధర్మాసనం పేర్కొంది. పిటిషన్ అడ్మిట్ చేసుకోకుండా వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ కోరారు. అడ్మిట్ కాకుండా నాన్‌మిస్‌లీనియస్ రోజున విచారణ చేపట్టలేం కదా.. అది రిజిస్ట్రీ చూసుకుంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనంతరం విచారణను మార్చి 13కు వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

మురుగు నీటి తొలగింపు



మిషన్‌తో మురుగు నీటిని తొలగిస్తున్న దృశ్యం

కంప్లి: హూవినహడగలి పట్టణంలోని వ్యాకరణ తీర్థ చంద్రశేఖర్ శాస్త్రి రోడ్డులో నిల్వ చేరిన భూగర్భ డ్రైనేజీ మురుగు నీటిని పురసభ ముఖ్యాధికారి మల్లేశప్ప పజ్జి జెట్టింగ్ మిషన్ తెప్పించి ఒకే రోజులో సంపూర్ణంగా తొలగించి స్వచ్ఛతను కాపాడారు. అదే విధంగా మురుగు కాలువల్లో నిండిన పూడికను కూడా తొలగించి ఇళ్లలో వాడే నీటిని ఎలాంటి అడ్డంకులు లేకుండా పారేలా చర్యలు తీసుకున్నారు. పట్టణ సమస్యపై వెంటనే స్పందించి స్వచ్ఛత అందించడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కృషి చేసిన ముఖ్యాధికారిని ప్రజలు అభినందించారు.

పార్టీలో పలువురి చేరిక



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్ తదితరులు

గంగావతి: ఇతర పార్టీల నుంచి కోళూరు, హిటాన్ల్ గ్రామాలకు చెందిన పలువురు సోమవారం కొప్పళ ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు శ్రమించాలన్నారు. సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలన్నారు. వారికి జెడ్పీ మాజీ అధ్యక్షులు రాజశేఖర్ హిట్నాల్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

భక్త మార్కండేయ జయంతి



జయంతిని ఆచరిస్తున్న సమాజ ప్రముఖులు

గంగావతి: నగరంలోని మార్కండేయ సర్కిల్‌లో సోమవారం పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ జయంతిని ఘనంగా జరిపారు. సమాజ బాంధవులందరూ చేరి మార్కండేయుడి చిత్రపటానికి పూజలు నెరవేర్చారు. సమాజ ఉపాధ్యక్షులు శేఖరప్ప మాట్లాడుతూ భక్త మార్కండేయ తమ తపస్సుతో ఈశ్వరుడే ప్రత్యక్షమై తనకు చిరంజీవిగా ఆయుష్షును ప్రసాదించారన్నారు. అలాంటి మహానుభావుడు పుట్టిన కులంలో మనం జన్మించడం పద్మశాలీయులందరూ చేసుకున్న పుణ్యమన్నారు. తమ జీవితాన్ని మెరుగు పరచుకునేందుకు, తమ పిల్లల భవిష్యత్తు కోసం, మంచి విద్యాభ్యాసం చెప్పించేందుకు భక్త మార్కండేయ తపోమార్గాన్ని ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సమాజ ప్రముఖులు నేకార్ సంజీవ్‌కుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మార్కండేయ జయంతి

రాయచూరు రూరల్: నగరంలోని మాణిక్ నగర్‌లోని మార్కండేయ ఆలయంలో సోమవారం మార్కండేయ జయంతిని ఘనంగా ఆచరించారు. పద్మశాలి సమాజం ఏర్పాటు చేసిన మార్కండేయ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి కిల్లే మఠాధిపతి శాంతమల్ల శివాచార్య పూలమాలలు వేశారు. స్వామీజీ మాట్లాడుతూ గురువులు, శరణుల మార్గదర్శనంలో సమాజం అభివృద్ధికి విద్య ప్రధానమన్నారు. కార్యక్రమంలో సమాజం అధ్యక్షుడు నాగరాజ్, రామాజంనేయులు, వెంకటేశ్వర, శాంతప్ప, బ్రహ్మగణేషులున్నారు.

యువతలో గుండెజబ్బుల సమస్య



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కంప్లి: కోవిడ్ అనంతరం 30 ఏళ్ల యువతలో గుండెజబ్బుల సమస్య అధికం అయిందని వైద్యాధికారి డాక్టర్ గురుబసవరాజ్ అన్నారు. ఆయన సోమవారం కురుగోడు తాలూకాలోని ముష్టిగట్టి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరంలో మాట్లాడారు. గ్రామీణ ప్రజలు మలేరియా, డెంగీ, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. డాక్టర్ గురుబసవరాజ్, డాక్టర్ లక్ష్మణ్ నాయక్, దివ్య, పుష్పా ప్రమోద్, వైద్య విద్యార్థులు రోగులను పరీక్షించారు. బీపీ, షుగర్, స్తన క్యాన్సర్ గర్భకోశ క్యాన్సర్, కంటి పరీక్షలను చేశారు. శిబిరంలో సుమారు 300 మందికి ఆరోగ్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. 55 మంది అవయవదానానికి పేర్లు నమోదు చేసుకున్నారు. 20 మందికి కంటి పరీక్షల అనంతరం కంటి అద్దాలను అందించారు. శిబిరంలో జీపీ అధ్యక్షులు బసవరాజ్, పీడీఓ దేవరాజ్, తాలూకా ఎస్టీ వర్గాల సంక్షేమ అధికారి గాదిలింగప్ప పాల్గొన్నారు.

దేవదుర్గలో ఇసుక రగడ

- పోలీస్‌పై ఎమ్మెల్యే బంధువుల దాడి!
- ఠాణా ముందు ఎమ్మెల్యే కరెమ్మ ధర్నా
- తాము ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని ధ్వజం

రాయచూరు రూరల్: జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా సాగిస్తున్న మాఫియాకు చెందిన ట్రాక్టర్‌ను అడ్డుకున్న పోలీస్ కానిస్టేబుల్‌పై ఎమ్మెల్యే తనయుడు, గుమాస్తా, సోదరుడు కలిసి దాడి చేసిన ఘటన దేవదుర్గలో జరిగింది. ఆదివారం సాయంత్రం కృష్ణా నదీ తీరంలోని దొడ్డంబళి, గోపాలపురల నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సీఐ సదలగి సమాచారం అందించారు. పోలీస్ కానిస్టేబుల్ హనుమంతరాయ ట్రాక్టర్‌ను అడ్డుకోవడంతో ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ తనయుడు సంతోష్, గుమాస్తా రామణ్ణ నాయక్, తమ్ముడు తిమ్మారెడ్డి ప్రభుత్వ అతిథిగృహానికి పిలిచి కానిస్టేబుల్‌పై దాడి చేశారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గాయపడిన పోలీస్ కానిస్టేబుల్ హనుమంతరాయ దేవదుర్గ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పోలీస్ స్టేషన్ వద్ద ఎమ్మెల్యే ధర్నా

అయితే అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న పోలీస్ కానిస్టేబుల్ హనుమంతరాయ తమను కులం పేరుతో దూషించినందుకు మాత్రమే ప్రభుత్వ అతిథి గృహానికి పిలిచి మాట్లాడామని, తమను దూషించినందుకు పోలీసు కానిస్టేబుల్‌పైనే కేసు నమోదు చేయాలని ఒత్తిడి చేస్తూ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ తన మద్దతుదారులతో ఆదివారం రాత్రి దేవదుర్గ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు.

ఎనిమిది మందిపై కేసు నమోదు

కాగా పోలీస్ కానిస్టేబుల్ హనుమంతరాయపై దాడి చేసిన ఘటనలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సదలిగి వెల్లడించారు. దాడికి పాల్పడిన ఎమ్మెల్యే కుమారుడు సంతోష్, సోదరుడు తిమ్మారెడ్డి, సోదరి కుమారుడు మల్లప్ప, వ్యక్తిగత సహాయకుడు ఇలియాస్, రఫీక్, దావూద్, అవంతి భీమన్న, రమేష్‌లపై కేసు నమోదు చేశామన్నారు.



ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్యే కరెమ్మ నాయక్



గాయపడిన కానిస్టేబుల్



తనయుడు సంతోష్



సోదరుడు తిమ్మారెడ్డి



గుమాస్తా రామణ్ణ నాయక్

చెట్ల పెంపకం మనందరి కర్తవ్యం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారి రవీంద్ర, కూలీ కార్మికులు

కంప్లి: చెట్లలను పెంచడం, వాటిని రక్షించడం భావి తరాలకు అత్యవసరమని, అది మనందరి కర్తవ్యం కూడా అని వాటర్‌షెడ్ అధికారి రవీంద్ర తెలిపారు. హరపనహళ్లిలోని ఆచార్య ఎక్స్‌టెన్షన్ పార్క్‌లో సిరివాటర్ సంస్థ జేసీఐ, జీవజల ట్రస్ట్ పదాధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెట్ల పెంపకం వల్ల కలుషిత వాతావరణం నుంచి విముక్తి కల్గుతుందన్నారు. చెట్ల పెంపకం ఒక ఉద్యమం, అడవి పెరిగి ఎదిగేంత వరకు మొక్కలకు నీరు పోసి కాపాడాలన్నారు. అడవుల నాశనంతో మనందరం ఎంతో క్షోభ అనుభవిస్తున్నామని అన్నారు.

స్వశక్తితోనే మనకు భద్రత

- ఎవరో ఇచ్చే గ్యారెంటీ ఎన్ని రోజులుంటుంది?
- మహిళలు స్వయంశక్తితో ముందడుగు వేయాలి
- కేఆర్‌పీపీ రాష్ట్ర నాయకురాలు గాలి లక్ష్మీ అరుణ

సాక్షి,బళ్లారి: ఎవరో ఇచ్చే గ్యారెంటీలు మనకు ఎన్ని రోజులు భద్రత కల్పిస్తాయి, స్వయంశక్తితో ఎదిగి ఆర్థికంగా ముందడుగు వేయాలని కేఆర్‌పీపీ రాష్ట్ర నాయకురాలు గాలి లక్ష్మీ అరుణ పేర్కొన్నారు. ఆమె ఆదివారం రాత్రి నగరంలోని హవంబావిలో కేఆర్‌పీపీ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్యే గాలి జనార్దన రెడ్డి స్వగృహం వద్ద మహిళలనుద్దేశించి మాట్లాడారు. నాలుగు రోజులుగా వందలాది మంది మహిళలకు రాష్ట్రంలో పేరుగాంచిన మెహందీ శిక్షకుడు నరేష్‌తో మెహందీ, మేకప్ ట్రైనింగ్ పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే గ్యారెంటీలను నమ్ముకోకూడదన్నారు. ఎవరికి వారు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉన్నట్లే మహిళ విజయం వెనుక కూడా ఖచ్చితంగా పురుషుడి పాత్ర ఉంటుందన్నారు. శ్రీరామచంద్రుడికి అంత పేరు ప్రఖ్యాతులు వచ్చాయంటే అందులో మహా తల్లి సీతమ్మ పాత్ర, కృషి కూడా ఎంతో ఉందన్నారు. మహిళలు అబలలు కాదు సబలలు అని నిరూపిస్తున్నారని కొనియాడారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సమానంగా స్వీకరిస్తూ ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నగరాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గాలి లక్ష్మీ అరుణ

రాజకీయాల్లో కక్ష సాధింపు తగదు

ఎన్నికల వరకే పోరాటం ఉండాలని, రాజకీయాల్లో కక్ష సాధింపు ఉండకూడదని ఆమె సూచించారు. ఎన్నికల్లో తమకు మద్దతుగా పని చేసిన కార్మిక నేత హుండేకర్ రాజేష్‌పై అధికార పార్టీ నాయకులు కక్ష సాధింపులకు పాల్పడ్డారన్నారు. అయితే ధైర్యంగా తమ పార్టీ కార్యకర్తలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. పదవులు ఐదేళ్లు మాత్రమే ఉంటాయన్నారు. మనం చేసిన మంచి పనులు పది కాలాల పాటు ఉంటాయన్నారు. కేఆర్‌పీపీ మహిళా నాయకురాలు హంపీ రమణ, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కార్మిక శక్తి శాఖ పదాధికారుల ఎంపిక

జిల్లా కేఆర్‌పీపీ కార్మిక శక్తి శాఖ పదాధికారులను ఎంపిక చేయడంతో పాటు ఆదేశ పత్రాలను అందజేశారు. జిల్లా కేఆర్‌పీపీ అధ్యక్షుడు దమ్మూరు శేఖర్ ఆధ్వర్యంలో నగరంలోని పార్టీ కార్యాలయం వరకు పెద్ద సంఖ్యలో జనంతో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మిక శక్తి శాఖ పదాధికారులను ప్రకటించారు. కేఆర్‌పీపీ కార్మిక శక్తి జిల్లాధ్యక్షుడుగా మారేష్, ప్రధాన కార్యదర్శిగా శంకర్, ఉపాధ్యక్షులుగా హనుమేష్, యల్లప్ప, గాదిలింగప్ప, నాగేనహళ్లి రమేష్, పాల్తూరు శ్రీనివాస్, ట్రెజరర్ అంజయ్య, సోషల్ మీడియా కన్వీనర్ అశోక్‌లను ఎంపిక చేశారు. అనంతరం వారికి ఆదేశ పత్రాలను కూడా అందజేశారు. కార్యక్రమంలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా గాలి లక్ష్మీ అరుణను కార్మిక సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేఆర్‌పీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖరగౌడ, కేఆర్‌పీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమారాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉండేకర్ రాజేష్, కేఆర్‌పీపీ ప్రముఖులు విజయ్‌కుమార్, రఘు, దరప్ప నాయక్, కొళగల్లు అంజిని, మల్లికార్జున ఆచార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కర్మాగార యాజమాన్యం తీరుపై ధర్నా

కంప్లి: 12 నెలల పాటు పండించిన చెరుకును నరకడానికి అనేక వ్యతిరిక్త పరిస్థితులను ఎదుర్కొంటుండటం తమ దౌర్భాగ్యమని చక్కెర రైతులు వాపోయారు. హూవినహడగలి తాలూకా కొంబళిలో చెరుకును పండించినా గంగాపుర విజయనగర షుగర్స్ కర్మాగార యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ట్రాక్టర్లను నిలిపి రైతులు ధర్నా చేశారు. అనంతరం చెరుకు రైతులు మాట్లాడుతూ విజయనగర షుగర్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం సకాలంలో చెరుకును నరికించక పోవడంతో దిగుబడి క్షీణించి రైతులు అపారనష్టం అనుభవిస్తున్నామన్నారు. రాష్ట్రంలో వరిపంటపై ఆశలు పెట్టుకొని కూడా ఎంతో మంది వర్షాలు లేక నష్టపోయారన్నారు. అయితే తమ పరిధిలో షుగర్ ఫ్యాక్టరీ ఉన్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విషయం తెలిసిన వెంటనే పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరి రైతులతో చర్చించి శాంతింపజేశారు.



రైతులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

వెట్టి పద్ధతి రద్దు కోసం జాగృతి జాతా

హొసపేటి: విజయనగర జిల్లా కూడ్లిగిలో వెట్టి పద్ధతి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాగృతి జాతా నిర్వహించారు. సోమవారం కోర్టు ఆవరణలో సీనియర్ జడ్జి మహాలక్ష్మి విజిలెన్స్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. వెట్టి పద్ధతి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలోని మదకరి సర్కిల్‌కు చేరుకున్న పాదయాత్రలో న్యాయవాది సి.విరుపాక్షప్ప ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కులవృత్తికి వ్యతిరేకంగా అమలులో ఉన్న చట్టంపై అవగాహన కల్పించి, సమాజానికి విధేయత లేని కులవృత్తి నిర్మూలనకు అందరూ కట్టుబడాలని సూచించారు. కోర్టు విభాగాధిపతి నాగరాజు, టీపీ ఈఓ వై.రవికుమార్, కార్మిక అధికారిణి మంజుల, విద్యాశాఖ జగదీశ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జీఎం మల్లికార్జునయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీనియర్ జడ్జి మహాలక్ష్మి

పరీక్షలపై భయాందోళన వద్దు

హొసపేటి: విద్యార్థులు పరీక్షలపై భయాందోళనకు గురికారాదని స్నేహితుల సంఘం అధ్యక్షుడు, సామాజిక సేవకుడు బీ.అబ్దుల్ రహిమాన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పాఠశాలలో విద్యార్థినులకు స్నేహితుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని విడిచి పెట్టి ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. విద్యార్థి జీవితం అమూల్యమైనదన్నారు. పరీక్షలకు సమయం తక్కువగా ఉందని, టెన్త్ పరీక్షలు దగ్గర పడుతున్నందున ప్రతి క్షణాన్ని శ్రద్ధగా చదువుకు కేటాయించాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల శ్రమ వృథా కాకూడదన్నారు. బాధ్యతాయుతంగా సాధన చేసి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులు పరీక్షలను తెలివి, చతురత, సమయప్రజ్ఞతో ఎదుర్కోవాలన్నారు. జానపద పరిషత్ తాలూకా అధ్యక్షుడు కేఎం.వీరేశ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబ్దుల్ రహిమాన్

నిందితుల అరెస్ట్‌కు డిమాండ్

రాయచూరు రూరల్: జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్న పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని దేవదుర్గ కాంగ్రెస్ మహిళా సంచాలకురాలు శ్రీదేవి నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆదివారం కృష్ణా నదీ తీరంలో ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక రవాణాను అడ్డుకున్న పోలీస్ కానిస్టేబుల్ హన్మంతరాయపై దాడి చేసి గాయపరిచారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తాలూకాలో అక్రమాలకు కళ్లెం వేస్తామని ప్రగల్భాలు పలికిన కరెమ్మ కుటుంబ సభ్యులు దాడిలో భాగస్వాములు కావడాన్ని తప్పుబట్టారు. శశికళ, మంజుల, మాలాలున్నారు.



మాట్లాడుతున్న శ్రీదేవి నాయక్

24 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

హుబ్లీ: పాత హుబ్లీ మస్తానుసోప వద్ద అక్రమంగా రేషన్ బియ్యం బస్తాలను తరలిస్తున్న లారీతో సహా పట్టుకుని డ్రైవర్‌ను అరెస్ట్ చేసిన సీసీబీ పోలీసులు సుమారు రూ.81,600 విలువ చేసే 24 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు..అబ్దుల్ ఖాదర్, నవాజ్ ఖాన్ అరెస్ట్ అయిన నిందితులు. బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించే ఉద్దేశంతో సుమారు 80 ప్లాస్టిక్ బస్తాల్లో నింపి రవాణాకు ప్రయత్నిస్తుండగా సీసీబీ ఏఎస్ఐ బీఎస్.లంగోటి సారథ్యంలోని బృందం ఈ దాడి చేసింది. ఈ క్రమంలో ఆహార పౌరసరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ కలీబా సమక్షంలో అధికారులు పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

సంక్షేమ మండలి ఏర్పాటు చేయరూ



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక మండలిని ఏర్పాటు చేయాలని దివ్యాంగుల సంఘం జిల్లాధ్యక్షుడు హొన్నప్ప డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల సమాజం అభివృద్ధి మండలికి రూ.25 కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. 500 కి.మీ.వరకు ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించాలన్నారు.70 శాతం లోపు వైకల్యం కలిగిన దివ్యాంగులకు నెలకు రూ.3వేలు, 75 శాతం పైబడిన దివ్యాంగులకు నెలకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

పేద రైతులకు వరం గంగా కల్యాణ పథకం



బోరుబావి తవ్వకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్

హొసపేటి: గంగా కల్యాణ పథకం పేద రైతులకు వరంలాంటిదని ఎమ్మెల్యే కే.నేమిరాజ్ నాయక్ అన్నారు. సోమవారం తాలూకాలోని కడలెబాళులో ప్రాజెక్టు లబ్ధిదారుల వ్యవసాయ భూమిలో గొట్టపు బావి డ్రిల్లింగ్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు ప్రభుత్వ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకు ముందు గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు వై.మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి శెట్రు, నాయకులు బీ.మంజునాథ్‌గౌడ్, కృష్ణంరాజు, టీఎం.శరణయ్య, హెచ్.హేమన్న, బీ.అంజినప్ప, గ్రామ సభ్యులు హెచ్.దొడ్డబసప్ప, ఓ.విరుపన్న, సీ.రమేష్ తదితరులు ఉన్నారు.

కాటికాపరులకు పెన్షన్ పెంచాలి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని శ్మశానాల్లో విధులు నిర్వహించే కాటికాపరులకు పెన్షన్ పెంచాలని కాటికాపరుల సమితి అధ్యక్షుడు వీరేష్ ఒత్తిడి చేశారు. సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖామంత్రి సిద్దరామయ్య 45 ఏళ్లు పైబడిన కాటికాపరులకు రూ.3 వేలు పెన్షన్ పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

నరేగ కూలీని పెంచండి

రాయచూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(నరేగ)లో వ్యవసాయ కూలీ కార్మికులకు రోజువారీ కూలీని రూ.500లకు పెంచాలని టీయూసీఐ సమితి అధ్యక్షుడు అమరేష్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని యూపీఏ సర్కారు రైతులకు విత్తనాలపై 50 శాతం సబ్సిడీని పెంచుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ చర్యలు చేపట్టాలన్నారు.

కళలకు ప్రాణం పోయాలి



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

రాయచూరు రూరల్: మరపురాని కళలకు ప్రాణం పోయాలని కిల్లె బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్య అభిప్రాయపడ్డారు. ఆదివారం రాత్రి నగరంలోని పండిత సిద్ధరామ జంబలదిన్ని రంగమందిరంలో కర్ణాటక కళా మండల 21వ వార్షికోత్సవంలో నృత్యం, గానం, సంగీతోత్సవ సంభ్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అరుణ, మంగళ నాయక్, సహన ప్రదీప్, విజయ్ రాఘవన్, రఘు నందన్, రంగనాథ్, భీమసేన్ దాస్, వైభవి, సంజయ్ కుమార్, అధ్యక్షులు నాగేంద్ర స్వామి, శ్రీలక్ష్మి దేవిలున్నారు.

బాలింతల కోసం బేబీ ఫీడింగ్ రూం



బేబీ ఫీడింగ్ రూంను ప్రారంభించిన దృశ్యం

మాలూరు: తాలూకాలోని చిక్కతిరుపతి శ్రీప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయానికి వచ్చే బాలింత భక్తుల కోసం ప్రత్యేక బేబీ ఫీడింగ్ రూం ఏర్పాటు చేసినట్లు టీపీ ఈఓ సెల్వమణి తెలిపారు. సోమవారం బేబీ ఫీడింగ్ రూంను ఆయన ప్రారంభించి మాట్లాడారు,. ఆలయానికి ప్రతి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తారు. ప్రత్యేక రోజుల్లో భక్తుల సంఖ్య భారీగా ఉంటుంది. వారిలో బాలింత భక్తులు తమ చంటి పిల్లలకు పాలివ్వడానికి పడుతున్న ఇబ్బంది దృష్ట్యా వారి అనుకూలం కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేశామన్నారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ వ్యవస్థాపక సమితి మాజీ సభ్యుడు ఆలంబాడి ఎస్ సురేష్‌బాబు, పి.శ్రీనాథ్ శెట్టి, ఆలయ అర్చకుడు రవిస్వామి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పాదపూజ



కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ తదితర అధికారులు, ప్రముఖులు

గంగావతి: శ్రీరామనగర్‌లోని విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు పాదపూజను జరిపారు. కార్యక్రమాన్ని డీఎస్పీ రుద్రేష్ ఉజ్జినకొప్ప ప్రారంభించి మాట్లాడుతూ గతంలో మంచి చదువు కోసం సుదూరంలోని మంగళూరు, బెంగళూరు, ధార్వాడలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. నేడు ఆ ప్రాంతవాసులే తాలూకాలో ఏర్పాటు చేసిన విద్యా సంస్థ వైపు చూస్తున్నారని, ఈ ఘనత సంస్థ అధ్యక్షుడికే దక్కుతుందన్నారు. ఈ పాఠశాలలో తన ఇద్దరు పిల్లలను సైతం చదివించానని, వారు మంచి భవిష్యత్తు పొందారన్నారు. సంస్థ అధ్యక్షుడు నెక్కంటి సూరిబాబు, డీఎస్పీ పాటిల్, శ్రీరామనగర్ గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

నియామకం



మీనళ్లి తాయణ్ణ

బళ్లారిటౌన్: జిల్లా జేడీఎస్ అధ్యక్షుడుగా మీనళ్లి తాయణ్ణను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్‌డీ కుమారస్వామి సోమవారం ఆదేశాలను జారీ చేశారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పార్టీలో నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ముందడుగు వేయాలని ఆయన తమ ఆదేశాలలో సూచించారు.

శ్రమదానంతో పరిశుభ్రతకు శ్రీకారం



శ్రమదానంలో పాల్గొన్న విద్యార్థులు

రాయచూరు రూరల్: దేవదుర్గ తాలూకా వీరగోటె వద్ద కృష్ణా నదీ తీరంలోని పరిసరాల్లో సోమవారం ఎన్ఎస్ఎస్ ద్వారా శుభ్రతకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శ్రీకారం చుట్టారు. నదిలో ప్రజలు పారవేసిన బట్టలు, మూటలు, సంచులు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను తొలగించి స్వచ్ఛతను చేపట్టారు. ఈసందర్భంగా సంతోష్ కుమార్, వెంకటేష్‌లున్నారు.

రేపు రజత సంభ్రమ

హుబ్లీ: పేదలు, యువత, అట్టడుగు వర్గాలకు చేయూతను అందిస్తున్న శుభవేళ ఈ ఏడాది కూడా రజత సంభ్రమ పేరిట పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ యువ నేత రజత్ ఉల్లగడ్డిమఠ పేర్కొన్నారు. నగరంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. తన 32వ జన్మదిన శుభవేళ ఈ నెల 14న సాయంత్రం స్థానిక ధిరణిచాలలో తృతీయ వార్షికోత్సవ రజత సంభ్రమ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ మఠాధీశులు డాక్టర్ గురుసిద్ధ రాజేంద్ర స్వామి, విమల రేణుక సాన్నిధ్యంలో సుమారు 50 మంది మఠాధిపతులు పాల్గొంటారన్నారు. గంగావతి ప్రముఖ హాస్య కళాకారుడు ప్రాణేష్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. జాతీయ జెండా రూపకర్తలను సన్మానిస్తామన్నారు. యువతచే మల్లకంబ ప్రదర్శన జరగనుంది. సినీనటుడు డ్యాలి ధనుంజయతో పాటు రాష్ట్ర మంత్రులు సంతోష్‌లాడ్, సతీష్ జారికిహొళి, లక్ష్మీహెబ్బాళ్కర, ఎమ్మెల్యే ప్రసాద్ అబ్బయ్య, కోనరెడ్డి, కార్పొరేటర్లు శివకుమార, చేతన్ తదితరులు పాల్గొంటారని ఆయన అన్నారు.

రూ.5 లక్షల నగదు చోరీ

హుబ్లీ: కిటికీ గ్లాస్ పగలగొట్టి లోపలికి వెళ్లిన దొంగలు ఆ అంగడిలో ఉన్న నగదును చోరీ చేసి పరారైన ఘటన నగరంలోని మూరుసావిర మఠం వద్ద చోటు చేసుకుంది. అమిత్ రాథోడ్‌కు చెందిన పాత్రల విక్రయ దుకాణంలో ఈ చోరీ జరిగింది. మూరు సావిర మఠం ప్రధాన ద్వారానికి ఆనుకుని ఉన్న ఈ భవనంలోకి గ్లాసులు పగలగొట్టి లోపలికి చొరబడిన దొంగలు డ్రాలో ఉన్న రూ.5 లక్షల నగదును చోరీ చేసి పరారైనట్లు బాధితుడు అమిత్ సోమవారం కమరిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.